# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 11 సంచిక : 4 హైదరాబాద్ 141 ఏప్రిల్ 2013 పేజీలు : 68 రు. 15

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల బండారం
- పేలుళ్లు - మతం - రాజ్యం
- రక్షణ శాఖలో కుంభకోణాలు
- తెలంగాణ ఉద్యమం ముందు ప్రమాదాలు
- అఫ్జల్ ఉరి - ఆలోచించాల్సిన అంశాలు
- పోస్కో వ్యతిరేక ప్రజాందోళన
- బంగ్లాదేశ్ కల్లోల కారణాలు

# వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

## ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

| | | |
|---|---|---|
| ఒక దళారీ పశ్చాత్తాపం | జాన్ పెర్కిన్స్ | రు. 50 |
| కుట్రాజకీయం | స్టీఫెన్ కింజర్ | 40 |
| అభివృద్ధిని ఇలా చూద్దాం | ముదునూరి భారతి | 80 |
| కొత్తచూపు | ఆర్.ఎస్. రావు | 120 |
| రాబందు వాలిన నేల | ఎన్. వేణుగోపాల్ | 180 |
| వ్యవసాయం - ప్రపంచీకరణ | కె.ఆర్. చౌదరి | 100 |
| ఒక ప్రేతాత్మక కథ | అరుంధతీ రాయ్ | 25 |
| రాజ్యం - సంక్షేమం | కె. బాలగోపాల్ | 100 |

## తెలంగాణ

| | | |
|---|---|---|
| లేచినిలిచిన తెలంగాణ | ఎన్. వేణుగోపాల్ | 120 |
| తిరగబడ్డ తెలంగాణ | ఇనుకొండ తిరుమలి | 100 |
| తెలంగాణ రాజకీయాలు | దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే | 80 |

## శాస్త్రవిజ్ఞానం

| | | |
|---|---|---|
| విశ్వాంతరాళం | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 90 |
| మానవ పరిణామం | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 90 |
| జీవకణాలూ నాడీకణాలూ | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 80 |
| ప్రకృతీ - పర్యావరణం | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 90 |
| అణువుల శక్తి | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 100 |
| జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 100 |
| మనుషులు చేసిన దేవుళ్లు | కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 100 |
| విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ | జెడి బెర్నాల్ | 80 |

## కులం-మతం

| | | |
|---|---|---|
| శూద్రవర్ణం ఎలా పుట్టింది | ఆర్.ఎస్. శర్మ | 80 |
| కులం వర్గం | బొజ్జా తారకం | 30 |
| ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు | బొజ్జా తారకం | 40 |
| ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు | బొజ్జా తారకం | 50 |
| ఖైర్లాంజి | ఆనంద్ తేల్‌తుంబ్డే | 100 |
| గులాంగిరి | జోతిబా పూలే | 40 |
| కుల నిర్మూలన | అంబేద్కర్ | 30 |
| రాముని కృష్ణుని రహస్యాలు | అంబేద్కర్ | 20 |
| దళితులు - రాజ్యం | అంబేద్కర్ | 25 |
| శూద్రులు - ఆర్యులు | అంబేద్కర్ | 8 |
| ఆధునిక భారతదేశంలో అంటరానితనం | అంబేద్కర్ | 25 |
| దాస్య విముక్తి కోసం | అంబేద్కర్ | 15 |
| భారతదేశం ప్రజాస్వామ్యం | అంబేద్కర్ | 12 |
| ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు | అంబేద్కర్ | 20 |
| రాష్ట్రాలు - మైనారిటీలు | అంబేద్కర్ | 40 |
| రాముని కృష్ణుని రహస్యాలు | అంబేద్కర్ | 20 |
| మతతత్వంపై బాలగోపాల్ | కె. బాలగోపాల్ | 150 |
| దళిత | కె. బాలగోపాల్ | 120 |
| దేవుని రాజకీయతత్వం | కంచె ఐలయ్య | 70 |
| నేను హిందూవు నెట్లయిత? | కంచె ఐలయ్య | 80 |

## సాహిత్య విమర్శ - వ్యాసాలు

| | | |
|---|---|---|
| గురజాడ దేశభక్తి | ఎన్. వేణుగోపాల్ | 20 |
| మహోదయం | కె.వి.ఆర్. | 200 |
| పరామర్శ | నల్లూరి రుక్మిణి | 80 |
| సాహిత్యంపై బాలగోపాల్ | కె. బాలగోపాల్ | 150 |
| విరసం సాహిత్య విమర్శ | విరసం ప్రచురణ | 150 |
| కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-1 | శారదాంబ స్మారక కమిటీ | 300 |
| అలిశెట్టి ప్రభాకర్ కవిత | అలిశెట్టి మిత్రులు | 150 |

## చరిత్ర-జీవిత చరిత్ర

| | | |
|---|---|---|
| భారత చరిత్ర పరిచయ వ్యాసాలు | డి.డి. కొశాంబి | 40 |
| ప్రాచీన భారత దేశ చరిత్ర | కె. బాలగోపాల్ | 50 |
| చరిత్రలో ఏం జరిగింది | గార్డన్ చైల్డ్ | 80 |
| తరతరాల భారతదేశ చరిత్ర | రొమిల్లా థాపర్ | రు. 80 |
| ఆధునిక భారతదేశ చరిత్ర | బిపిన్ చంద్ర | 100 |
| బాబాసాహెబ్ అంబేద్కర్ | బి. విజయభారతి | 70 |
| కన్నబీరన్ | వ్యాస సంకలనం | 50 |
| చేగువేరా | కాత్యాయని | 80 |
| ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ | నళినీ జమీలా | 50 |
| పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ | మహాశ్వేతాదేవి | 150 |
| నిర్జన వారధి | కొండపల్లి కోటేశ్వరమ్మ | 100 |
| ఇంట్లో ప్రేమ్‌చంద్ | శివరాణీ దేవి | 120 |
| పరిచయాలు | ఎన్. వేణుగోపాల్ | 50 |
| నా ప్రజాజీవితం | పెండ్యాల రాఘవరావు | 50 |
| ఆర్.ఎస్.రావు స్మృతిలో | వ్యాస సంకలనం | 50 |
| హక్కుల బాటసారి | బుర్ర రాములు రచనలు | 50 |
| నిగాహ్ | కె. బాలగోపాల్ వ్యాసం సంకలనం | 200 |
| ఛత్రపతి సాహూ మహరాజ్ | కాత్యాయని | 40 |

## విప్లవోద్యమం

| | | |
|---|---|---|
| పోలీసులు అరెస్ట్ చేస్తే | బొజ్జా తారకం | 30 |
| భారత్‌పై అరుణతార | యాన్ మిర్డాల్ | 100 |
| జంగల్‌నామా | సత్నామ్ | 100 |
| జనహృదయం జనార్దన్ | సూరపనేని మోహనరావు | 60 |
| కోటి జ్ఞాపకాలు | విరసం ప్రచురణ | 50 |

## తత్వశాస్త్రం

| | | |
|---|---|---|
| మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ | డా. శ్రీనివాస్ | 100 |
| లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని | | |

## కథ - నవల

| | | |
|---|---|---|
| గంగానమ్మ | విజయ | 15 |
| రుదాలి | మహాశ్వేతాదేవి | 45 |
| ఏడుతరాలు | అలెక్స్ హేలీ | 80 |
| కథలగూడు | దేవులపల్లి కృష్ణమూర్తి | 60 |
| పథేర్ పాంచాలి | బిభూతిభూషన్ బంధోపాధ్యాయ | 100 |
| వనవాసి | బిభూతిభూషన్ బంధోపాధ్యాయ | 100 |
| చంద్రగిరి శిఖరం | బిభూతిభూషన్ బంధోపాధ్యాయ | 50 |
| అపరాజితుడు | బిభూతిభూషన్ బంధోపాధ్యాయ | 100 |
| నేల నాగలి - మూడెద్దులు | బొజ్జా తారకం | 25 |
| పంచతంత్రం | బొజ్జాతారకం | 100 |
| ఇస్మత్ చుగ్తాయి కథలు | ఇస్మత్ చుగ్తాయి | 100 |
| పంచమం | చిలుకూరి దేవపుత్ర | 100 |
| అజేయుడు | అలెగ్జాండర్ ద్యుమా | 160 |
| ఘంటారావం | విక్టర్ హ్యూగో | 100 |
| స్పార్టకస్ | హోవార్డ్ ఫాస్ట్ | 80 |
| రేపటి కల | రిచర్డ్ రైట్ | 50 |

| | | |
|---|---|---|
| **Fifty Years of Andhra Pradesh** | **(1956-2006)** | 300 |
| **Towards Understanding Semi Feudal - Semi Colonial Society** | R.S. Rao | 300 |
| **In search of Method** | Mudunuri Bharathi | 200 |
| **Individual Sub-groups, Groups and Freedom** | Mudunuri Bharathi | 75 |
| **Crisis and Development in Marxian Framework** | Mudunuri Bharathi | 80 |
| **Methodoly of Social Enquiry** | Mudunuri Bharathi | 150 |
| **On Education** | Mudunuri Bharathi, R.S. Rao | 100 |
| **Understanding Maoists** | N. Venugopal | 300 |

**వీక్షణం,** మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

141 ISSN 2231-6892

# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2013
సంపుటి : 11
సంచిక : 4



## లోపలి పేజీల్లో...



'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

### వీక్షణం చందా వివరాలు

| | సంస్థలకు / లైబ్రరీలకు | వ్యక్తులకు | విద్యార్థులకు |
|---|---|---|---|
| విడి ప్రతి | రు. 15 | రు. 15 | రు. 15 |
| సంవత్సరం | రు. 180 | రు. 150 | రు. 120 |
| మూడు సంవత్సరాలు | రు. 500 | రు. 400 | రు. 350 |
| ఐదు సంవత్సరాలు | రు. 800 | రు. 650 | – |
| పది సంవత్సరాలు | రు. 1500 | రు. 1300 | – |

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

*వీక్షణం మార్చ్ 2013 సంచికలో 33వ పేజీలో అచ్చయిన ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి 'వధువు కావలెను' ప్రకటన కులాలను ప్రోత్సహించేదిగా ఉంది. ఇటువంటి కుల స్వభావపు వ్యక్తీకరణలను వీక్షణం తీవ్రంగా ఖండిస్తుంది. వీక్షణం ఆ ప్రకటనను వేసి ఉండవలసింది కాదు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. – సం.*

**వీ**క్షణం ఫిబ్రవరి 2013 సంచికలోని సంపాదకీయంతోపాటు కొన్ని వ్యాసాలు ఆలోచింప చేసేవిగా, అవగాహన పెంచేవిగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో స్త్రీలపై జరిగిన, జరుగుతున్న అత్యాచారాలకు మూలాలు, కారణాలు పరిశీలించినట్లైతే అత్యాచార నేరస్తులను శిక్షించడం ఎంత అవసరమో, ఆ నేరస్తులను తయారు చేస్తున్న, వారికి ప్రేరకాలుగా ఉపయోగపడుతున్న ఈనాటి వ్యవస్థ తీరును వ్యతిరేకించడం కూడా అంతే అవసరం. ఈ రోజు స్త్రీని మానవ విలువలున్న మనిషిగా కాకుండా, ఒక వినియోగ, భోగ వస్తువుగా చూపే విష సంస్కృతిని నింపుతున్న వ్యవస్థకు, స్త్రీని ఆట వస్తువుగా చూపుతున్న మీడియా సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా గళం వినిపించాలి. రెండవ అంశం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు అవలంబిస్తున్న అస్పష్ట ప్రకటనల వల్ల, పూటకో మాటతో సమస్య సాగతీత వల్ల పాలకుల పట్ల ప్రజలకు నమ్మకం సన్నగిల్లి, సహనం నశిస్తుంది. తెలంగాణ ప్రజలలో అవిశ్వాసం, అశాంతి పెరగకుండా ప్రజల ఆకాంక్షను నెరవేర్చవలసిన బాధ్యత ఉంది. ప్రపంచ తెలుగు మహాసభల పై వివి గారి వ్యాసం వివరణాత్మకంగా ఉంది. 1975లో మొదటిసారి ప్రభుత్వపరంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరిపిన నాటి నుండి ఇప్పటి వరకు 37 సంవత్సరాల కాలంలో పరిపాలన విధానంలో తెలుగు భాష అమలు జరుగుతున్న తీరును పరిశీలించినట్లైతే, ఇప్పటికీ కూడా కెజి నుండి పిజి వరకు ఇంగ్లిష్ విద్యాబోధన, న్యాయస్థానాలలో ఇంగ్లిష్‌లోనే విచారణలు, తీర్పులు ఇస్తున్నాయి. రాష్ట్ర సచివాలయంలో ఉత్తర్వులన్నీ ఇంగ్లిష్‌లోనే వెలువడుతున్న రాష్ట్రం మనది. ఈ మధ్య తిరుపతిలో జరిగిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు కూడా ఒక పక్క ప్రత్యేక రాష్ట్రం కోసం ఉవ్వెత్తున ఉద్యమాలు జరుగుతున్న సందర్భంగా, సభలు మాత్రం ఆర్భాటంగా, అనుంగు సాహితీవేత్తలకు సన్మానాలతో ముగిసింది. తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు భాష అమలుకై చేసిన తీర్మానాలు ఏ మేరకు అమలు జరుగుతాయో వేచి చూడవలసి ఉంది. చివరగా, వ్యవస్థలో జరుగుతున్న అవలక్షణాలను వెలికితీసి తెలుగు ప్రజలకు అవగాహన కల్పించి, ఆరోగ్యకరమైన సమాజం కోసం పాటుపడుతున్నందుకు వీక్షణం పత్రికకు కృతజ్ఞతలు.

**– బోరెడ్డి మధుసూదన్ రెడ్డి**
*సిద్దిపేట, మెదక్*

**వీ**క్షణంలో రెగ్యులర్‌గా ప్రచురిస్తున్న 'చర్చ' శీర్షిక పేజీల్లోని విషయాలు ఆసక్తి దాయకంగానూ, ఉపయోగకరంగానూ ఉంటున్నాయి. ఫిబ్రవరి సంచికలో 'కుల చట్రంలో లక్ష్మింపేటకు పరిష్కారమా?'లో పుల్లూరి జగదీశ్వరరావు గారు కుల సమస్యకు సంబంధించిన ఒక అంశాన్ని చాలా సులభశైలిలో, చాలా ప్రతిభావంతంగా వివరించారు. 'వ్యవసాయ సంబంధాలు – స్త్రీ పాత్రలో మార్పులు – అర్ధ భూస్వామ్యం'లో ఆశాలత గారి వివరణ చాలా సరిగానూ, శాస్త్రీయంగానూ, వాస్తవికంగానూ ఉన్నది. ఇక సుబ్బనాచారి గారు రాసిన 'దళితుల ఆత్మగౌరవాన్ని ఎత్తిపట్టిన వ్యాసం'లో ఆయన చర్చించి, స్పష్టం చేసిన ప్రధానమైన విషయం కులాల విడి విడి పోరాటాల వల్ల కలిగే ఫలితం తాత్కాలికమేనని, సామాజిక మార్పు కోసం ఉద్యమిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నొక్కి చెప్పారు. ఇక మార్చి నెల సంచికలో ఎస్. కృష్ణమూర్తిగారు రాసిన 'భారత – చైనా యుద్ధం – అర్ధ సత్యాలు'లో భారత్ – చైనా యుద్ధంపై రచయిత రాసిన దాంట్లో సానుకూల విషయాలను, సరైన విషయాలను గుర్తిస్తూనే దానిలో దొర్లిన అర్ధ సత్యాల గురించి సరైన ఆధారాలతో ఎత్తి చూపడం చాలా బాగుంది. 'ఇక మంచి వ్యాసాలు – కానీ అవగాహన లోపం'లో ఎన్. ఆదిరెడ్డి గారు లోకసంచారి గారి ఇటీవలి కాలంలో రాసిన అన్ని వ్యాసాలను సానుకూల దృష్టితో, లోతుగా విశ్లేషించడం, లోపాలను ఎత్తి చూపడం బాగుంది. ఆ పనికోసం ఆదిరెడ్డిగారు ఎన్ని గంటల సమయాన్ని వెచ్చించి ఉంటారో కదా! అని అనిపించింది. ఆ రకమైన వైఖరి, శ్రద్ధతో కూడిన పరిశీలన, విశ్లేషణ, తప్పులను ఎత్తి చూపే పద్ధతి అందరూ అనుసరించదగినదిగా ఉంది. ఇక రంగనాయకమ్మగారి 'కుండెడు అమృతంలో రెండు విషపు చుక్కలు ఉండవచ్చునా' అనే దానిపై ఎక్కువగా వ్యాఖ్యానించవలసిందేమీ లేదు. ఆమె ఎత్తి చూపే, విమర్శించే పద్ధతిలోని హేతుబద్ధత గురించి ఆంధ్ర రాష్ట్రంలోని పాఠకులకు సుపరిచితమే. వీక్షణం ఈ శీర్షికలోని ఒరవడిని కొనసాగించాలనీ, దానిని మరింత పెంపొందింప చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనేది నా అభిప్రాయం.

**– జి. సత్యనారాయణ రెడ్డి**
*హైదరాబాద్*

*దశాబ్ది సంచిక పై చర్చతో పాటుగా 'నిత్య జీవితంలో సోషలిజం' పుస్తక రచనపై కూడా చర్చ జరిగింది. ఫిబ్రవరి 2013 సంచికలో ఆ సమావేశపు ఫొటోలతో పాటు ఈ సమాచారం ఇవ్వనందుకు చింతిస్తున్నాం. – సం.*

**2001**లో పార్లమెంట్‌పై దాడి కేసులో మహమ్మద్ అఫ్జల్ గురును కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇరికించి, ఉరిశిక్ష విధించి, రాష్ట్రపతి క్షమాభిక్ష దరఖాస్తును తిరస్కరింప చేసి, రహస్యంగా ఉరి పేరుతో హత్య చేసింది. అతనికి న్యాయ సహాయం అందించడంలో హక్కుల సంఘాలు వైఫల్యం చెందాయి. స్వయం నిర్ణయాధికార ఉద్యమ సంస్థలు తగు రీతిలో స్పందించలేకపోయాయి. రాజ్యం, మీడియా కవల పిల్లలు. ఉరికి ముందు ఒకరకమైన కథనాలు, ఉరి తరువాత మరొక కథనాలు ప్రచురించాయి. నిర్భయ 'ఘటన' సందర్భంగా (అ) స్వతంత్ర భారత దేశంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రపతి భవనాన్ని ముట్టడించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది స్పందించినందున జె.ఎస్. వర్మ కమిటీ 23 డిసెంబర్‌న నియమించడం, నెల రోజుల లోపే చారిత్రాత్మకమైన సిఫారసులు చేయడం జరిగింది. అంతేకాక మరింత పదునైన వాస్తవ అభిప్రాయాలు తెలియజేశారు. భన్వారి దేవి, మథుర కేసుల్లో న్యాయమూర్తుల తీర్పుల సందర్భంగా చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. జస్టిస్ వర్మ కమిషన్ సిఫారసులు అమలు కోసమంటూ ప్రభుత్వం నేర చట్టం (సవరణ) 2012కు ఆర్డినెన్స్ తెచ్చింది. మహిళా భద్రతకు దోహదం చేసే సిఫారసుల్లో కీలకమైన అంశాలను పార్లమెంట్‌లో చర్చించకుండా వచ్చిన ఆర్డినెన్స్‌ను అందరూ వ్యతిరేకించాలి. స్త్రీల భద్రత కొరకు, లైంగిక దాడులు నిరోధించే రక్షణ చట్టం కొరకు ఉద్యమించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**– తుంపాల శ్రీరామమూర్తి**
*విశాఖపట్నం*

**అ**త్యాచారాల గురించి వీక్షణం మార్చ్ 2013 సంచికలో ఉదయ గారి 'అత్యాచార నిరోధక ఆర్డినెన్స్' వ్యాసం చదివిన తరువాత సుమారు ముప్పై ఏళ్ల క్రితం జరిగిన ఘటన గుర్తుకు వచ్చింది. గుంటూరు జిల్లాలో ఒక నిందితురాలిని పోలీసు స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసి, సబ్ ఇన్‌స్పెక్టర్ అత్యాచారం చేశాడని ఆమె ఆరోపించినా, మెజిస్ట్రేట్ ఆమెను రిమాండ్‌కు పంపగా, పౌరహక్కుల కార్యకర్తల, పత్రికల వల్ల విషయం బయటపడింది. ప్రభుత్వం ఏమీ చేయకపోగా, కోర్టును ఆశ్రయించడంతో సుప్రీంకోర్టు దాకా వెళితే జిల్లా కలెక్టర్‌ను విచారించమని

*(మిగతా 19వ పేజీలో...)*

**అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు**

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ;

# పాలక కుటిల నీతికి అక్షర సాక్ష్యాలు బడ్జెట్లు

ప్రపంచీకరణ విధానాల తర్వాత, ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి వ్యూహం నిరాదరణకు గురికావడం మొదలైన తర్వాత వార్షిక బడ్జెట్ అనే మాటకు అర్థమే లేకుండా పోయింది. రానున్న సంవత్సరంలో తన ఆదాయ వ్యయాలు ఎలా ఉండబోతున్నాయో ప్రభుత్వం చేసే ప్రకటనే బడ్జెట్. ఏ విధానాలు అవలంబించి ఏ ఆదాయాన్ని సమకూర్చుకో దలచుకుంటున్నదో, ఏ విధానాల మీద ఎంత వ్యయం చేయదలచుకుంటున్నదో ప్రభుత్వం ఈ బడ్జెట్ లో తెలియజేస్తుంది. ఆ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రజాప్రతినిధుల ముందర ప్రవేశపెట్టి, వారి చర్చ తర్వాత మార్పులు చేర్పులు చేసిన విధానాల మేరకే ఆదాయ వ్యయాలు ఉండేలా చూడడం బడ్జెట్ తాత్విక దృక్పథం.

ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాల చిత్తశుద్ధికి ఎంతో కొంత ప్రాధాన్యత ఉండే రోజుల మాట అది. ఇవాళ ప్రభుత్వ విధానాలు అనేవి లేవు, అవి మార్కెట్ ఇష్టాయిష్టాలకు, అంతకన్న ఘోరంగా కార్పొరేట్ కంపెనీల అధిపతుల ఇష్టాయిష్టాలకు లోబడి రూపొందుతున్నాయి. అందువల్ల బడ్జెట్‌లో పాలనా విధానాలు ప్రకటించాలనే నియమమేమీ లేదు. బడ్జెట్‌కు ముందు రోజో, తర్వాత రోజో, ఏడాది పొడవునా ఎప్పుడు తమ యజమానులు కోరుకుంటే అప్పుడో విధాన ప్రకటనలు రావచ్చు. ఆ ప్రకటనలకూ బడ్జెట్‌కూ ఏమీ సంబంధం లేదు. ఇక బడ్జెట్‌ను చర్చించవలసిన ప్రజాప్రతినిధులు అనబడేవాళ్లు లేరు. ఐదు కోట్లో పది కోట్లో పదిహేను కోట్లో ఖర్చు పెట్టి చట్టసభలో స్థానం సంపాదించడం, ఆ స్థానాన్ని ఉపయోగించుకుని అంతకు రెట్టింపు సంపాదించుకోవడం ప్రజాప్రతినిధుల ఏకైక కార్యక్రమం. ఆ పనిలో తలమునకలై ఉన్నందువల్ల వారికి చట్టసభలకు వెళ్లడానికి తీరిక దొరకదు. ఒకవేళ దొరికి వెళ్లినా తమ పనులు చక్కబెట్టుకోవడానికే తప్ప ఇటువంటి చిల్లరమల్లర లెక్కల పత్రాల మీద చర్చించడానికి కాదు. చర్చిద్దామని కూచున్నా ఆ లెక్కల సంస్కృతం అర్థం కాదు. అలా మొత్తం మీద బడ్జెట్ అనేది ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో పనికిమాలిన వ్యవహారం అయిపోయింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని అన్ని వ్యవస్థల లాగనే అది కూడ నామమాత్రంగా, రూపంలోనే తప్ప సారంలో శూన్యంగా మారిపోయింది.

అలా బడ్జెట్ కూడ ఒక తతంగంగా మారిపోయాక దానికీ ఇతర తతంగాల స్థాయి వచ్చేసింది. పెళ్లిలో, తద్దినాలలో పురోహితుడు చదివే మంత్రాలు, పురోహితుడికీ, ఆ వేదిక మీద కూచున్న ఒకరిద్దరికీ తప్ప మరెవరికీ పట్టనట్టు, ఇవాళ బడ్జెట్ కూడ పత్రికలకూ టివి ఛానళ్లకూ ఛానళ్ల చర్చల మేధావులకూ ఆర్థిక మంత్రిత్వశాఖకూ తప్ప మరెవరికీ పట్టని వ్యవహారమైపోయింది. దానిమీద చర్చించడమే అనవసరం అన్న స్థితి వచ్చేసింది. ప్రజాజీవితాన్ని ప్రభావితం చేయగల ఒక ముఖ్యమైన రాజకీయార్థిక విధాన పత్రానికి ఈ గతి పట్టించిన భారత పార్లమెంటరీ రాజకీయ నాయకత్వపు సమర్థత ఆశ్చర్యం గొలుపుతుంది.

అలా బడ్జెట్ ఎవరికీ పట్టని పనికిమాలిన విధాన ప్రకటన అయిపోయినా ప్రజాజీవితంపై దానికి ఉండగల ప్రభావం వల్ల, ప్రజల శ్రమ ఫలితమైన సంపదను పంపిణీ చేసే ఒక సాధనం అయినందువల్ల దాన్ని విశ్లేషించవలసి ఉంటుంది.

ఈ ఫిబ్రవరి 28న లోకసభలో కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం కేంద్ర బడ్జెట్‌ను, మార్చ్ 18న శాసనసభలో రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ రెండు బడ్జెట్లూ కూడ అంకెల గారడీగా, మాయగా ఉన్నాయి. చేస్తున్న పని చేయడం లేదన్నట్టుగా, చెయ్యని పని చేస్తున్నట్టుగా భ్రమింపజేయడం ఈ బడ్జెట్ల లక్షణం. పేద, మధ్యతరగతి ప్రజల గొంతు నులుముతూ సేవలు అందిస్తున్నామనడం, ధనిక వర్గాల అడుగులకు మడుగులొత్తుతూ వారికి ఇబ్బంది కలిగిస్తున్నామనడం బడ్జెట్లు నేర్చుకున్న కళ.

కేంద్ర బడ్జెట్ రు. 16,65,297 కోట్లు. ఇందులో ప్రణాళికా వ్యయం రు. 5,55,224 కోట్లు. ప్రణాళికేతర వ్యయం రు. 11,10,073 కోట్లు. కేంద్ర బడ్జెట్ ప్రసంగం దేశ ఆర్థిక స్థితి ఆందోళనాకరంగా ఉన్నదని, వృద్ధిరేటు ఆశించినంతగా, ఊహించినంతగా లేదని మొదలయింది. అందువల్ల కొన్ని చర్యలు అనివార్యమయ్యాయని నమ్మబలికింది. సంక్షేమ వ్యయాలను తగ్గించక తప్పదు. సబ్సిడీలను తగ్గించక తప్పదు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయక తప్పదు. ఖర్చు పెరిగిపోతున్నదని ఒకవైపు అంటూనే ఆదాయం పెంచుకోవడానికి ఉన్నతాదాయ వర్గాల మీద పన్ను వేయాలనే వైపు మాత్రం కనీస ఆలోచన కూడ చేయలేదు. అనవసరమైన వృథా ఖర్చు తగ్గించుకోవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఒక్క రక్షణ రంగ కేటాయింపులను చూసినా ఈ దివాళాకోరు మాటలగారడీ బయటపడుతుంది. ప్రజా సంక్షేమ రంగాలకు గత సంవత్సరం ఇచ్చినంత ఇవ్వడానికీ, రెండు మూడు శాతం పెంచడానికీ చేతులు రాని చిదంబరం రక్షణ రంగానికి మాత్రం గత సంవత్సరం కన్న 14 శాతం పెంచి రు. 2,03,672 కేటాయించడానికి నిర్ణయించాడు. ఈ రక్షణ రంగ కేటాయింపులలో అత్యధికభాగం ఆయుధాల కొనుగోళ్ల కోసం బహుళ జాతి సంస్థల బొక్కసాలకు చేరుతాయి. వాటిలో ఎక్కువభాగం మంత్రులకు, అధికారులకు ముడుపులుగా అందుతాయి. ఇది దేశభక్తికి సంబంధించిన వ్యవహారం గనుక అధికార రహస్యాల చట్టాన్ని అన్వయించి ఎవరూ ప్రశ్నించకుండా చూడవచ్చు. అందువల్ల ఇటీవలికాలంలో ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి పాలకులు ఈ రక్షణరంగ కేటాయింపుల మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

ఇక రాష్ట్ర బడ్జెట్ ఎంత పెద్దదిగా తయారుచేస్తే అంత గొప్ప అనే తప్పుడు ధోరణి కొంతకాలంగా రాజ్యమేలుతోంది. పెట్టే ఖర్చు ఎంత ఎక్కువ అని కాదు, అది ఏ రంగాలకు, ఏ ఫలితాల కోసం, ఏ వర్గాల మేలు కోసం అన్నది ముఖ్యమైన ప్రశ్న. ఆ ప్రశ్న వేసుకోకుండా రు. 1,61,000 బడ్జెట్ (ఇందులో ప్రణాళికా వ్యయం రు. 59,422 కోట్లు, ప్రణాళికేతర వ్యయం రు. ఒక లక్షా ఒక వెయ్యి కోట్లు) ఖర్చు పెట్టడమే ఘనత అన్నట్టు ప్రకటించారు. ఈ ఖర్చు వల్ల రు. 24,487 కోట్ల ద్రవ్య లోటు ఉన్నప్పటికీ ఆ లోటు తీర్చడానికి అప్పు తెస్తామని, కొత్త పన్నులు వేయడం లేదని చాల ఔదార్యాన్ని ప్రకటించారు. కాని అప్పు తేవడమంటే భవిష్యత్తులో మరిన్ని పన్నులు వసూలు చేస్తామనే అర్థం.

ఒక్క మాటలో చెప్పాలంటే రెండు బడ్జెట్లూ అబద్ధాల కుప్పలు. మాటల గారడీలు. ప్రజలను మోసం చేసే పాలకవర్గ కుటిలనీతికి అక్షరసాక్ష్యాలు.

వీ

# సామాజిక సంక్షోభ తీవ్రతా సూచికలు

దేశవ్యాప్తంగా ఎన్నికలు సమీపిస్తున్నాయనే హడావుడిలో అటు భారతీయ జనతా పార్టీ, ఇటు కాంగ్రెస్ రెచ్చగొడుతున్న మతోన్మాదం, అఫ్జల్ గురు ఉరి తర్వాత జమ్మూ కశ్మీర్ లలో మళ్లీ రగులుతున్న, బద్దలవుతున్న అసంతృప్తి, రోజుకొకటి చొప్పున బైటపడుతున్న అవినీతి ఉదంతాలు, రక్షణ శాఖ కొనుగోళ్లలో కుంభకోణాలు, ఒడిశాలో పోస్కో ఆందోళనను అణచివేయడానికి పోలీసులే బాంబులు విసిరి ఉద్యమకారులను పొట్టన పెట్టుకోవడం, కూడంకుళంలో మరి రెండు రియాక్టర్లు నెలకొల్పడానికి ఉగ్రరూతలూగుతున్న ప్రభుత్వం, లేని విదేశీ కంపెనీల పేర్లతో పోలవరం ప్రాజెక్టు దక్కించుకున్న దొంగ కంపెనీల రాత్రికి రాత్రి అనుమతులు, విచ్చలవిడిగా ధరల పెరుగుదల, ఒకవైపు కఠిన చట్టాల గురించి మాట్లాడుతుండగానే మరొకవైపు మహిళల మీద పెచ్చరిల్లుతున్న అత్యాచారాలు, మణిపూర్ ఉద్యమకారిణి ఇరోమ్ షర్మిలా అక్రమ నిర్బంధం, స్వతంత్రంగా ఉండవలసిన న్యాయవ్యవస్థనూ, పరిశోధనా సంస్థలనూ రాజకీయ అవసరాల కోసం దుర్వినియోగం చేయడం, శ్రీలంక సైనిక అత్యాచారాల విషయంలో న్యాయాన్యాయ విచక్షణ పక్కనపెట్టడం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల విషయంలో మాత్రం జోక్యం చేసుకుని ద్వంద్వవైఖరి ప్రదర్శించడం, మానవాభివృద్ధి సూచికలో అట్టడుగు పడిపోవడం... ఒక్క సంఘటన కాదు, ఒక్క ప్రాంతం కాదు, దేశం అటు మూల నుంచి ఇటు మూల దాకా ఏదో ఒక ఆందోళనతో, సమస్యతో, ధరల పెరుగుదలతో, అవినీతితో, పోలీసు, పారామిలిటరీ దళాల మోహరింపుతో అట్టుడికిపోతున్నది. మన సమాజంలో నెలకొని ఉన్న విభజనల వల్ల, చీలికల వల్ల, అనైక్యత వల్ల ఈ సమస్యలన్నిటి నుంచీ కూడ పాలకవర్గాలు ప్రస్తుతానికి గట్టెక్కవచ్చు. ఒక సమూహం మీదికి మరొక సమూహాన్ని ఎగదోసి, ఏదో ఒక సమూహానికి ఏవో పనికిమాలిన తాయిలాలు ముట్టజెప్పి ఇవాల్టికి పబ్బం గడుపుకోవచ్చు. కాని నానాటికీ సమస్యలు పెరిగిపోతుండడం, సమస్యల తీవ్రత, విస్తృతి, లోతు పెరిగిపోతుండడం, ఎక్కువ ప్రజాసమూహాలు ఆందోళనాపథంలోకి దిగడం దేనికి సూచిక? ఈ పరిణామాలన్నీ భారత సమాజం అనబడేది అగ్నిపర్వతంలా ఉన్నదని, సమస్యల నిలయంగా ఉన్నదని స్పష్టం చేస్తున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభం భయానక స్థితికి చేరి ప్రతిరోజూ ప్రతిచోటా ఏదో ఒక రూపంలో విస్ఫోటనమవుతున్నది. నిన్నటివరకూ కడుపులో చల్ల కదలకుండా ఉన్న ప్రాంతాలు, సమూహాలు కూడ ఇవాళ ఈ సుడిగుండంలోకి లాగబడుతున్నాయి. ఇంకెవరూ ఎంతమాత్రమూ మౌనంగా ఉండలేని స్థితి పెరిగిపోతున్నది. ఈ స్థితి ఇంకా విస్తరిస్తున్న కొద్దీ సమాజం అల్లకల్లోలమైపోతుంది, హింసాద్వేషాలు చెలరేగుతాయి. సామాజిక భద్రతకే ప్రమాదం వాటిల్లుతుంది. ఎన్ని కోట్ల మంది భద్రతా బలగాలయినా, ఎన్ని లక్షల కోట్ల రూపాయల నిధులైనా ఆ కల్లోలాన్ని ఆపజాలవు. ప్రస్తుత పాలకవర్గాల అధికారం కింద ఆ విధ్వంసం అనివార్యం. ఈ అగ్నిపర్వతాన్ని పేలనిచ్చి మొత్తం సమాజాన్ని ధ్వంసం కానిద్దామా, నిర్మాణాత్మక నాయకత్వం, మార్గనిర్దేశనం అందించి ఆ సారవంతమైన లావాతో సమాజ పునర్నిర్మాణం సాగిద్దామా ఎవరికి వారు తేల్చుకోవలసిందే. వీ

# చావెజ్ అసమగ్ర ప్రయత్నం ఎంత ప్రశంసనీయం?

వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ (1954 – 2013) అకాల మరణం మీద ప్రపంచవ్యాప్తంగా భిన్న ప్రతిస్పందనలు వెలువడుతున్నాయి. ఆయనను ఇరవై ఒకటో శతాబ్దపు సోషలిజం ప్రతినిధిగా, విప్లవకారుడిగా చూస్తున్న వారు చాలమందే ఉన్నారు. వారందరూ ఇది తీరని లోటని ప్రకటిస్తున్నారు. అనేక దేశాల నుంచి చావెజ్ పట్ల ప్రశంసలు నిండిన సంస్మరణ వ్యాసాలు, ప్రకటనలు వెలువడుతున్నాయి. భారతదేశంలో, తెలుగుసీమలో కూడ పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలు, చాలమంది ప్రగతిశీల మేధావులు, పత్రికలు, టివి ఛానళ్లు చావెజ్ మీద ప్రశంసలు కురిపించాయి. సామ్రాజ్యవాదశక్తులు ఆయనను శత్రువుగా చూస్తున్నాయి గనుక మరణానంతరం కూడ ఆయన పట్ల వారినుంచి సానుకూల వ్యాఖ్యలేమీ రాలేదు. పీడ వదిలిందనే లాంటి వ్యాఖ్యలే వచ్చాయి. ఈ రెండు చివరలకూ మధ్య అర్జెంటీనా, ఈక్వడార్, పెరూ, ఆఫ్ఘనిస్తాన్, ఫ్రాన్స్, బంగ్లాదేశ్, టర్కీల వంటి దేశాల మావోయిస్టు బృందాలు చావెజ్‌ను సోషల్ ఫాసిస్టు అనీ, ఆయన ప్రకటించిన సోషలిజం, సామ్రాజ్యవాద వ్యతిరేకతలు ముసుగులు మాత్రమేనని, ఆ సంస్కరణవాదమే ప్రమాదకరమనీ తీవ్రమైన ప్రకటనలు చేశాయి. నాజీలు తమను తాము నేషనల్ సోషలిస్టులమని పిలుచుకున్నట్టే చావెజ్ బొలివారియన్ సోషలిస్ట్ అని పిలుచుకున్నాడని చిలీ నుంచి వెలువడే పత్రిక ఎల్ పూబ్లో రాసింది. ఈ భిన్న వ్యాఖ్యానాల మధ్య వాస్తవమేమిటి? చావెజ్ విప్లవకారుడా, కుహనా విప్లవకారుడా, సంస్కరణవాదా, సోషల్ ఫాసిస్టా, సామ్రాజ్యవాద వ్యతిరేకి అవునా కాదా? అమెరికా సామ్రాజ్యవాద పాలకవర్గాలు తమ పెరడుగా భావించే లాటిన్ అమెరికా దేశాల నేపథ్యం నుంచి చూసినప్పుడు చావెజ్ కృషిని కొంత సానుభూతితో చూడవచ్చు. సోవియట్ అనంతర ప్రపంచంలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అవసరాన్ని గుర్తించినప్పుడు చావెజ్ కృషి తప్పనిసరిగా ప్రశంసనీయమైనదే. అయితే, ఆయన ప్రయత్నం అసమగ్రమైనది. ఆయన సోషలిజం శాస్త్రీయ సోషలిజం కాదు. మార్క్సిజం లెనినిజాన్ని తాను వ్యతిరేకిస్తానని, అది పిడివాదమని, తనది బొలివారియన్ సోషలిజమని ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు. ఆ అభిప్రాయాలకు తగినట్టుగానే పాలన నడిపాడు. సైనికకుట్రకు ప్రయత్నించి, విఫలమై, జైలుశిక్ష అనుభవించి, విడుదలై, ఎన్నికలలో పాల్గొని గెలిచిన తర్వాత ఆయన ప్రయత్నించినది సామాజిక మార్పు కొరకు కాదు. పెట్టుబడిదారీ ప్రయోజనాలను మౌలికంగా దెబ్బతీయకుండా, పేదలకు మేలు కలిగే సంస్కరణల ప్రయత్నమే ఎక్కువ. అందువల్లనే పద్నాలుగు సంవత్సరాల పాలన తర్వాత అక్కడి వ్యవస్థలో మార్పులు జరగలేదు గాని, కొన్ని అతుకులు, మాట్లు, సంస్కరణలు మిగిలాయి. అవి కొనసాగుతాయా లేదా కాలమే చెపుతుంది. నరహంతకుడు జార్జి బుష్ దగ్గర కార్యదర్శిగా పనిచేసిన కండొలీజా రైజ్‌ను రాజకీయ పరిభాషలో ఎంతయినా విమర్శించవచ్చు గాని, ఆమెను స్త్రీగా సంబోధిస్తూ చావెజ్ పురుషాహంకారాన్ని బయటపెట్టుకున్నాడు. అలాగే 'నేను మొదట క్రైస్తవుడిని, ఆ తర్వాత సోషలిస్టును' అని ప్రకటించి మతవిశ్వాసాలే తనకు ప్రధానమని చూపుకున్నాడు. చావెజ్ వారసుడుగా ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడుగా ఎన్నికయిన నికొలస్ మదురో పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుడంటేనే అక్కడి సోషలిస్టు ప్రభుత్వం ఎలా నడవబోతున్నదో అర్థమవుతుంది. అలా అటు సామాజికంగానూ, ఇటు వ్యక్తిగతంగానూ అసమగ్ర, అభివృద్ధి నిరోధక, అశాస్త్రీయ భావాలతోనైనా, ప్రజలకు కొంత మెరుగైన పాలన ఇవ్వడానికి ప్రయత్నించిన వ్యక్తిగా చావెజ్ సంస్కరణవాదిగానే చరిత్రలో మిగులుతాడు. వీ



❖ **ఇద్దరి మధ్య** (కవిత్వం) – పలమనేరు బాలాజి– పవిత్ర, ప్రణీత ప్రచురణలు–140 పేజీలు, 1/8 డెమీ రు. 70, ప్రతులకు: కె.ఎన్. జయమ్మ, 6–219, గుడియాత్తం రోడ్డు, పలమనేరు, చిత్తూరు– 517408; సెల్: 9440995010; ఆర్.ఆర్. బుక్ సెంటర్–పలమనేరు; మణి బుక్‌స్టాల్; దిశ; సహచర; నవోదయ; ప్రజాశక్తి; విశాలాంధ్ర



❖ **విద్య–ఉపాధ్యాయుడు–సమాజం –** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్), ప్రగతిశీలుర, ప్రజాతంత్రవాదుల, మేధావుల వేదిక, 106 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : మణి బుక్‌స్టాల్, సండే మార్కెట్, నెల్లూరు – 524 001, సెల్: 7386223538



❖ **నిచ్చెనమెట్ల లోలకం** (కవిత్వం) – జూపల్లి ప్రేమ్‌చంద్ – పాలపిట్ట బుక్స్ – 131 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్–500 036; ఫోన్: 27673430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **నేను గొర్రెల్ని కాస్తుంటాను** (కవిత్వం) – డా. బెల్లి యాదయ్య – పదం ప్రచురణలు – 100 పేజీలు, 1/8 డెమీ, రు: 45, లైబ్రరీ ప్రతి రు. 90, ప్రతులకు: శ్రీమతి బి. గీత, 'శ్రీక్రితి', 6–2–330, ఎన్‌జి కాలేజీ వెనుక, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ టౌన్ – 508 001; సెల్: 9848392690; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు




❖ **విభాజకం –** దీర్ఘ కవిత – డా. బెల్లి యాదయ్య – పదం ప్రచురణలు – 21 పేజీలు, 1/8 డెమీ, రు: 20, లైబ్రరీ ప్రతి రు. 40, ప్రతులకు: 'శ్రీక్రితి', 6–2–330, ఎన్‌జి కాలేజీ వెనుక, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ టౌన్ – 01; సెల్: 9848392690; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు




❖ **కొమురం భీము –** సాహు, అల్లం రాజయ్య – పర్‌స్పెక్టివ్స్ – 214 పేజీలు, 1/8 డెమీ, రు: 150, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ – 500 001; ఫోన్: 040–24744580




❖ **సాహిత్య సందర్భం – సమకాలీన స్పందన –** సాహిత్య వ్యాసాలు – డా. అమ్మంగి వేణుగోపాల్ – జయమిత్ర ప్రచురణ – 372 పేజీలు, 1/8 డెమీ, రు: 200, ప్రతులకు: డా. అమ్మంగి వేణుగోపాల్, 11–9–317, లక్ష్మీనగర్, రోడ్ నం. 4, కొత్తపేట్, హైదరాబాద్–35; సెల్: 9441054637; నవోదయ; విశాలాంధ్ర; ప్రజాశక్తి



❖ **పెత్తనం –** డా. ప్రభంజన్ యాదవ్ – ప్రభంజన పథం పబ్లికేషన్స్ – 72 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: ప్రభంజన పథం పబ్లికేషన్స్, సత్యశోధక విద్యాపీఠం, గూడూరు (గ్రా), పాలకుర్తి (మం), వరంగల్ – 506 252; తెలంగాణ; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో



❖ **కొత్తకోణం –** ఎనిశెట్టి శంకర్ – స్నేహ ప్రచురణలు – 151 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : విశాలాంధ్ర; సహచర; దిశ; నవోదయ




❖ **సోషలిజంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం –** లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు – 48 పేజీలు, 1/8 డెమీ, రు : 15, ప్రతులకు: లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002; సెల్: 9848877596




❖ **తెల్ల కాకులు.. –** కథ – తుమ్మల రామకృష్ణ – తుమ్మల పబ్లికేషన్స్ – 24 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : తుమ్మల రామకృష్ణ, 204, సిగ్మా సెంట్రల్, తారానగర్, శేరీ లింగంపల్లి, హైదరాబాద్ – 500 019; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



❖ **రెప్పల వంతెన –** కవిత్వం – కెక్యూబ్ వర్మ – జంఝూవతి ప్రచురణలు – 136 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : కె.కె. కుమార వర్మ, ఇ.నం. 11–3–11, కెపిఎం హైస్కూల్ దగ్గర, పార్వతీపురం – 535501, విజయనగరం సెల్: 9493436277; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు ఇబుక్ : www.kinige.com




❖ **మహా గురజాడ–శ్రీశ్రీ –** కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్య నిధి ప్రచురణ – 119 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ – 520004, ఫోన్:0866–6617375, సెల్: 9246277375 ఇమెయిల్: srisri_sahityanidhi@yahoo.com



❖ **తెలంగాణలో ఒక కాళరాత్రి –** గోవింద్ కృష్ణన్. వి., అనువాదం: కొణతం దిలీప్ – తెలంగాణ ఆత్మగౌరవ వేదిక – 32 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్‌మార్క్



❖ **మూఢనమ్మకాల విముక్తి –** బొర్రా గోవర్ధన్ – స్వేచ్ఛాలోచన ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు : 40, ప్రతులకు : గోవర్ధన్ బొర్రా, శాంతినికేతన్, నాగారం, గుంటూరు – 522 268; సెల్: 9390600157, 9394656770; ఫోన్: 08648–256780 ఇమెయిల్: govardhanborra@gmail.com



❖ **రాజనీతిజ్ఞుడు బూర్గుల రామకృష్ణారావు (1899–1967)** – ఆచార్య వెలుదండ నిత్యానందరావు – సి.పి. బ్రౌన్ అకాడమి – 138 పేజీలు, 1/8 డెమీ, రు. 95, ప్రతులకు : సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ – 500 082; వెబ్‌సైట్: www.cpbrownacademy.org ఇమెయిల్: info@cpbrownacademy.org;

## తెలంగాణ మహిళా జెఎసి ఆవిర్భావం

తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా మార్చ్ 2న సికింద్రాబాద్‌లోని 'తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్' కార్యాలయంలో 29 మంది సభ్యులతో కూడిన తెలంగాణ మహిళా జెఎసి ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్యను కన్వీనర్‌గా, మరో ఆరుగురిని కో-కన్వీనర్స్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని అన్ని జెఎసి సంఘాలు పాల్గొన్నాయి.

## తెలంగాణ మహిళా ధూం ధాం

హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద మార్చ్ 3న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ' తెలంగాణ మహిళా దూం దాం' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ, అన్ని రంగాల్లో మహిళలకు సమానమైన అవకాశాలూ, సాధికారిత కల్పించాలని నినదించారు. కార్యక్రమంలో అనేక మంది మహిళలూ, మహిళా ప్రజా సంఘాలూ పాల్గొన్నాయి.

## అణు విద్యుత్ కేంద్రాలపై మళ్లీ ఆందోళన

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్రం కోసం మార్చ్ 4న భూసేకరణకూ, సిబ్బంది నియామానికీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 42, 270 లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అణు పార్కు వ్యతిరేక ఉద్యమ కమిటీ, బాధిత మృత్స్యకారులూ, కొవ్వాడ గ్రామాల ప్రజలూ, అఖిల పక్ష నాయకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం బాలవరం సమీపంలో కెపిఆర్ గ్రూపు 100 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణంపై, పరిస్థితులపై అవగాహన పేరుతో స్థానికుల్లో చిచ్చు పెడుతున్నారని కెపిఆర్ కంపెనీకి వ్యవతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

## హక్కుల సాధన కోసం భారీ ర్యాలీ

మహిళ హక్కుల సాధన కోసం ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చ్ 5న వరంగల్‌లో పబ్లిక్ గార్డెన్ నుంచి వేయి స్తంబాల గుడి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. స్వరూపరాణి మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల వల్లనే మహిళలపై అత్యాచారాలూ, దాడులూ జరుగుతున్నాయని అన్నారు.

## శ్రీపాద పినాక పాణి మృతి

ప్రముఖ సంగీత విద్వాంసుడు, కవి, రచయిత శ్రీపాద పినాక పాణి (101) మార్చ్ 11న శ్వాస కోస వ్యాధితో బాధ పడుతూ కర్నూలు జిల్లా ఎస్‌జిఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం, ప్రియాగ్రహారం గ్రామం.

## రెడ్డి ల్యాబ్స్ వ్యవస్థాపకుడి మృతి

ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ వ్యవస్థాపకులు, దాని చైర్మన్ కళ్లం అంజిరెడ్డి మార్చ్ 15న కాలేయ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మరణించారు. ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లాలోని తాడేపల్లి గ్రామం.

## విశ్వాసంలేని అవిశ్వాసం

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ పార్టీ మార్చ్ 15న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. దానికి ప్రధాన ప్రతి పక్షమైన టిడిపి మినహా వైఎస్ఆర్‌సిపి, బిజెపి, సిపిఐలతో పాటు మరికొంత మంది ఎంఎల్ఎలు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో సభలో 261 మంది శాసన సభ్యులున్నారు. అవిశ్వానికి అనుకూలంగా 58 మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా 142 మంది ఓటు వేశారు. తటస్థంగా 64 మంది ఉండగా, 27 మంది గైర్హాజరైనారు.

## రాష్ట్ర బడ్జెట్

**2013-14** ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి మార్చ్ 18న అసెంబ్లీలో రు.1,61,348 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెరు. ఇందులో వ్యవసాయ రంగానికి రు. 500 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు రు. 4122 కోట్లు, గిరిజన శాఖకు రు. 2126 కోట్లు, బిసి సంక్షేమ శాఖకు 4027 కోట్లు, మైనారిటీ సంక్షేమ శాఖకు రు. 1027 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖకు రు.2712 కోట్లు, వికలాంగుల సంక్షేమ శాఖకు రు. 73 కోట్లు, యువజన సర్వీసు శాఖకు రు. 280 కోట్లు, పర్యాటక రంగానికి రు. 69 కోట్లు, శాంతి భద్రతల విభాగానికి రు. 5386 కోట్లు, వైద్య, ఆరోగ్య రంగాలకు రు. 6481 కోట్లు కేటాయించారు

## సడక్ బంద్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజకీయ జెఎసి పిలుపు మేరకు మార్చ్ 21న శంషాబాద్ నుండి అలంపూర్ వరకు 44వ జాతీయ రహదారిపై సడక్ బంద్ నిర్వహించింది. ఈ బంద్‌లో టిఆర్ఎస్, బిజెపి, సిపిఐలతో పాటు అనేక వేల మంది ప్రజలూ, ప్రజా సంఘాలూ, కళా బృందాలూ, విద్యార్థులూ, విద్యార్థి సంఘాలూ, మహిళలూ, మహిళా సంఘాలూ, పాల్గొని బంద్‌ను విజయవంతం చేశాయి. ఈ క్రమంలో అనేక మంది ఉద్యమకారులను అరెస్టు చేశారు.

## పవర్ గ్రిడ్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామక్రిష్టాపురం వద్ద నిర్మించనున్న పవర్ గ్రిడ్‌కు వ్యతిరేకంగా మార్చ్ 22న గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. గ్రిడ్‌ను నిర్మిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వాసిరెడ్డి సత్యనారాయణ మృతి

సీనియర్ పాత్రికేయుడు వాసిరెడ్డి సత్యనారాయణ (82) మార్చ్ 22న విజయవాడలో మరణించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సత్యనారాయణ 1934 ఆగస్ట్ 30న గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరులో పుట్టారు. 1967 నుంచి పత్రిక, రచన రంగంలోకి అడుగు పెట్టారు. విశాలాంధ్ర, జనశక్తి, ఈనాడు, ప్రజాశక్తి పత్రికల్లో పనిచేశారు.

## మావోయిస్టు శ్రీరాముల శ్రీనివాస్ అరెస్టు

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రా-ఒడిశా స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు శ్రీరాముల శ్రీనివాస్ అలియాస్ సుదర్శన్‌ను మార్చ్ 23న ఖమ్మ జిల్లా వైరా మండల పరిధిలో స్పెషల్ టీం పోలీసులు అరెస్టు చేశారు.

వీ

# ఆమ్ ఆద్మీకి చిదంబరం శఠగోపం

***ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా సామాన్యుల, రైతుల ప్రయోజనాల కన్నా, కార్పొరేట్ శక్తుల, పెట్టుబడిదారుల ప్రయోజనాలే ధ్యేయంగానే బడ్జెట్ రూపొందిందని అంటున్నారు వి. హనుమంతరావు***

ప్రణబ్ ముఖర్జీ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యత స్వీకరించక ముందు సంవత్సరంలో ఆ శాఖ మంత్రిగా ఉన్న చిదంబరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను డ్రీమ్ బడ్జెట్ అంటూ కార్పొరేట్, బహుళజాతి సంస్థలు భళిరా, సెహభాష్ అని అనిపించుకొన్న, చిదంబరమే 2013-14 బడ్జెట్‌ను నీళ్ల నములుతూ ప్రవేశపెట్టడం చూస్తే ఆ మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిని ఎంత పతనా వ్యవస్థకు దిగజార్చిందో స్పష్టమవుతుంది. ఇలాంటి ప్రభుత్వం వచ్చే రెండు సంవత్సరాల్లో ప్రస్తుతం అయిదు శాతం వృద్ధిరేటును (జిడిపి) ఎనిమిది శాతానికి పెంచుతామని అనడం తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అరచేతిలో స్వర్గాన్ని చూపించడమే అవుతుంది. నిన్న మొన్నటి దాకా ఆమ్ ఆద్మీ, ఆమ్ ఆద్మీ అంటూ ఇల్లెక్కి బాకాలూదిన ప్రభుత్వం ఆ పప్పులుడకకపోయేసరికి సర్వవ్యాప్తి (ఇంక్లూజివ్ గ్రోత్) అని కొత్త పాట పాడడం ప్రారంభించింది. ఈ మార్పు కూడా ఫలితం ఇవ్వలేదని 2013-14 బడ్జెట్ నిరూపించింది. గ్రామీణ ప్రజలు, రైతాంగం, మధ్యతరగతి గృహస్తులకు గానీ, యువతకు, నిరుద్యోగులకు గానీ స్వాంతన కలిగించడానికి ఈ బడ్జెట్‌లో ఏమైనా ఉందా? లేదు, ఉండబోదు. ఎందుచేతనంటే మన్మోహన్ సింగ్ రెండవ విడత సంస్కరణలు ప్రవేశపెట్టి, కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించి, ఆ బాధ్యతను డ్రీమ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన చిదంబరానికి అప్పగించిన తర్వాత, ఆయన ఆమ్ ఆద్మీకి ఏదో వండి ఒరగబెడతాడని ఆశించడం అత్యాశే అవుతుంది.

చిదంబరం తన బడ్జెట్ ఉపన్యాసాన్ని ఎలాగ ఎత్తుకున్నాడో చూడండి. 'ప్రపంచ దేశాల్లో ఆర్థిక మాంద్యం నెలకొంది. దానినెవరూ తప్పించుకోలేరు. అంటే దేశంలో మాంద్యం ప్రపంచవ్యాప్త సంక్షోభ ప్రభావమే. మా తప్పేం లేదు' అని తప్పించుకోవడానికి ప్రయత్నించడమే. అయితే 2008లో ఇంతకన్నా తీవ్రమైన ప్రపంచవ్యాప్త సంక్షోభం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది కాని దానికి బయటి నుంచి వామపక్షాలు, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో పనిచేసే వారు మన బ్యాంకింగ్ రంగాన్ని రక్షించడమే. మన దేశ ఆర్థికాభివృద్ధి ఎనిమిది శాతానికి చేరుకొనే అవకాశం ఉందని ఆయనే అన్నారు. ఎనిమిదేమిటి, తొమ్మిది శాతానికి చేరిన సంవత్సరాలున్నాయి. అక్కడ నుంచి అయిదు శాతానికి కిందకు దొర్లించిందెవరు?

దేశాభివృద్ధి ఇలా దొర్లు పుచ్చకాయలా కిందకి దొర్లిపోవడానికి అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ కాదా? అందుకనే, ప్రజలు తమ ప్రభుత్వాన్ని వేలెత్తి చూపిస్తారనే తన ఉపన్యాసం మొదట్లో ప్రపంచ మాంద్య స్థితిని ప్రస్తావించి, తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించారు. చిదంబరం మామూలుగా దూకుడుగా దూసుకుపోయే, నిలబడి నిలదొక్కుకునే మనిషి ఇలా నంగి నంగి మాట్లాడాల్సి రావడానికి స్వయంకృతాపరాధమే కారణం.

తన ప్రభుత్వ లక్ష్యం ఎక్కువ అభివృద్ధి సాధించడం ద్వారా ఇంక్లూజివ్ గ్రోత్, సుస్థిరత సాధించడమేనని చెప్పుకొన్నారు. ఆహ్వానించదగిన ప్రకటనే. ప్రజలిలాంటి ప్రకటనలు సవాలక్ష విన్నారు. ఈ లక్ష్యం ఎప్పుడు సాధిస్తారనేదే వారి ప్రశ్న. మనమప్పుడే 12వ ప్రణాళిక మొదటి సంవత్సరం సుమారుగా పూర్తి చేశాం. అప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి. జిడిపి కోత, మంత్రివర్గాలకు కేటాయింపుల్లో కోత, ఉపాధి హామీ పథకం కోత (ధరల పెరుగుదల వల్ల) సబ్సిడీల కోత, ఎరువుల ధరలు, పెట్రోలియం ఉత్పత్తుల కోత, 12వ ప్రణాళికలో కోత - అన్నీ కోతలే. ఈ మొదటి సంవత్సరంలోనే కేటాయింపు అరవై వేల కోట్లు తగ్గనున్నట్లు ప్రకటించారు. అంటే మొదటి సంవత్సరంలోనే చుక్కెదురైంది. కారణం, మాంద్యం అట. 12వ ప్రణాళిక ఫైనల్ స్వరూపమే ప్రణాళిక ప్రారంభించిన ఆరేడు నెలలకు గాని ఆమోదించలేదు. ఆ విషయాన్ని పక్కకు నెట్టి కారణం మాంద్యం అనడం ఎంత బాధ్యతారాహిత్యం. మీ అందరికీ తెలిసే ఉంటుంది. ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ తయారీకి క్రితం సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే పరిపాలనా యంత్రాంగం ప్రాథమిక చర్చలు తీసుకోవడం ప్రారంభిస్తుంది. అదే విధంగా ప్రణాళికా రచన ముమ్మందే ఎందుకు ప్రారంభించారో ఆ సంస్థ ఉపాధ్యక్షులు అహ్లూవాలియా జవాబు చెప్పాలి.

మొట్టమొదట ప్రతీ ఆర్థికమంత్రి వ్యవసాయ రంగం విశ్లేషణతో ప్రారంభిస్తారు. కాని చిదంబరం సాంఘిక సంక్షేమ పథకాలకు తన ఉపన్యాసంలో మొదటి స్థానం ఇచ్చారు. తర్వాతనే 70 శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయాన్ని ఎత్తుకొన్నారు. కాస్త అటూ ఇటూ అయితేనేం, వాటితో తన ఉపన్యాసాన్ని ఆరంభించడం మంచిదే. మొదటి ప్రాధాన్యత యువతకిచ్చారు. వారిలో వృత్తిలో నైపుణ్యాన్ని పెంచడం ఈ పథకం లక్ష్యం. ఈ సంవత్సరం లక్ష్యం 90 లక్షల మందికి నైపుణ్య సాధనలో శిక్షణ ఇవ్వడం. ఇస్తే వారు ఉద్యోగాలకు మరింతగా అర్హులవుతారట. ఇటీవలి కాలంలో పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం ఉద్యోగం కావాలని వచ్చిన వారిలో నైపుణ్యత కొరవడిందనీ, డిగ్రీ సర్టిఫికెట్లు బాగానే ఉన్నాయి గానీ, ఉద్యోగానికి కావల్సిన నైపుణ్యత లోపించిందనీ ఆ వార్తలు తెలియజేస్తున్నాయి. ఆ నేపథ్యంలో నైపుణ్య శిక్షణ మంచిదే. అందుకనే చాలా సంవత్సరాల నుంచి విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు విద్యార్హత

సాధించడంతో పాటు ప్రాక్టికల్‌గా పరిశ్రమల్లో అప్రెంటిస్‌లుగా చేరి అనుభవం సంపాదిస్తే ఉద్యోగార్హత పెరుగుతుందని భావించారు, తీర్మానించారు. ఆచరణ? షరా మామూలే. అసలు విషయం ఉపాధి, ఉద్యోగం. ఆ విషయం ఆర్థికమంత్రి చెప్పకుండా తప్పించుకొన్నారు. ఇప్పటికే బజార్లలో తిరుగుతున్న లక్షలాది నిరుద్యోగులు, నైపుణ్యత లేకనేనా? యువతను బుట్టలో వేసుకొని ఓట్లు సంపాదించడమే ఈ కొంగ్రొత్త పథకం అసలు ఉద్దేశం.

ఎస్‌సి, ఎస్‌టిల ఉప ప్రణాళికలకు రు. 66 వేల కోట్లు కేటాయించానని చెప్పారు. ఈ నిధులను ఇతరత్రా మళ్లించకూడదన్నారు. ఇలా ఇతర సంక్షేమ పథకాలన్నింటికీ కాస్త కాస్తగా ఎంగిలి చేయి విదిలించారు. ధరల పెరుగుదల వెలుగులో ఈ కేటాయింపుల నిజ స్వరూపం బయటపడుతుంది. వ్యవసాయం, తత్సంబంధిత పథకాలకు మొత్తం బడ్జెట్ సుమారు 16 లక్షల కోట్లలో వ్యవసాయానికి కేటాయించిన మొత్తం 8.65 శాతం మాత్రమే. అంటే ప్రతీ నూరు రూపాయల్లో ఎనిమిదిన్నర రూపాయలు ఖర్చు చేయబోతున్నారు. వ్యవసాయం, తత్సంబంధిత కార్యక్రమాలకు వచ్చే ఏడాదిలో ఆ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడే జనానికి ఖర్చు పెట్టే శాతం ఇంతే. వ్యవసాయం అంటే చిదంబరంకు ఎంత ఏవగింపో తెలుసుకోవచ్చు. విదేశీ విత్తనాల పుణ్యమా అంటూ సస్య విప్లవం వచ్చింది. బ్యాంకులిచ్చే రుణ సహాయాన్ని ఏడు లక్షల కోట్లకు పెంచుతారట. చిదంబరం సొమ్మేం పోయింది. బ్యాంకుల్లో ఉన్న డబ్బు ప్రజలు డిపాజిట్ చేసిన సొమ్ము. ప్రభుత్వానిది కూడా కాదు. 30 శాతం మందికే బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలు ముడుతున్నాయి. ఈ లెక్కన వడ్డీ వ్యాపారుల ధృతరాష్ట్ర కౌగిలి నుంచి రైతాంగం ఎప్పుడు బయట పడతుందో మొసలి కన్నీళ్లు కార్చే చిదంబరం గారు సెలవిస్తారా? సస్య విప్లవం అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా తయారైంది. ఉత్పాదకత స్తంభించి పోయింది కాబట్టి, వేరే పంటలు వేసుకోవడం ప్రారంభించాలని చిదంబరం విలువైన సలహా. అంటే వ్యాపార పంటలన్న మాట. ఇదంతా చూస్తుంటే వ్యవసాయానికి (నీటి పారుదల రంగం గురించి ఒక్క మాట కూడా లేదు) ఈ బడ్జెట్ బండి సున్నా చుట్టింది.

వ్యవసాయమే కాదు, గ్రామీణ భారతమే సంక్షోభంలో ఉంది. ఆరు లక్షల గ్రామాల్లో సంక్షోభం నెలకొంటే, భారత దేశం మొత్తం సంక్షోభంలో ఉన్నట్లే కదా. ఈ సంక్షోభం ఈనాటిది కాదు. 1991లో మొదటి విడత సంస్కరణలను అప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న ప్రస్తుత ప్రధాని మన్మోహన్ సింగ్ చేతి చలవే. వ్యవసాయంలో పెట్టుబడులను ప్రపంచ బ్యాంకు ఒత్తిడి మేరకు తగ్గించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మనం ఆహార ధాన్యాల విషయంలో స్వయం పోషకత్వం సాధించి మన కాళ్ల మీద మనం నిలబడడం అమెరికా బంటు ప్రపంచ బ్యాంకుకు ఇష్టం లేదు. (అసలీ స్వయం పోషకత్వం సాధించామనుకోవడమే తప్పుడు లెక్క. 120 కోట్ల మంది కడుపు నిండా భోజనం చేసి ఉంటే దిగుమతుల మీద ఆధార పడుతూ ఉండే వాళ్లం).

ఆహార ధాన్యాల ఉత్పత్తి 2007-08లో 230.8 మిలియన్ టన్నుల నుంచి 2011-12 అంచనా ప్రకారం 257.4 మిలియన్ టన్నులకు పెరగడాన్ని చూపించి తమ వీపు తామే చరుచుకొంటోంది ప్రభుత్వం. కాని ఇదే కాలంలో దేశ జనాభా పెరిగిందనే విషయాన్ని గమనంలోకి తీసుకొంటే కంటికి కనపడే ఉత్పత్తి పెరుగుదల మాయమైపోయి, 2008లో ఎక్కడ ఉన్నామో అక్కడే ఉన్నట్లవుతుంది. ఇందులో ప్రభుత్వ లెక్కల ప్రకారమే పేదరికపు రేఖ కింద ఉన్న 30 శాతం ప్రజలను చవక దుకాణాల ద్వారా అందేది 48 మిలియన్ టన్నులు మాత్రమే. ఈ గణాంకాలు ఆహార ధాన్యాల లభ్యత గురించి మాత్రమే. వారు తింటున్నారని కాదు. మిల్లర్లు, దుకాణదారులు, కింద నుంచి పైదాకా ఉన్న చిన్న, పెద్ద అధికారులు బొక్కేయగా మిగిలినవి మాత్రమే పేదలకు దక్కేది. ఉత్పత్తి దృష్ట్యా తిండిగింజల పంట పెరుగుతున్నప్పటికీ (2012లో ఉత్పత్తి తగ్గింది) జిడిపిలో వ్యవసాయం శాతం 2004-05 ధరల ప్రకారం) తగ్గుతూ వస్తోందని ఎకనమిక్ సర్వే గణాంకాలు తెలియ జేస్తున్నాయి.

| సంవత్సరం | వ్యవసాయం శాతం |
|---|---|
| 2007-08 | 14.3 |
| 2008-09 | 13.4 |
| 2009-10 | 12.3 |
| 2010-11 | 12.3 |
| 2011-11 (ప్రాథమిక అంచనా) | 12.0 |

ఈ పెరుగుదల, తరుగుదల అనేవి మాన్‌సూన్ మీద ఆధారపడినవి, వర్షాలో, వరదలో, కరువో వస్తే అంతే సంగతులు. పంటలు సవ్యంగా పండాలంటే నేలలో పోషకాహార విలువలు, సరైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యమైనవి అవసరం. ఇవి ఎంత సత్యమైనవో, ఎంత నకిలీవో, దొరుకుతాయో లేదో రైతులకు చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా సాంప్రదాయ వ్యవసాయ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువుల వాడకం, వాటి మీదే ఆధారపడడం (అధిక దిగుబడి విత్తనాలకు అధికంగా ఎరువులు వాడాలి) ప్రారంభమైందో, లభ్యతా తగ్గింది. ధరలూ పెరుగుతూ వచ్చాయి. నేల సారం తగ్గుతోంది. ఎరువుల్లో రకరకాల ఎరువులున్నా, యూరియా మీదే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఎప్పుడైతే ఆధార పడడం ఎక్కువైందో, ధరా పెరిగింది. కల్తీలు పెరిగాయి. కారణంగా సబ్సిడీలు పెరిగాయి. దేశంలో ఉత్పత్తి చేసే ఎరువుల కన్నా ఎక్కువగా దిగుమతి చేసుకొంటున్నాం. దిగుమతి చేసుకొన్న ఎరువుల ధరలు అంతర్జాతీయ మార్కెట్ మీద ఆధారపడి ఉంటాయి. అంతేకాదు, మన అవసరాన్ని గమనించి విదేశీ ఎరువుల తయారీ ధరలు పెంచుతారు. ప్రభుత్వం సబ్సిడీలు తగ్గింపు కారణంగా ధరల పెరుగుదల భారం రైతుల మీద పడుతోంది. ఉత్పత్తి ఖర్చు పెరుగుతోంది. మార్కెట్‌లో పంట ధర ఆ మేర పెరుగదు కదా. గిట్టుబాటు ధర లభించదు. వడ్డీ వ్యాపారస్తుల నుంచి తెచ్చిన అప్పు తీర్చలేక కిడ్నీలు అమ్ముకోవడం, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 30 శాతం రైతులకే బ్యాంకులు రుణాలిస్తున్నాయి. గత అయిదేళ్లలో దేశంలో రెండున్నర లక్షలు ఆత్మహత్యలు జరిగాయంటే, చిన్న, సన్నకారు రైతులు పట్టణాలకు, నగరాలకు వలసపోతున్నారంటే పోరూ?

ప్రభుత్వమే వ్యవసాయం అంటే అంటీ ముట్టనట్లు ప్రవర్తిస్తుంది. కేంద్ర బడ్జెట్ మొత్తం ఖర్చులో 1.6 శాతం మాత్రమే కేటాయింపు, మొత్తం ప్రణాళిక ఖర్చులో వ్యవసాయానికి కేటాయింపు 4.8 శాతం, గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలో కేటాయింపు 14.6 శాతం నుంచి 14.4 శాతానికి (2013-14), మొత్తం బడ్జెట్‌లో అదే కాలంలో 5.1 శాతం నుంచి 4.8 శాతానికి తగ్గించారు. ఉపాధి పథకానికి గత సంవత్సరంలో ఎంత కేటాయించారో 2013-14లో అంతే కేటాయించారు.

వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం, పూర్తిగా ఖర్చు చేయని కేటాయింపులు, చిన్న, సన్నకారు రైతుల దిగజారుతున్న జీవనం ఏదో యాదృచ్ఛికంగానో, ఈ సంవత్సరంలోనో, గత సంవత్సరంలోనో జరిగిన పరిణామం కాదు. పైన చెప్పినట్లు మొదటి విడత ఆర్థిక సంస్కరణలతో ప్రారంభమై మెల్లమెల్లగా చిన్న, సన్నకారు రైతులను వ్యవసాయం నుంచి తరిమేసి, కార్పొరేట్, బహుళజాతి సంస్థలు వ్యవసాయ రంగంలో ప్రవేశానికి ద్వారాలు బార్లా తెరవడానికి రెండవ విడత సంస్కరణల ప్రకటన. ప్రభుత్వం ఈ పని చేయకముందే పై సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. మాంద్య పరిస్థితుల్లో పరిశ్రమలు కునికిపాట్లు పడతూంటే వ్యవసాయ రంగంపైన వారి దృష్టి పడిందంటే దానికి ముఖ్యకారణం వ్యవసాయాదాయంపై ఆదాయ పన్ను లేదు. ఉన్నత మధ్యతరగతి కుటుంబాలు టిన్నులో ప్యాక్ చేసి రెడిమేడ్‌గా తినడానికి వీలుగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు మార్కెట్ పెరగడం, బహుళజాతి సంస్థలు తమ దేశాల శీతోష్ణ స్థితిలో పండించుకోడానికి, వాటిని ఇక్కడ పండించడానికి గల అవకాశాలు మరో కారణం. పండించాలంటే భూమి కావాలి. వారి దృష్టి చిన్న, సన్నకారు రైతుల చిన్న కమతాల సాగుదార్లపై పడింది. దీనికి ప్రభుత్వం తోడ్పాటునందించింది. తమ భూముల్లో తామే కూలీలుగా పనిచేసే పరిస్థితి ఏర్పరిచింది. వ్యవసాయ సంక్షోభానికి ఇది నేపథ్యం. వ్యవసాయ మార్కెటింగ్‌కు కావాల్సిన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చిదంబరం కేటాయింపులు చేశారు. వ్యవసాయ మార్కెటీకరణకు పునాది వేశారు. నిజానికి ఈ పునాదులు కొద్ది సంవత్సరాల క్రితమే ఏర్పాటయ్యాయి. అందుకు కావాల్సిన నిధులను కార్పొరేట్‌కు సమకూర్చడానికి అవసరమైన నిధులు కూడా అనేక పన్నులు, డ్యూటీలు చెల్లింపుల్లో ప్రోత్సాహకాలు, మినహాయింపుల పేర్లతో (సబ్సిడీలకు ముద్దుపేరు) 2011-12లో రు. 5,73,630 కోట్లు కేటాయించింది. ఇది అంతకు ముందు సంవత్సరం కన్నా నలభై వేల కోట్లు ఎక్కువ. వ్యవసాయానికి నిధుల కొరత, కార్పొరేట్లకు నిధుల కుండపోత, కోర్టుల్లో న్యాయం, పోలీసు స్టేషన్లలో రక్షణ, వ్యవసాయానికి సాయం కోసం వెతకడం, గడ్డివాముల్లో సూదికోసం వెతకడమే అవుతుంది.

దేశంలో సంవత్సరానికి కోటి రూపాయల ఆదాయం ఉన్న వారిపై పది శాతం సర్‌ఛార్చి విధిస్తున్నట్లు వారు మరికొంత భారాన్ని మోయాలని రంగరాజన్ చేసిన సలహా నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. సంవత్సరానికి ఒక కోటి కాదు, వేల లక్షల ఆదాయం ఉన్నవారు లక్షల్లో ఉన్నారని, చిదంబరం మంచి పనిచేశాడని మనమంతా అనుకొంటాం. కానీ అద్భుతాల్లో అత్యంత అద్భుతమైన విషయం ఏమంటే ఈ కోటి రూపాయల ఆదాయం సంపాదిస్తున్న వారు 42,800 మందేనట. ఇది స్వయంగా చిదంబరం చెప్పిన మాట. ఈ సర్‌ఛార్చి ప్రస్తుత సంవత్సరానికే వర్తిస్తుందట.

పాప్యులిజం జోలికి పోకుండా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని గమనంలో ఉంచుకొని, వాటిని అదుపులో ఉంచినందుకు కొంతమంది ప్రముఖులు చిదంబరాన్ని కొనియాడుతున్నారు. ఒకరకంగా దీనిని స్వాగతించాల్సిందే. పాప్యులిస్టు పథకాలకు కేటాయించిన నిధులు అధికారుల, మధ్యవర్తుల, పాలకపార్టీ స్థానిక నాయకుల జేబుల్లోకి సింహభాగం చేరుతున్నాయి. అయితే, ప్రస్తుత మాంద్య పరిస్థితుల్లో కొన్ని కోతలు విధించాలనే తలంపుతో చిదంబరం కోతలు విధించాడు తప్ప చిత్తశుద్ధితో చేసింది కాదని గమనించాలి. దేశమంతా విద్యుత్ సంక్షోభంతో విలవిలలాడుతుంటే బడ్జెట్‌ను అవకాశంగా తీసుకొని కొన్ని విధాన చర్యలు ప్రకటించకుండా, ఆ సమస్యను రాష్ట్రాలను పరిష్కరించుకోవాలనడం రాక్షసకృత్యం.

పెట్టుబడుల రాక నేపథ్యంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇది సాధ్యం కావడానికి పెట్టుబడిదారులకు అన్ని ద్వారాలు తెరిచారు. ప్రోత్సాహకాలు ప్రకటించారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత మారిషస్ దీవుల ద్వారా దేశంలోకి వచ్చే పెట్టుబడులకు చిన్న సమస్య రావడంతో కొన్ని రోజుల్లో కాదు, కొన్ని గంటల్లో విదేశీ పెట్టుబడులు రావడానికి దారి సుగమం చేశారు చిదంబరం.

ఇటు ప్రజలూ, అటు పెట్టుబడిదారులు కూడా అసంతృప్తితో ఉన్నారు. అయితే కారణాలు వేరు. పెట్టుబడిదారుల కోర్కెల జాబితా చాలా పెద్దది. అవి తీరలేదని వారి అసంతృప్తి. ఆమ్ ఆద్మీ అసంతృప్తి ఎందుకో మనందరికీ తెలుసు. పరిష్కారం? తూర్పున ఉన్న రాష్ట్రాల్లో మొన్న జరిగిన ఎన్నికల్లో ఆ రాష్ట్రాల ప్రజలు (ఒక్క రాష్ట్రం తప్ప) కాంగ్రెస్‌కు చరమగీతం పాడారు. మనదీ అదే దారి కావాలి.

*(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు)* వీ

*వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి.*
*- సం.*

*ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం ఈ టెలిగ్రాఫిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు మీద మీరు ఎం.ఒ. ఎందుకు పంపుతున్నారో రాయండి. - సం.*

# పేదలకు ఖేదం - సంపన్నులకు మోదం

***దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకుండా విదేశీ సంస్థలను భారతదేశంలోకి ఆహ్వానించడమే ప్రధాన ధ్యేయంగా బడ్జెట్‌ను రూపొందించిన తీరును వివరిస్తున్నారు సంతోష్***

ఎన్నికల ముందు ఇదే చివరి బడ్జెట్ గనుక ఏవో సంక్షేమ పథకాలు ప్రకటించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారంటూ వినవచ్చిన అంచనాలను చిదంబరం పటాపంచలు చేశారు. కార్పొరేట్ ప్రభువులనూ, వారి రేటింగు సంస్థలనూ మెప్పించాలన్న తాపత్రయమే బడ్జెట్‌ను ప్రభావితం చేసింది. ఆహార అభద్రత గురించి ఆర్థిక సర్వేలో అదేపనిగా ఆందోళన వెలిబుచ్చినా అన్నార్తులను ఆదుకునే ఊసే బడ్జెట్‌లో లేకుండా పోయింది. ఉద్యోగాలు తగ్గిపోవడంలో ఉపద్రవాన్ని ఏకరువు పెట్టినా ఆ దిశలోనూ నిర్దిష్ట పథకం ఒక్కటంటే ఒక్కటైనా లేదు. ఉపాధికి ప్రధానాధారాలైన వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి వంటివి గాలికొదిలేశారు. వ్యవసాయం, ఉపాధి హామీ, ఎరువుల సబ్సిడీ, మధ్యాహ్న భోజనం వంటి వాటికి కేటాయింపులు పెంచి చూపించినా ధరల పెరుగుదలతోనూ, అవసరాలతోనూ పోలిస్తే అవి తగ్గినట్టు భావించాల్సి వస్తుంది. విద్య, వైద్య రంగాల కేటాయింపులు కూడా గత బడ్జెట్‌తో పోలిస్తే దిగజారాయి. పెట్రోలియం సబ్సిడీ కూడా గత బడ్జెట్ అంచనాతో పోలిస్తే దాదాపు రు. 30 వేల కోట్లు తగ్గింది. ఇక ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల వంటి అలక్షిత వర్గాల అవసరాలపై అసలే ధ్యాస లేదు.

ప్రజలపై భారాలు మోపే యుపిఎ ప్రభుత్వ ఆలోచన సరళిని చిదంబరం దాపరికం లేకుండా బడ్జెట్‌లో వెల్లడించాడు. 2012-2013 ఆర్థిక సంవత్సరంలో 5 శాతానికి మందగించిన వృద్ధిరేటు వచ్చే ఆర్థిక సంవత్సరం 6.1-6.7 శాతం మధ్య ఉండవచ్చని ఆర్థిక సర్వే పేర్కొంది. ఈ సవాలును అందుకోవడానికి జాతీయ వ్యయాన్ని వినిమయం నుండి మదుపుకు, మదుపు, వృద్ధి బాటలోని అవరోధాల తొలగింపు, ఉపాధి కల్పన, నిధులకయ్యే వ్యయం తగ్గింపు వైపు మరల్చాలని సర్వే పేర్కొంది. అయితే ఆదాయం పెంపుదలకు మార్గాలేమిటన్న స్పష్టత లేదు. మహా సంపన్నులపైన, వారసత్వ ఆస్తిపైన పన్ను రేటు పెంచాలన్న వాదనను సర్వే తోసిపుచ్చింది. వ్యయం తగ్గిస్తే అభివృద్ధికి విఘాతం ఏర్పడుతుంది. కాబట్టి సంపన్నులపై పన్ను పెంచడం బదులు పన్ను చెల్లింపుదారుల పరిధిని విస్తరించాలని పేర్కొంది. పన్ను - జిడిపి నిష్పత్తి 2007 -08 లో 11.9 శాతం కాగా 2011-12లో 9.9 శాతానికి తగ్గింది. మళ్లీ 11 శాతానికి చేర్చాలన్నది లక్ష్యం. పన్ను వసూళ్లు 69 శాతం మించడం లేదు. కాని ప్రణాళికేతర వ్యయం మాత్రం పెరిగిపోతోంది. ధరల పెరుగుదలను ప్రజలు భరించక తప్పదని సర్వే చెప్పింది. ధరలు తగ్గించే మార్గాలేవీ సర్వే సూచించలేదు. ప్రభుత్వం ప్రైవేటు రంగంపై ఆధార పడినందున ధరలు తగ్గే అవకాశం ఉండదు. సామాన్యులకు అదనపు భారాలు, పెట్టుబడి దారులకు ప్రోత్సాహకాలు కోరుతున్న ఆర్థిక సర్వే అభిప్రాయాలు బడ్జెట్ ప్రతిపాదనలకు ప్రాతిపదికగా ఉన్నాయి.

పేద, మధ్యతరగతి వర్గాలు, వేతన జీవులపై వరాల జల్లులు కురిపిస్తారనుకున్నారు. రాయితీలు కల్పించడం ద్వారా వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారని భావించారు. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఆదాయపన్ను నుంచి భారీ ఉపశమనాలు ఉంటాయన్న అంచనాలను ఆర్థిక మంత్రి పి.చిదంబరం తలకిందులు చేశారు. అన్ని రంగాలకు ఎంతో కొంత మేలు చేకూర్చుతారని ఆశించారు. అయితే ఈ ఆశలన్నీ నీరుగారాయి. కానీ ఇందుకు భిన్నంగా పేదలకు ఖేదం - సంపన్నులకు మోదం కలిగే రీతిలో కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం 2013-14 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ఆవిష్కరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో బడ్జెట్‌కు ఉన్న ప్రాధాన్యం, ఆర్థిక మంత్రికి ఉన్న పరిమితులు, తరచుగా సామాన్యులపై పడుతున్న భారం, ప్రభుత్వ విధానాల పోకడ, తాజా ఆర్థిక సర్వే, బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి చెప్పిన మాటలు పరిగణనలోకి తీసుకుంటే - బడ్జెట్‌ను నామమాత్రంగా మార్చి, ఆ ముందు వెనుకా కాలంలో జనకంటక విధానాలు అమలవు తున్నాయని తెలిసిపోతుంది. అందువల్ల ఎన్నికల సంవత్సరమైనా సరే, సామాన్యుడికి లబ్ధి చేకూరుతుందని నమ్మలేని పరిస్థితి, ప్రపంచీకరణలో భాగంగా కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచే విధానాల కొనసాగింపే తాజా బడ్జెట్ అనడంలో సందేహం లేదు.

ప్రతిపక్షాలతో బాటు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలు సైతం దీనిని అంకెల గారడీగాను, ఇప్పటికే అధిక ధరల మంటల్లో హాహాకారాలు చేస్తున్న సాధారణ ప్రజానీకానికి ఎటువంటి మేలు చేయని ఉత్తుత్తి పద్దుగాను, రైతులకు మొండి చేయిగానూ వర్ణించి తూర్పార బట్టాయి. అతినీరసమైన బడ్జెట్‌గా కొట్టి పారేశాయి. ఆర్థిక వ్యవస్థను అత్యంత దయనీయ దుస్థితికి చేర్చిన యుపిఎ చివరికి చేతులెత్తేసిన నిస్సహాయ బడ్జెట్‌ను ప్రతిపాదించిందని ఎద్దేవా చేశాయి. వామపక్షాలు షరా మామూలుగానే దీనిని కార్పొరేట్ల బడ్జెట్‌గా వర్ణించాయి. మొత్తం 16 లక్షల 65 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో రూపొందించిన చిత్తుపద్దులో ప్రణాళిక వ్యయం కింద 5 లక్షల 55 వేల 322 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది వర్తమాన ఆర్థిక సంవత్సరం (2012-13) సవరించిన అంచనాల ప్రకారం పెట్టిన ప్రణాళికా వ్యయం కంటె 29.4 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ప్రణాళికా వ్యయం మొత్తం బడ్జెట్‌లో మూడో వంతు కాగా మిగతా 11,09,975 కోట్ల రూపాయలను ప్రణాళికేతర వ్యయం కింద కేటాయించారు.

ఈ బడ్జెట్‌లో ద్రవ్యలోటుకు కళ్లెం వేసే పేరిట ఆహారం, ఇంధనం, ఎరువులకు కేటాయించే సబ్సిడీలను గణనీయంగా తగ్గించి పేదలకు, దిగువ మధ్యతరగతికి, రైతులకు అన్యాయం చేశారు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీల మొత్తం రు. 2,47,854 కోట్లుంటే అది ఇప్పుడు

రు. 2,20,971 కోట్లకు కుదించారు. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలోని ద్రవ్యలోటు 5.2 శాతాన్ని ఈసారి 4.8 శాతానికి పరిమితం చేయడం కోసం పేద వర్గాలకు కీడుచేసే నిర్ణయాన్ని తీసుకున్నారు. అలాగే ప్రస్తుత సంవత్సరం రెవెన్యూ లోటు 3.9 శాతం కాగా 2013-2014 సంవత్సరానికి దీన్ని 3.3 శాతంగా నిర్దేశించారు. 2016-17 నాటికి ద్రవ్యలోటును 3 శాతానికి, రెవెన్యూ లోటు 1.5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు.

భారతదేశంలో ఉపాధి అవకాశాలు నిపుణతలేని అల్పోత్పత్తి రంగం లోనే పెరుగుతున్నాయి తప్ప భారీ ఉత్పత్తి పరిశ్రమల్లో కాదని సర్వేలో పేర్కొంది. అంటే భద్రత లేని అసంఘటిత రంగంలోనన్నమాట. వ్యవసాయ రంగం వాటా జిడిపిలో తగ్గిపోవడం కూడా ఉపాధి అవకాశాలను కుదించుతున్నాయి. సహజంగా ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ప్రజలకు ఉపాధి కల్పించాలి. తద్వారా ఉత్పత్తిని పెంచాలి. కాని అలాంటి చర్యలకు ప్రతిపాదనలు లేవు. పైగా చిల్లర వ్యాపారంలో ఎఫ్‌డిఐల రాకను స్వాగతించడంతో ఆగక లీగల్, అకౌంటింగ్ రంగాలలోనూ విదేశీ ప్రవేశానికి తలుపులు బార్లా తెరవాలని పేర్కొంది. ఆహారం, సరుకుల రవాణా యథేచ్ఛగా చేసుకోనివ్వాలన్నది. రవాణా, గృహ నిర్మాణం, వ్యవసాయం వంటి రంగాలలోనూ విదేశీ పెట్టుబడులను అనుమతించాలన్న అత్యుత్సాహం వెలిబుచ్చింది. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు, బడ్జెట్ చూపిన ప్రతిపాదనలకు ఏమాత్రం పొంతన లేదు. ఏ సంస్కరణల వల్లనైతే ఇన్ని అనర్థాలు సంప్రాప్తించాయో వాటినే నమ్ముకొని వేగవంతం, తీవ్రతరం చేయాలని యోచించడమంటే ప్రజల్ని పెనం మీద నుంచి పొయ్యిలోకి తోయడమే అవుతుంది.

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే ఆహార పదార్థాల సబ్సిడీ రు. 90,000 కోట్లు కేటాయించినా గతంతో పోలిస్తే అది రు. 5,000 కోట్లు మాత్రమే అధికం. మరోపక్క భూమ్యాకాశాలు ఏకం చేసేలా ప్రచారం చేసుకున్న జాతీయ ఆహార భద్రత పథకం కోసం కేటాయించింది కేవలం రు. 10,000 కోట్లు మాత్రమే. ఆ పథకానికి కావలసిన దాదాపు రు. 3 లక్షల కోట్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. బహుశా తమ పదవీకాలం ముగిసేలోగా దాన్ని అమలు పరచగలమన్న నమ్మకం పాలకులకు లేనట్టుంది. ఆర్థిక సర్వేలో వ్యవసాయ రంగం తీరుపై ఆందోళన వ్యక్తం చేసినా దానికి చేయూతనిచ్చే చర్యలేవీ బడ్జెట్‌లో లేవు. గతం కంటే 22 శాతం కేటాయింపులు పెరిగినట్టు కనిపిస్తున్నా ద్రవ్యోల్బణం నేపథ్యంలో అవి ఏమూలకూ రావు. గత ఏడాది పంట రుణాల కింద ఇవ్వదల్చుకున్న మొత్తంలో సగమైనా పంపిణీ కాలేదంటే రైతన్నపై సర్కారుకు ఏపాటి శ్రద్ధ ఉందో అర్థమవు తుంది. ఒకపక్క ఇలా చేస్తూనే తాడూ బొంగరంలేని ఆధార్ కార్డుతో నగదు బదిలీ పథకాన్ని అనుసంధా నించాలనుకోవడం, దాంతో బడుగు జనంలో పాగా వేయాలనుకోవడం గాల్లో మేడలు కట్టడమే.

పేదలకు, మధ్యతరగతికి, రైతులకు, ఇతర ఆపన్న వర్గాలకు చెప్పుకోదగిన వరాలవంటివేమీ లేకపోవడం ఈ బడ్జెట్ ప్రత్యేకత. ఎన్నికల సంవత్సరం కాబట్టి వివిధ సాధారణ ప్రజలను విశేషంగా ఆకట్టుకునే కనికట్టులకు చోటు కల్పించక పోవడంలోనే ఆర్థిక మంత్రి సంస్కరణాభిలాష, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి లోటును పరిమితం చేసుకునే దృష్టి దండిగా కనుపిస్తున్నది. కొంచెమైనా పెరిగి తీరుతుందను కున్న రాబడి పన్ను విధింపు ఆదాయ పరిమితి విషయంలో వేతనాదాయ వర్గానికి నిరాశే మిగిల్చారు. పన్ను శ్లాబులలో ఎటువంటి మార్పు చేయకుండా ఐదు లక్షల లోపు ఆదాయమున్న వారికి రెండు వేల రూపాయల ఏక మొత్తపు పన్ను రాయితీతో సరిపెట్టారు. అందుకే ఇది నిర్విషేష బడ్జెట్ అనవలసి వస్తున్నది.

**2013 - 14 బడ్జెట్ సమగ్ర స్వరూపం (రు. కోట్లలో)**

| | 2011-12 సవరించిన అంచనాలు | 2012-13 బడ్జెట్ అంచనాలు | 2012-13 సవరించిన అంచనాలు | 2013-2014 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవిన్యూ వసూళ్లు | 751437 | 935685 | 871828 | 1056331 |
| మూలధన వసూళ్లు | 552928 | 555241 | 558998 | 608967 |
| మొత్తం వసూళ్లు | 1304365 | 1490925 | 1430825 | 1665297 |
| ప్రణాళికేతర వ్యయం | 891990 | 969900 | 1001638 | 1109975 |
| ప్రణాళికా వ్యయం | 412375 | 521025 | 429187 | 555322 |
| మొత్తం వ్యయం | 1304365 | 1490925 | 1430825 | 1665297 |
| రెవెన్యూ లోటు | 394348 | 350424 | 391245 | 379838 |
| ద్రవ్య లోటు | 515990 | 513590 | 520925 | 542499 |
| ప్రాథమిక లోటు | 242840 | 193831 | 204251 | 171814 |

ప్రస్తుతం అమలులో ఉన్న పన్ను శ్లాబులు గత బడ్జెట్‌లోనే ప్రవేశ పెట్టినవి కావడంతో ఈసారి వీటిల్లో ఎటువంటి మార్పులు చేయడం లేదని చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం విశేషం. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థను దృష్టిలో పెట్టుకుంటే అటు పన్నులు పెంచే పరిస్థితి లేదని, అలాగని తగ్గించే పరిస్థితి కూడా కనిపించడం లేదన్నారు. బేసిక్ లిమిట్‌ను పెంచితే చాలా మంది పన్ను పరిధి నుంచి తప్పుకుంటారని, ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాకపోవడంతో పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని మధ్య తరగతి ఆదాయవర్గాల వారికి రు. 2,000 పన్ను రాయితీని ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న అయిదు లక్షల నుంచి పది లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి 10 శాతం, పది లక్షల ఆదాయం దాటిన వారిపై 20 శాతం పన్ను రేట్లపై ఎటువంటి మార్పులు లేవు. కోటి దాటిన వారందరిపై 10 శాతం సర్‌చార్జిని విధిస్తూ చిదంబరం నిర్ణయం తీసుకున్నారు. కోటి రూపాయల ఆదాయం దాటిన 42,800 మందిపై ఈ భారం పడుతుంది. ఈ సర్‌చార్జి కేవలం 2013-14 ఆర్థిక సంవత్సరానికి మాత్రమేనని, ఒక వ్యక్తి లేదా సంస్థ, ఎచ్‌యుఎఫ్‌ల పన్నుకు గురయ్యే ఆదాయం కోటి రూపాయలు దాటితే ఈ 10 శాతం సర్‌చార్జి చెల్లించాల్సి ఉంటుంది.

ఆర్థిక లోటును తగ్గించాలన్న సాకుతో అధిక ఆదాయం సముపార్జించేందుకు ప్రభుత్వ ఆస్తులను విక్రయించడంపై ఎక్కువగా ఆధారపడాలని ఆర్థిక మంత్రి భావిస్తున్నారు. వాటాల ఉపసంహరణ, స్పెక్ట్రమ్ అమ్మకాల ద్వారా నిధులు రాబట్టాలని ఆశించారు. ఇది, 2012-13లో సవరించిన వాటాల ఉపసంహరణ ప్రకారం రు. 24 వేల కోట్లు ఉంటే 2013-14 లో ఏకంగా రు. 55,814 కోట్లుగా చూపించారు. పెద్ద మొత్తంలో లాభాలార్జించే ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను కేవలం పెట్టుబడులను ఆకర్షించేందుకు అయినకాడికి అమ్మేసేందుకు సిద్ధపడ్డారు. పెట్టుబడిదారులు దీనివైపు దృష్టి

సారించవచ్చు. కానీ, ఇందులో ఎలాంటి ఆర్థికపరమైన ప్రయోజనాలు లేకపోగా దీర్ఘకాలంలో ప్రభుత్వ ద్రవ్య సంక్షోభం మరింత ముదరడానికి దారి తీస్తుంది.

భరించగలిగిన మధ్యతరగతి వర్గాలపై పన్ను విధిస్తూ పోయిన చిదంబరం మౌలిక సదుపాయాల కల్పన రంగానికి నిధుల కొరత తీర్చే ప్రతిపాదనలు కొన్నింటిని ప్రకటించారు. ఇందులో ముఖ్యమైనది 50 వేల కోట్ల రూపాయల మేరకు పన్ను లేని బాండ్ల రూపంలో నిధుల సేకరణకు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అవకాశం కల్పించడం. ఈ రంగంలో 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో 55,00,000 కోట్ల రూపాయల మేరకు పెట్టుబడి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో 47 శాతం ప్రైవేటు పెట్టుబడికి అవకాశం కల్పించడం గమనార్హం. అలాగే 100 కోట్ల రూపాయల మేరకు ప్లాంటు పరికరాలకి పెట్టుబడి పెట్టే వారికి కొత్తగా కొనుగోలు చేసిన సామగ్రిపై 75 శాతం పన్ను రాయితీ కల్పించడం వంటి చర్యల ద్వారా తయారీ రంగానికి ప్రోత్సాహం కల్పించారు. పలు రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఎన్నికలు అతి దగ్గరలో ఉన్న తరుణంలో ప్రవేశపెట్టిన యుపిఎ ప్రభుత్వ ఆఖరి బడ్జెట్‌లో చిదంబరం సంక్షేమ వ్యయాన్ని పెంచడానికి గాని పేద వర్గాలకు వివిధ రాయితీలు ప్రకటించి ఆకట్టుకోవడానికి ప్రయత్నించకుండా ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ రేటింగ్ సంస్థల నుంచి చివాట్లు తినే పరిస్థితి తల ఎత్తకుండా జాగ్రత్త తీసుకున్నారు. కాని దేశ ఆర్థిక రంగానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగానికి భారీ ఉద్దీపన వంటిది లేకపోవడం, అధిక ధరల దావానలంలో మాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టకపోవడం బాధాకరం.

### రైతులకు నిరాశ

ఆహారోత్పత్తిని పెంపొందించడంలో వ్యవసాయ రంగం కృషిని మెచ్చుకున్న ఆర్థికమంత్రి చిదంబరం తన 2013-14 బడ్జెట్‌లో రైతుల కడగండ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. వ్యవసాయరంగంలో అదనపు విలువ సృష్టించే నిమిత్తం సరఫరాల గొలుసులోని అవరోధాలను తొలగించడానికి రిటైల్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) ఆగమనంపైనే ఆయన ఆశపెట్టుకున్నారు. ఎరువుల సబ్సిడీల విలువ ఆధారంగా గాక నిర్దిష్టమైన మొత్తంగా సబ్సిడీని నిర్ణయించే విధానాన్ని ఆలోచిస్తున్నామని ఆయన చెప్పారు. అంటే ఎరువుల కొరకు రైతులు అదనంగా వ్యయం చేయవలసివస్తుంది. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోని అంశమైనప్పటికీ దానికి దిశానిర్దేశం, ప్రోత్సాహకాలు కేంద్రం నుండే రావాలి. కాని అవి తగినంతగా కనిపించడం లేదు. పెరిగిన వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా లేని కనీస మద్దతు ధరలు, అవి కూడా రైతులకు అందని స్థితి, ఎఫ్‌సిఐ, సిసిఐ, వంటి ప్రభుత్వ సంస్థలు మార్కెటింగ్‌లో రైతులకు అండగా నిలవకపోవడం, తగినంతగా వ్యవస్థాగత పరపతి లభ్యం కాకపోవడం, పెట్టుబడుల పెరుగుదల – ప్రైవేటు వడ్డీ భారంతో ఆరుగాలం కుటుంబమంతా శ్రమించినా అప్పులే మిగలడం వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. ఇరిగేషన్ వసతుల విస్తరణ నత్తనడకన సాగుతోంది. విద్యుచ్ఛక్తికి కొరత, డీజిల్ ధరల పెరుగుదల, ప్రకృతి వైపరీత్యాలు ఇత్యాది సమస్యలు మాగాణి, మెట్ట రైతులిరువురినీ వేధిస్తున్నాయి.

ఏ బడ్జెట్‌లో చూసినా సముదాయింపు మాటలు తప్ప రైతులను ఆదుకునే అభయహస్తం అందడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే ఆ రంగంపై 60 శాతం ప్రజలు ఆధారపడి ఉన్న పరిస్థితిని మార్చాలనే మాటలేతప్ప, మిగులు జనాభాను ఇతర వృత్తుల్లోకి, వ్యాపకాల్లోకి తరలించే కార్యక్రమాలు కనిపించవు. వ్యవసాయం మొత్తంగా సంక్షోభంలో ఉంది. దేశవ్యాప్తంగా 11 కోట్ల రైతు కుటుంబాల్లో మూడొంతుల మంది ప్రైవేటు రుణదాతల గుప్పిట్లో చిక్కి విలవిల్లాడు తున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ప్రైవేటు బ్యాంకుల్లో నాలుగు శాతం వడ్డీపై పంట రుణాలు అందిస్తామంటూనే పాత బాకీలను వడ్డీతో సహా సక్రమంగా చెల్లించినవారికే ఆ వెసులుబాటు అని మెలికె పెట్టడం, అవసరార్థులకు వ్యవస్థాగత పరపతి ఎండమావేనని చాటడమే అవుతుంది. ప్రణాళికలో ప్రకటించుకున్న 4 శాతం వ్యవసాయభివృద్ధి మిథ్య కాగా దేశానికి ఆహార అభద్రత ఏర్పడే ప్రమాదముంది. మార్కెట్లకు, ప్రైవేట్ పెట్టుబడు లకు ఇతోధిక అవకాశాలు కల్పించే విధానాలతో ఆహారోత్పత్తి, పంపిణీ, నిల్వ వంటివి నిర్వహించాలనే సూచన కొరివితో తల గోక్కోమన్నట్లు ఉంది. 'బడ్జెట్ ఒక రోజుతో అయిపోయే పనికాదు. నిరంతర క్రమం. బడ్జెట్, ఫైనాన్స్ బిల్లు ఆమోదం సందర్భంలో మరికొన్ని ప్రకటనలు చేస్తాను' అని చిదంబరం చెప్పారు. దీనిపై రైతులు ఆశపెట్టుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆ రాబోయే ప్రకటనలు ఎగుమతి, దిగుమతి వ్యాపారానికి సంబంధించే ఉంటాయి.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం రు. 27,049 కోట్లు మాత్రమే కేటాయించిన ఆర్థికమంత్రి ప్రాధాన్యతగల కొన్ని కొత్త చొరవలు ప్రకటించారు. వాటికి కేటాయింపులు ఇప్పుడు పరిమితమే. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ అన్నట్లుగా వ్యవసాయ రంగానికి సంబంధించి ఆర్థికమంత్రి త్రిముఖవ్యూహం అనుసరించారు. ఒకటి, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో అది హరిత విప్లవ ఫలితాలను రక్షించుకునేందుకు ఆ రాష్ట్రాల్లో పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు రు. 500 కోట్లు

**వసూళ్లలో రుణాల వాటా (రు. కోట్లలో)**

| పద్దు | 2011-12 | 2012-13 | 2012-13 | 2013-14 |
|---|---|---|---|---|
| మార్కెట్ రుణాలు | 436211 | 479000 | 467384 | 484000 |
| స్వల్పకాలిక రుణాలు | 126866 | 9000 | 45746 | 19844 |
| నికర విదేశీ సాయం | 12499 | 10148 | 2214 | 10560 |
| చిన్న పొదుపు | -10302 | 1198 | 8626 | 5798 |
| స్టేట్ పీఎఫ్ (నెట్) | 10804 | 1200 | 10000 | 10000 |
| ఇతర వసూళ్లు | -44048 | 2245 | -7895 | 12297 |
| మొత్తం | 531980 | 513590 | 526075 | 542499 |
| **బడ్జెట్ వ్యయంలో అప్పులకు పోయేది** | | | | |
| రుణాల చెల్లింపు | 111933 | 124302 | 116669 | 167072 |
| వడ్డీ చెల్లింపులు | 273150 | 319759 | 316674 | 370684 |

కేటాయించారు. రెండు, తూర్పు రాష్ట్రాలైన అసోం, బీహార్, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో దిగుబడులు పెంచే కార్యక్రమానికి రు. 1000 కోట్లు కేటాయించారు. మూడు, పౌష్టికాహారం – వ్యవసాయాన్ని మేళవిస్తూ న్యూట్రీ – ఫామ్స్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించేందుకు రు. 200 కోట్లు కేటాయించారు. ఇనుము, తుత్తునాగం, విటమిన్ ఎ, విటమిన్ బి12 తదితర పోషకాలు, మొక్కజొన్న వంటి మాంసకృత్తులు పుష్కలంగా ఉండే పంటలను మేళవించే కొత్త పంటల విధానాన్ని ప్రవేశపెట్టడం దీని లక్ష్యం. సూక్ష్మ పోషకాలు కొరతగా ఉన్న జిల్లాల్లో దీన్ని ప్రవేశపెడతారు. టెక్నాలజీ అభివృద్ధికి, పరిశోధన అభివృద్ధికి, పరిశోధన ఫలితాలను పొలాలకు చేర్చేందుకు కూడా ప్రతిపాదనలు చేశారు. చిన్న, సన్నకారు రైతుల మార్కెట్ వాటా, ఆదాయాలు పెంచే దృష్టితో రైతు – ఉత్పత్తిదారు సంస్థల (ఎఫ్‌పిఒ)కు రు. 10 లక్షల వరకు మ్యాచింగ్ గ్రాంట్ ప్రకటించారు. ఈ రైతులు సంఘాలుగా, కంపెనీలుగా రిజిస్టర్ కావాలి. సహకార లేక సమష్టి వ్యవసాయానికిది పరోక్ష ప్రోత్సాహం. ధాన్యపు గోదాములను పంచాయితీ స్థాయిలో నెలకొల్పాలని ప్రతిపాదించారు.

**వసూళ్లలో రుణాల వాటా (రు. కోట్లలో)**

| శాఖల వారీగా (రు. కోట్లలో) | 2011-12 వాస్తవ కేటాయింపు | 2012-13 బడ్జెట్ అంచనాలు | 2012-13 సవరించిన అంచనాలు | 2012-13 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| మొత్తం | 508596 | 651509 | 556176 | 680123 |
| వ్యవసాయం | 12482 | 16121 | 13787 | 17095 |
| పౌర విమానయానం | 3866 | 7293 | 9288 | 8865 |
| కమ్యూనికేషన్, ఐటి | 9228 | 21394 | 11248 | 16783 |
| పర్యావరణం, అడవులు | 1823 | 2430 | 1800 | 2430 |
| విదేశీ వ్యవహారాలు | 1104 | 1500 | 1620 | 3000 |
| ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 23159 | 30477 | 24894 | 32745 |
| హోం వ్యవహారాలు | 5919 | 10500 | 6828 | 10500 |
| మానవ వనరుల అభివృద్ధి | 50658 | 61427 | 56223 | 65869 |
| పెట్రోలియం, సహజవాయువు | 64246 | 79728 | 76850 | 79052 |
| విద్యుత్ | 46084 | 62425 | 54696 | 59329 |
| గ్రామీణాభివృద్ధి | 66638 | 76376 | 55000 | 80194 |
| శాస్త్ర, సాంకేతిక | 5178 | 5975 | 5030 | 6275 |

**విద్యారంగం**

విద్యారంగానికి 2013-14 బడ్జెట్‌లో రు. 65,867 కోట్లను కేటాయించారు. ఇది గత ఏడాది బడ్జెట్ కన్నా 17 శాతం అధికం. ఈ బడ్జెట్‌లో సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ), విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎస్ఎస్ఎకు రు. 27.25 కోట్లు కేటాయించారు. ప్రణాళిక వ్యయం కింద పాఠశాల విద్యాశాఖకు రు. 49,659 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రు.16,198 కోట్లు కేటాయించారు. మాధ్యమిక విద్యను అందరికీ అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన రాష్ట్రీయ మాధ్యమిక సర్వ శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) కార్యక్రమానికి రు. 3,983 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ దఫా రు. 25.6 శాతం పెరిగింది. అలాగే మధ్యాహ్న భోజనం పథకానికి రు. 13,215 కోట్లు కేటాయించారు. అయితే 2012-13 బడ్జెట్‌లో విద్యారంగానికి రు. 45,969 కోట్లు కేటాయించినప్పటికీ అంచనాల పునఃపరిశీలన తర్వాత రు. 42,729 కోట్లకు తగ్గించారు. అలాగే ఉన్నత విద్యాశాఖకు రు. 15,438 కోట్ల నుంచి రు. 13,479 కోట్లకు కోత వేశారు. ఎడ్యుకేషన్ సెస్ ఈ బడ్జెట్‌లోనూ 3 శాతం కొనసాగించనున్నట్లు చిదంబరం వెల్లడించారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీ విద్యార్థులతో పాటు విద్యార్థినులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం వివిధ మంత్రిత్వ శాఖలకు రు. 5,284 కోట్లు కేటాయించడానికి ప్రతిపాదించారు. దీనికి గత బడ్జెట్‌లో కేటాయించినది రు. 4,575 కోట్లే. అలాగే విశ్వ విఖ్యాత ప్రాచీన విశ్వ విద్యాలయం 'నలంద' పునర్నిర్మాణానికి, ఉన్నత విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నడుం బిగించిందని వెల్లడించారు.

జాబ్ ఓరియంటెడ్ స్కిల్స్‌కు రు. 1000 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఇది మంచి అవకాశమని ఆయన అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఐదు యూనివర్సిటీలకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. అలీగఢ్ ముస్లిం వర్సిటీ, బెనారస్ హిందూ వర్సిటీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ వర్సిటీలకు ఒక్కో దానికి రు. 100 కోట్లు కేటాయిస్తున్నట్లు చిదంబరం ప్రకటించారు. గతంతో పోలిస్తే ఈసారి రు. 300 కోట్లు అదనంగా కేటాయించారు. 2012-13 బడ్జెట్‌లో శాస్త్ర సాంకేతిక రంగానికి రు. 5975 కోట్లు కేటాయించగా, ఈసారి దాన్ని రు. 6275 కోట్లకు పెంచారు కాగా నూతన ఆవిష్కరణలకు రు. 2000 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

విద్యారంగానికి 2013-14 బడ్జెట్‌లో కేటాయింపుల పెంపు చాలా స్వల్పమేనని కేంద్ర మానవ వనరుల మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు అన్నారు. తమ లక్ష్యాలు సాధించేందుకు తప్పనిసరిగా మరిన్ని నిధులు కేటాయించాలని కోరతామన్నారు. అయితే మరోవైపు విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) నిర్దేశాలను పూర్తి చేయాల్సిన గడువు మార్చి 31తో ముగుస్తోందన్నారు. ఇందుకు అవసరమైన కేంద్ర వాటా నిధుల కోసం రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయని, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాధ్యమిక, ఉన్నత విద్యాశాఖలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**'రక్షణ' శాఖ**

2013-14 బడ్జెట్‌లో రక్షణ మంత్రిత్వ శాఖకు రు.2,03,672 కోట్లు కేటాయించింది. గత ఏడాది కన్నా 14 శాతం అధికంగా నిధులు ఇవ్వనున్నట్టు తెలిపింది. 2012-13లో రక్షణ రంగానికి సవరించిన అంచనాల ప్రకారం రు. 1,78,503 కోట్లు కేటాయించగా, ఈసారి రు. 25,169 కోట్లను అధికంగా ఇవ్వనున్నట్టు ప్రతిపాదించింది.

ఇందులో 'రు. 86,741 కోట్లను పెట్టుబడి వ్యయంగా ఉపయోగించు కోవచ్చు' అని బడ్జెట్ ప్రసంగంలో చిదంబరం వెల్లడించారు. ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖ భారీ ఆధునీకరణ ప్రక్రియను చేపట్టింది. పెద్దస్థాయిలో ఆయుధ, సామాగ్రి సంపత్తిని సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. చైనా సరిహద్దుల్లో భారీగా మౌలిక వసతుల కల్పనకు సంకల్పించింది. 126 బహుళ ప్రయోజన యుద్ధ విమానాలను, 22 అపాచీ యుద్ధ హెలికాప్టర్లను, 15 హెవీ లిఫ్ట్ చాపర్స్‌ను సేకరించాలని నిర్ణయించింది. పెట్టుబడి వ్యయం కింద గత ఏడాది రు. 69,579 కోట్లు కేటాయించగా, దానిని ఈ ఏడాది రు. 86,741 కోట్లకు పెంచారు.

## అంచనాలను మించుతున్న అప్పులు

ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం అప్పులు అంచనాలను మించుతున్నాయి. 2012-13 బడ్జెట్ అంచనాల్లో దేశీయ, విదేశీ అప్పులు కలిపి రు. 5.13 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసుకుంటే అది మరో 13 వేల కోట్ల రూపాయలు పెరిగింది. స్వల్పకాలిక రుణాలు 9 వేల కోట్ల రూపాయలనుకుంటే 45 వేల కోట్ల రూపాయలకు ఎగబాకింది. కేంద్ర ప్రణాళిక బడ్జెట్‌లో గతేడాది దాదాపు రు. 95 వేల కోట్ల మేర కోతపడింది. ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాగునీరు, సామాజిక సేవల్లాంటి ప్రధాన రంగాల ప్రణాళికా వ్యయం భారీగా తగ్గిపోయింది. వ్యవసాయ / అనుబంధ రంగాల ప్రణాళిక వ్యయం దాదాపు రు. 2 వేల కోట్లు, సామాజిక సేవల రంగం బడ్జెట్ దాదాపు రు. 20 వేల కోట్లు కోతకు గురైంది. ఈ ఆర్థిక సంవత్సరం కూడ కోత ఉండదన్న గ్యారంటీ ఏమిలేదు.

ఇటీవల ఢిల్లీలో యువతిపై సామూహిక అత్యాచారం, హత్య ఉదంతం సృష్టించిన కల్లోలాన్ని దృష్టిలో పెట్టుకుని మహిళలకు రు. 1,000 కోట్లతో ప్రత్యేక బ్యాంకును ప్రతిపాదించారు. వాస్తవానికి ఈ ఆలోచన కొత్తది కాదు. దశాబ్దాల క్రితమే గుజరాత్‌లో ఇలా భట్ ఈ తరహా సహకార బ్యాంకును ప్రారంభించి విజయవంతంగా నడుపుతున్నారు. వివిధ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు రు. 1,000 కోట్లతో ఓ పథకాన్ని ప్రకటించారు. నల్ల డబ్బును అరికట్టడం పైగానీ, కుంభకోణాలను నియంత్రించడంపైగానీ శ్రద్ధ పెట్టని ప్రభుత్వం ఘనమైన అంకెలతో, గారడీ పథకాలతో వచ్చినంత మాత్రాన దేశానికి ఒరిగేదేమీ ఉండదు. ఇలాంటి బడ్జెట్‌తో ఎన్నికలకు వెళ్లగలమని, జనాన్ని భ్రమింపజేయగలమని భావిస్తే అది పాలకుల తెలివి తక్కువతనానికి నిదర్శనమవుతుంది.

తొలిసారిగా 25 లక్షల రూపాయల గృహ రుణం తీసుకుంటున్న వారికి వడ్డీ రాయితీని 1 లక్ష 50 వేలనుంచి 2 లక్షల 50 వేల రూపాయలకు పెంచడం గమనార్హం. ఇటువంటివి మినహా మధ్యతరగతికి అదనపు ఆకర్షణలు లేవు. సెల్‌ఫోన్ల ధరల పెంపు వారికి బాధ కలిగించేదే. విలాస జీవనంపై పన్నులు విధించిన తీరు కొత్త బడ్జెట్‌లో సుస్పష్టం. సంపన్న వర్గాలకు దోచిపెడుతున్నారు. వారి నుంచి రాబట్టవలసినంత పన్ను ఆదాయాన్ని రాబట్టడం లేదనే విమర్శను తట్టుకోవడానికా అన్నట్టు సాలీనా కోటి రూపాయల పైబడిన ఆదాయమున్న వారినుంచి 10 శాతం సర్ చార్జీ వసూలు చేయదలిచారు. అయితే ఇటువంటి వారు దేశం మొత్తం మీద 43000 మందే ఉంటారని అంచనా. పదికోట్ల పన్ను వర్తింపు ఆదాయం నమోదైన కార్పొరేట్ సంస్థల నుంచి వసూలు చేసే సర్‌చార్జిని 5 నుంచి 10 శాతానికి పెంచారు. ఏబై లక్షల రూపాయల విలువకు మించిన వ్యవసాయేతర స్థిరాస్తుల కొనుగోలుపై మూలం వద్ద ఒక శాతం పన్ను విధించారు. 2000 రూపాయలకు మించి ఖరీదుగల మొబైల్ ఫోన్లపై అదనంగా 5 శాతం ఎక్సైజ్ సుంకం విధించారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ముందే అనేక సార్లు సామాన్యుడిపై భారం పడే నిర్ణయాలు తీసుకున్నది. వంట గ్యాస్ పెరుగుదల నియంత్రణా సంస్థకు అప్పగించినందున ప్రభుత్వ ప్రమేయం లేకుండానే ధరలు పెరుగుతాయి. డీజిల్‌పై కూడా నియంత్రణ దశల వారిగా ఎత్తివేయబోతున్నారు. డీజిల్, వంటగ్యాస్, కిరోసిన్‌ను తక్కువ ధరలకు విక్రయించే ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బిపిసిఎల్, ఎచ్‌పిసిఎల్‌లకు 2013-14 సంవత్సరానికి సబ్సిడీ మొత్తంగా రు. 65 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రస్తుత 2012-13 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం ఈ సబ్సిడీ మొత్తం రు. 96,880 కోట్లు కావడం గమనార్హం. రైలు చార్జీలు కూడా ఇక క్రమబద్ధంగా పెరుగుతూనే ఉంటాయని రైల్వే మంత్రి చెప్పారు. ఈ ప్రభావం ధరల పెరుగుదలపై ఉంటుంది. ఇప్పటి వరకు అనేక పథకాల కింద అందిస్తున్న సేవలు ఇప్పుడు ఆహార సబ్సిడీ కిందకు వస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్నవేవీ నిజానికి సంక్షేమ పథకాలు కావు. ప్రభుత్వ నిధులను ప్రజల సంక్షేమం కోసం కేటాయించే విధానాన్ని ప్రభుత్వం ఎప్పుడో మానుకున్నది.

ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం విదేశీ కంపెనీలకు పన్నులు, సుంకాలు ఎత్తివేసి మౌలిక వసతులు, రాయితీలు కల్పించడంగా మారింది. దీంతో ప్రభుత్వానికి ప్రజలకోసం ఖర్చు పెట్టే నిధులు ఉండవు కూడా. సంక్షేమ పథకాలు ఎత్తివేసిన తరువాత జనం చావకుండా లేవకుండా కనీస జీవన భద్రత కింద కొంత డబ్బు విదిలిస్తుంటారు. ఇది సంక్షేమం అనిపించుకోదు. ఇప్పుడు ఆహార సబ్సిడీ కూడా అటువంటిదే. అందుకే ఎన్నికల ముందు సంవత్సరం కూడా ఆర్థిక మంత్రి సంక్షేమ పథకాలు అమలు పరిచే ప్రసక్తే లేదు. మరోవైపు 'కఠిన నిర్ణయాలు' అమలువుతూనే ఉంటాయి. బడ్జెట్ లోటును అధిగమించాలని మన్మోహన్ సింగ్, చిదంబరం అంటూనే ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నదనే మాట వెనుక ప్రజలను 'కష్టాల'కు సిద్ధం కావాలనే పిలుపు ఉన్నది!

*(రచయిత రిటైర్డ్ ఉపాధ్యాయులు)* వీ

## వ్యాస రచన శిక్షణా తరగతి

వీక్షణం రూపొందించిన, మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న వ్యాస రచన శిక్షణా తరగతి మార్చ్ 16న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్‌లో జరిగింది. తెలుగులో వ్యాస ప్రక్రియ ప్రాధాన్యత, వ్యాస ప్రక్రియ చరిత్ర, వ్యాస రచనలో పాటించవలసిన మెళకువలు, వ్యాస రచనలో సాధారణంగా దొర్లే పొరపాట్లు వగైరా పాఠ్యాంశాలపై జరిగిన ఈ శిక్షణా తరగతికి యాభై మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేషన్, రిసర్చ్ విద్యార్థులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయాలలోనైనా, కళాశాలలోనైనా, ఇతర చోట్లనైనా ఆసక్తిగల విద్యార్థులకు, వర్ధమాన వ్యాస రచయితలకు ఈ శిక్షణా తరగతి నిర్వహించడానికి వీక్షణం సంపాదకవర్గం సిద్ధంగా ఉంది.

# కేంద్ర బడ్జెట్ - రాజకీయార్థిక విశ్లేషణ

***సమాజంలో అంతరాలను తగ్గించే ప్రతిపాదనలు కాకుండా, దిగుమతులను ప్రోత్సహించేదిగా, స్థానిక వనరులను కొల్లగొట్టడానికి అవకాశం పెంచేదిగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని అంటున్నారు* ఏంపెల్లి భాస్కర్**

పెట్టుబడిదారీ మేధావులు పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ సాగించడానికి, సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు నివారించడానికి, సంక్షేమ రాజ్య భావనలు ముందుకు తీసుకువచ్చారు. ఈ సంక్షేమ రాజ్యాలలో, కేంద్రీకృతం అవుతున్న సంపద మీద పన్నులు విధించడం ద్వారా వచ్చిన వనరులు ప్రజల సంక్షేమానికి ఉపయోగించి, పేదరికం, నిరుద్యోగం, సామాజిక వర్గాల మధ్య అసమానతలు తగ్గించాలనేది ముఖ్య ఉద్దేశం. కేంద్రీకృతమవుతున్న సంపద మీద పన్నులు ఎలా విధించాలి, ఏ విధంగా ప్రజల మధ్య పంపిణి చేయాలి అనే విషయాల సమాహారమే బడ్జెట్.

ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు తయారు చేస్తున్న బడ్జెట్‌లు సంపద మీద పన్నులు విధించడం, ప్రజలకు సంక్షేమం అందించడం, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు తగ్గించడం అనే భావనను కూడా పక్కకు పెట్టాయి. సహజ వనరులను, సమాజ సంపదను విదేశీ బహుళజాతి కంపెనీల, దేశీయ పెట్టుబడిదారుల చేతిలో పెట్టి, వారికి పన్ను మినహాయింపులు, దిగుమతి సబ్సిడీలు ఇచ్చి పెద్ద ఎత్తున దోపిడిని ప్రోత్సహిస్తున్నట్టుగా అర్థమవుతుంది. ఈ కోణం నుండి చూడవలసినదే 2013 -14 బడ్జెట్.

రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు, పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు లభించని రైతులు, పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం, అసమానతలు, ఇటీవల బయటపడుతున్న స్పెక్ట్రమ్ అమ్మకాల కుంభకోణం వంటివి దృష్టిలో పెట్టుకుని, యుపిఎ-2 ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్ బాధ్యతాయుతంగా ఉండగలదని ఆశించినవారికి నిరాశే ఎదురయ్యింది. నీటిపారుదల రంగంలో, ప్రభుత్వ పథకాలలో తగ్గుతున్న ప్రజా వ్యయమే రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలకు కారణమని పరిశోధనలు చెపుతున్నాయి. అయినా కూడా గతం నుండి గుణపాఠాలు నేర్చుకున్నట్టుగా ఏమీ కనిపించడం లేదు. సంక్షేమ రాజ్యాల ముసుగులో ఈ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఇప్పుడు స్పష్టమయ్యాయి.

2013-14 బడ్జెట్ ద్వారా ప్రభుత్వం సామాన్య ప్రజలను కాకుండా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలను, బహుళజాతి కంపెనీలను, విదేశీ పెట్టుబడిదారులను, దేశీయ పెట్టుబడి దారులను సంతోష పెట్టడానికి చేసిన ప్రయత్నంగా మనకు కనిపిస్తుంది. ప్రణాళికా వ్యయంలో కోత విధించడం ద్వారా ఆర్థిక లోటుని జాతీయాదాయంలో 4.8 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుని తద్వారా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల దగ్గర క్రెడిట్ కొట్టేసి, విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరవడం కోసం అల్లిన అంకెల కథే ఈ బడ్జెట్.

### ఆర్థిక లోటు - ప్రభుత్వ వ్యయం

2012-13 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ప్రభుత్వ వ్యయం తగ్గించడం ద్వారా ఆర్థిక లోటుని జాతీయాదాయంలో 5.2 శాతానికి తగ్గించడం జరిగింది. ఇప్పుడు కూడా ప్రభుత్వ వ్యయంలో అనగా సబ్సిడీలలో, ప్రభుత్వ పథకాలకు కేటాయింపులు తగ్గించడం లేదా పెంచకపోవడం వంటి విధానాలు అవలంభించడం ద్వారా ఆర్థిక లోటుని జాతీయాదాయంలో 4.8 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పెట్టుకొంది.

సంక్షేమ రాజ్య భావనలో ప్రభుత్వాలు ప్రజల పైన చేసే వ్యయం చాలా ముఖ్యమైనది. కానీ 2013-14 బడ్జెట్లో 13.4 శాతం వృద్ధి సాధించాలని, కేవలం 11.7 శాతం ప్రభుత్వ వ్యయం కేటాయింపు జరిగింది. తమది సామాన్యుల ప్రభుత్వం అని చెప్పుకోవడానికి చేపట్టిన పథకాలైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు 2013-14 బడ్జెట్‌లో రు. 33,000 కోట్లు కేటాయించింది. అంటే ఇది గత సంవత్సరం కేటాయించిన దానికి సమానం. ఇటువంటిదే ఇంకొక పథకం ఆహార భద్రత పథకం. దీనికోసం ఒక బిల్లు చేసి ఆహార భద్రతను చట్టబద్ధం చేసి, సామాన్యుల ప్రభుత్వంగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం రు. 90,000 కోట్లు కేటాయించింది. ఇది 2012 - 13 బడ్జెట్లో కేటాయించిన దాని కన్న రు. 5000 కోట్లు ఎక్కువ. దీనితో ఎక్కువ మందికి ఆహార భద్రత పథకం విస్తరించడానికి వీలు కాదు. చిదంబరం కేటాయిస్తానని చెప్పింది రు.10,000 కోట్లు, ఆర్థిక వృద్ధి ఆశించినట్టుగా ఉంటే మిగతా రు. 5,000 కోట్లు కేటాయిస్తారట.

వ్యవసాయ ఉత్పత్తి వ్యయం పెరిగి, పండించిన దానికి కనీస మద్దతు ధర లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ ఎరువులు ఏ మూలకూ సరిపోక సతమతమవుతుంటే, 2013-14 బడ్జెట్లో ఎరువుల సబ్సిడీకి రు. 65,971.10 కోట్లు కేటాయించింది. ఇది 2012-13 బడ్జెట్లో కేటాయించిన దానితో (రు. 65971.50 కోట్లు) సమానం. పెరిగిన ద్రవ్యోల్బణం దృష్ట్యా ఇది చాల తక్కువ.

పెట్రోలియం ఉత్పత్తుల మీద సబ్సిడీ రు. 96,879 కోట్ల నుండి రు. 65,000 కోట్లకు తగ్గించడం జరిగింది. ఇది ధరల పెరుగుదలకు దారి తీసి, సామాన్యులకు అతిపెద్ద భారంగా మారబోతుంది. ఈ పెట్రోలియం ఉత్పత్తుల పైన తగ్గించిన సబ్సిడీ ధనికుల మీద మాత్రమే ప్రభావం చూపించేదిగా కనిపించినా, దీని ద్వారా రవాణా వ్యయం

పెరిగి, తద్వారా ఆహార వస్తువుల ధరలు పెరిగి, ఆ భారం అంతిమంగా పేద, మధ్య తరగతి ప్రజల మీద పడుతుంది. ప్రపంచ మార్కెట్లో ధరలు పెరిగిన ప్రతీసారి దేశంలో ఆహార ఉత్పత్తుల ధరలు పెరగకుండా కాపాడాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంది. 2012-13 సవరించిన బడ్జెట్ తో పోలిస్తే సబ్సిడీలు 2013-14 ఆర్థిక సంవత్సరానికి 10 శాతం తగ్గాయి. ఇది ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకోవడంలో భాగంగా జరిగింది.

పెట్రోలియం దిగుమతుల పెరుగుదల, బొగ్గు దిగుమతుల పెరుగుదల, బంగారం పట్ల మనకున్న మక్కువ, ఎగుమతుల తగ్గుదల ఇవన్నీ ఆర్థిక లోటుకి కారణాలు. ఈ లోటుని తగ్గించడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రు. 7,500 కోట్లు వెచ్చించాల్సి ఉంది. దీనికోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు, అంతర్జాతీయ అప్పుల మీద ఆధారపడవలసి వస్తుందని, విదేశీ పెట్టుబడుల అవసరాన్ని ఆర్థికమంత్రి పదే పదే గుర్తు చేస్తున్నారు.

ఆర్థిక లోటుని తగ్గించుకోవడానికి ప్రభుత్వ వ్యయంలో కోత విధించడం ఒక్కటే మార్గం కాదు. పన్నులు విధించడం ద్వారా వనరులు సమకూర్చుకుని ఆర్థిక లోటుని తగ్గించుకోవచ్చు. ప్రస్తుతం పన్నులు విధించడం ద్వారా సమకూరుతున్న వనరులు జాతీయాదాయంలో 10 శాతం, ఇది 2007 -08 ఆర్థిక సంవత్సరంలో 11.9 శాతంగా ఉంది. కనీసం ఆ స్థాయిలోనైనా పన్నులు విధించవచ్చు. తద్వారా ప్రభుత్వ వ్యయం తగ్గించకుండానే ఆర్థిక లోటును తగ్గించవచ్చు. కానీ చిదంబరం ఆ పని చేయలేదు లేదా ఆయన వర్గ ప్రయోజనాలు ఆయన్ని అలా చేయనీయలేదు. అంతే కాకుండా పెట్రోలియం ఉత్పత్తుల మీద, ఎరువుల సబ్సిడీల మీద కోత విధించేందుకు వెనుకాడని ఆర్థిక మంత్రి, బంగారం దిగుమతుల మీద, ఆభరణాల బాగేజ్ మీద పురుషులకు రు. 50,000 వరకు, స్త్రీలకి లక్ష రూపాయల వరకు డ్యూటీ ఫ్రీ లిమిట్ అలవెన్సు ఇచ్చారు.

అయితే ఒక కోటి రూపాయల ఆదాయం మించిన ధనికుల మీద 10 శాతం సర్‌ఛార్జి విధించారు. ఈ పన్ను 42,800 మందిని తన పరిధిలోకి తెస్తూ రు. 13,000 కోట్ల వనరులు సమకూరుస్తుంది. ఇది మధ్యాహ్న భోజన పథకానికి కేటాయించిన మొత్తానికి సమానం.

## రక్షణ వ్యయం

ప్రభుత్వం అన్ని వ్యయాలను తగ్గించుకుంటూ వచ్చి, అనుత్పాదక వ్యయమైన రక్షణ వ్యయం మాత్రం 2012-13 సవరించిన బడ్జెట్‌లో రక్షణ వ్యయం రు. 1,78,503 కోట్లుగా ఉంటే అది ఇప్పుడు రు. 2,03,672 కోట్లు. అంటే 14 శాతం పెంచడం జరిగింది (అంచనా వ్యయంతో పోలిస్తే ఇది 5.3 శాతంగా ఉంటుంది). అయితే ఇది రక్షణ శాఖ అడిగిన దానికంటే రు. 50,000 కోట్లు తక్కువ. ఈ మొత్తాన్ని ఈశాన్య రాష్ట్రాలలోని చైనా సరిహద్దుల వద్ద భద్రతని ఆధునీకరించడానికి, 126 హెలికాప్టర్లు, 22 చాపర్‌లు, 15 భారీ సామర్థ్యం గల చాపర్లు కొనడానికి ప్రణాళికలు వేయడమైనది. రక్షణకు కేటాయించిన మొత్తంలో 28 శాతం వైమానిక దళానికే కేటాయించడం జరిగింది. గత చాలా సంవత్సరాలుగా పొరుగు దేశాలతో యుద్ధం పోకడలు ఏమీ కనిపించక పోయిన, రక్షణ వ్యయం మాత్రం పెరుగుతూనే ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్, దండకారణ్యం నుండి ఆర్మీని తొలగించాలని ప్రజలు అడిగిన ప్రతిసారీ ఏదో ఒక హింసాత్మక ఘటన జరుగుతుంది. ఇటీవల కశ్మీర్‌లో జవాన్‌ల మీద జరిగిన దాడి, అర్మీని తొలగించాలన్న ప్రజల డిమాండ్ తర్వాత జరిగిందే. దాన్ని సాకుగా చూపించి ఆర్మీ అవసరం ఉంది అని చెప్పడం జరుగుతుంది. ఇన్ని లక్షల కోట్లు ఖర్చు ప్రజల మీద యుద్ధానికే కాని, మరొకటి కాదు.

ఈ విధంగా ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తూ, ప్రజల కనీస అవసరాల మీద కోత విధించడం అనేది ప్రతి ప్రభుత్వం లోనూ, బడ్జెట్ లోనూ జరుగుతుంది.

## పెట్టుబడుల ఉపసంహారణ

2013-14 బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహారణ ద్వారా రు. 55,814 కోట్ల వనరులు సేకరించడానికి సిద్ధమయ్యారు. ఇందులో రు. 40,000 కోట్లు స్పెక్ట్రం అమ్మకాల లాగా, ప్రభుత్వ కంపెనీలు, ఆస్తులు అమ్మడం, మిగతా మొత్తం ప్రభుత్వేతర కంపెనీలలో ప్రభుత్వ వాటాలు అమ్మడం ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. స్పెక్ట్రం కుంభ కోణం నేపథ్యంలో ఇది ఎంత వరకు ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది, ఆర్థిక లోటును తగ్గిస్తుంది అనేది ఆలోచించాలి. 2012 - 13 బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహారణ రు. 24,000 కోట్లుగా ఉండగా అది ఇప్పుడు రెండింతలు లక్ష్యంగా పెట్టుకోవడమైంది. చాల సందర్భాల్లో ఈ పెట్టుబడుల ఉపసంహారణ ద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, సమర్థవంతమైన కంపెనీలను తక్కువ ధరలకే అమ్మడం జరుగుతుంది.

## ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం పరిష్కారం లేని సమస్యగా మారింది. ఆహార పంటలకి ఇస్తున్న కనీస మద్దతు ధర వలన ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది, ఇది ద్రవ్యోల్బణాన్ని ఇంకా పెంచింది, తద్వారా వాణిజ్య పంటల విస్తరణకి అది అడ్డంకిగా మారింది. దాని వలన ఆహారేతర వస్తువుల ధరలు పెరిగాయి అనేది ప్రభుత్వ వాదన. రైతులు వాణిజ్య పంటలు పండించే ఆర్థిక స్థోమత లేకపోవడమే ఆహార పంటలు మీద ఆధార పడడానికి కారణం, అంతేకాని ఉత్పత్తి వ్యయం కూడా తిరిగి రాని కనీస మద్దతు ధర కాదు. కాని ప్రభుత్వం ఇలా ఏర్పడిన ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి రు. 500 కోట్లు వాణిజ్య పంటల విస్తరణకి కేటాయించమని చెప్తుంది. ఒక వైపు పెద్ద భూస్వాములకు ఉపయోగపడే ఇలాంటి కేటాయింపులు చేస్తూ, మరొక వైపు చిన్న రైతులకు ఉపయోగపడే ఎరువుల మీద సబ్సిడీలు తగ్గించడం గమనిస్తే ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు కాపాడుతుంది అనేది తెలిసి పోతుంది.

## మహిళలు-మహిళల రక్షణ

మహిళలకు ప్రత్యేకంగా రు. 1000 కోట్లు ప్రారంభ మూల ధనంతో బ్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించడమైంది. ఈ బ్యాంకు మహిళలకు వాళ్లు నడిపే వ్యాపారాలకు స్వయం సహాయక బృందాలకు అప్పులు ఇవ్వడమే కాకుండా మహిళా సాధికారత కోసం కృషి చేస్తుంది. మహిళలకు సంస్థాగత పరపతి అందుబాటులో లేదు అనేది షెడ్యూల్డ్

కమర్షియల్ బ్యాంకుల్లో మహిళలకున్న ఖాతాలు అవి వారికిచ్చిన రుణాలు పరిశీలిస్తే తెలిసిపోతుంది. మహిళలకు ప్రత్యేక బ్యాంకు పెట్టడమంటే వారికి సంస్థాగత పరపతి సౌలభ్యత లేదు అనే విషయాన్ని మరుగు పరచడం అవుతుంది.

ఈ సంస్థాగత పరపతి మహిళలు పొందేట్లు చర్యలు తీసుకోవడానికి బదులు ప్రత్యేక మహిళా బ్యాంకులు ఏర్పాటు చేయడం అనేది వారి అసలు సమస్యను పరిష్కరించకుండా దాటవేయడమే. సూక్ష్మ రుణాలు, స్వయం సహాయక బృందాలు కూడా అందులో బాగమే. పురుషులకు సంస్థాగత పరపతి, మహిళలకు సూక్ష్మ రుణాలు. మహిళలను ప్రధాన పరపతి విధానంలోకి తీసుకు రాకుండా చేసే ఏ ప్రయత్నమైనా సరియైన ఫలితాలు ఇవ్వదు.

## నిర్భయ నిధి

2013–14 బడ్జెట్లో మహిళల రక్షణకు నిర్భయ నిధి పేరిట వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడమైంది. ఢిల్లీలో జరిగిన అత్యాచారఘటన తర్వాత దేశంలో జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు మహిళల రక్షణలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించాయి. అయితే ఒక పక్క ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి ఏర్పాటు చేసిన ఈ నిధి దేశంలో మహిళల రక్షణకు అవసరమైన అవస్థాపన సౌకర్యాలు ప్రభుత్వ వసతులు, సామాజిక సేవలు అందించడానికి ఏ విధంగాను సరిపోదని నిపుణుల భావన. దేశంలోని ప్రతి పౌరునికి ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. మహిళల రక్షణకు ప్రభుత్వ వైఫల్యం కప్పిపుచ్చుకోవడంలో భాగంగా ఏర్పాటు చేసిందే ఈ నిధి.

## బాధ్యత నుండి బహుమతులకు

ప్రభుత్వ వ్యయంలో కోత, పెట్రోలియం ఎరువుల సబ్సిడీ తగ్గింపు వంటి చర్యలు తీసుకున్నా, 2013–14 బడ్జెట్ ఏ విధంగానూ రైతుల, చేనేత కార్మికుల, చిన్న వర్తకుల పరిస్థితి మెరుగుపరిచేదిగా లేదు. మహిళలకు సంస్థాగత పరపతి సౌలభ్యం కల్పించడం బాధ్యతగా కాకుండా, ఒక ప్రత్యేక బ్యాంకు అనే బహుమతిని ఇచ్చింది. పౌరుల, మహిళల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదని మరచి ప్రజా రక్షణలో వ్యయం పెంచాల్సింది పోయి, చాలీ చాలని నిధులతో నిర్భయ నిధిని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తప్పనిసరిగా ఒక హక్కుగా కల్పించాల్సిన విద్య వైద్య సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రణాళిక వ్యయం తగ్గించి, సర్వ శిక్ష అభియాన్, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం వంటివి ఏర్పాటు చేసి వాటికి చాలీ చాలని నిధులు ఇచ్చి, అందులో పని చేసే వారికి ఉద్యోగ భద్రత లేకుండా కాంట్రాక్టు కింద తీసుకుని, అరకొర జీతాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి పక్కకు జరిగి ప్రత్యేక పథకాలు ప్రవేశపెడుతుంది.

ఇదంతా ప్రభుత్వం బాధ్యతగా ప్రజల హక్కుగా కాకుండా ఏదో బహుమతులు ఇస్తున్నట్లుగా ఉంది. ఈ ప్రభుత్వ వ్యయంలో కొరత విధించడం, సబ్సిడీల ఎత్తివేత అనేది ఆర్థిక లోటును పూడ్చడానికి తీసుకున్న నిర్ణయంగా భావించడం పొరపాటు అవుతుంది. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుని, మార్కెట్ శక్తులకు ప్రజా సంక్షేమాన్ని వదిలివేయడం అనే ప్రజా వ్యతిరేక, పెట్టుబడిదారీ విధానం ఇందులో దాగి ఉంది.

జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న యశ్వంత్ సిన్హా ఒక ఇంగ్లీషు టివిలో మాట్లాడుతూ 2013–14 కేంద్ర బడ్జెట్ 'క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల కోసం తయారు చేసిన బడ్జెట్‌గా ఇది మనకు కనిపిస్తుంది. కంపెనీల మీద, ఆర్థిక వ్యవస్థ మీద ప్రపంచం విశ్వాసం కోల్పోయే పరిస్థితి ప్రభుత్వమే కల్పించి ఇప్పుడు దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేశారు' అన్నాడు. మీరు ఆర్థికమంత్రిగా ఉంటే ఏం చేసేవారు అంటే 'నదులు అనుసంధానం, జాతీయ రహదారుల విస్తరణ, 100 ఎయిర్‌పోర్ట్‌లు నిర్మాణం చేసి, ఆర్థిక వ్యవస్థని అభివృద్ధి పథంలో నడిపే వాడిని' అన్నాడు.

దీనివలన మనకు అర్థమయ్యేది ఏమిటంటే ఎవరు ఎట్లాంటి అభివృద్ధి గురించి మాట్లాడినా అది సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉండబోదు. కాబట్టి ఇప్పుడు కావాల్సింది అభివృద్ధి సూచికలు, స్టాక్‌మార్కెట్ పాయింట్లు, క్రెడిట్ రేటింగ్ కంపెనీలు ఇచ్చే రేటింగ్‌లు, ఎయిర్‌పోర్ట్‌లు, రోడ్లు చూసి మురిసిపోయే అభివృద్ధి కాదు, ప్రజల కనీస అవసరాలు తీర్చి, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు తొలగించి, రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు నివారించే బడ్జెట్‌ను ప్రభుత్వాలు రూపొందించాలి.

*(రచయిత అర్థశాస్త్ర పరిశోధక విద్యార్థి, సెంట్రల్ యూనివర్సిటీ)* వీ

---

*(...4వ పేజీ తరువాయి)*

సుప్రీంకోర్టు ఆదేశించింది. కథ ఎక్కడ మొదలైందో తిరిగి అక్కడికే వచ్చి చేరింది. ప్రభుత్వం, పరిపాలనా విభాగం, పోలీసు, న్యాయ యంత్రాంగం మొత్తం కుమ్మక్కై ఇటువంటి వాటిని జరగనిస్తున్నారు. చట్టపరంగా ఆ పోలీసు ఒక్కడే నేరస్తుడు అయితే, నైతికంగా ఈ విభాగాలన్నీ నేరస్తులే. ముప్ఫై ఏళ్లలో ఈ అవినీతి, ప్రజల పట్ల అలక్ష్యం పెరిగిందే కానీ, తగ్గలేదు. శరీరంలో నుండి క్యాన్సర్‌ను తొలగించినట్లు సమాజం నుండి ఈ రాజ్య వ్యవస్థను తొలగించడమే పరిష్కారం. చాలా ఏళ్ల క్రితం నల్లగొండలో జరిగిన సభలో ఒక ఉపాధ్యాయుడు అన్న మాట గుర్తుకొస్తుంది – 'ఈ వ్యవస్థను మార్చలేం, దీన్ని అంతం చేయాల్సిందే'.

**– కె. నరేంద్రమోహన్**

*(వీక్షణం బ్లాగ్ www.veekshanam.wordpress.com పై పోస్ట్ చేసిన వ్యాఖ్య)*

**ఎన్.** నరసింహులు గారు 'చరిత్ర తవ్వితే జవాబు కోరే ప్రశ్నలెన్నో' అంటూ కొన్ని సాంకేతికపరమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఇంత స్పష్టత ఆనాటికే ఉంది అన్నవాళ్లు శ్రీకాకుళ, నక్సల్‌బరి పోరాటాల ప్రజ్వలనాన్ని ఎందుకు వ్యతిరేకించినట్లు? అని ప్రశ్నించారు. నిజానికి డి.వి. శ్రీకాకుళ, నక్సల్‌బరి పోరాటాలను ఏనాడూ వ్యతిరేకించ లేదు. కాని నక్సల్‌బరి పోరాటం, భూపంపకాన్ని ఆర్థిక వాదంగా ముద్రవేసి, భూమి పంపకం లేని 'సాయుధ పోరాటాన్ని' సృష్టించడాన్ని, ఆ క్రమంలోనే వచ్చిన 'ఖతం' కార్యక్రమాన్ని వ్యతిరేకించారు. కాగా ఆనాటి భూపంపకం లేని సాయుధ పోరాటం విప్లవకారులను పెడదారి పట్టించి, ఫలితంగా ఎన్నో ఏండ్లు అనేక పోరాట రూపాలను అనుసరించి నిర్మించిన శ్రీకాకుళ గిరిజన విప్లవ రైతాంగ పోరాటం ఖతం కార్యక్రమం అమలు జరిపిన ఫలితంగా త్యాగధనులు అయిన పార్టీ నాయకత్వాన్ని, క్యాడర్‌ను బలి తీసుకుంది. ఆ సమయంలో డి.వి. ఖతం కార్యక్రమం ద్వారా కకావికలైన విప్లవ పోరాటాన్ని సరైన విప్లవ ప్రజాపంథా వైపు మళ్లించడానికి చేసిన కృషి నిష్ఫలమైంది. వాస్తవం ఇలా ఉండగా, శ్రీకాకుళ, నక్సల్‌బరి ప్రజ్వలనాలను డి.వి. వ్యతిరేకించారని రాయడానికి ఎలాంటి ఆధారం లేదు.

**– జి. కృష్ణ**

సూర్యాపేట, నల్లగొండ

# దిల్‌సుఖ్‌నగర్ దుఃఖానికి బాధ్యులెవరు?

*నేరాలను వాస్తవిక దృష్టితో చూడకుండా, పారదర్శకంగా విచారణ చేపట్టకుండా, దానికి ప్రేరణ కాగల అవకాశాలన్నింటినీ శోధించకుండా, ఆ నెపాన్ని ఒక మత సంస్థపై, ఒక దేశంపై రుద్ది ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అంటున్నారు* **వరవరరావు**

ఇంత కాలానికి 'ఎన్‌కౌంటర్'లపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఏకగ్రీవ తీర్పుపై ఎపి పోలీసు అధికారుల సంఘం స్టే తెచ్చి, వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణను చేపట్టింది. స్టే ఇచ్చింది సుప్రీంకోర్టు ముగ్గురితో కూడిన ధర్మాసనం అయినప్పటికీ విచారణ డివిజన్ బెంచ్ ముందుకు వచ్చింది. హైకోర్టు ఐదుగురితో కూడిన ధర్మాసనం తీర్పు గనుక సుప్రీంకోర్టులో కూడా కనీసం ముగ్గురితో కూడిన బెంచీ చేపట్టాల్సి ఉంటోందని పేర్కొంటూ వాయిదా వేశారు. ఈలోగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా ఇందులో ఇంప్లీడ్ అయినవి. ఆయా ప్రభుత్వాల తరఫున కూడా ఈ తీర్పుకు వ్యతిరేకంగా పిటిషన్లు వేసినవి. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆరు వందల పేజీల పిటిషన్ సమర్పిస్తూ హరీష్ సాల్వే నక్సల్బరీ కాలం నుంచి ఇవ్వాల్టి మావోయిస్టు పార్టీ దాకా చరిత్రంతా ప్రభుత్వ దృష్టిలో వివరిస్తూ 'వీళ్లు తాజ్ ఇంటర్నేషనల్, బొంబాయిలో కాల్పులు జరిపిన వాళ్లపై ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన పోలీసుల మీద కూడా హత్యానేరం నమోదు చేయమని అడుగుతారు' అని ప్రారంభించాడు.

ఒక హత్య జరిగినపుడు, పైగా హత్య చేసినవాడు (పోలీసు అయినా సరే) ఆత్మరక్షణ కోసమైనా సరే హత్య చేశానని స్పష్టంగా, బాహాటంగా ప్రకటిస్తున్నప్పుడు అవి ఎదురు కాల్పులన్నంత మాత్రాన భారత శిక్షా స్మృతి కింద హత్యానేరంగా (ఐపిసి సెక్షన్ 302 కింద) నమోదు కాకుండా ఎట్లా ఉంటుంది? అది ఆత్మరక్షణ కోసం జరిగిందని రుజువయితే అది వేరే విషయం. మొదలు ఒక సంఘటన (హత్య)గా అది నమోదు కావాలి కదా.

అదట్లా ఉంచి – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిలో నేరమంటే ఏమిటి? ఏ నేరం అరుదయిన వాటిల్లో కల్లా అరుదయిన నేరం – ఏదయి ఉంటుంది అనే విషయంలో వర్గ పక్షపాతం హరీష్ సాల్వే మాటల్లో స్పష్టంగా బయటపడింది.

ఇటీవల ఉరితీసిన కసబ్ మీద ఇటు తాజ్ ఇంటర్నేషనల్‌లో కాల్పులు, హత్యలు అటు ఛత్రపతి శివాజీ టర్మినల్ (రైల్వే స్టేషన్)లో సామాన్య ప్రజలపై కాల్పులు, హత్యలు కూడా నేరాలుగా ఆరోపించ బడినాయి. అయితే కేంద్ర ప్రభుత్వానికి తాజ్ ఇంటర్నేషనల్ కాల్పులు, హత్యలే చాల తీవ్రమైనవనిపించింది. అందుకే మరణశిక్ష విధించి రహస్యంగా ఉరి తీసింది. ఒక్క కేంద్ర ప్రభుత్వమనే కాదు మీడియా కూడా కసబ్‌ను కరడుగట్టిన హంతకునిగా చూపించినపుడల్లా పక్కన తాజ్ ఇంటర్నేషనల్‌ను చూపడం మరచిపోలేదు. టివిలలోనూ, ప్రింట్ మీడియాలోనూ (మరణ శిక్షలను సూత్రబద్ధంగా వ్యతిరేకిస్తున్న హిందూ పత్రికతో పాటు) తాజ్ ఇంటర్నేషనల్‌పై, అది నిర్వహిస్తున్న టాటాలపై ఎన్ని ఉజ్వలమైన చారిత్రక కథనాలు' వచ్చాయో చరిత్రలో ఆసక్తి ఉన్న వాళ్లందరూ గుర్తుపెట్టుకుంటారు. సభ్య సమాజంలో కూడా ఆగ్రా తాజ్‌మహల్ పట్ల ఉండే సెంటిమెంట్ వంటిది బొంబాయి తాజ్ పట్ల కూడా ఉంటుంది. మధ్యతరగతికి అది అందుకోలేని మైమరపు. నిర్విచక్షణా కాల్పులు జరిపాడనే మాట వాడుతాం గానీ నేరాన్ని అంచనా వేసేపుడు, అరుదయిందిగా ఆరోపించి, చిత్రించి తీర్పు ఇచ్చేపుడు సభ్య సమాజం చైతన్యంలో ఈ వివక్ష ఉంటుంది.

మూడు వేల మంది మరణానికి కారణమైన భోపాల్ గ్యాస్ విస్ఫోటనకు బాధ్యుడైన ఆండర్సన్‌కు మరణశిక్ష కాదు కదా, ఆయనను మన ప్రభుత్వం, న్యాయస్థానాలు బోనెక్కించి విచారిస్తాయని కూడా మనం ఆశించలేం. ఆయనపై కేసును మన ప్రభుత్వం మూసేసుకున్నది కూడా. ముప్పై ఏళ్ల క్రితం జరిగిన ఈ విస్ఫోటన బాధితులు ఇంకా మరణిస్తూనే ఉన్నారు. ఇంకా గర్భస్రావాలు, అంగవైకల్య జననాలు జరుగుతూనే ఉన్నాయి. అట్లాగే గుజరాత్ మారణకాండకు ముఖ్యమంత్రిగా నైతికంగానూ బాధ్యత వహించవలసిన నరేంద్రమోడీ గురించి పోలిక తెచ్చి మాట్లాడడాన్ని కూడా సభ్య సమాజం సహించదు. ఆయనను కానున్న భారత ప్రధానిగా ఊహించుకొని ఆయన చేతుల్లో సురాజ్యం సాధ్యమని భ్రమలు పెంచుకుంటున్నది. కనీసం మూడు వేల మంది ముస్లింల జీవించే హక్కును హరించిన ఆయనకు అమెరికా ఆహ్వానం వెనక్కు తీసుకున్నదని, అది ఆయన భావ ప్రకటనా స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కును హరించడమేనని మన మీడియా, సభ్య సమాజం ఇటీవలే గగ్గోలు పెట్టినాయి. అయినా ఇంత వివరణ అక్కర్లేకుండానే అఫ్జల్‌గురును ఉరిశిక్ష విషయంలో సుప్రీంకోర్టు 'జాతి భావోద్వేగాల' దృష్టిలో పెట్టుకొని వేసినట్లుగా చెప్పనే చెప్పింది. ఈ 'జాతి భావోద్వేగాల' లో తాజ్ ఇంటర్నేషనల్ ఉంటుంది. పార్లమెంట్ ఉంటుంది. జనరల్ వైద్య ఉంటాడు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలుంటారు. భోపాల్ గ్యాస్ విషాదం కానీ, గుజరాత్ మారణకాండ కానీ ఉండవు. మాలెగాంవ్, మక్కామసీదు, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ వంటి బాంబు పేలుళ్లు, మరణాలు, పోలీసుల కాల్పులు ఉండవు. స్వర్ణ దేవాలయంపై దాడి, 1984 సిక్కుల ఊచకోత ఉండదు.

ఇది ఎవరి నేరాన్ని సమర్థించడానికి కాదు. కాని సభ్య సమాజం ఎవరి నేరాన్ని, ఎవరి విషయంలో జరిగినపుడు తీవ్రంగా పరిగణిస్తున్నది? ఎవరి విషయంలో జరిగినపుడు విస్మరిస్తున్నది, ఉపేక్షిస్తున్నది అన్నది ఇక్కడ ప్రతి ఒక్కరు గుండెల మీద చేయి వేసుకొని ఆలోచించాలి.

మక్కా మసీదు, మాలెగాంవ్‌లు మాత్రమే కాదు, గోకుల్ చాట్, లుంబినీ పార్క్ మొదలు దిల్‌సుఖ్‌నగర్ వరకు జరిగిన బాంబు పేలుళ్లలో

మరణించిన, గాయపడిన వాళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వహించిన శ్రద్ధ ఎంత? దిల్‌సుఖ్‌నగర్ బాంబు విస్ఫోటనలో మరణించిన వారి కుటుంబాలనే కాదు, గాయపడిన వారి కుటుంబాల హృదయ విదారక గాథలు వింటుంటే ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలను 'ఏ స్కోరు సెటిల్' చేసుకోవడానికి వాడుకుంటున్నాయో కొంచెం నిగ్రహంతో ఆలోచిస్తే సత్యం ఎన్నటికైనా బయటికి వస్తుందా అన్నది సందేహమే.

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల క్షణం ఆలస్యం కాకుండా 'ఇండియా ముజాహిదీన్' చర్యగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తేల్చివేశాయి. దీని వెనుక పాకిస్తాన్ ఐఎస్ఐ అంటే పరోక్షంగా ప్రభుత్వ కుట్ర ఉన్నదని కూడా తేల్చేశాయి. కుట్రదారులు కూడ సిద్ధంగా జైళ్లలోనే దొరికారు. ఇదంతా కాసేపటి కోసం యథాతథంగా ప్రశ్నించకుండా విచారణ కాలం వరకు స్వీకరించినా ఈ క్రమంలో ఏం జరిగింది?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ బాంబు పేలుళ్లు జరిగాయని స్వయంగా కేంద్ర హోంమంత్రి తన బాధ్యత నుంచి తప్పుకున్నాడు. అరగంట ముందే పోలీసు కమిషనర్ వచ్చిపోయాడు గనుక ఇది సాయిబాబా దేవాలయం దగ్గర జరిగే ఘోర ప్రమాదం తప్పిపోయి వందలాది మంది ప్రాణాలు కాపాడబడినాయి. అంటే, దిల్‌సుఖ్‌నగర్ గానీ, హైదరాబాద్ గానీ పోలీసు కమిషనర్ మొదలు ప్రధాని వరకు పర్యటనలకు వస్తే తప్ప సురక్షితంగా ఉండదన్న మాట. చాట్‌లు, చౌరస్తాలు, మసీదులు, గుళ్లు – ఎప్పుడూ ఎవరో ఒక విఐపి రాకపోతే సామాన్య ప్రజల కోసం వెళ్లవలసిన ప్రాణాలు కాదన్నమాట.

కేంద్ర ప్రభుత్వానికి ఈ కుట్ర తెలుసు గనుక, రాష్ట్రాలకు ముందే హెచ్చరించింది గనుక, ఇది పొరుగు రాష్ట్రం ప్రోత్సహించిన ఉగ్రవాద చర్య గనుక దీని విచారణకు రాష్ట్ర పోలీసులు, యంత్రాంగం సమర్థులు కారు. కనుక నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీకి ఈ కేసు అప్పగించారు.

మావోయిస్టుల నెపంతో కేంద్ర అర్ధసైనిక బలగాలు, కోబ్రాలే కాదు, సైన్యం కూడా రాష్ట్రాల్లో ప్రవేశిస్తుంది. సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్‌లు ఎన్‌కౌంటర్లు, కాల్పులు జరుపుతాయి. ప్రత్యేక కోర్టులు ఏర్పడుతాయి. యుఎపిఎ వంటి కేసులు పెడతారు. జాతి విముక్తి పోరాటాల నెపంతో సైన్యానికి ప్రత్యేక అధికారాలు ఇస్తారు. ఆ సైనికులు సాధారణ స్త్రీలపై లైంగిక అత్యాచారం చేస్తే సాధారణ పౌరుల వలె విచారించాలన్న జస్టిస్ వర్మ సిఫారసులను ఆమోదించరు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం కోరలు పెరగడం సభ్య సమాజానికి అభ్యంతరం కాదు.

సత్‌ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష తర్వాత క్షమాభిక్ష పెట్టే మానవీయ అంశం అడుగున పడిపోతుంది. సాధారణ ప్రజలకు, ఖైదీలకు, న్యాయానికి సంబంధించినంత వరకు ఒక అపవాదం (మినహాయింపు, ఎక్సెప్షన్ – అందులో ఉన్న వాస్తవాల సంగతి అలా ఉంచి) సాధారణీకరింప బడుతుంది.

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లు జరిగిన నాటి నుంచి హతులకు, కుటుంబాలకు ఉపశమనం, ఊరట అలా ఉంచి, గాయపడిన వారికి చికిత్స అలా ఉంచి సాధారణ ప్రజలు ఎంత భయ భీతావహులవు తున్నారు – హైదరాబాద్‌లో సాధారణ జీవితం ఎంత అతలాకుతలం అవుతున్నది – ఎంత అభద్రతా భావానికి గురవుతున్నది – అనుభవిస్తున్న వాళ్లందరికీ తెలుసు. ఎందుకంటే నేరసాధనం సైకిలు. నేరస్థలం – చౌరస్తాలోనో, సినిమాహాల్ దగ్గరనో ఉండే తినుబండారాలు అమ్ముకునే బజ్జీల బండ్లు. నేరస్తులు – గడ్డాల వాళ్లు – ముస్లింలు.

చేయించేది పొరుగుదేశం అనుకున్నప్పటికీ చేసేవాళ్లంతా సాధారణమైన మనుషులు. హతులు, బాధితులు అంతే. నేరాలూ పేదలూ, ముస్లింలే చేస్తారు. హతులూ, బాధితులూ వాళ్లే అవుతారు. ఒక్క ప్రభుత్వంతో – మరొక ప్రభుత్వానికున్న శత్రుత్వం వల్ల (భారత ప్రభుత్వం కూడా పాకిస్తాన్‌లో ఇటువంటి చర్యలకే పూనుకుంటుందా?) ఒక దేశంలోని టెర్రరిజానికి మరొక దేశపు దేశభక్తి కారణమా? నా దేశాన్ని, నా ప్రజలను ప్రేమించే నేను, అన్ని దేశాలు నా దేశం వంటివే. అన్ని దేశాల ప్రజలు, నా ప్రజల వంటివాళ్లే అనుకోనా? అనుకోవాల్సిన అవసరం లేదా? అఫ్జల్ గురుకు వర్తించే న్యాయ ప్రమాణాలు సభ్య సమాజం దృష్టిలోనైనా సమాజాలకు వర్తించవా?

భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీసిన కాలంలోనే స్పెయిన్‌లో ఐదుగురు విప్లవకారుల ఉరిశిక్షలు రద్దు చేయాలని ఇందిరాగాంధీ నియంత ఫ్రాంకోకు విజ్ఞప్తి చేసింది. అఫ్జల్‌గురు ఉరిశిక్షను ఆలస్యం చేశారని పదకొండేళ్ల నుంచి పట్టుపడుతున్న వాళ్లే పాకిస్తాన్ సరబ్‌జిత్ ఉరిశిక్ష రద్దు చేసి భారతదేశానికి క్షేమంగా పంపించాలని కోరుతున్నారు.

ఒకవేళ దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లు కసబ్, అఫ్జల్‌గురుల ఉరిశిక్షలకు ప్రతీకారాలు అనుకుంటే మరణశిక్షలు రద్దుచేయాలని కోరుకున్న వాళ్ల వాదనలో ఎంత బలముందో తేలిపోయినట్లే కదా. ఇద్దరిని ఉరితీసిన ప్రభుత్వం ప్రతీకారంగా పదిహేడు మంది మరణాలను ఆపలేకపోయింది. అంతేకాదు, ఇంకా దేశంలో పలు రాష్ట్రాల్లో, పలు ప్రాంతాల్లో ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం ఉందని పదే పదే హెచ్చరిస్తున్నది. హైదరాబాద్‌లోని ప్రతి కూడలిలో సైకిల్ బాంబులు, సూట్‌కేసు బాంబులు, అనుమానిత వ్యక్తుల హెచ్చరికలతో ప్రజలకు నిద్రకరువయి, అభద్రతా భావంతో, భయాందోళనలతో ఇప్పటికీ స్వేచ్ఛగా తిరగడానికి, నిద్ర పోవడానికి భయపడుతున్న ప్రజలకు ప్రభుత్వం అదనంగా 'ఇదిగో తోక, అదిగో పులి' భయాన్ని చెవుల్లో ఇల్లు కట్టుకొని కూరుతున్నది.

ఒక నేరం జరిగినపుడు – నేరమనే వాస్తవాన్ని మొదట వస్తుగత దృష్టితో నిష్పాక్షికంగా, పారదర్శకంగా చేపట్టి, ప్రకటించి, ప్రదర్శించి, దానికి ప్రేరణ కాగల అవకాశాలన్నింటినీ సత్యావిష్కరణ కోసం శోధించడం కాకుండా – ఇండియన్ ముజాహిదీన్ అని హోంమంత్రి నిర్ధారణ చేసి నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీకి అప్పగించిన తర్వాత – ఇంక విచారణ ఏముంది? ఈ మైండ్‌సెట్‌కు అనుగుణంగా కోర్టులు విచారించాల్సి ఉంటుంది. కోర్టులు ఈ మైండ్‌సెట్‌కు ఎప్పుడో ట్యూన్ అయిపోయాయి. బాంబు పేలుళ్లు జరిగిన మరుక్షణం అన్ని టివి ఛానెళ్లు ట్రయల్ జరిపే కోర్టులుగా మాత్రమే కాదు, తీర్పులిచ్చేవిగా కూడ వ్యవహరిస్తున్నాయి. అంతమాత్రమే కాదు, ప్రతీకారం అని తేల్చివేశాం గనుక, లేదా, మన ప్రభుత్వాలను అస్థిరపరచాలని, మన దేశంలో అల్లకల్లోలం సృష్టించాలని పాకిస్తాన్ పురికొల్పిన కుట్రపూరిత ఉగ్రవాద చర్య అని తేల్చివేశాం గనుక నేరస్తుడు ముస్లిం అయి ఉంటాడు. ఒక నేరస్తుడు ముస్లిం అయితే ముస్లిం ప్రజలందరూ నేరస్తులే. పాతబస్తీలోని ప్రతి ముస్లిం యువకుడూ, ఆరుసార్లు నిష్ఠగా నమాజ్ చేసేవాడు ప్రతి ఒక్కడూ అనుమానితుడే. గాంధీజీ హత్య కాలానికి మనకే 'జాతి భావన' లేదా 'జాతి భావోద్వేగం' లేదు. ఇందిరాగాంధీ హత్యతో ప్రారంభమై రాజీవ్‌గాంధీ హత్య నాటికి ముదిరి అమెరికాలో వాణిజ్య సంస్థపై దాడితో స్థిరపడింది.

సంస్మరణ

# లాటిన్ అమెరికాలో రాలిన ఎర్రసూరీడు

***ప్రపంచ సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా నిలిచి, తమ దేశ వనరులు దేశ ప్రజలకే చెందాలనే ఆశయంతో, దేశ ప్రజల కోసం పాటుపడ్డ సోషలిస్టు నాయకుడు హ్యూగో చావెజ్ గురించి వివరిస్తున్నారు*** **డా. ఎ. పున్నయ్య**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వనరులన్నింటి మీద బహుళజాతి సంస్థల ఆధిపత్యాన్ని నెలకొల్పడం కొరకు అమెరికా రాజకీయ, సైనిక, దౌత్య పరంగా చేసిన ఎన్నో ప్రయత్నాలను తిప్పికొట్టి, అమెరికా సామ్రాజ్య వాదాన్ని మొక్కవోని సాహసంతో ఎదుర్కొని అగ్రరాజ్యానికి వణుకు పుట్టించి అసామాన్యంగా గర్జించిన గొంతు మూగబోయింది. అనేకానేక కుట్రలు, కుతంత్రాలను ఎప్పటికప్పుడు పసిగట్టి కణకణంలో కమ్యూనిస్టు భావాలను నింపుకొని పధ్నాలుగు సంవత్సరాలు ప్రజారంజక పాలన నందించి ప్రపంచ దేశాల్లో తన దేశాన్ని ప్రముఖ స్థానంలో నిలిపిన కామ్రేడ్ హ్యూగో చావెజ్‌ను క్యాన్సర్ వ్యాధి రెండు సంవత్సరాలు తీవ్రమైన దాడిలో ఓడించింది. లాటిన్ అమెరికా వేగుచుక్క రాలిపోయింది. యాభై ఎనిమిది సంవత్సరాల చావెజ్ మార్చ్ 5న మరణించారు.

అసాధారణ కమ్యూనిస్టుగా ఎదిగి, మిలిటరీ దుస్తులు వదిలి సగౌరవంగా ఎర్రచొక్కా వేసుకొన్న దేశాధినేత చావెజ్. మురికి ఇంటి నుండి ఎదిగి వచ్చినా, ప్రపంచాన్ని మార్చగల విధానం ఒక్క సోషలిజమే నని త్రికరణశుద్ధిగా నమ్మడమే కాకుండా, ఆచరణలో నిరూపించాడు. శత్రువులను హృదయాంతరాల నుంచి ద్వేషించాలన్న స్టాలిన్ సూక్తిని పూర్తిగా వంటబట్టించుకొని ప్రపంచ దేశాల పురోగతికి అడ్డంకిగా మారిన అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రాణమున్నంత వరకు వ్యతిరేకించాడు.

క్యూబా అండదండలు, కమ్యూనిస్టు దిగ్గజం ఫైడెల్ క్యాస్ట్రో మార్గ దర్శకత్వంలో మొత్తం లాటిన్ అమెరికా దేశాలను ఏకతాటిపై నడిపించి, సామ్రాజ్యవాదంపై భీకర యుద్ధం ప్రకటించి ఎర్రదండు సేనాని చావెజ్.

1954 జూలై 28న పశ్చిమ వెనిజులా రాష్ట్రమైన బరినాస్‌లో ఒక పేద ఉపాధ్యాయుడు హ్యూగో రాఫిల్ చావెజ్ ప్రియాస్ ఆరుగురు కొడుకుల్లో రెండవ సంతానం చావెజ్. అవమానం, వేదన, పేగులు మెలిపెట్టే ఆకలి బాధల మధ్య పెరిగాడు. 1970లో వెనిజులా మిలిటరీ అకాడమీలో పారా ట్రూపర్‌గా సైనిక జీవితం ప్రారంభించాడు. అక్కడ పట్టభద్రుడై, తూర్పు వెనిజులాలో కౌంటర్ ఇన్సర్జెన్సీ యూనిట్‌లో పనిచేశాడు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశం ఎందుకింత పేదరికంతో ఉన్నదని శాస్త్రీయంగా ఆలోచించి, అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వాలే ప్రజల కష్టాలకు కారణమని విశ్లేషించుకున్నాడు. పరిష్కార మార్గంగా మావోయిస్టు తీవ్రవాద సంస్థలైన రెడ్‌ఫ్లాగ్ ఆశయాలను ప్రత్యామ్నాయం గా గుర్తించాడు. ఆ ఆశయ స్ఫూర్తితో ఆయన తనతో పాటు సైన్యంలో పనిచేసే కొందరిని సమీకరించి 1980లో బొలివేరియన్ రెవల్యూషనరీ మూవ్‌మెంట్‌ను ప్రారంభించాడు. అదే సమయంలో అప్పటి లిబియా అధ్యక్షుడు గడాఫీ రచించిన 'ది గ్రీన్ బుక్' ఆయన్ను మరింత లోతుగా ఆలోచించేలా చేసి ఆచరణ మార్గానికి అడుగులు వేయించింది.

చావెజ్, విప్లవం అనేది దానంతట అది పాలిత ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, ఒక జాతి సాంస్కృతిక అస్తిత్వ జీవన విధానాల కాలక్షేత్రంలో మొలకెత్తిన రాజకీయ విత్తనమనీ, పాతుకుపోయిన బూర్జువా వ్యవస్థను

---

హైదరాబాద్‌కు సంబంధించినంత వరకు ఇంకా గోకుల్ చాట్, లుంబినీవనం బాంబు దాడుల కారణాలు తేలలేదు కదా, సాయిబాబా గుడి, మక్కామసీదు సంఘటనల విషయంలో ఆరోపణలు అబద్ధమని తేలింది కదా – అరెస్టు చేసిన ముస్లిం యువకులను నిర్దోషులుగా కోర్టు వదిలేసింది కదా. మక్కామసీదు పేలుళ్ల విషయంలో ఆ యువకులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది కదా తొందరపడి ఒక సామాజిక వర్గాన్ని సమాజంలో నేరస్తులుగా, దోషులుగా నిలబెట్ట కూడదని బాధ్యతలేని ప్రభుత్వానికి ఉద్దేశాలు, ప్రయోజనాలు ఉన్నాయని భావిస్తే నేరమవుతుందా?

ఇటువంటి వివక్ష మరింత అభద్రతా భావానికి, ప్రతీకార భావానికి దారితీస్తే, దాని పరిణామాలు ఎలా ఉంటాయో కూడా ఊహించలేనంత బాధ్యతారహితంగా మీడియా అయినా, ప్రభుత్వమైనా నిర్ధారణలు చేస్తే దాని తీవ్ర పరిణామాలన్నీ అనుభవించవలసింది సామాన్య ప్రజలే కదా.

'జాతి భావోద్వేగానికి' అదే దేశ ప్రజలు ఇంకా మూల్యం చెల్లించక తప్పదా? ఈ మొత్తం పరిణామాల్లో వ్యవస్థీకృత నిర్మాణాలు కలిగిన శక్తులు, ప్రభుత్వంతో సహా నేరం నీడ మీదికి నెట్టి తప్పుకోగలగడమే కాదు, ఆమోదాన్ని పొందడం ఎంత అమానుషం.

అమానుషంగా అని ఎందుకంటున్నానంటే, మనుషులు మనుషుల్ని చంపారు. కనిపించని శక్తులేవో నడిపిస్తే కనిపించే నేరాలు జరుగుతాయి. ఆ శక్తులు మానవ సమాజాలు కావు. అవి వ్యవస్థలు, స్వార్థ ప్రయోజన మున్న వ్యవస్థ. అన్నీ సమాజాల్లోని నేరచరిత్ర అంతా వ్యవస్థాగత స్వార్థ ప్రయోజన రచనయే. అది భూస్వామ్యానిది కావచ్చు. అది పెట్టుబడిది కావచ్చు. అది రాజ్యానిది కావచ్చు. కశ్మీరులో సైన్యం, రా వంటి వ్యవస్థలు, సంస్థలు చేసిన నేరాలు కేంద్ర ప్రభుత్వం దాచలేక పోయింది. మాలెగాఁవ్, మక్కామసీదు విషయంలో కూడ దాచలేక పోయింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ప్రభుత్వాలు ఆయా కాలాల్లో చేసిన నేరాలు ఆలస్యంగానయినా బయటికి వచ్చాయి, వస్తున్నాయి. జాతి భావోద్వేగాల అభిప్రాయాలు, ఆరోపణలు, నిర్ణయాలు, తీర్పులు ఆ జాతికి మేలు చేయకపోగా కాలక్రమంలో భస్మాసురుల హస్తాలవుతాయి.

*(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం నాయకులు)* వీ

కూలదోయనిదే సోషలిజం రాక అసాధ్యమనీ ప్రకటించి 1992లో అధ్యక్షుడు కార్లోస్ ఆండ్రెస్ పెరెజ్‌పై తిరుగుబాటు బావుటానెత్తి విఫలయత్నం చేశాడు. ఆ తిరుగుబాటు ఫలితంగా రెండు సంవత్సరాలు జైళ్లో ఉన్నాడు. 1994లో జైలు నుండి బయటికొచ్చి సోషల్ డెమోక్రటిక్ పొలిటికల్ పార్టీని ఏర్పాటు చేశాడు. జానపద కళాకారుడైన చావెజ్ తన కళల ద్వారా దేశం మొత్తం తిరిగి ప్రభుత్వాల దిగజారుడు విధానాన్ని ప్రచారం చేసి, ప్రజా మద్దతుతో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని రగిలించి 1998లో ఎన్నికల్లో ఘన విజయం సాధించాడు. 44 సంవత్సరాల అతి చిన్న వయసులో వెనిజులా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాడు. అనంతరం 2002, 2004 సంక్షోభ సమయంలో సామ్రాజ్యవాద దేశాల కుట్రలకు వ్యతిరేకంగా నిలవడంలో యావత్ వెనిజులా జాతి ఆయన వెన్నంటి నిలిచింది.

ప్రకృతి వనరులు సమాజపు అభివృద్ధికి తోడ్పడితే ఆ సమాజమే దానికి కాపలాదారు అవుతుంది. స్థానిక సహజ వనరులు తమ జాతి విద్య, వైద్యం, ఆహారం, ఉపాధితో పాటు మొత్తంగా జాతి పురోగాభివృద్ధికి ఆధారమైనపుడు ప్రజలే వనరుల సంరక్షణకు పెట్టనికోటలా తయారవుతారు. ఈ సహజ తాత్వికతను వెనిజులా ప్రజలు గుర్తించేలా చేసిన చావెజ్ వెనిజులాకి తిరుగులేని నాయకుడయ్యాడు. దేశంలో అక్షరాస్యత శాతం గణనీయంగా పెరిగింది. పేదరికం ఎన్నడూ లేనంతగా తగ్గింది. ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. చైతన్యవంతులైన ప్రజలు నిజాయితీగా, నిర్భయంగా ఆయన వెంట నడిచారు. లాటిన్ అమెరికాలో కమ్యూనిస్టు దేశాధినేతలందరినీ ఏకం చేశాడు. అదే సమయంలో క్యూబా అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో, ఈక్వెడార్ అధ్యక్షుడు రాఫెల్, బొలీవియా అధ్యక్షుడు ఇవోమోరెల్స్ వంటి స్నేహితులు అధికారంలోకి వచ్చారు. అమెరికా శత్రువులైన లిబియా, సిరియా, ఇరాన్ వంటి దేశాలతో దౌత్య సంబంధాలు నెలకొల్పాడు. చమురు వనరులున్న అన్ని దేశాలకన్నా, సామ్రాజ్యవాద దేశం అమెరికాకు ప్రధాన ఇంధన వనరు కేంద్రం వెనిజులాయేనని గ్రహించి, దాని దురాక్రమణను ప్రపంచానికి తెలియజేసి, బద్ధశత్రువుగా నిలబడి, పోరాడి జాతి సార్వభౌమాధికారాన్ని కాపాడిన నేత చావెజ్.

ఒక దేశాధ్యక్షుడై ఉండి కూడా ప్రజలతో నేరుగా ఎక్కువ కాలం గడపడానికి, ప్రజలతో సంభాషించడానికి 'హలో ప్రెసిడెంట్' పేరుతో ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రతి ఆదివారం కార్యక్రమాల్ని నిర్వహించి సమస్యల పట్ల సత్వర పరిష్కారాలను చూపేవాడు. తన ప్రజల పట్ల, ప్రజా సంక్షేమాల పట్ల అత్యంత ప్రేమాదరాలు గల చావెజ్ తన జాతిని కించపరిచే వారి పట్ల, తమ దేశ ప్రయోజనాలను కొల్లగొట్టాలని చూసే వారి పట్ల చాలా కఠినంగా ఉండేవాడు. ఆయన జాతినుద్దేశించి చేసే ప్రసంగాలు చైతన్యపూరితమైన నదీ ప్రవాహంలా సాగేవి. అనర్గళమైన ఆయన వాక్ప్రవాహంలో ఎన్నో చురకలు కూడా ఉండేవి.

చావెజ్ మరణానికి లాటిన్ అమెరికా దేశాలు రెడ్ సెల్యూట్ చేయగా, రష్యా, చైనా, భారత్, ఇరాన్ వంటి దేశాలు ఘనంగా నివాళు లర్పించాయి. అమెరికా, వెనిజులాతో మరింత సంబంధాన్ని మెరుగు పరుచుకుంటుందని బరాక్ ఒబామా చెప్పారు. కమ్యూనిస్టు దిగ్గజం ఫైడల్ కాస్ట్రోకు చావెజ్ నిజమైన పుత్రుడని క్యూబా నివాళులర్పించి, మూడు రోజులు సంతాప దినాలు పాటించింది. బ్రెజిల్ నాయకురాలు దిల్మా రౌసెఫ్ చావెజ్‌ను గొప్ప లాటిన్ అమెరికన్‌గా పేర్కొనగా, చావెజ్ ఎప్పటికీ అమరుడేనని బొలీవియా అధ్యక్షుడు ఇవో మోరెల్స్ నివాళి అర్పించాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఛావెజ్‌ను అసాధారణ శక్తిమంతమైన నాయకుడనీ, తనకు తానుగా వర్తమాన కాలంలో అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఎల్లప్పుడు భవిష్యత్తును చూసే వాడనీ, రష్యా వెనిజులాల మధ్య దృఢమైన సంబంధాలు నెలకొనేందుకు పునాది వేశాడనీ సంతాప సందేశంలో పేర్కొన్నాడు. తమకు గొప్ప మిత్రుడేగాక, గొప్ప నాయకుడని చైనా ప్రశంసించింది. మేమొక విప్లవ నాయకుడిని కోల్పోయాం, కాని ఆయన ప్రభావం మాపై చిరస్థాయిగా ఉంటుందని ఈక్వెడార్ అధ్యక్షుడు రఫెల్ కారియా అన్నారు. వెనిజులాపై చావెజ్ చెరగని ముద్ర వేశాడని బ్రిటన్ విదేశాంగ మంత్రి విలియం హేగ్ పేర్కొన్నాడు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్, చావెజ్ జీవితాంతం పేదల అభ్యున్నతికే పాటు పడ్డాడని కొనియాడారు. భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ చావెజ్ మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాడు. అలాగే మన దేశ కమ్యూనిస్టు నేతలు కూడా, అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసి, సామ్రాజ్యవాద శక్తుల నుండి లాటిన్ అమెరికా దేశాలను రక్షించిన యోధుడని, ఒకనాడు అమెరికా ఇంటి పెరడుగా ఉన్న లాటిన్ అమెరికా ఇప్పుడు ప్రగతిశీల ప్రజాస్వామ్య వేదికగా పరిఢవిల్లుతోంది. అంటే అది కేవలం చావెజ్ చేతి చలవేనని, అతనికి ఘన నివాళులర్పించారు. ఒక దేశాధ్యక్షుని మరణం ప్రజాస్వామ్య వాదులను, ప్రగతిశీల శక్తులను ఎంతగా కదిలించిందో ఆయా దేశాల ప్రతిస్పందనే అందుకు తార్కాణం. చెక్కు చెదరని ఆత్మవిశ్వాసాన్ని వెనిజులా ప్రజలకు అందించాడు కాబట్టే ఆ దేశ పౌరసమాజం అంతా ఆయనను స్టాలిన్ లాగా, మరో తరానికి సైతం ఆయన స్ఫూర్తిని సజీవంగా సహజాతి సహజంగా ఉండేలా భద్రపరుచుకుంటోంది. చావెజ్ తమ 'జాతిపిత' అని, మరణం లేని వీరుడని నినదిస్తోంది.

మొత్తంగా జాతి సమగ్రాభివృద్ధి, ఆ దేశ అంతర్గత సహజ వనరుల తోనే సాధ్యమని నిరూపించాడు. బహుళజాతి, కార్పొరేట్ శక్తుల సామ్రాజ్యవాద విష వలయాలను అడ్డుకొని, అభివృద్ధి ఫలాలు అక్కడి ప్రజలకు అందేలా చేశాడు. చావెజ్ ఒక్క లాటిన్ అమెరికా దేశాలకే గాక అటు పశ్చిమాసియాలోని దేశాలకు, ఇటు తూర్పు దేశాలకు సైతం ఆదర్శప్రాయుడే. ముఖ్యంగా, పుష్కలమైన సహజ వనరులు ఉన్న భారతదేశంలో సంస్కరణ పేరుతో, గ్లోబలైజేషన్ పేరుతో సామ్రాజ్యవాద శక్తులకు ధారాదత్తం చేసి, ప్రజలను నిరాశ్రయులను చేసి, జీవన విధ్వంసం సృష్టిస్తూ, ఆయా శక్తులకు రెడ్‌కార్పెట్ పరుస్తున్న భారత పాలకవర్గాలు చావెజ్ ఆచరణా విధానాన్ని ఆదర్శంగా గ్రహించాల్సి ఉంది. అక్కడి అభివృద్ధి నమూనాను మన దేశ కమ్యూనిస్టులు సైతం గ్రహించాల్సి ఉంది. సంస్కరణల పేరుతో ముందుకొస్తున్న బానిస ప్రభుత్వాల కొమ్ము కాయడం మాని, ప్రజలను చైతన్యపరచడం నేర్చుకోవాలి చావెజ్‌లా. ప్రపంచ దేశాల అధినేతల మన్ననలందుకొని, ప్రజల కోసం జన్మించి ప్రజల కోసమే మరణించిన అమరజీవి చావెజ్ కాలం సృష్టించుకున్న నాయకుడు. ఆయన మరణం వెనిజులాకు తీరని లోటైనా, ఆయన ఉద్యమ జీవితమే వెనిజులా వెన్నెముకగా నిలుస్తుంది. ప్రజాకాంక్షలు ప్రజాస్వామిక విప్లవాలున్న ప్రతి నోట ఆయన ఛాయలు ఎప్పటికీ ఉంటాయి. నేడు అస్తమించిన సూర్యుడే గాని, రేపటి లాటిన్ అమెరికాలోనే కాదు లాట్ ఆఫ్ కంట్రీస్‌లో కూడా తొలి పొద్దై పొడిచే ఎర్రసూరీడు ఛావెజ్.

*(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్)* వీ

# షాబాగ్ స్క్వేర్ అల్లర్లకు మూలాలు

***మతోన్మాద, సామ్రాజ్యవాద శక్తులపట్ల ఉద్యమకారుల నిరంతర అప్రమత్తత, ప్రజా ఉద్యమం బంగ్లాదేశ్ లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడుతుందని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

**1947**లో భారత దేశంలోని ముస్లింలు ప్రత్యేకమైన జాతి అనే విశ్వాసం, సైద్ధాంతిక ప్రాతిపదికన పాకిస్తాన్ సృష్టించబడింది. అయితే పశ్చిమ పాకిస్తాన్‌లోని పంజాబీ మాట్లాడే ప్రజల్ని, తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీ మాట్లాడే ప్రజల్ని మతం కలిపి ఉంచలేకపోయింది. పశ్చిమ పాకిస్తాన్‌లోని ఆర్థిక ఉన్నతవర్గం సైనిక, పాలన, రాజకీయ, వాణిజ్య రంగాలలో ప్రబలమైన స్థానం ఆక్రమించింది. ఫలితంగా తూర్పు పాకిస్తాన్‌కి వ్యతిరేకంగా రాజకీయ, ఆర్థిక వివక్షత ప్రబలింది. తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీలకు రాజకీయ ప్రజాస్వామ్యం లేకపోవడంతో తమ పరిస్థితిని చక్కదిద్దుకునే నిర్మాణ విధానం లేదు. ఫలితంగా ప్రజాస్వామ్యం కొరకు స్వతంత్ర ప్రతిపత్తి కొరకు తూర్పు పాకిస్తాన్ ప్రజలు శక్తిమంతమైన ఉద్యమాన్ని నిర్మించారు. పాకిస్తాన్ పాలకుల ఆధిపత్యానికి, ఉర్దూను అధికార భాషగా బలవంతంగా రుద్దడానికి వ్యతిరేకంగా బెంగాలీ భాషోద్యమాన్ని బంగ్లా జాతీయత పునాదిగా 1952లో విజయవంతం చేశారు. పాకిస్తాన్ పాలకులు ఆర్థిక రాజకీయ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా కాలక్రమంలో ఉద్యమాన్ని అణచివేయాలని నిర్ణయించారు. పర్యవసానంగా ఉద్యమ స్వరూపం మారిపోయింది. పాకిస్తాన్ నుండి స్వాతంత్ర్యాన్ని కోరే ఉద్యమంగా 1970 నాటికి అది మారింది.

పాకిస్తాన్ మిలిటరీ నియంత జనరల్ యాహ్యాఖాన్ 1970 డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాడు. ఈ ఎన్నికలలో షేక్ ముజిబూర్ రహమాన్ నాయకత్వంలో బెంగాలీల అవామీ పార్టీ తూర్పు పాకిస్తాన్‌లో 99 శాతం సీట్లను, పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో మెజారిటీ స్థానాల్ని గెలిచింది. అయితే అవామీ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచడాన్ని పాకిస్తాన్ నాయకుడు జుల్ఫీకర్ అలీ భుట్టో మద్దతుతో జనరల్ యాహ్యాఖాన్ తిరస్కరించారు. రాజ్యాంగ అమలుకై ముజిబూర్ రహమాన్ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు. దీన్ని అణచడానికి యాహ్యాఖాన్ 1971 మార్చ్ 25న తూర్పు పాకిస్తాన్‌పై తీవ్రమైన మిలిటరీ చర్యకై ఆదేశాలు జారీ చేశాడు. ముజిబూర్ రహమాన్ పశ్చిమ పాకిస్తాన్‌లోని గుర్తు తెలియని ప్రాంతానికి తరలించబడ్డారు. తూర్పు పాకిస్తాన్‌లో సైన్యం అమాయక ప్రజల్ని చంపింది. పంటల్ని, గ్రామాల్ని తగుల బెట్టింది. స్త్రీలపై అత్యాచారాలు చేసింది. భయోత్పాతాన్ని సృష్టించింది. ప్రజలకు ఎలాంటి నాయకత్వం లేకుండా చేసేందుకు వేలాది మంది మేధావులను పోలీసు మిలిటరీలో పనిచేస్తున్న వారిని విచక్షణా రహితంగా ఒక క్రమపద్ధతిలో హత్య చేసింది. ఉద్యమకారుల్ని చిత్రహింసలు పెట్టింది. దారుణ హత్యాకాండ సాగించింది. ఇంకా పలు నీచాతి నీచమైన నేరాలు చేసింది. ఈ బీభత్సకాండ ఆరు నెలల పాటు దారుణంగా సాగింది. తూర్పు పాకిస్తాన్‌లోని పోలీసు, పారా మిలిటరీ సంస్థలు, సైనిక రెజిమెంట్‌లోని పెద్ద పెద్ద సెక్షన్లు తూర్పు పాకిస్తాన్ ప్రజా తిరుగుబాటుకి సానుకూలంగా స్పందించాయి. అవామీ లీగ్ నాయకులు ప్రవాసంలో ఉండి బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. ముక్తవాహిని (విముక్తి సైన్యం) నిర్మించారు. అజ్ఞాతంగా ఉంటూ గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించారు.

పాకిస్తాన్‌లో భారత్ నుంచి వెళ్లిన ఉర్దూ మాట్లాడే పంజాబీల పెత్తనం ఎక్కువగా ఉండేది. వీళ్లే అక్కడ అధికార బృందంగా చెలామణి అయ్యారు. ఆర్థిక రాజకీయాలలో వీళ్లే కీలకమైన బృందం. పాకిస్తాన్ పాలకులు మత ప్రాతిపదికన బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్తాన్)ను నియంత్రించాలనుకున్నారు. సమైక్యత ముసుగులో, మతం ముసుగులో పాకిస్తాన్ సాగించిన ఆర్థిక దోపిడీని, రాజకీయ పెత్తనాన్ని, భాషపరమైన అణచివేతను బంగ్లాదేశ్‌లోని బెంగాలీలు జాతీయత పునాదిగా 90 శాతం ముస్లింలు వ్యతిరేకించారు. బంగ్లాదేశ్‌లో బలంగా ఉన్న అవామీ లీగ్ ఎన్నికల్లో గెలిచినా అధికారం అప్పగించడానికి పాకిస్తాన్ పాలకవర్గం సిద్ధపడలేదు. ఈ నేపథ్యంలో బెంగాలీలు ఆత్మాభిమానంతో పాకిస్తాన్ ఆధిపత్యానికి, సాంస్కృతిక అణచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును అణచివేయడానికి పాకిస్తాన్ సైన్యాన్ని దింపింది. వారికి తాబేదారుగా ఉన్న స్థానిక మతవర్గం సైన్యంతో కుమ్మక్కై ఢాకా విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులనూ, విద్యార్థులనూ ఊచకోత కోసింది. గ్రామీణ ప్రాంతంలో లక్షలాది మందిని హతమార్చింది.

పాకిస్తాన్ సైన్యం హిందువులు, బెంగాలీ ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు అనే తేడా లేకుండా పాశవికంగా ప్రవర్తించింది. సైన్యం పాశవిక చర్యలు తట్టుకోలేక తప్పని సరైన పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుకునేందుకు లక్షలాది మంది వలసబాట పట్టారు. భారతదేశంలోని పశ్చిమ బెంగాల్, అస్సాం, మేఘాలయలలో ఆశ్రయం పొందారు. 1971 నవంబర్ నాటికి తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్) కాందిశీకుల సంఖ్య ఒక కోటికి చేరింది. భారత దేశానికి ఒక సమస్యగా మారింది. తూర్పు బెంగాల్ ప్రజల పట్ల సానుభూతి పెరిగింది. తూర్పు పాకిస్తాన్‌లో స్వయం ప్రతిపత్తి కొరకు సాగుతున్న ఉద్యమం ఫలితంగా చెలరేగిన తిరుగుబాటును ప్రజల తిరుగుబాటుకాదని, ఇదంతా భారతదేశ కుట్రయని పాకిస్తాన్ ప్రచారం చేసింది. అంతేగాక అంతర్జాతీయంగా సమస్యని బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి సంబంధించిన సమస్యగా కంటే భారత్ పాకిస్తాన్‌ల మధ్య సమస్యగా చూపించ యత్నించింది. అంతిమంగా సమస్య అంతర్గత సమస్య నుండి అంతర్జాతీయ సమస్యగా, భౌగోళిక రాజకీయ సమస్యగా మారింది. చైనా, అమెరికాలు పాకిస్తాన్‌ను సమర్థించగా, రష్యా, తూర్పు యూరప్ దేశాల స్పందన భారత ప్రభుత్వానికి సానుకూలంగా లభించింది.

1971 ఆగస్టులో అమెరికా–చైనాల మధ్య సామరస్యం కుదుర్చడానికి పాకిస్తాన్ సహకరించింది. అదే సమయంలో పరిస్థితులు యుద్ధానికి దారితీస్తాయన్న సాకుతో అమెరికా, చైనా జోక్యం నుండి బయట పడాలని భారతదేశం 20 సంవత్సరాల భారత్–సోవియట్ ఒడంబడికపై సంతకం చేసింది. ఈ ఒప్పందం విస్తరణవాద కాంక్షతో భారత్ చేసుకుందన్న విమర్శ వచ్చింది. ఒక దేశ అంతర్గత వ్యవహారాలతో జోక్యం చేసుకోవడమంటే అంతర్జాతీయ న్యాయ నియమాలను ఉల్లంఘించడంగా విమర్శ వచ్చింది. భారత సైనికాధికారి జనరల్ జె.యస్ అరోరా నాయకత్వంలో తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్) ముక్తివాహిని, గెరిల్లాలతో కలిసి డిసెంబర్ 4న పాకిస్తాన్ సైన్యంతో యుద్ధానికి తలపడింది. 11 రోజుల్లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వరకు భారత సైన్యం చొచ్చుక పోయింది. 1971 డిసెంబర్ 10న పాకిస్తాన్ సైన్యం భారత సైన్యానికి లొంగిపోయింది. వెంటనే భారతదేశం బంగ్లాదేశ్‌ను గుర్తించింది. పాకిస్తాన్ యుద్ధ విరమణ అంగీకరించి ముజిబూర్ రహమాన్‌ని విడుదల చేసింది. ఆయన 1972 జనవరి 12న బంగ్లాదేశ్ పాలనాధికారాలు స్వీకరించాడు.

9 మాసాలు సాగిన బంగ్లా విముక్తి పోరాటంలో సుమారు 30 లక్షల మంది దాకా ప్రాణాలు కోల్పోగా, 2 లక్షల మంది మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. 1971లో విముక్తి ఉద్యమకారులపై జమాతే పార్టీ సభ్యులైన మిలీషియా గ్రూపుల రజాకార్లు, అల్ ఖాద్ర, అల్ షామ్స్ వంటివి పాకిస్తాన్ సైన్యానికి సహకరించాయి. యుద్ధ విరమణ జరిగి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది కాని శాంతి స్థాపన జరుగలేదు. 90 వేల మంది పాకిస్తాన్ సైనికులు భారతదేశం ఆధీనంలో బందీలుగా ఉన్నారు. 9 వేల చ.కిమీ. పాకిస్తాన్ భూభాగం భారత్ ఆధీనంలో ఉంది. శాంతిస్థాపన కొరకు భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్తాన్ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో మధ్యన 1972 జూలైలో సిమ్లాలో శిఖరాగ్ర సమావేశం జరిగింది. భారత్ ఆధీనంలో ఉన్న భూభాగాన్ని తిరిగి పాకిస్తాన్‌కు ఇవ్వడానికి, బంధీలుగా ఉన్న పాకిస్తాన్ సైనికులను అప్పగించేందుకు అంగీకరించింది. అయితే బంగ్లాదేశ్‌ను 1973లో పాకిస్తాన్ గుర్తించిన తర్వాతనే యుద్ధ ఖైదీల అప్పగింత జరిగింది. బంగ్లాదేశ్ విముక్తి జరిగి నాలుగు దశాబ్దాలు గడచినా, నాటి గాయాలు ఇంకా మానలేదు. ఊచకోతకు, అత్యాచారాలకు బాధ్యులైన వారిని శిక్షించాలనే డిమాండు ఇంకా ప్రజల్లో బలంగా ఉంది.

ఈ పూర్వరంగంలో గత నాలుగు దశాబ్దాల బంగ్లాదేశ్ రాజకీయాలను, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుంటేనే గత ఫిబ్రవరి 5 నుండి షాబాగ్ స్క్వేర్ ప్రాంతంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యం అర్థమవుతుంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పొంది స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పుడు ముజిబూర్ రహమాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేది. బంగ్లాదేశ్‌లో క్రమంగా జాతీయ లౌకికవాదం నెలకొంది. బంగ్లాదేశ్ స్వతంత్ర సార్వభౌమాధికార దేశంగా ఆవిర్భవించిన అనంతరం బంగబంధు ముజిబూర్ రహమాన్ యుద్ధ నేరస్తులను న్యాయపరంగా శిక్షించడానికి 1973 జూలైలో అంతర్జాతీయ నేరాల (ట్రిబ్యునల్) చట్టాన్ని తీసుకొచ్చారు. పాకిస్తాన్ సైన్యంతో కుమ్మక్కైన మతతత్వ జమాత్ పార్టీని మరో నాలుగు గ్రూపులను నిషేధిస్తూ ముజిబూర్ 'అత్యవసర ఆదేశం' జారీ చేశాడు. అంతర్జాతీయ యుద్ధనేరాల ట్రిబ్యునల్ ద్వారా విచారణ జరపాలని ఉత్తర్వులిచ్చాడు. కాని కొద్దికాలానికి భౌగోళిక రాజకీయాల్లో భాగంగా, అమెరికా కుట్రల మూలంగా 1975లో బంగ్లాదేశ్‌లో సైనిక తిరుగుబాటు వచ్చింది. ముజిబూర్ హత్యకు గురయ్యాడు. పాకిస్తాన్ సైన్యంపై వీరోచిత పోరాటం చేసి, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న సైనికాధికారి జియావుర్ రహ్మాన్ అమెరికాకు పావుగా మారాడు. ఆయన అధికారం హస్తగతం చేసుకున్న వెంటనే అంతర్జాతీయ ట్రిబ్యునల్ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాడు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా అన్ని దేశాలలో తన వ్యతిరేక ప్రభుత్వాధి నేతలను కుట్రల ద్వారా హత్యచేసి, తనతొత్తు ప్రభుత్వాధి నేతను తెచ్చుకున్నట్లు బంగ్లాదేశ్‌లో కూడా సైనిక పాలన నెలకొల్పి దానికి అండగా నిలిచింది.

1975 నుంచి రజాకార్లు రాజకీయ పార్టీగా బంగ్లాదేశ్‌లో ఏర్పడ్డారు. 1986 నుంచి జామాత్ పార్టీ ఎన్నికల్లో పాల్గొంది. పార్లమెంటులో రెండు సీట్లు సంపాదించింది. బంగ్లా నేషనలిస్టు పార్టీ 2001–06 మధ్యకాలంలో బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్నప్పుడు జమాత్ పార్టీ కూడ అందులో భాగస్వామిగా ఉంది. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్ అనేక సంక్షోభాలు ఎదుర్కొంది. బంగ్లాదేశ్‌లో సైనికపాలన అంతమై ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిన తర్వాత రెండు పార్టీల వ్యవస్థ ఏర్పడింది. ముజిబూర్ రహమాన్ కుమార్తె షేక్ హసీనా నాయకత్వంలో బంగ్లా జాతీయ, లౌకికవాద శక్తులు ఉన్నాయి. మరో కూటమికి ఖలీదా బేగం (జియావుర్ రహ్మాన్ కుమార్తె) బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తుంది. ఈ కూటమిలో జమాతే ఇస్లామీ పార్టీ కూడా భాగస్వామిగా ఉన్నది. షేక్ హసీనా భారత్ అనుకూల నాయకురాలు కాగా, బంగ్లా నేషనలిస్టు పార్టీతో అనుబంధంగా ఉన్న మతతత్వ పార్టీలు దేశభక్తి, మతతత్వాన్ని రెచ్చగొడుతూ మరోవైపు సామ్రాజ్యవాద కార్పొరేట్ పెట్టుబడులకు కొమ్ముకాశాయి. 1992లో తాత్కాలిక ఆపధర్మ ప్రభుత్వం అవినీతి ఆరోపణ కింద హసీనాను, ఖాలీదాను జైలులో పెట్టింది. బంగ్లాదేశ్‌లో పాలకుల విధానాల వలన క్రమంగా రాజకీయ ఇస్లాం ప్రబలంగా వేళ్లూనుకుంది. మైనారిటీ హిందూ ప్రజానీకంపై మతతత్వ ముస్లింలు దాడులకు పూనుకోవడమే కాకుండా ఆధునిక లౌకిక భావాలున్న తస్లిమా నస్రీన్ వంటి ముస్లిం రచయితలపై కూడ దాడులు చేసే పరిస్థితికి బంగ్లాదేశ్ దిగజారింది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో లౌకిక తత్వం క్రమంగా కనుమరుగైంది.

బంగ్లాదేశ్ రాజకీయాలలో అనేక మార్పుల తరువాత – లౌకిక, జాతీయవాద శక్తులు బలోపేతం కావడం వల్ల విముక్తి ఉద్యమకారులపై ఊచకోత సాగించిన వారిని శిక్షించాలనే డిమాండ్ బలపడింది. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ఎన్నికల ప్రణాళికలో ఊచకోత దోషులను శిక్షిస్తామని వాగ్దానం చేసి 2008లో అధికారానికి వచ్చింది. దీనికి తోడు బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి వ్యతిరేకంగా సాగిన యుద్ధ నేరాలపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని అంతర్జాతీయ హక్కుల సంఘాల ఒత్తిడి నేపథ్యంలో ప్రస్తుత దేశ ప్రధాని షేక్ హసీనా ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఒత్తిడి పెరిగింది. హసీనా ఈ విచారణకు ప్రత్యేక ట్రిబ్యునల్‌ను 2010లో ఏర్పాటు చేసింది.

2010 మార్చ్ 26న అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ పునరుద్ధరించబడి, కార్యకలాపాలను ప్రారంభించింది. భాష, జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించిన మితవాద వామపక్ష భావాలు గల అవామీ లీగ్ పార్టీ 2009 నుంచి అధికారంలో ఉంది. వివిధ సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన హసీనా ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. దాంతో బంగ్లా నేషనలిస్టు పార్టీ, జమాతే ఇస్లామీ పార్టీ, ఇస్లామీ అయిక్య జోతె వంటి మతతత్వ పార్టీలు

బలపడదానికి ఆస్కారం ఏర్పడింది. బంగ్లాదేశ్‌లో లౌకిక జాతీయ వాదానికి, మతవాదానికి మధ్య విభజన రేఖ స్పష్టంగా ఏర్పడి, ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకున్నది. ఇందులో రాజకీయాలు, భారత అనుకూల, వ్యతిరేక భావనలు కలగలసి ఉన్నందున మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై విచారణను ఏవిధంగా చూడాలనే విషయమై హక్కుల సంఘాలలో కొంత గందరగోళం కూడ ఏర్పడింది. బంగ్లా ప్రజలు మాత్రం తమ సంతతిని హత్యచేసిన వారిని, మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారిని క్షమించే ప్రశ్నేలేదని నిర్భయంగా, నిస్సంకోచంగా చెబుతున్నారు. పాలకుల దాష్టీకాన్ని ప్రజలు మరచిపోరని, చరిత్రలో ఏదో ఒక రోజున ప్రతీకారం తీసుకుంటారనడానికి బంగ్లా ఉద్యమం నిదర్శనం.

మధ్యంతర ఆపద్ధర్మ ప్రభుత్వం 'చట్టవిరుద్ధం, ప్రజాస్వామిక సూత్రాలకు వ్యతిరేకం' అని బంగ్లా సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో అవామీ లీగ్ ప్రభుత్వం తనకున్న సంఖ్యాబలంతో రాజ్యాంగ సవరణ చేసి ఎన్నికలు జరిపించడానికి ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పాటు అవకాశం ఉన్న క్లాజును రద్దు చేసింది. ఖలీదా నాయకత్వంలోని బిఎన్‌పి పార్లమెంటు నుండి వాక్‌అవుట్ చేసింది. పార్లమెంటు ఎన్నికల ముందు తటస్థ మధ్యంతర ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా బంగ్లాదేశ్ రాజ్యాంగాన్ని తిరిగి సవరించాలని బంగ్లా నేషనలిస్టు పార్టీ పట్టుపట్టడం ప్రభుత్వ వ్యతిరేకతకు ఒక కారణం. బంగ్లా పార్లమెంటు ఎన్నికలు ఒక సంవత్సర దూరంలో ఉన్న ప్రస్తుత తరుణంలో బంగ్లా నేషనలిస్టుపార్టీ, దాని భాగస్వామ్య పక్షాలు ఆపద్ధర్మ ప్రభుత్వ ఏర్పాటు క్లాజును పునరుద్ధరించాలని డిమాండు చేస్తున్నాయి. ఖలీదా ఫిబ్రవరి మొదటి వారంలో అమెరికా వెళ్లివచ్చింది. ఆ తర్వాతనే బంగ్లాదేశ్‌లో ప్రతిపక్ష పార్టీ (బిఎన్‌పి) ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఆందోళనలు చేయడం గమనార్హం. అందుకు సమ్మెలు, రహదారి దిగ్బంధాలు, నిరసన ప్రదర్శనలు, విచ్చలవిడి హింసతో ఆ పార్టీల అనుచరులు చెలరేగి పోవడంతో పోలీసులు వందలాది మంది ప్రతిపక్షపార్టీ సభ్యులను, నాయకులను హింసా, దౌర్జన్యం, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం మొదలైన నేరారోపణలతో అరెస్టు చేశారు.

ఆనాడు పాకిస్తాన్ సైన్యానికి బంటుగా వ్యవహరించి, ఇప్పుడు ప్రతిపక్ష కూటమిలో భాగస్వామ్య పక్షమైన జమాతే ఇస్లామీకి ఉపాధ్యక్షుడుగా ఉన్న దెల్వార్ హుస్సేనీ సయ్యదీకి మరణ శిక్ష విధించిన నేపథ్యంలో గొడవలు జరుగుతాయని ఊహించిందే. కాని ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చాయి. విచారణ ఎదుర్కొంటున్నది పది మంది ప్రతిపక్ష రాజకీయ నాయకులే. వీరిలో ఏడుగురు జమాతే ఇస్లామీకి చెందిన వారే. అందువల్ల జమాతే ఇస్లామీతో పాటు మిగతా ప్రతిపక్షాలు కలసికట్టుగా ఆందోళనకు దిగినట్టు కనిపిస్తున్నది. హుస్సేనీ సయ్యదీపై ఒక కవి తలనరకడం, పదకొండేళ్ల అమ్మాయిపై అత్యాచారం, 344 మందిని హత్య చేయడం లాంటి నేరాలు ఉన్నాయి. సామూహిక హింస, అత్యాచారం, మారణకాండ తదితర నేరాలకుగాను జమాతే ఇస్లామీ పార్టీ ఉపాధ్యక్షుడు 73 ఏళ్ల దిల్వర్ హుసేనీ సయ్యదీకి బంగ్లాదేశ్ ప్రత్యేక యుద్ధ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాట సమయంలో హుసేన్ సయ్యదీ అనేక మందిని హత్య చేశాడనీ, అత్యాచారాలకు పాల్పడ్డాడనీ, హిందువులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చాడనీ, దోపిడీలు చేశాడనీ, గృహ దహనాలకు పాల్పడ్డాడనీ కోర్టులు నిర్ధారించాయి. అయితే, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అంటూ ఆయన అభిమానులు, అనుచరులు ఉత్తర బంగ్లాదేశ్‌లో అల్లర్లకు ఒడిగట్టారు. అంతకుముందే ఆ పార్టీకి చెందిన ఇద్దరు నేతలకు ట్రిబ్యునల్ మరణశిక్షలు విధించడంతో దేశంలో అతిపెద్ద రాజకీయ వివాదానికి తెర లేచింది. ట్రిబ్యునల్ తీర్పుకు నిరసనగా ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) కూడా ఈ సాధారణ సమ్మెలో పాల్గొంది. దాంతో ఆ దేశంలో పర్యటిస్తున్న భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో బిఎన్‌పి అధినేత బేగం ఖలీదా జియా భేటీని రద్దు చేసుకోవడం వివాదాస్పదమైంది. ప్రణబ్ బస చేసిన సోనార్‌గాన్ పాన్ పసిఫిక్ హోటల్‌కు అతి సమీపంలో ఉద్యమకారులు బాంబులు పేల్చి నిరసన వ్యక్తం చేశారు.

1971లో మూకుమ్మడి హత్యలు, బెంగాలీయులపై అత్యాచార ఘటనల్లో పాల్గొన్నందుకు 'బుచర్ ఆఫ్ మీర్‌పూర్'గా మారుపేరుతో పిలువబడే బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీ సహాయ కార్యదర్శి 64 ఏళ్ల ఖాదిర్ మొల్లాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ జీవిత ఖైదు విధించిన ఫిబ్రవరి 4 నుండి బంగ్లాదేశ్‌లో హింసాకాండ చెలరేగింది. ఇది ట్రిబ్యునల్ విధించిన రెండవ శిక్ష. మొదటగా, మరో జమాత్ నాయకుడికి మరణ శిక్ష విధించబడింది. ఆయన గైర్హాజరీలో విచారణ జరిగింది. కొంతకాలం క్రితం అతను పాకిస్తాన్ పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. 1971 యుద్ధంలో ఖాదిర్ మొల్లా చేసిన నేరానికి అతనికి కూడా ట్రిబ్యునల్ మరణశిక్ష విధిస్తుందని బంగ్లాదేశ్ ప్రజలు భావించారు. పై పెచ్చు, ఫిబ్రవరి నెల 4న సుప్రీం కోర్టు నుండి బయటకు వచ్చిన ఖాదిర్ బయట పొంచి ఉన్న మీడియా ప్రతినిధుల వైపు తిరిగి, చిరునవ్వు నవ్వి విజయ సంకేతం చూపారు. ఆయన హావభావాలు, 1971 యుద్ధ నేరాలకు, ఊచకోతలకు న్యాయం చేయాలని గత 42 ఏండ్లుగా డిమాండ్ చేస్తున్న బంగ్లాదేశ్ ప్రజల్లో సహజంగానే ఆగ్రహావేశాలను రేకెత్తించాయి.

బంగ్లాదేశీయుల ఉమ్మడి లక్ష్యమే షాబాగ్ స్క్వేర్ వద్దకు లక్షలాది మందిని చేర్చింది. లక్ష నుంచి ఐదు లక్షల బెంగాలీలు షాబాగ్ స్క్వేరు వద్దకు చేరుకున్నారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. విముక్తి పోరాట ఘట్టాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మొల్లాను ఉరితీయాలని, ఖలీదాను దేశద్రోహ నేరం కింద అరెస్టు చేసి విచారించాలని నినాదాలు చేశారు. వారి ఉమ్మడి డిమాండ్ బంగ్లా విముక్తి పోరాట కాలం నాటి నేరస్తులకు ఉరి, బాధితులకు న్యాయం. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం (21 ఫిబ్రవరి 2013) నాడు 1952 నాటి బెంగాలీ భాషా పరిరక్షణ ఉద్యమకారులను గుర్తు చేసుకుంటూ ఆరు అంశాల డిమాండ్ పత్రాన్ని విడుదల చేశారు. 1) వారం రోజులలోపు విముక్తి ఉద్యమంలో హత్యలకు పాల్పడిన జమాతే ఇస్లామీ శిబిరంలోని హంతకులను అరెస్టు చేయాలి. 2) మార్చ్ 26లోగా జామాతే పార్టీని యుద్ధ నేరస్తురాలుగా గుర్తించి నిషేధించే ప్రక్రియ మొదలు పెట్టాలి. 3) ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా జమాతే శిబిరానికి నిధులు సమకూరుస్తున్న వ్యక్తులనూ, సంస్థలనూ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 4) యుద్ధనేరాల విచారణ ట్రిబ్యునల్‌ను శాశ్వతంగా కొనసాగించాలి. 5) శాంతి భద్రతలు కాపాడడానికి, ప్రజలకు భద్రత కల్పించడానికి టెరర్రిస్టుల స్థావరాలను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని, వివరాలను మీడియా ద్వారా బహిరంగ పరచాలి. 6) మతోన్మాదాన్ని రెచ్చగొట్టే టెర్రరిస్టులను, సమర్థించే మీడియాను అదుపులో పెట్టాలి. ఈ డిమాండ్లకు స్పందనగా జామాతే ఇస్లామీ విద్యార్థి విభాగం 'ఇస్లాం చాత్ర శిబిర్' నిరసనకారులను

హత్య చేస్తామని బెదిరింపులు జారీ చేసింది. ఆత్మాహుతి దళాలతో బాంబులు వేస్తామని హెచ్చరించింది. మతోన్మాదులు ఫిబ్రవరి 22న షాబాగ్ వీథులన్నింటిని రక్తసిక్తంగా మార్చారు. దాదాపు వందమంది చనిపోయారు. ఫిబ్రవరి 24న జమాతే ఇస్లామీ పార్టీ, బంగ్లా నేషనలిస్టు పార్టీ మద్దతుతో బందు పాటించింది. ఆ రోజున హింస, విధ్వంసం పెచ్చరిల్లింది. చివరికి రాజీబ్ హైదర్ హత్యకు దారితీసింది.

ట్రిబ్యునల్ గత జనవరి 21న జమాత్ మాజీ సభ్యుడు అబ్దుల్ కలామ్ ఆజాద్‌కు మరణశిక్షను విధించింది. మరో తొమ్మిది మంది జమాత్ నాయకులపై విచారణ కొనసాగుతోంది. ట్రిబ్యునల్ జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పినప్పుడు, యుద్ధనేరస్తులందరికి మరణ శిక్ష విధించాల్సిందిగా డిమండ్ చేస్తూ షాబాగ్ స్క్వేర్ అనే ప్రాంతంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తీర్పు ఔదార్యంతో యువత ఆగ్రహానికి, అసహనానికి గురైంది. హత్యానేరాల నుండి జమాత్ బయటపడటం పట్ల వారు ఆగ్రహోద్రులయ్యారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఉద్యమాన్ని, ప్రజాతిరుగుబాటును ఆ నేపథ్యంలో చూడవలసి ఉంటుంది. ఎందుకుంటే మొల్లా మీద 300కు పైగా ఆరోపణలు దాఖలయ్యాయి. వందలాది మంది మహిళల మీద బహిరంగంగానే అత్యాచారాలు జరగడానికి ప్రధాన కారకుడుగా కూడా ఆధారాలున్నాయి. అటువంటి నేరస్తుడిని జీవిత ఖైదుతో వదిలేయడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. దేశంలోని 12 మతపరమైన రాజకీయ పార్టీలు ఈ నిరసనలో పాల్గొన్నాయి. ఈ నిరసనల్లో పాల్గొన్న అహ్మద్ రజీబ్ హైదర్ అనే నాస్తికవాది ఒక బ్లాగ్ ద్వారా కూడా తన నిరసనను తెలిపాడు. ఆ బ్లాగుకు వేలాది మంది నుంచి మద్దతు లభించింది. ఆ బ్లాగును రాసిన హైదర్‌ను జమాత్ మద్దతుదారులు కొందరు దారుణంగా హతమార్చారు. దాంతో రెండు పక్షాలు చేస్తున్న నిరసనలు క్రమంగా హింసాత్మకంగా పరిణమించాయి. వచ్చే ఏడాది జనవరిలో పార్లమెంటరీ ఎన్నికలు జరగబోతున్న పరిస్థితుల్లో దేశంలో ఈ అల్లర్లు మరింత పెట్రేగే అవకాశం ఉందని చెపుతున్నారు.

ట్రిబ్యునల్‌లో విచారణ ఎదుర్కొంటున్న వాళ్లు ప్రతిపక్షంలో ఉండడం వల్ల ఆందోళనలు చెలరేగుతున్నాయి. ప్రజల సంపూర్ణ మద్దతు మాత్రం షేక్ హసీనాకు ఉంది. జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్ విముక్తిని వ్యతిరేకించినట్లు బాహాటంగానే అంగీకరిస్తుంది. అయితే ఊచకోతలో తమ పాత్ర లేదని అంటున్నది. మతవాద శక్తులు ప్రతిపక్ష బంగ్లా నేషనలిస్టు పార్టీకి బాసటగా నిలుస్తున్నాయి. మరోవైపు జీవిత శిక్షకు బదులు ఉరి శిక్షలు వేయాలని ప్రజానిరసనలు వెల్లువెత్తాయి. 1971 నాటి యుద్ధ నేరస్తులను ఉరితీయాలన్న డిమాండ్‌పై సామాజిక ఉద్వేగాల ప్రభావం ఉన్నప్పటికీ చారిత్రకంగా ఉత్పన్నమైన స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా న్యాయస్థానాలు వ్యవహరించాలి. ఉరి అమానవీయమైనదన్న చర్చ మాట ఎలా ఉన్నా స్వాతంత్ర్య పోరాట కాలంనాటి యుద్ధ నేరస్తుల విచారణ అనేది ఒక జాతీయ సమస్య. అలాంటి అంశం సంకుచిత రాజకీయ వివాదంగా మారడం దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రణబ్ పర్యటన బంగ్లాదేశ్‌లో సాగుతున్నప్పుడే ఈ ఆందోళనలు సాగడం వల్ల భారత్ సందిగ్ధంలో పడింది. ఆందోళనను సమర్థించలేక, ఖండించలేక సతమతమయింది. ఇరుగు పొరుగు దేశాలతో భారత్ పాత్ర ఇప్పటికే వివాదాస్పదమైంది. అమెరికా అనుకూలంగా వ్యవహరిస్తుందని పొరుగు దేశాలు గ్రహించాయి. బంగ్లాదేశ్ సమాజంలో మత వైషమ్యాలు నింపాలనే అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను అక్కడి ప్రజలు, లౌకిక శక్తులు, వారి అండతో హసీనా ప్రభుత్వం తిప్పికొట్టగలదని ఆశిద్దాం.

బంగ్లాదేశ్‌లో ప్రజాగ్రహం నివురుగప్పిన నిప్పులా ఉందనడంలో సందేహం లేదు. షాబాగ్ ఉద్యమానికి వ్యతిరేకంగా జమాత్ కూడా ఆందోళన చేస్తోంది. సంఘర్షణ వాతావరణం అంతర్యుద్ధం అంచుకు నెట్టబడింది. విముక్తి యుద్ధ నేరస్తులకు ఉరిశిక్షలు వేయాలని, లౌకిక రాజకీయ వ్యవస్థ పునరుద్ధరణ కొరకు 1971 తర్వాత పుట్టిన వారు అధికంగా ఉద్యమంలో పాల్గొంటున్నారు. వీరు రాజకీయ పంథాలు, గుర్తింపులకు అతీతంగా వ్యవహరించే 'వంగ గణ జాగరణ్ మంచ్' ను ఏర్పాటు చేయడం ద్వారా యువత నూతన చరిత్రను సృష్టిస్తుంది. అత్యంత ప్రమాదభరితమైన జమాత్, దాని అనుబంధ సంస్థలతో తలపడడానికి అపార శక్తిసామర్థ్యాలను వారు ప్రదర్శిస్తున్నారు. అయితే మరోవైపు దేశాన్ని తిరిగి సైనిక పాలనలోకి తీసుకవెళ్లాలని సామ్రాజ్యవాద దన్నుతో మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయి. అయితే బంగ్లాదేశ్ గత చరిత్ర దృష్ట్యా మతోన్మాదవాద, సామ్రాజ్యవాద శక్తులపట్ల షాబాగ్ ఉద్యమకారుల నిరంతర అప్రమత్తత, ప్రజా ఉద్యమ నిర్మాణమే లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థ పునరుద్ధరణకు రక్షణగా నిలుస్తుంది. ఈ ఉద్యమ విజయం ప్రభావం మతోన్మాద ఛాందసవాదం, ఉగ్రవాదం అస్తిత్వంలో ఉన్న దక్షిణాసియాపై కూడా ఉంటుంది. ముస్లిం జనాభా అధిక సంఖ్యలో ఉన్న ఒక దేశం ప్రజాస్వామ్యం, లౌకిక రాజకీయ వ్యవస్థ కొరకు పోరాడడం అసాధారణమైంది. ఈ ప్రజా ఉద్యమానికి ప్రపంచ ప్రజాస్వామిక వాదులు సంఘీభావం తెలుపడం చారిత్రక అవసరం.

*(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి)* వీ

**రాబోయే సంచికలలో...**

- **మహిళలపై ప్రపంచీకరణ ప్రభావం - తోట జ్యోతిరాణి**
- **నగదు బదిలీ పథకం - సూరి**
- **చత్తీస్‌గడ్‌లో పెట్టుబడులు - అభివృద్ధి - బూటకం - విశ్వం**
- **భూమి వేట - కాకినాడ సెజ్ - హేమా వెంకట్రావ్**
- **గల్ఫ్ బాధితులు - ఒక అధ్యయనం - బి.వి.ఎన్. స్వామి**
- **డా. కేశవరెడ్డి నవలల్లో రైతు - వలస పాలన - భూస్వామ్యం - ఎస్. జగన్‌రెడ్డి**

# విదేశీ శక్తులకు బంగారు బాతు రక్షణ రంగం

***దేశ బడ్జెట్‌లో అధికశాతం వాటా పొందుతున్న రక్షణ శాఖలో అక్రమాల చరిత్ర ఇప్పటిది కాదనీ, 1947 నాటి నుంచే కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయనీ అంటున్నారు* పి.వి. రమణ**

రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర ఉన్నతస్థాయి నాయకులు ప్రయాణించడానికి అవసరమైన హై సెక్యూరిటీ హెలికాప్టర్‌ల కొనుగోలు కోసం కేంద్ర ప్రభుత్వం ఇటలీకు చెందిన ఫిన్‌మెక్కానికా అనే కంపెనీతో ఒప్పందం చేసుకుంది. ఒక్కొక్కటి 300 కోట్ల రూపాయల విలువగల 12 అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టలు సరఫరా చేయాలి. వీటి మొత్తం విలువ రు. 3600 కోట్లు. ఇప్పటి వరకు మూడు హెలికాప్టర్‌లు మన దేశానికి వచ్చాయి. ఇంకో తొమ్మిది రావలసి ఉంది. కాని మొత్తం విలువలో ముప్పై శాతం సొమ్ము చెల్లింపులు జరిగిపోయాయి. భారత రక్షణ శాఖకు చెందిన ఈ ఒప్పందంలో దాదాపు 362 కోట్ల రూపాయలు లంచాలుగా చెల్లించినట్టు వెల్లడయింది. అంటే మొత్తం విలువలో పది శాతం. మొత్తం కుంభకోణంలో మన దేశ రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, దేశ రక్షణ అధికారులు, పాలనా యంత్రాంగంలో అన్ని శాఖల భాగస్వామ్యమున్నట్లు తెలుస్తుంది.

ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో ప్రధాని, రక్షణ మంత్రి, రాష్ట్రపతి, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులు సియాచిన్ లాంటి ఎత్తైన, దూర ప్రాంతాలకు, ఆరు వేల మీటర్ల ఎత్తు వరకు ఎగిరే ప్రత్యేకమైన హెలికాప్టర్‌లు అవసరమనే ప్రతిపాదన 2002లో అప్పటి రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండిజ్ చేశారు. అప్పుడే టెండర్ల నిబంధనల్ని ఖరారు చేసి గ్లోబల్ టెండర్స్‌ను పిలవడానికి నిర్ణయించారు. కాని ఆరు వేల మీటర్ల ఎత్తున ప్రయాణించే హెలికాప్టర్‌లు ఫ్రాన్స్‌కు చెందిన యూరోకాప్టర్ కంపెనీ ఒక్కటే తయారు చేయగల సామర్థ్యం కలిగి ఉంది. ఒకే కంపెనీ నుండి రక్షణ సామగ్రి కొనుగోలు చేయడం నిబంధనలకు వ్యతిరేకమని, ఆనాటి జాతీయ భద్రతా సలహాదారు బ్రిజేష్ మిశ్రా జోక్యం చేసుకొన్నారు. 2003, నవంబర్ 19న ప్రధాని వాజ్‌పేయిని కలిసి, మిగతా కంపెనీలు పాల్గొనేందుకు వీలుగా, ఆపరేషన్ సీలింగ్‌ను ఆరు వేల మీటర్ల ఎత్తు నుండి ఐదు వేల మీటర్ల ఎత్తుకు తగ్గించడానికి ఒప్పించారు.

ఆపరేషన్ సీలింగ్ మార్పులతో 2006, సెప్టెంబర్ 27న గ్లోబల్ టెండర్స్‌ను పిలిచారు. అమెరికాకు చెందిన సీకోర్స్కి, రష్యాకు చెందిన రోసో బోరోనెక్స్‌పోర్ట్‌లతో పాటు అగస్టా వెస్ట్‌లాండ్స్ కూడా ఈ టెండర్లలో పాల్గొన్నారు. చివరకు రక్షణ శాఖ అవసరాలకు తగ్గ ప్రమాణాలు అగస్టా వెస్ట్‌లాండ్స్ హెలికాప్టర్‌కున్నాయని తేల్చారు. భద్రతా వ్యవహారాలపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం అంగీకారం తెలపడంతో ఫిబ్రవరి 2010లో అగస్టా కంపెనీతో ఒప్పందం జరిగింది.

ఎప్పటిలాగానే ఈ హెలికాప్టర్ల ఒప్పందాలలో బయటపడిన లంచాల వ్యవహారం మన దేశ నిఘా సంస్థల వలన బయటపడలేదు. మనకు హెలికాప్టర్లను సరఫరా చేసిన అగస్టా వెస్ట్‌లాండ్ కంపెనీ ఇటలీకి చెందిన ఫిన్‌మెక్కానికాకు అనుబంధ సంస్థగా ఉంది. ఇటలీలో ఎన్నికలు జరగబోతున్న సమయంలో ఈ ఫిన్‌మెక్కానికా 'లిగానార్డ్' అనే రాజకీయ పార్టీకి ఎన్నికల నిధులు అందజేస్తుందని తెలిసి అక్కడి ప్రభుత్వం ఆ సంస్థ ఆయుధాల అక్రమ వ్యాపారంపై కేసు పెట్టి విచారణ ప్రారంభించింది. ఇటలీలో బడా కంపెనీలు, మాఫియా, ప్రభుత్వాల మధ్యగల అపవిత్ర కలయిక మరోసారి రుజువయింది. ఫిన్‌మెక్కానికా ముఖ్యాధికారి లారెంజో బొర్గోన్నిని అరెస్టు చేసారు. అతను శిక్షను తగ్గించుకోవడానికి రహస్యాలన్నీ చెప్పేస్తానని ఒప్పుకున్నాడు. అతను చెప్పిన వివరాల ప్రకారం బ్రిటన్‌కు చెందిన క్రిష్టియన్ మైఖేల్, స్విట్జర్లాండ్‌కు చెందిన గూడోరాల్ఫోహస్కీ, కార్లో గెరిసో, ఫిన్‌మెక్కానికా సిఇఒ గుసెపె ఓర్సి, మన దేశానికి చెందిన మాజీ వైమానిక దళాధిపతి శశీంద్రపాల్ త్యాగి, అతని సోదరులు జూలియా, డొక్టో, సందీప్‌లున్నారు. ఫిన్‌మెక్కానికా సిఇఒ ఓర్సిని, అగస్టా వెస్ట్‌లాండ్ సిఇఒ బ్రూనో స్పోగ్నో వినిలను కూడా ఇటలీ ప్రభుత్వం అరెస్టు చేసింది.

ఫిబ్రవరి 12న ఈ కుంభకోణం గురించి ఇటలీలో బయటపడిన వెంటనే మన ప్రభుత్వం మేల్కొని విచారణ జరిపి దోషులెవర్నీ వదిలేది లేదని గంభీరంగా ప్రకటించింది. సిబిఐతో విచారణ ప్రారంభించారు. వివరాల కోసం సీనియర్ జాయింట్ సెక్రటరీ అరుణ్‌కుమార్ బార్, సిబిఐ అధికారి మహిపాల్ యాదవ్‌తో పాటు ఒక బృందం ఇటలీకి వెళ్లింది. పదిమంది రాజ్యసభ, ఇరవై మంది లోక్‌సభ సభ్యులతో, అందులో ఎక్కువ మంది ప్రతిపక్షాలకు చెందినవారితో ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి, నిజనిర్ధారణ నివేదికను మూడు నెలలలో సమర్పించాలని ప్రకటించారు. దశాబ్దాల తరబడి నిరంతరం జరుగుతున్న భారీ కుంభకోణాల్లో సిబిఐ గాని, జాయింట్ పార్లమెంటరీ కమిటీలు గాని ఏపాటి నిజాల్ని బయటపెట్టాయో, ఎంతమందిని శిక్షించాయో ప్రజలకు తెలుసు. అందుకే ఈ కంటి తుడుపు చర్యల మీద ఎవరికీ నమ్మకాలు లేవు. నేరస్తులే అధికారంలో ఉన్నప్పుడు వారిని శిక్షించే దమ్ములు ఎవరికుంటాయి.

## సంవత్సరం క్రితమే తెలిసినా పట్టించుకోని ప్రభుత్వం

అంతర్జాతీయ రక్షణ పరికరాల ఏజెంట్ సి. ఎడ్మాండ్స్ అలెన్ మార్చి 2012లో రక్షణమంత్రి ఆంటోనికి ఒక మెయిల్ పంపాడు. దానితో పాటు మన దేశ రక్షణ రంగానికి సంబంధించిన ఎనిమిది రహస్య మిలిటరీ డాక్యుమెంట్స్‌ను జతపరిచాడు. వాటిలో రిసెర్చ్ అండ్

అనాలిసెస్ వింగ్ కొరకు పరిశీలనా ఎయిర్ క్రాఫ్ట్‌లు, భారత నేవీ కొరకు సబ్ మెరైన్‌లు, అగస్టా హెలికాప్టర్‌లు, భారత వైమానిక దళం కొరకు రక్షణ సామగ్రిల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలన్నీ ఆ రహస్య డాక్యుమెంట్లలో ఉన్నాయి. దీనిపై న్యూయార్క్ నుండి మాట్లాడుతూ 'సంబంధిత దోషుల్ని పట్టుకోవడానికి, ముడుపులకు సంబంధించిన వివరాలన్నీ ఇచ్చాను. కాని ఇటలీలో పరిశోధన ప్రారంభమయ్యే వరకు భారత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారో అర్థం కావడం లేదు' అని అలెన్ అన్నాడు.

గత నవంబర్‌లోనే అగస్టా కుంభకోణంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధముందని ఇటలీకి చెందిన 'లింటారా 43' అనే పత్రిక ప్రకటించింది. ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర వహించిన ముగ్గురి గురించి వివరంగా తెలిసింది. వారు బ్రిటన్‌కు చెందిన ఆయుధాల బ్రోకర్ క్రిష్టియన్ మైఖేల్, అంతర్జాతీయ ఆయుధ వ్యాపారి గూడోరాల్ఫ్ హస్కే, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ కుడిభుజం కనిష్కసింగ్‌లు. గత నవంబర్‌లోనే ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ వారు అగస్టా కుంభకోణం గురించి రక్షణశాఖకు హెచ్చరికలు చేసినా స్పందించలేదు.

### కుంభకోణంలో పాత్రధారులు

ఫిన్‌మెక్కానికా సిఇఒ గుసెపె ఓర్సి, అగస్టా వెస్ట్‌లాండ్ సిఇఒ బ్రూనో స్పాగ్నోలిని లిద్దరు కాంట్రాక్టు తమకు వచ్చేలా చేస్తే కొనుగోలు మొత్తంలో పది శాతం కమిషన్ ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇటాలియన్ దర్యాప్తు అధికారుల ప్రకారం కాంట్రాక్టు కోసం అన్ని రకాల అడ్డదారులు తొక్కారు. మాజీ వైమానిక దళాధిపతి ఎస్.పి. త్యాగిని బుట్టలో పడేయడానికి డబ్బు, అమ్మాయిలు, కుటుంబ సంబంధాలు కూడా ఉపయోగించారని తెలుస్తుంది.

గూడోరాల్ఫ్ హస్కే, కార్లో గెరిసోలిద్దరూ అంతర్జాతీయ ఆయుధ వ్యాపారంతో పాటు మధ్యవర్తులుగా కూడా వ్యవహారాలు సాగిస్తారు. అగస్టా స్కాములో వీరిద్దరూ కీలకపాత్రదారులు. హస్కేకి భారత రక్షణరంగ అధికారులతో మంచి సంబంధాలున్నాయి.

ఇప్పటికే పీకలలోతు అవినీతి వివాదాల్లో చిక్కుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మార్ - ఎంజిఎఫ్ సంస్థకు 2009 సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు మూడు నెలల పాటు హస్కే డైరెక్టరుగా వ్యవహరించాడు. ఎమ్మార్ డైరెక్టర్‌గా హస్కే ప్రారంభించిన ట్రస్టుకు వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఎనిమిది వందల ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించాడు. ఆ ట్రస్టుకు వై.ఎస్. అల్లుడు బ్రదర్ అనిల్‌కుమార్ ట్రస్టీగా ఉన్నాడు. ఈ సంబంధాల కారణంగానే దేశంలో మొట్టమొదటి అగస్టా హెలికాప్టర్‌ను 65 కోట్ల రూపాయలకు వై.ఎస్. హయాంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ హెలికాప్టరే ఈ మధ్య కాలిపోయింది. హస్కే కారణంగానే కామన్‌వెల్త్ గేమ్స్ విలేజ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన భారీ కాంట్రాక్టు ఎమ్మార్ - ఎంజిఎఫ్‌కు దక్కింది. కామన్‌వెల్త్ కుంభకోణం బయటపడగానే 2009లో ఎమ్మార్ డైరెక్టర్‌గా హస్కే రాజీనామా చేశాడు. ఐడిఎస్ ఇండియా, ఐడిఎస్ టునిసియా అనే రెండు దొంగ కంపెనీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అగస్టా వెస్ట్‌లాండ్ తీసుకొన్న 155 కోట్ల రూపాయలు భారత్‌కు చేరవేశాడు.

కార్లో గెరిసో కలకత్తాకు చెందిన నర్బేరమ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించాడు. మన రాష్ట్రంలో క్రిష్టియన్ మిషనరీ సంస్థ అయిన ఆర్బోర్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు డైరెక్టర్‌గా పనిచేశాడు. పేదరిక నిర్మూలన, మహిళల, చిన్నారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ ఆర్బోర్ సంస్థ ద్వారానే అగస్టా స్కాం ముడుపుల సొమ్ము రు. 360 కోట్లు బదిలీ అయినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్ హయాంలో ఆర్బోర్ సంస్థకు పెద్ద తండా నుండి పోలేపల్లి వరకు పెద్దఎత్తున భూములు కేటాయించారు. 2008లో ఆర్బోర్ ఫౌండేషన్ డైరెక్టర్‌గా చేరిన గెరిసో హెలికాప్టర్‌ల ఒప్పందం కుదిరిన నెల తర్వాత అంటే మార్చ్ 2010న పదవి నుండి తప్పుకొన్నాడు.

దుబాయ్‌లో గ్లోబల్ ట్రేడ్ అండ్ కామర్స్ నడుపుతూ అగస్టా వెస్ట్‌లాండ్ సంస్థకు సలహాదారుగా క్రిష్టియన్ మైఖేల్ రక్షణ రంగ కొనుగోళ్లలో మధ్యవర్తిగా పనిచేశాడు. 2000లో భారత వైమానిక దళానికి 55 వేల కోట్ల రూపాయలు విలువ చేసే 'మిరేజ్' విమానాల కొనుగోలు టెండర్ 'ద సాల్ట్' కంపెనీకి దక్కడంలో కీలక పాత్ర వహించాడు. ఇతని తండ్రి వుల్ఫ్‌గాంగ్ మాక్స్ రిచర్డ్ అంతర్జాతీయ ఆయుధ వ్యాపారి. 1980-90ల్లో కాంగ్రెస్ పార్టీకి సన్నిహితంగా ఉండేవాడు. ఆ సంబంధాలతోనే ఆయన కొడుకు మైఖేల్ భారత రాజకీయ నాయకులకు దగ్గరయ్యాడు. రక్షణరంగంలో అతనికి తెలియని వారు లేరు. అందుకే అగస్టా ఒప్పందం దక్కేలా చేస్తానని ఫిన్‌మెక్కానికా సిఇఒ ఓర్సికి అగస్టా సిఇఒ బ్రూనోకు హామీ ఇచ్చాడు. ముడుపుల కోసం వారు అతనికి 217 కోట్ల రూపాయలు ముట్టచెప్పారు. ఆ సొమ్ములో నుంచే మొదటి విడతగా త్యాగి సోదరులకు 72 లక్షల రూపాయలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

దేశంలో అత్యంత శక్తిమంతమైన నాయకులు వంద మందిలో 31వ స్థానంలో ఉన్న 37 సంవత్సరాల కనిష్కసింగ్ రాజీవ్‌గాంధీకి అత్యంత సన్నిహితుడు. ఈయన తండ్రి ఎన్‌కె సింగ్ ఐఎఫ్ఎస్ అధికారిగా పనిచేశారు. ఎంజిఎఫ్ సంస్థ ప్రమోటర్ అయనే. కనిష్కసింగ్ కారణంగానే యుపిఎ ప్రభుత్వం కామన్‌వెల్త్ గేమ్స్ టెండర్లను ఎమ్మార్-ఎంజిఎఫ్‌కు కట్టబెట్టింది. ఆయన తల్లి మంజు రాజస్థాన్ మాజీ గవర్నర్. కనిష్కసింగ్ వాల్‌స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులో, వరల్డ్ బ్యాంక్‌లోనూ పనిచేసి భారత్‌కు తిరిగి వచ్చేశాడు. రాహుల్ గాంధీకి సన్నిహితుడిగా మారాడు. 2004లో రాహుల్ అమేథీలో పోటీ చేసినప్పుడు ఎన్నికల వ్యూహం ఇతనిదే. చాలా మంది రాజకీయ నాయకులకు పదవులిప్పిస్తుంటాడు. ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, అసెంబ్లీ ఎన్నికల్లో చాలామందికి ఈయనే టిక్కెట్లు ఇప్పించాడు. అగస్టా కుంభకోణంలో కనిష్కసింగ్‌కు సంబంధముందని ఇటలీ పత్రికలు ప్రకటించాయి.

మారిషస్‌లో ఉన్న అట్లాస్ ఇంటరాక్టివ్ లిమిటెడ్ కంపెనీ అధిపతి, అభిషేక్ వర్మ మాజీ ఎంపి కొడుకు. ప్రస్తుతం వర్మ, అతని భార్య రక్షణ రంగం రహస్యాలు దొంగిలించి అమ్ముకుంటున్నారని, రక్షణ రంగ సంస్థల నుండి లంచాలు తీసుకున్నారనే అభియోగాల మీద అరెస్టు కాబడి ప్రస్తుతం జైల్లో ఉన్నారు. అగస్టా కుంభకోణంలో గాంటన్ లిమిటెడ్ కంపెనీ ద్వారా వర్మ పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

దేశ రక్షణ కొరకు అత్యంత కీలకమైన పదవిలో ఉంటూ పవిత్రుడిగా

ప్రచారం పొందిన మాజీ వైమానిక దళాధిపతి శశేంద్ర పాల్ త్యాగి ముడుపులతో సంబంధం లేదంటూనే మధ్యవర్తులతో తన కార్యాలయం లోనే మాట్లాడినట్లు ఒప్పుకున్నారు. 2005లో ఇటలీ అధ్యక్షుడు కార్లో సియాపీ భారత్‌లో పర్యటించారనీ, ఆ తర్వాత ఫిన్‌మెక్కానికా ప్రతినిధులు త్యాగీతో భేటీ అయ్యేలా చేసానని హస్కీ ఇటలీ కోర్టులో తెలిపాడు. ఇటలీ కోర్టులో మరో డాక్యుమెంటు ప్రకారం అగస్టా సలహాదారుగా ఉన్న మైఖేల్, ఎస్‌పి త్యాగి కోసమే 72 లక్షల లంచాన్ని అతని సోదరుల కిచ్చినట్లు తెలుస్తుంది. ఆ తర్వాతే హెలికాప్టర్ల కొనుగోలు విషయంలో 2006 మార్చిలో కొత్త నిబంధనలతో అగస్టాకు అనుకూలంగా పరిస్థితి మారింది.

ఇంకో ఏరోమాట్రిక్స్ ఇన్ఫో సొల్యూషన్స్ సిఇఒ ప్రవీణ్ బక్షి, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ బగ్రాడియా సోదరుడు, ఐడిఎస్ ఇన్ఫోటెక్ ఛైర్మన్ సతీష్ బగ్రాడియా, మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ కె. అగర్వాల్, హస్కీకి లీగల్ అడ్వైజర్, అడ్వకేట్ గౌతమ్ ఖైతాన్‌లు కూడా అగస్టా ముడుపుల కుంభకోణంలో పాత్రధారులే. హస్కీ దగ్గర దొరికిన పత్రాల ప్రకారం హెలికాప్టర్‌ల ఫ్లైట్ ట్రయిల్స్‌ను పర్యవేక్షించే ఆర్మీ బ్రిగేడియర్ యాభై లక్షల డాలర్లు లంచం అడిగినట్లు తెలుస్తుంది. హెలికాప్టర్ ఫీల్డ్ ట్రయిల్స్ బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ జరిగాయి. భారతదేశ వాతావరణంలో ఎగరగలగాలంటే ఇక్కడ పరీక్షలు జరపాల్సింది పోయి విదేశాల్లో పరీక్షలు జరపడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారత రక్షణ శాఖ, నేవీ, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌లన్నీ చర్చించిన తర్వాత కేవలం ముఖ్యుల కోసం మొదటి ఎనిమిది హెలికాప్టర్‌లను కొనాలని నిర్ణయించారు. దాని తరువాత నాలుగు అదనంగా చేర్చారు. ఇంత ఖరీదైన హెలికాప్టర్‌లను అదనంగా కొనాలనుకోవడం పై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## అగస్టా, ఫిన్‌మెక్కానికా మధ్య సంబంధాలు

1985 నుండే అగస్టా వెస్ట్‌లాండ్ వ్యవహారాలు మన దేశంలో నడుస్తున్నాయి. అప్పటి బ్రిటన్ ప్రధాని మార్గరెట్ థాచర్ ఒత్తిడితో నిపుణుల సలహాలను కూడా లెక్క చెయ్యకుండా ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ 21 వెస్ట్‌లాండ్ హెలికాప్టర్‌లను స్వీకరించారు. వాటి విలువ 65 మిలియన్ పౌండ్లు. బ్రిటన్ సహాయ నిధి నుండి ప్రత్యేకంగా ఈ హెలికాప్టర్‌లను కొనడానికి ఇచ్చారు. అప్పటికి వెస్ట్‌లాండ్ కేవలం బ్రిటన్‌కు చెందిన కంపెనీగా ఉంది. నిపుణులు హెచ్చరించినట్లుగానే ఆగస్టు 1988, తర్వాత ఫిబ్రవరి 1989లలో రెండు హెలికాప్టర్‌లు కూలిపోయి పది మంది ప్రయాణికులు మరణించారు. సాంకేతికంగా అధ్వాన్న స్థాయిలో, భద్రతాపరంగా ప్రమాదకరమైన స్థాయిలో ఉన్న వాటిని నడపడానికి పైలెట్లు భయపడేవారని అప్పటి పరిశీలకులు చెప్పారు. అప్పటికి వెస్ట్‌లాండ్ కంపెనీ ఆర్థికంగా తీవ్ర సమస్యల్లో కూరుకు పోయి ఉంటే దాన్నించి బయటపడవేయడానికి ఆ దేశ ప్రభుత్వం సహాయం పేరుతో ప్రమాదకరమైన హెలికాప్టర్‌లను మనకు అంటగట్టారు.

అనేక మంది నిపుణుల పరీక్షల తర్వాత, భద్రతా కారణాల దృష్ట్యా వీటిని 1991లో సర్వీసు నుండి రద్దు చేసారు. 1993లో వీటిని అమ్మడానికి గ్లోబల్ టెండర్స్‌ను పిలిస్తే, బ్రిటన్‌కు చెందిన ఐఇఎస్ ఏరోస్పేస్ కంపెనీకి కేవలం తొమ్మిది లక్షల పౌండ్లకు అమ్మేశారు. వెస్ట్‌లాండ్ కంపెనీ 2000లో ఇటలీకి చెందిన ఫిన్‌మెక్కానికా సంస్థలో విలీనమయింది. 2008లో వై.ఎస్. హయాంలో అగస్టా హెలికాప్టర్‌ను 65 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశారు. జనవరిలో జరిగిన అగ్ని ప్రమాదంలో అది కాలిపోయింది.

2009లో ఢిల్లీ పోలీసుల కోసం హెలికాప్టర్ల సరఫరా చేసే వ్యవహారంలో అగస్టా వెస్ట్‌లాండ్ కంపెనీ న్యూయార్క్‌లో ఉన్న గాంటన్ లిమిటెడ్ కంపెనీకి సహాయం చేయమని కోరింది. హెలికాప్టర్ కొనుగోళ్లలో 8 శాతం, స్పేర్‌పార్ట్స్ కొనుగోళ్లలో 15 శాతం ముడుపులు చెల్లించడానికి సిద్ధమయ్యారు. గాంటన్ కంపెనీ ప్రెసిడెంట్ ఆలెన్. ఇతనే రక్షణమంత్రి ఆంటోనీకి అగస్టా కుంభకోణాల గురించి మెయిల్ పంపాడు. మన దేశంలో ఫిన్‌మెక్కానికా హస్తం 1970ల నుండే ఉంది. భారత నేవీదళానికి అప్పుడు 41 సీలింగ్ హెలికాప్టర్‌లను సరఫరా చేశారు. ప్రభుత్వరంగ సంస్థలైన బిఎచ్ఇఎల్, బిఇఎల్, భారత్ డైనమిక్స్, ఎచ్ఎఎల్‌లతో పాటు టాటా కంపెనీలతో కూడా నాటి నుండి భాగస్వామ్యముంది.

## రక్షణ రంగంలో కుంభకోణాలు

1948లో బ్రిటన్ నుండి 155 జీపుల్ని 80 లక్షల రూపాయలకు కొన్నారు. వీటి కోనుగోళ్లలో భారీగా లంచాలు చేతులు మారాయనీ, అప్పటి బ్రిటన్ హైకమిషనర్‌గా పనిచేసిన వికె కృష్ణమీనన్ సహకారంతోనే ఇవి జరిగాయని ఆరోపణలు వచ్చాయి.

1980లో జర్మనీ నుండి ఆరు ఎచ్‌డిడబ్ల్యు సబ్‌మెరైన్‌లు 420 కోట్ల రూపాయలకు కొన్నారు. వీటిలో 7 శాతం లంచాల రూపంలో తీసుకొన్నారని ఆరోపణలు వచ్చాయి. అప్పటి అడ్మిరల్ ఎస్.ఎమ్. నందాను సిబిఐ ప్రశ్నించింది.

1986లో స్వీడన్ నుండి నాలుగు వందల హోవిట్జర్ శతఘ్నులు బోఫోర్స్ కంపెనీ నుండి కొనుగోళ్లు చేసిన వ్యవహారంలో 64 కోట్ల రూపాయలు లంచాలు తీసుకొన్నట్లు రుజువయింది.

1999 నుండి 2005 వరకు దక్షిణ ఆఫ్రికా సంస్థ డానెల్ నుండి కొనుగోలు చేసిన 700 ఆంటీ మెటీరియల్ రైఫిల్స్ వ్యవహారంలో 12.75 శాతం లంచాలు చెల్లించారు.

2000లో ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ నుండి 1600 కోట్ల రూపాయల విలువచేసే 200 బారక్-1 డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్ కొనుగోళ్లలో ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు రావటంతో సిబిఐ కేసు నమోదు చేసింది.

అర్జున్ యుద్ధ ట్యాంకుల విడిభాగాల సరఫరాలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. దాంట్లో రాజకీయ నాయకులు, రక్షణశాఖ అధికారులతో పాటు, ముంబైకి చెందిన వ్యాపారి సుబీమల్లీల ప్రమేయం ఉన్నట్లు తేలింది. త్రిసూర్‌లోని స్టీల్ అండ్ ఇండస్ట్రియల్ ఫోర్జింగ్స్ లిమిటెడ్, మైసూరుకు చెందిన ఎఎండబ్ల్యు - ఎజిఎం సంస్థలతో పాటు మెదక్ జిల్లా, ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ వికె పాండేకు భాగస్వామ్యమున్నట్లు తెలుస్తుంది. సుబీమల్లీని సిబిఐ

అధికారులు ప్రశ్నించినపుడు రక్షణశాఖ అధికారుల పేర్లు కూడా బయట పడ్డాయని తెలుస్తుంది.

అనేక సంస్థల నుండి లంచాలు తీసుకొన్నట్లు రుజువు కావడంతో 2009లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డుకు చెందిన మాజీ చీఫ్ సుదీప్తఘోష్‌ను అతని అనుచరుల్ని అరెస్టు చేశారు. లంచాలిచ్చిన అరవై కంపెనీలను, పది సంవత్సరాల పాటు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. వీటిలో ఇజ్రాయిల్‌కు చెందిన మిలిటరీ ఇండస్ట్రీస్, జర్మనీకి చెందిన రెయిన్ మెటల్ ఎయిర్ డిఫెన్స్, రష్యాకు చెందిన కార్పొరేషన్ డిఫెన్స్, భారత్‌కు చెందిన టిఎస్ కిసాన్ అండ్ కంపెనీ, ఆర్‌కె మెషిన్ టూల్స్ లాంటి కంపెనీలు ఉన్నాయి.

## రక్షణరంగం బంగారు గుడ్డు పెట్టే బాతు

స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సర్వే ప్రకారం 2007-11లలో ప్రపంచ వ్యాపిత ఆయుధ కోనుగోళ్లలో పది శాతంతో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. 2002-06 వరకు ప్రథమ స్థానంలో ఉన్న చైనా నాల్గవ స్థానంలోకి పడిపోయింది.

2012-13 భారత రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపు 1.93 లక్షల కోట్ల రూపాయలు. ఇక 2022 నాటికి రక్షణ రంగాన్ని బలోపేతం చెయ్యడానికి దాదాపు 5.4 నుండి 8.1 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి నిర్ణయించారని రక్షణరంగ పరికరాల సలహాదారు కంపెనీ ఫ్రాస్ట్ అండ్ సుల్లివాన్ తెలిపింది. రక్షణ రంగానికి భారీగా ఖర్చుపెట్టే అమెరికా, రష్యా, చైనాల తర్వాత 2020 నాటికి భారతదేశం నాల్గవ స్థానంలో ఉంటుందని అమెరికాకు చెందిన ఐఎచ్ఎస్ సంస్థ తెలిపింది. దీన్ని బట్టి లంచాల వ్యవహారాలు భవిష్యత్తులో ఇంకా భారీగా ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. ప్రపంచంలో ఆయుధాల వ్యాపారం లంచాలు లేకుండా జరగదు. దాదాపు ఇరవై బిలియన్ డాలర్లు ముడుపుల రూపంలో చేతులు మారతాయని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తేల్చింది.

మనదేశంలో రక్షణరంగ అవసరాలకు 70 శాతం విదేశాల నుండే దిగుమతి జరుగుతుంది. ఆఖరికి పాకిస్తాన్ లాంటి దేశం మనకన్నా విదేశాల మీద ఆధారపడడం తక్కువ. అధిక శాతం వారి దేశంలోనే తయారవుతాయి. 'మన రక్షణ వ్యవస్థలో ఒక పిన్ను కావాలన్నా విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిందే గాని స్వంతంగా తయారు చెయ్యడం గురించి ఆలోచించడమే జరగదు' అని ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్‌కు చెందిన స్మితా పురుషోత్తం అన్నారు. దేశీయంగా అభివృద్ధి చెందే పరిశోధనలకు అవకాశమివ్వరు. దీనికి బెంగళూరుకు చెందిన లక్ష్మీకుమార్ మంచి ఉదాహరణ. టోంబో ఇమేజింగ్ కంపెనీ స్థాపించి యూరోప్‌లోని పెద్ద మిలిటరీ సామాగ్రి తయారు చేసే కంపెనీకి డ్రోన్స్, మానవ రహిత విమానాలు ఏరియల్ సర్వే చేసినపుడు, అక్కడి స్పష్టమైన చిత్రాలను మిలిటరీ కేంద్రాలకు పంపే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసాడు. ఆ యూరప్ కంపెనీ ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచవ్యాప్తంగా అమ్ముకోవడంతో మన దేశంలో తప్ప అమెరికాతో సహా అన్ని అగ్రదేశాలు వాడుకొంటున్నాయి.

విదేశీ కంపెనీల నుండి కొనుగోళ్లు చేస్తే, రాజకీయ నాయకులకు, అధికారులకు, పార్టీలకు ముడుపులు, విరాళాలు దండిగా లభిస్తాయి. వీటిని ఎట్టి పరిస్థితిలోనూ వదులుకోరు. ఇటలీ కోర్టు సేకరించిన డాక్యుమెంట్స్ ప్రకారం ఢిల్లీలో ఆయుధాల వ్యాపారులు, బ్రోకర్లు, రాజకీయ నాయకులు, మిలిటరీ అధికారులు పార్టీల్లో కలుస్తూ, డీల్స్‌ను ఖరారు చేసుకుంటారు. అభిషేక్ వర్మ డిసెంబర్ 5, 2011న ఏర్పాటు చేసిన పెద్ద పార్టీలో విదేశీ కంపెనీల బ్రోకర్లతో పాటు రక్షణ రంగానికి చెందిన డైరెక్టర్ జనరల్ (రక్షణ కొనుగోళ్లు), డైరెక్టర్ జనరల్ (స్పెషల్ ఫ్రంటియర్ ఫోర్స్)లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. రక్షణరంగ ఇంటెలిజెన్స్ ఛీఫ్‌గా పనిచేసిన తేజేందర్ సింగ్ టెట్రా ట్రక్కుల కొనుగోలు ఒప్పందం ఖరారు కోసం పద్నాలుగు కోట్ల రూపాయలు లంచం, సర్వీసులో ఉన్న దేశ సైనిక దళాల ప్రధానాధికారి వికె సింగ్‌కు ఇచ్చిన సంగతి మనకు తెలుసు.

పెట్టుబడిదారీ సమాజంలో అవినీతి అంతర్భాగంగా ఉంటుందని వేరే చెప్పనక్కర్లేదు. అందుకే అగస్టా కుంభకోణంపై ఇటలీ ప్రభుత్వం జరుపుతున్న విచారణపై మాజీ ఇటలీ ప్రధాని బెర్లుస్కోని తీవ్రంగా స్పందించాడు. 'అంతర్జాతీయ వ్యాపారం చేయడానికి అన్ని రకాల అనుమతులుంటే చాలదు. అప్పుడప్పుడు కొంతమంది చేతులు తడపాల్సిందే. ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపారాభివృద్ధి కోసం లంచాలివ్వడం తప్పుకాదు. ఈ విచారణ ఆర్థికంగా ఆత్మహత్యలాంటిదని' నిజాన్ని ప్రకటించాడు.

మాజీ భారత నౌకాదళాధిపతి అరుణ్ ప్రకాష్ ఒక వ్యాసంలో రక్షణ రంగ సామాగ్రి కొరకు విదేశాల మీద ఆధారపడడం చాలా ప్రమాదకరం. మన దేశంలో దాదాపు 70 శాతం నుండి 80 శాతం వరకు రష్యా, అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, ఇజ్రాయిల్ లాంటి దేశాల నుండి దిగుమతి చేసుకొన్నవే. మనం తయారు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వాటిలో కూడా ముఖ్యమైన ఎలక్ట్రానిక్స్, ఇతర సాంకేతిక సామాగ్రి అన్నీ విదేశాల నుండి రావలసిందే. ఇలా విదేశీ పరిజ్ఞానం మీద రక్షణ రంగం ఆధారపడడం ఎంత ప్రమాదమో ఎవ్వరూ ఆలోచించడం లేదు. మన దేశ రక్షణ చాలా ప్రమాదంలో పడుతుంది. విదేశాల నుండి దిగుమతి చేసుకొన్న యుద్ధట్యాంకులు, సబ్‌మెరైన్లు, రాడార్లు, ఫైటర్ జెట్స్, ఇతర యుద్ధ పరికరాలలో అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడనివీ, పాడయి పోతున్న వాటి గురించి 'కాగ్' ప్రతి సంవత్సరం పార్లమెంట్‌కు తెలుపుతూనే ఉంది. కాని దానిపై ఎటువంటి చర్యలూ లేవు. విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొన్నప్పుడు ఎటువంటి రహస్యాలూ ఉండకూడదని, అవినీతికి తావివ్వమని, 'నిజాయితీ ఒడంబడిక' (ఇంటిగ్రిటీ ఫాక్ట్)లు చేసుకొన్నా ఎటువంటి ఉపయోగం ఉండదు. మన దేశంలో లంచం ఇస్తే ఎంత పెద్ద ఒప్పందాలయినా సులువుగా చేసుకోవచ్చని విదేశీ కంపెనీలకు తెలుసు. పైగా పాలక, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలకు ఈ కంపెనీలు ఎన్నికల సమయంలో భారీ విరాళాలిస్తాయి. అందువల్ల ఎలాంటి కుంభకోణమైనా రాజకీయ పార్టీలు పైపైన విమర్శిస్తాయి గాని సమస్య లోతుల్లోకి వెళ్లరు. బంగారు బాతును చంపుకోలేరు కదా!

'ఈ సమస్య పరిష్కారానికి నా దృష్టిలో రెండు మార్గాలున్నాయి. మొదటిది, మన రక్షణరంగ ఆయుధాల కొరకు ఇరవై సంవత్సరాల కాల పరిమితితో ప్రభుత్వ - ప్రైవేట్ రంగాల ఆధ్వర్యంలో ఒక 'జాతీయ ప్రణాళిక' అమలు చేయాలి. తద్వారా ఆయుధాల తయారీలో స్వయం

# అఫ్జల్ ఉరి - ఆలోచించాల్సిన అంశాలు

***భావ ప్రకటనా స్వేచ్ఛపై నిర్బంధం, మరణశిక్షల అమలు లాంటి ప్రజా వ్యతిరేక ధోరణులు అవలంబిస్తున్న పాలకుల తీరును ప్రశ్నిస్తున్నారు* ఎల్. అరణ్య**

**భా**రత పార్లమెంట్‌పై 2001లో దాడిచేసిన నేరంలో అఫ్జల్‌గురు ఉరితీయ బడ్డాడు. అఫ్జల్‌గురు మరణశిక్షలో ప్రధానంగా నాలుగు అంశాలున్నాయి. ఉరిశిక్ష అవసరం; అఫ్జల్‌గురు చేసిన నేరం; మరణశిక్ష పట్ల ప్రభుత్వాల వైఖరులు; భావ ప్రకటన హక్కుపై రాజద్రోహ అస్త్రం.

మొదటగా, ఉరిశిక్ష అవసరాన్ని గురించి ఈరోజు దేశంలోని అనేక ప్రాంతాలలోని ప్రజలలో తీవ్రమైన చర్చ జరుగుతున్నది. మరణశిక్ష అనేది అనాగరికమని ఎంతోమంది మేధావులు వాదిస్తూనే ఉన్నారు. ప్రజలలో కనీసం కొందరైనా మరణశిక్షను వ్యతిరేకించే వారున్నారు. అలాగే నేరాలను అదుపు చేయడానికి మరణశిక్ష ఉండాలని వాదించే వారూ ఉన్నారు. కనిపిస్తే కాల్చిపారేయడం నిత్యకృత్యమైన నేటి భారతదేశంలో మరణశిక్షపై కనీసం ఈ మాత్రమైనా చర్చ జరగడం మంచిదే. అసలు మరణశిక్షలే లేని సమాజంగా ఇన్నాళ్ల మన 'ప్రజాస్వామ్య' భారతదేశం ఎదగకపోవడం బాధాకరమే. ప్రపంచంలో 136 దేశాలు మరణశిక్షను తమ శిక్షా స్మృతుల నుండి తొలగించాయి. ఆ శిక్ష స్థానంలో అత్యున్నత శిక్షా దశగా యావజ్జీవ వంటివి అమలు పరుస్తున్నాయి. మరణశిక్షను రద్దు పరచాలని డిమాండ్ చేస్తున్నవారు అడుగుతున్న ప్రధానమైన ప్రశ్న – ఒకవేళ మరణశిక్ష విధించిన తర్వాత కాలంలో ఆ చనిపోయిన వ్యక్తి నిర్దోషి అని తేలితే ఆ చర్యకు ఎవరు బాధ్యత తీసుకోగలరు? పోయిన ప్రాణాన్ని మళ్లీ తీసుకు రాగలరా? ఇది చాలా సహజమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సమాధానముండదు. సెక్షన్ 302 ప్రకారం ఉరి విధించడం సమంజసమే అని చేతులు దులుపుకోవడం తప్ప ప్రభుత్వాలు కనీసంగానైనా ఈ విషయం గురించి ఆలోచించలేవు.

అసలు ఒక వ్యక్తిని దోషిగానో, నిర్దోషిగానో నిర్ణయించడం ఏ సామాజిక పరిస్థితులననుసరించి, అనుభవాలననుసరించి జరుగుతున్నదనే ప్రాథమిక ప్రశ్నను వేసుకుంటే గానీ ఒక మనిషి ప్రాణం తీయడాన్ని అధికారిక చర్యగా ప్రభుత్వాలు లేదా న్యాయస్థానాలు అమలు పరచడాన్ని అర్థం చేసుకోలేం. నాగరికతా వికాసం జరగని ఆటవిక కాలం నుంచి ఒడంబడికల ద్వారా సామాజిక ప్రభుత్వాలుగా పిలవబడ్డ అధికార కేంద్రాలు ఏర్పడేదాకా ఇష్టానుసారంగా, వ్యక్తిగతంగా సాగిన ఈ హత్యలు ఆ తర్వాత ప్రజల, సమాజాల ప్రతినిధిగా అవతరించిన ప్రభుత్వాల హయాంలో అధికారికంగా, చట్టబద్ధంగా సాగుతూ వచ్చినవి. (కనీసం ఆటవిక కాలంలో తమ పనులకు అడ్డు వస్తేనే ఒక వ్యక్తిని మరో వ్యక్తి చంపుకునే వారు గానీ ఈనాడు ఏరివేసి, లొంగదీసుకొని, అత్యాచారాలు చేసి మరీ చంపివేసే దుర్మార్గ కాలం దాపురించింది. రాజ్యం రాష్ట్రపతి సాయంతో చేసే హత్య మరణశిక్ష అయితే, న్యాయస్థానాల, రాష్ట్రపతుల గొడవ లేకుండా చేసే హత్య 'ఎన్‌కౌంటర్'.) ఈ అధికారం, చట్టబద్ధత ఆయా ప్రభుత్వాలకు ప్రజలే అందించగా, ప్రభుత్వాలుగా సింహాసనంపై ఆసీనులైన వారు ఆ ప్రజలనే మరణశిక్షల పేరిట చంపి వేస్తున్నారు. మరణశిక్ష ముమ్మాటికీ హత్యే అనేది ప్రజలకు చైతన్యంతో వస్తున్న ఇవాల్టి అవగాహన. ఇందుకు ప్రభుత్వాలు చేస్తున్న వాదన ఏమిటంటే, సమాజంలో తీవ్రమైన నేరాలు, అన్యాయాలు చేస్తున్న వారికే కదా మరణశిక్షలు వేస్తున్నది! అది కూడా వద్దంటే ఇతర నేరస్తులు భయపడేదెలా? నేరస్తుల సంఖ్య తగ్గేదెలా? అని. నిజానికి న్యాయవ్యవస్థలోని మౌలికమైన విషయాన్ని మర్చిపోయి ప్రభుత్వాలు ఈ విధంగా మాట్లాడుతున్నాయి. ఒక నేరస్థున్ని పరివర్తనతో మార్చాలి గానీ, శిక్షతో కాదు. శిక్షతో మార్చాలనుకోవడం అవివేకం. శిక్ష, భయం అనేవి నేరాలను, నేరస్తుల సంఖ్యను తాత్కాలికంగా తగ్గించి వేస్తాయేమో గానీ నేరరహిత సమాజాల్ని నిర్మించలేవు. ఇది చరిత్ర చెప్తున్న సత్యం. అలాగే నేరస్తునికి మరణదండన విధించినంత మాత్రాన ఇక ముందు ఎవరూ అలాంటి నేరాలు చేయరని భావించడం అమాయకత్వం. కనీసం ఇందుకు తగ్గ ఆధారాలు కూడా లేవు. అలాంటప్పుడు ఈ సూత్రీకరణకు

---

పోషకత్వం సాధ్యమవుతుంది. ఇలా మనం చేయగలిగితే 2038 నాటికి మొత్తం విదేశీ పెత్తనాన్ని తొలగించుకోగలం. రెండవది, రాజకీయ పార్టీలన్నీ ఒక 'నిజాయితీ ఒడంబడిక' పై సంతకం చేసి, దేశ రక్షణ రంగ అవసరాలు చాలా ప్రాముఖ్యమైనవని, ఎన్నికల కోసం విదేశీ నిధులు స్వీకరించమని ప్రతిన చేయాలి' అంటూ అరుణ్ ప్రకాశ్ తన ఆలోచనల్ని ప్రజల ముందు పెట్టారు. కాని రాజకీయ పార్టీలు బంగారు బాతును చంపుకోవు అని ఆయనే చెప్పి, అమాయకంగా తిరిగి వారినే బంగారు బాతును చంపమని ప్రణాళికలు వేస్తే అమలు చేసేదెవరు?

సామ్రాజ్యవాద దాసులుగా పాలిస్తున్న మన దళారీ పాలకుల పాలన కొనసాగినంత కాలం ఆయన కల నిజం కాదు. నిజం కావాలంటే సామ్రాజ్యవాద పెత్తనాన్ని తుడిచిపెట్టి, స్వావలంబన లక్ష్యంతో ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలి. విదేశీశక్తుల పెత్తనం కొనసాగుతున్నంత కాలం అగస్టా లాంటి కుంభకోణాలు నిరంతరం బద్ధలవుతూనే ఉంటాయి. వాటికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. వారి విజయమే విదేశీ పెత్తనాన్ని తొలగించగలదు.

*(రచయిత కార్మికోద్యమ నాయకులు)* వీ

రావడం ఎంతవరకు సమంజసం? నిజానికి ప్రభుత్వాలు శిక్షల గురించి కాకుండా జరిగిన నేరాలకు గల మౌలిక కారణాలపై దృష్టి పెడితే సమస్య ఇంత దూరం వచ్చి ఉండేది కాదు. అసలు ఒక వ్యక్తి ఎందుకు నేరం చేస్తాడు? అతడు ఏ కారణం కోసమైతే, ఏ అవసరం కోసమైతే నేరాలు చేస్తాడో ఆ అవసరాలను తీర్చలేని స్థితిలో ప్రభుత్వాలు ఎందుకున్నాయి? ఎందుకుండాలి? అని ప్రభుత్వాలు ఆత్మశోధన చేసుకోవాలి. కానీ అలా కాకుండా మరణశిక్షను కప్పిపుచ్చుకుంటూ, ఈ విషయాలను విస్మరిస్తూ ప్రవర్తిస్తున్నాయి.

ఇక రెండవ అంశం - అఫ్జల్‌గురు చేసిన నేరం. నిజానికి ఇంత చిన్న వ్యాసంలో అఫ్జల్ నేరస్తుడా కాదా అని నిర్ధారించడం సాధ్యమయ్యే పనికాదు. కానీ ఇవాళ మనం తీవ్రవాదంగా మాట్లాడుకుంటున్న పార్లమెంట్‌పై దాడి వంటి చర్యలను అఫ్జల్‌గానీ, ఇంకెవరైనా గానీ, వారిని నడిపిస్తున్న సంస్థలు గానీ ఎందుకు చేస్తున్నాయి? వాళ్ల డిమాండ్ ఏమిటి? అనే విషయాన్ని పరిశీలిస్తే అఫ్జల్ నేరస్తుడో కాదో చెప్పవచ్చు. క్లుప్తంగానే ఆ చర్చలోకి వెళ్దాం. జమ్ము కశ్మీర్ రాష్ట్రం భారతదేశంలోని అతి సుందరమైన ప్రాంతం. హిందూ, ముస్లిం మతాలు ప్రబలంగా ఉన్న ప్రాంతం. కానీ దశాబ్దాలుగా భారతదేశం, పాకిస్తాన్ ప్రభుత్వాలు కశ్మీర్‌ను కేవలం భౌగోళికంగానే చూస్తూ అక్కడి ప్రజలను గుర్తించడానికి, వారి మనోభిష్టాలను తెలుసుకోవడానికి నిరాకరిస్తున్నారు. మనుషులతో సంబంధం లేకుండా కేవలం భూమి కోసం రెండు దేశాలు నరమేధాలు సృష్టిస్తున్నాయి. రాజకీయ పార్టీలు ఈ భూమి అంశానికి దేశభక్తి రంగులు అద్ది దేశ ప్రజలలో ఆవేశాలను రగిలించి వారిని నిత్యం విడదీస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి. కశ్మీర్ మాదంటే మాదని ఈ రెండు దేశాల ప్రభుత్వాలు కొట్లాడుతూ అమెరికా లాంటి దేశాలను, ఐక్యరాజ్య సమితి లాంటి సంస్థలను ఈ వివాదంలోకి లాగుతూ సమస్యను అంతర్జాతీయం చేసి పారేసి కశ్మీర్ అంశం కేంద్రంగా చేసుకొని కోట్లాది రూపాయలను రక్షణ పేరిట బడ్జెట్లుగా కేటాయిస్తూ వాటిని తమ ఖాతాల్లోకి దోచుకుంటున్నారు. కశ్మీర్ సమస్యను పరిష్కరించాల్సింది భారతదేశమో, పాకిస్తానో, మరే బయట దేశమో కాదనీ, కశ్మీర్ ప్రజలే స్వయంగా తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలనీ, ప్రభుత్వాలుగా ఆ ప్రజలకు ఆ అవకాశాన్నీ తాము కల్పించాలనే కనీస రాజకీయ స్పృహ రెండు దేశాల ప్రభుత్వాలకూ కరువైంది. అందుకే దశాబ్దాలుగా కశ్మీర్ సమస్య ఒక కొలిక్కి రావడం లేదు.

నిజానికి కశ్మీర్ విషయాన్ని సమస్య అని అసలే అనలేం. అది కశ్మీరీల అస్తిత్వానికి, స్వీయ గౌరవానికి సంబంధించిన విషయం. దాన్ని సమస్యగా మార్చింది రెండు దేశాల ప్రభుత్వాలే. ఒక ప్రాంతంలోని ప్రజలకు తాము ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే హక్కు ఉంటుంది. అసలైతే ఒక దేశంలోనో, రాష్ట్రంలోనో అంతర్భాగంగా ఉన్న ప్రాంతానికి కూడా ఆ దేశం లేదా రాష్ట్రం నుంచి విడిపోయే హక్కు ఉంటుంది. ఆ విషయమై అక్కడి ప్రజలకు నిర్ణయాధికారం ఉండాలి. ఇక ఏ దేశంలోనూ అంతర్భాగంగా లేని లేదా ఉమ్మడి దేశాల ఆధీనంలో ఉన్న ప్రాంతానికైతే ఆ హక్కు, అధికారం మరింత బలంగా ఉండాలి. కానీ ఆ హక్కు, అధికారాన్ని కనీసంగానైనా గుర్తించడానికి మతతత్వ దేశంగా ప్రజాస్వామిక విలువలకు దూరంగా ఉంటున్న పాకిస్తాన్ అంగీకరించక పోతే ఆశ్చర్యపోనవసరం లేదు. కానీ ఇవాళ దొరికిన ప్రతి వేదిక మీదా ప్రజాస్వామ్యం గురించి, ఆ ప్రజాస్వామ్యానికి ప్రపంచ దేశాలన్నింటి లోనూ బృహత్తరమైన ప్రతినిధిగా చెప్పుకుంటున్న భారతదేశ పాలకులు గుర్తించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవడం?

ఆర్ఎస్ఎస్ సృష్టించిన అతివాద హైందవ భావజాలం, దానికి దన్నుగా నిలిచిన దశాబ్దాల మీడియా వల్ల కశ్మీర్‌పై చాలామంది భారత ప్రజల అవగాహన కశ్మీర్ భారత్‌దేనని, హిందూ రాజ్యంలో భాగమేననే తప్పుడు అర్థంలో ఉంది. భారత ప్రభుత్వాలు, సైన్యం ఈ భావజాలానికి మద్దతిస్తుండగా, పాకిస్తాన్ ప్రభుత్వాలు, సైన్యం కశ్మీర్ పాకిస్తాన్‌దేనని అంటున్నాయి. ఈ రెండు వైపుల ప్రభుత్వాలకు మద్దతుగా అనేక సంస్థలు, వ్యక్తులు కశ్మీర్‌లో పనిచేస్తున్నారు. అఫ్జల్ సభ్యుడుగా చెప్పబడుతున్న జైష్-ఎ-మహమ్మద్ పాకిస్తాన్‌కు అనుకూలమైన ఇలాంటి ఒక సంస్థ. నిజానికి అఫ్జల్ జైష్ సభ్యుడని నిర్ధారించే ఒక్క ఆధారమూ లేదు. కానీ సంవత్సరాలుగా జైష్ సభ్యుడనే ముద్రను అఫ్జల్ మోస్తూ వచ్చాడు. అతను నిజంగానే జైష్ సభ్యుడనుకుందాం. భారత ప్రభుత్వం ఎలాగైతే కశ్మీర్ ప్రజలను ఇండియన్ యూనియన్‌లో కలవండని అడుగుతున్నదో అలా పాకిస్తాన్‌లో కలవండని అడిగే హక్కు జైష్‌కూ ఉంటుంది. ఎలాగైతే ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి వంటి హిందూ సంస్థలు అతివాదాన్ని ప్రోత్సహిస్తున్నాయో, జైష్ లాంటివీ అదే పని చేస్తున్నాయి. హింస తప్పే. జైష్‌ది మాత్రమే కాదు కదా హిందూ ఉన్మాద సంస్థలను వెనుక వేసుకొచ్చే ప్రభుత్వాలకు అయితే జైష్ ఎందుకు నిషేధించాల్సిన సంస్థగా కనబడిందో అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, హిందూ సంస్థలతో ముడిపడి దేశ ప్రజల ఓట్లున్నాయి, వాటితో ప్రభుత్వాలకు రాజకీయ ప్రయోజనా లున్నాయి. కానీ భారతదేశ ముస్లింలు విదేశీ సంస్థలకు మొదటి నుంచీ దూరంగా ఉన్నారు. కనుక జైష్‌తో ముడిపడి భారతదేశ ముస్లిం రాజకీయాలు లేనందున ఇవాళ జైష్ ఈ దేశ పాలకులకు ఉగ్రవాద సంస్థ అయింది. అంటే ఒక సంస్థ చేసే పనుల వల్ల కాకుండా ఆ సంస్థతో ముడిపడిన ఓట్ల రాజకీయాల వల్ల ఆ సంస్థను ఉగ్రవాద సంస్థగా ముద్రవేసే స్వార్థ రాజకీయాలు భారతదేశంలో ఉండడం వల్లే ఇవాళ చాలామట్టుకు సంస్థలు ఉగ్రవాద సంస్థలుగా ముద్రపడ్డ విషయాన్ని గమనించాలి. ఈ నేపథ్యంలో జైష్ చేస్తున్న పనులు తప్పే అనుకుంటే అలాంటివే చేస్తున్న హిందూ సంస్థలదీ కూడా తప్పవ్వాలనే కనీస స్పృహ పాలకులకు కరువవడంలో భాగంగానే జైష్‌ను గానీ మరే ఇతర సంస్థను గానీ అర్థం చేసుకోవాలి. కనుక ఒక ప్రాంత ప్రజల మనోభావాలను డిమాండ్ చేయడం ఒక సంస్థగా జైష్‌కున్న హక్కు, బాధ్యత. భారతదేశంలోని వేలాది సంస్థల వలెనే జైష్‌కున్న ఆ డిమాండ్ చేసే హక్కును అందరమూ గౌరవించాలి.

ఇక హింసాత్మక చర్యల విషయానికి వస్తే దేశీయంగా, అధికారికంగా హింసను నెరపుతున్న అనేక సంస్థలకు ప్రభుత్వాలు స్వార్థంగా మద్దతిచ్చి వెనకేసుకొస్తున్నంత కాలం జైష్ లాంటి సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా నిషేధించే అర్హత ప్రభుత్వాలకుండదు. అయినా సరే మా చేతిలో అధికారం ఉంది కనుక మేం నిషేధిస్తాం అని అంటే అది న్యాయ సూత్రాలకు, నీతి సూత్రాలకు నిలబడే విషయం అవదు.

అఫ్జల్‌గురు చేసిన తప్పేమిటనే విషయానికి వస్తే మొదట్లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లిన అఫ్జల్ తర్వాత కాలంలో మారిపోయి సాధారణ జీవితం

గడపాలనుకున్నాడు. భద్రతా దళాలకు లొంగిపోయాడు కూడా. అందరు సాధారణ పౌరుల లాగానే ఉద్యోగమో, వ్యాపారమో చేసుకోవాలను కున్నాడు. కానీ భద్రతా దళాలు, ఎస్‌టిఎఫ్ అతన్ని ఇన్‌ఫార్మర్‌గా వాడుకోవాలనుకున్నారు. సోపోర్‌లో వైద్యపరికరాల కమిషన్ ఏజెంట్‌గా ఉన్న సమయం లో అఫ్జల్‌ను ఎస్‌టిఎఫ్ తీసుకెళ్లింది. మాజీ ఉగ్రవాది అనే నెపంతో పోలీసులు లక్ష రూపాయలు లంచం అడిగారు. భార్య నగలు అమ్మి అఫ్జల్ 80 వేలు ఇచ్చాడు. తర్వాత ఓ కోచింగ్ సెంటర్లో ట్యూటర్‌గా ఉన్నప్పుడు ఒక డిఎస్‌పి మహమ్మద్ అనే వ్యక్తిని ఢిల్లీలో దించి రావాలని బెదిరించగా తనకిష్టం లేకున్నా దించి వచ్చాడు. మహమ్మద్‌తో పరిచయమైన ఆనాటి నుంచి పార్లమెంట్‌పై దాడి వరకూ మహమ్మద్ ఉగ్రవాద చర్యలు చేస్తున్నాడని అఫ్జల్‌కు తెలియదు. మహమ్మద్ పరిచయస్తుడుగా మారిపోవడంతో అతనితో కొద్ది రోజులున్నాడు. అతనికి కారు కొనివ్వడంలో సాయం చేశాడు. సాయానికి ప్రతిఫలంగా ముప్ఫై వేలు తీసుకున్నాడు. ఇవన్నీ ఒక పరిచయస్తునికో, స్నేహితునికో ప్రతి ఒక్కరూ చేసే పనులే. కానీ మహమ్మద్ ఉగ్రవాది అని తేలడంతో ఈ పనులన్నీ ఉగ్రవాద చర్యలుగా అఫ్జల్ మెడకు చుట్టుకున్నాయి. ఆ తర్వాత పోలీసులు అఫ్జల్ తమ్ముడు హిలాల్ అహ్మద్‌ను చిత్రహింసలు పెట్టారు. భార్యను, కొడుకును చంపుతామని బెదిరించారు. 300 తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. నోట్లో మూత్రం పోశారు. మర్మాంగాలపై ఒత్తిడి పడేలా కొట్టారు. బట్టలు విప్పి కరెంటు షాక్ పెట్టారు. నిరంతరం నరకం చూపారు. బలవంతంగా పార్లమెంట్‌పై దాడి వెనక ఉన్నానని ఒప్పించారు. మీడియా ముందు చెప్పించారు. చివరికి కోర్టులో చెప్పుకోవడానికి అవకాశం కల్పించలేదు. ఇదంతా అఫ్జల్ తన న్యాయవాదులకు రాసిన లేఖలోని సారాంశం.

ఇదంతా పక్కన పెడితే దాడి జరిగింది పార్లమెంట్ భవనం మీద. పార్లమెంట్ విశ్వాశాల మీదనో, న్యాయసూత్రాల మీదనో, ప్రజల మనోభావాల మీదనో, రాజ్యాంగ విలువల మీదనో కాదు. ఒకవేళ పార్లమెంట్ సభ్యులు లక్ష్యంగానే దాడి జరిగిందని అనుకున్నా అది కూడా పై విషయాల మీద జరిగిన దాడి అవదు. కేవలం ఒక భవనం మీద, దాని గోడల మీద జరిపిన దాడి కారణంగా వ్యక్తులను ఎన్‌కౌంటర్ చేయడం, ఆ కారణానికి పాల్పడ్డారని ఉరిశిక్ష వేయడం హాస్యాస్పదం. పార్లమెంట్‌కు నీతి నియమాలు, రాజ్యాంగ విలువలు అనేవి ఏవైనా ఉంటే వాటికి తూట్లు పొడిచి భ్రష్టు పట్టిస్తున్నది పార్లమెంట్‌కు ఎంపికైన వారే. దేశాన్ని రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలిస్తున్నదీ వారే. అంటే పార్లమెంట్ ప్రతిష్ఠ దిగజారుతున్న వారి వల్లనే అవుతుంది గానీ పార్లమెంట్ గోడల మీద దాడి చేసిన వారి వల్ల కాదనే విషయాన్ని న్యాయస్థానాలు కూడా గుర్తించలేకపోవడమే విషాదం. వ్యక్తులను చంపాలని కుట్ర పన్నే వారు ఈ దేశంలో చాలామందే ఉండగా కేవలం ఈ దాడికి మాత్రమే ఇంత సంచలనం, ప్రాముఖ్యత సృష్టించడం కూడా మరో విషాదం. జరిగిందేమైనా అఫ్జల్‌కు మాత్రం ఉరి పడింది. ఒక మాజీ ఉగ్రవాదిగా ఉండడమే అఫ్జల్ చేసిన తప్పేమో, మారిపోయి లొంగిపోయి సాదాసీదా జీవితం గడపాలనుకోవడం తప్ప అఫ్జల్ చేసిన నేరమేమిటో ఇప్పటికీ పోలీసులు, ప్రభుత్వమూ సరిగ్గా చెప్పలేక పోతున్నప్పుడు అతన్ని ఉరితీయడం చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

ఇక మూడోది మరణశిక్షల పట్ల ప్రభుత్వ వైఖరి. మరణిశిక్షను ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి. భారతీయ జనతా పార్టీ, ఎన్‌డిఎలకు కొంచెం ఇమేజ్ ప్రజలలో పెరుగుతుందని భావించినప్పుడల్లా ఇలాంటి సంచలనాలతో ఆ ఇమేజ్‌ను తమవైపుకు తిప్పుకోవడానికి యుపిఎ ప్రయత్నిస్తున్న క్రమంలో భాగమే అఫ్జల్ ఉరి అయినా, కసబ్ ఉరి అయినా. ఎంత అన్యాయమంటే కనీసం తన కేసు వాదించుకోడానికి న్యాయవాదిని కూడా ఇవ్వకుండా, తనను వాదించుకోనివ్వకుండా, పూర్తిగా పోలీసుల కస్టడిలో ఉంచి, బలవంతంగా నేరం ఒప్పించి చేయాల్సినన్ని క్రూరమైన పనులు చేసి చివరికి చంపే సమయంలోనైనా మానవత్వంతో వ్యవహరించడం ప్రభుత్వాలు మానేశాయి. చివరి కోరికను అడగడం, కుటుంబ సభ్యులకు తెలియ పరచడం వంటి అసాధారణ మానవీయ ప్రతిస్పందనలైనా లేకుండా చంపడమే లక్ష్యంలో వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వాల పాలనలో ఉన్నందున మూకుమ్మడిగా సిగ్గు పడాల్సిన సందర్భమిది.

చివరగా భావ ప్రకటనపై రాజద్రోహ అస్త్రం. ఈ అస్త్రం మోపాలనే డిమాండ్, ఆలోచన చాలా సందర్భాలలో జరుగుతూనే ఉన్నా, మరణశిక్ష సందర్భంగా మరోసారి చర్చకు వచ్చింది. నేరాల విషయంలో ఉగ్రవాదుల హక్కుల గురించో, వారి తప్పొప్పుల గురించో మాట్లాడేవారిపై రాజద్రోహం మోపాలనే డిమాండ్ వస్తున్నది. ముఖ్యంగా ఈ డిమాండ్ పెడుతున్న వారు హిందూ అతివాద శక్తులు. ఉగ్రవాదంపై ఎలాంటి చర్చా జరగకుండా చూసి ఉగ్రవాది అనే నింద పడిన మరుక్షణం అతనికున్న ప్రాథమిక హక్కులను హరించి అతన్ని ఉరి తీసేవరకూ చాలా చురుగ్గా వ్యవహరించే ఉన్మాదశక్తులు ఆ మరణశిక్ష తర్వాత కూడా దానిపై ఎలాంటి చర్చా జరగకూడదని, అలా జరిగితే ప్రజలు చైతన్యవంతులై పోతారనే భయంతో ఉగ్రవాదంపై మాట్లాడే ప్రతి ఒక్కరి మీద కేసులు పెడుతున్నారు. ఈ కేసులకు పరాకాష్ట రాజద్రోహం కేసు. అరుంధతీరాయ్‌పై గతంలో ఇలాంటి ప్రయత్నం చేశారు. ఇప్పుడు మన రాష్ట్రం నుంచి మాట్లాడుతున్న వారిపై ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి శక్తులు బహిరంగంగానే విరుచుకుపడుతున్నాయి.

కనుక ప్రభుత్వాలు హిందూ అతివాద శక్తులు ఉగ్రవాదం భయం చూపి ప్రజల, హక్కుల నాయకుల, ప్రజాస్వామ్యవాదుల నోర్లు నొక్కాలని చూస్తున్నాయి. ఇది భావ ప్రకటనా స్వాతంత్ర్యపు హక్కుకే ప్రమాదమని ఈ సందర్భంగా గుర్తించాలి. తప్పైనా ఒప్పైనా మొదట ఒక చర్చ జరగాలి. విషయాన్ని బహిరంగపరచాలి. అది జరిగాకే తప్పొప్పుల సంగతి బయటపడుతుంది. కానీ మాటే నేరమైతే, చెప్పడమే ద్రోహమైతే అలాంటి ప్రభుత్వాలు కూలిపోక తప్పదు. కనుక విషయం అఫ్జల్ ఉరిదే కావచ్చు, కానీ మొదట ఈ విషయాన్ని బాహాటంగా మాట్లాడే స్వేచ్ఛను పోరాడి పొందాల్సిన అవసరాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తించాలి.

మొత్తంగా అఫ్జల్ ఉరి ప్రభుత్వాల చాలా దుర్మార్గాలను, అమానవీయ చర్యలను, ప్రభుత్వాధికారుల నీతిబాహ్యతను బయట పెట్టింది. ఈ విషయాలను గ్రహించి మరో ఉరి బిగుసుకోకుండా ప్రభుత్వాలను కట్టడి చేసే చైతన్యాన్ని పొందాల్సిన అత్యవసరమైన బాధ్యత ఇప్పుడు ప్రజల ముందర ఉంది.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

# ఉరిశిక్ష ఖైదీలతో చెలగాటమా?

***ఉరిశిక్ష అనే సున్నితమైన, అమానవీయ అంశాన్ని కూడా పాలకవర్గాలు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయనీ, ఖైదీలకు ఉండాల్సిన కనీస హక్కులు కూడా లేకుండా చేస్తున్నాయనీ అంటున్నారు* పుల్లూరు జగదీశ్వరరావు**

ఇప్పుడు నడుస్తున్నది ఉరిశిక్షల కాలం. మొన్న కసబ్, నేడు అఫ్జల్ గురు, రేపు వీరప్పన్ అనుచరులు, ఎల్లుండి రాజీవ్ గాంధీ హంతకులు. ఆ మరుసటి రోజు ఎవరి మెడలో ఉరితాడు బిగియనున్నదో? ఆ ఉరితాడు అత్యంత రహస్యంగా బిగుసుకోవచ్చు. శవాన్ని బంధువులకు అప్పగించకుండా జైలు ఆవరణలోనే సమాధి చేయవచ్చు. రేపు శాంతి భద్రతల కారణంగానో లేదా మరో కారణంగానో, ఉరిశిక్ష అమలును ప్రపంచానికి తెలియకుండా చేసినా ఆశ్చర్యపోవలసిన పనిలేదు.

ఉరిశిక్ష పడ్డ ఖైదీ జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు. ఇది ప్రభుత్వాల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. ఏళ్ల తరబడి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న క్షమాభిక్ష పిటిషన్ ఏనాడైన ఆమోదించవచ్చు. దానికి కాలపరిమితి లేదు. కసబ్, అఫ్జల్ గురుల ఉరిశిక్షల అమలును పరిశీలిస్తే, ఖైదీలకు వర్తించే కనీస హక్కులను సైతం గుర్తించడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయని స్పష్టమవుతున్నది. ఉరిశిక్షలు రాజకీయ ఉచ్చులో చిక్కుకోవడం అత్యంత దురదృష్టకరం.

ప్రభుత్వాలు, ఉరిశిక్షలాంటి సున్నిత అంశాలను సైతం రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం, రాష్ట్రపతి క్షమాభిక్ష అధికారాన్ని సైతం చిత్తం వచ్చిన విధంగా ఆమోదించడం లేదా తిరస్కరించడం, అమానవీయం, అప్రజాస్వామికం.

కసబ్, అఫ్జల్‌గురులకు ఉరిశిక్షలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ పార్టీని బిజెపి గత కొంతకాలంగా నిలదీస్తోంది. తాము అధికారంలోకి వస్తే తక్షణమే ఉరి తీస్తామని ప్రకటించింది. అఫ్జల్‌గురు సైతం, బిజెపి అధికారంలోకి వస్తే, తన ఉరిశిక్ష అమలుపై ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుందని వ్యాఖ్యానించాడు. దీంతో కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంది. ఇప్పటికే కేంద్ర సర్కార్ స్కాంల భారంతో కునారిల్లుతున్నది. దాని ప్రతిష్ఠ రోజురోజుకూ మసక బారుతున్నది. విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నది. విభిన్న సర్వేలు కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరం కావచ్చునని వెల్లడిస్తున్నాయి. దానికి తోడు విధాన వైఫల్యం. ప్రజలు తనకు రాజకీయ ఉరిశిక్ష విధిస్తారని కాంగ్రెస్ భయపడుతున్నది. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఉరిశిక్షలపై దృష్టి సారించింది.

రాజకీయ చదరంగంలో కసబ్, అఫ్జల్ గురులు పావులయ్యారు. బిజెపికి ఈ ఇద్దరు రాజకీయంగా బాగా అందివచ్చే 'అంశాలు'. వారికి అవి దక్కకుండా, రాజకీయ లబ్ధి పొందాలని, తాము బిజెపి కంటే మరింత ఎక్కువ దేశభక్తులమని రుజువు చేసుకోవాలని ఉరికంబం ఎక్కించారు.

2008 నవంబర్ 26న పది మంది ఉగ్రవాదులు సముద్ర జలాల గుండా ముంబై మహానగరంలోకి ప్రవేశించి, పదకొండు చోట్ల దాడులు జరిపి 166 మందిని పొట్టన పెట్టుకున్న దాడిలో సజీవంగా పట్టుబడ్డ ఏకైక పాకిస్తాన్ ఉగ్రవాది కసబ్. నాలుగు సంవత్సరాలలో నేర విచారణ పూర్తయ్యింది. అత్యున్నత న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. క్షమాభిక్షను తిరస్కరించడంతో ఉరిశిక్షను అమలు చేశారు. పాలక పార్టీకి పాక్షికంగా రాజకీయ ప్రయోజనాలు నెరవేరినట్టయింది.

పూర్తిగా రాజకీయ లబ్ధి పొందాలని, కశ్మీర్‌కు చెందిన అఫ్జల్ గురుపై దృష్టి సారించింది. కనీసం కుటుంబ సభ్యులకు సైతం ముందస్తు సమాచారం అందించకుండా, అత్యంత రహస్యంగా తీహార్ జైలులో ఉరితీశారు. 2001లో ఢిల్లీలోని పార్లమెంట్‌పై దాడికి కుట్ర పన్నిన వ్యక్తులలో అఫ్జల్ గురు ఒకరు. ఇతనికి 2002లో ఉగ్రవాద నిరోధక కోర్టు ఉరిశిక్ష విధించింది. 2003లో ఢిల్లీ హైకోర్టు ఉరిశిక్ష ఖరారు చేస్తే, 2005లో సుప్రీంకోర్టు అఫ్జల్‌గురు అప్పీల్‌ను తోసిపుచ్చింది. 2006లో ఉరిశిక్ష అమలు కావల్సి ఉంది.

మరి ఉరిశిక్ష ఎందుకు అమలు కాలేదు? రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడం ఎందుకు జాప్యం జరిగింది? ఆరు సంవత్సరాల తర్వాత ఎందుకు ఉరికంబం ఎక్కించారు? ఉరిశిక్ష విధించబడ్డ ఖైదీలు క్యూలో ఉంటారు. ఎవరి అవసరం ఎప్పుడు వస్తుందో? రాజకీయంగా అవసరమనుకున్నప్పుడు, ఒక్కొక్కరిని బయటికి తీసి, క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరింపచేసి ఉరితీస్తారు.

అఫ్జల్‌గురును రహస్యంగా ఉరితీయడం కొంచెం వివాదాస్పదమయింది. అఫ్జల్‌గురు ఉరితీత ఎంచుకుని చేసిన ఉరితీత కాదని కేంద్ర ప్రభుత్వం రుజువు చేసుకోవాలని కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశాడు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకింత ఉలిక్కిపడింది. 'రాజకీయ దిద్దుబాటు' చర్యకు పూనుకుంది. మాకు 'ఎంచుకుని' ఉరిశిక్ష అమలు చేయాల్సిన అవసరం లేదనీ, అన్నీ చట్ట ప్రకారమే జరుగుతాయనీ చెప్పడానికి క్యూలో ఉన్న వీరప్పన్ అనుచరులను బయటికి తీసింది. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేత క్షమాభిక్షను తిరస్కరింపజేశారు. ఆగమేఘాల మీద అమలు చేయడానికి పూనుకున్నారు. అదృష్టవశాత్తు, మీడియాలో ఎక్కువ ప్రచారం లభించడంతో, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం, ఉరిశిక్ష అమలుపై ఆరు నెలల స్టే విధించడం జరిగిపోయాయి. లేదంటే ఉరిశిక్ష అమలు జరిగేది.

వీరప్పన్ అనుచరుల కేసు ఈనాటిది కాదు. వీరప్పన్ సోదరునితో పాటు మరో ముగ్గురికి సుప్రీంకోర్టు 2004లోనే ఉరిశిక్ష విధించింది.

# ప్రైవేటీకరణ - విద్యుత్ ఛార్జీల పెంపు

***ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు లాభాలు చేకూర్చడంలో భాగంగానే ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచుతోందని అంటున్నారు***

**ముప్పాళ్ల భార్గవశ్రీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండు దశాబ్దాల కాలంపైగా అనుసరిస్తున్న సరళీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ విధానాల ఫలితంగా ప్రజలపై వివిధ రూపాల్లో నానాటికీ భారాలు పెరిగి తడిసి మోపెడవుతున్నాయి. ఈ విధానాలలో భాగంగానే చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న కాలంలోనే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దానిలో భాగంగా విద్యుత్ బోర్డును జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలుగా మూడు ముక్కలుగా చేసి, వాణిజ్య సరళిలో లాభార్జనే ధ్యేయంగా పని చేయించే దానిలో భాగంగా ఒక్కసారిగా రు.1450 కోట్ల విద్యుత్ చార్జీలను పెంచడానికి తలపడింది. ఈ అనూహ్య పెంపుదలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబికింది. ఆనాడు రాష్ట్రంలోని తొమ్మిది వామపక్ష, విప్లవ పార్టీల నాయకత్వాన పోరాటం ఉధృతంగా సాగి 2000 ఆగస్ట్ 28న బషీర్‌బాగ్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యమకారులపై జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించే స్థితికి వెళ్లింది. చంద్రబాబు నాయుడు ఆ తరువాత విద్యుత్ ఛార్జీలను పెంచే సాహసం చేయలేక పోయాడు. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేది లేదని హామీ ఇచ్చి 2009లో తిరిగి అధికారంలోకి వచ్చింది. వైఎస్ హఠాత్ మరణానంతర రోశయ్య తరువాత ముఖ్యమంత్రిగా వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2012-13 సంవత్సరానికిగాను విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచే నిర్ణయానికి పాల్పడింది. ప్రధానంగా ఈ పెంపు భారాన్ని పేద, మధ్యతరగతి వర్గాలపై, చిన్న పారిశ్రామిక వర్గాలపై మొత్తంగా రు. 32,442 కోట్ల ఛార్జీలను పెంచే నిర్ణయం తీసుకుంది. విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వం చూపిన సాకులను విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో జరిపిన బహిరంగ విచారణలో విద్యుత్ రంగ సాంకేతిక నిపుణులు, వ్యాపార పారిశ్రామికవేత్తలతో పాటు వామపక్ష పార్టీలు తీవ్రంగా ఎండగట్టాయి. అయినా రెగ్యులేటరీ కమిషన్ విద్యుత్ ధరలు పెంచుతూ నిర్ణయం ప్రకటించడంతో వామపక్ష పార్టీలు దశలవారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి.

ఇతర రంగాలతో పాటు విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు గేట్లు బార్లా తెరిచింది. ఈ విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా థర్మల్ ప్లాంట్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేసింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 15 ప్లాంట్లకు అనుమతి ఇచ్చిందంటే రాష్ట్రంలో మరెన్నీ ప్లాంట్లు రాబోతున్నాయో

---

ఆనాటి నుండి క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి వద్ద పెండింగ్ క్యూలో ఉంది. వీరప్పన్ అనుచరుల అరెస్టు నుండి ఇప్పటివరకు లెక్కిస్తే దాదాపు పన్నెండు సంవత్సరాలు జైలులోనే మగ్గారు. వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించి ఉంటే దాదాపు పూర్తయ్యేది. అఫ్జల్ గురు 'స్కోర్'ను సమం చేయడానికి, వీరప్పన్ అనుచరులను బలిపీఠం ఎక్కించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. పాలక పార్టీల ప్రయోజనాల కోసం ఉరిశిక్ష పడ్డ ఖైదీల జీవితాలతో చెలగాటమాడడం ఆక్షేపణీయం.

సాధారణ ఖైదీలకు హక్కులున్నట్టే, మరణశిక్ష విధించబడ్డ వారికి సైతం హక్కులుంటాయి. అలాంటప్పుడు వారి జీవితాలతో ఆడుకునే హక్కు ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారు? ఏళ్ల తరబడి క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించకుండా రాష్ట్రపతి వద్ద పెట్టుకోవడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికి రాదా? ప్రభుత్వాలకు, అవసరమనుకున్నప్పుడు, గుర్తుకు వచ్చినప్పుడు ఓ అర్ధరాత్రి రహస్యంగా ఉరికంబం ఎక్కించే హక్కు ఉందా? ఉరిశిక్ష పడ్డ ఖైదీలు, ఉరిశిక్ష ఎప్పుడు అమలు చేస్తారో తెలియక రోజుల కొద్దీ చిత్రహింసలు అనుభవించాలా? ఇలా చేయడం వల్ల ఇలాంటి ఖైదీలు మానసిక స్థైర్యం కోల్పోయి, మానసిక రోగులుగా మారే ప్రమాదం లేదా?

ఒక నేరానికి ఒకే శిక్ష అమలు చేయాలని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో భాగమైన ఆర్టికల్ 20 (2) స్పష్టం చేస్తుంది. ప్రస్తుత ప్రభుత్వాలు అమలు పరుస్తున్న విధానం ఉరిశిక్ష పడ్డ ఖైదీలకు, యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, నచ్చిన సమయంలో మరణశిక్ష అమలు పరచడం, రాజ్యాంగ ఉల్లంఘనతోపాటు ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది. మన రాజ్యాంగంలోని 72వ ఆర్టికల్ ప్రకారం ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే అధికారం రాష్ట్రపతికి ఉంది. అయితే క్షమాభిక్ష పిటిషన్‌ను ఆమోదించే లేదా తిరస్కరించే కాలపరిమితి రాజ్యాంగంలో పొందుపరచ లేదు. అందువల్ల రాష్ట్రపతి తనకు నచ్చినప్పుడు క్షమాభిక్ష పిటిషన్‌పై దృష్టి సారిస్తున్నారు. ఏళ్ల తరబడి జాప్యం వల్ల ఖైదీల హక్కులకు భంగం వాటిల్లుతోంది. సుప్రీంకోర్టు కూడా రాష్ట్రపతి క్షమాభిక్షపై కాలపరిమితిని విధించలేమని, ఓ కేసులో తీర్పు చెప్పింది. కాబట్టి ప్రభుత్వం త్వరగా ఆర్టికల్ 72ను సవరించి, క్షమాభిక్ష పిటిషన్‌ను ఆమోదించే లేదా తిరస్కరించే కాలపరిమితిని ఆరు నెలలకు మించని గడువు విధించాలి. దీనివల్ల ఖైదీల జీవితాలతో రాజకీయం చేసే అవకాశం సన్నగిల్లుతుంది. వారి ఖైదీ జీవితం ప్రశాంతంగా గడుస్తుంది.

*(రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయులు)* వీ

ఊహించడం కష్టంకాదు.

ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు అపరిమితమైన లాభాలు చేకూర్చేదానిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ యాక్సిస్ విధానాన్ని ప్రకటించింది. దీని ప్రకారం ఒక మెగావాట్ ఆపైన విద్యుత్ వాడే పరిశ్రమలు ఏ ప్రైవేట్ విద్యుత్ సంస్థ నుంచైనా విద్యుత్‌ను కొనుగోలు చేయవచ్చు. అలానే ప్రైవేట్ విద్యుత్ ప్లాంట్లను మర్చంట్ ప్లాంట్ల క్యాటగిరిలో చేర్చి, అవి చేసే ఉత్పత్తిని ఎవరికైనా వాణిజ్య విద్యుత్‌గా ఎక్కువ ధరకు అమ్ముకునే వీలు కల్పించింది. మన ట్రాన్స్‌కో కూడా ఈ వాణిజ్య విద్యుత్‌ను కొనాల్సి రావడం వలన విద్యుత్ రేట్లను పెంచుతూ పోతున్నది. అంతేకాక డబ్బున్న బడా పెట్టుబడిదారుడు అప్పటికి ఉన్న రేటుకి విద్యుత్‌ను కొనుగోలు చేసుకొని తరువాత ఎక్కువ రేటు ఉన్న సమయంలో అమ్ముకునే దళారీ వ్యాపార వర్గానికి కూడా డీమ్డ్ జనరేషన్ ఒప్పందం పేరుతో అవకాశం కల్పించింది. ఈ విధానాలన్నీ విద్యుత్ రంగంలోని బహుళజాతి కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు గడించడానికే తోడ్పడు తున్నాయి. పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల విష వలయంలో వినియోగదారులు బలి పశువులుగా మారిపోతున్నారు.

భారీగా పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో సతమతమవుతున్న విద్యుత్ వినియోగదారులపై కిరణ్ సర్కార్ ఇంధన సర్దుబాటు సర్‌ఛార్జి (ఫ్యూయల్ సర్‌ఛార్జి ఎడ్జెస్టుమెంట్ - ఎఫ్‌ఎస్‌ఏ) పేరుతో విద్యుత్ బిల్లుతో పాటు అదనపు మొత్తాన్ని వసూలుచేసే నిరంకుశ చర్యకు పాల్పడింది. వాస్తవంగా ఎలక్ట్రిసిటీతో రెగ్యులేటరీ కమిషన్ నిబంధనల ప్రకారం సర్‌ఛార్జీలను వసూలు చేయడానికి వీలు లేదు. విద్యుత్ కొనుగోలు చేయాలన్నా, సరఫరా చేయాలన్నా దీనికి సిఆర్‌సి అనుమతి తప్పనిసరి అనే అంశాన్ని 2000 సిఆర్‌సి నిబంధన నాలుగో చాప్టర్లో స్పష్టంగా ఉన్నా, 2009లో విద్యుత్ కొరత ఉందనే పేరుతో యూనిట్ ధర అత్యధికంగా రు.13.50కి కొనుగోలు చేశారు. దీన్ని సిఆర్‌సి అంగీకరించక పోవడంతో డిస్కమ్‌ల నుండి వసూలు చేశారు. దీని కోసం ట్రాన్స్‌కో, డిస్కంలు తమ నిర్వహణ నిధుల నుండి వెచ్చించడంతో ఆ మొత్తాన్ని ప్రజల నుండి వసూలు చేయడానికి పూనుకొన్నారు. వాస్తవానికి ఈ ఖర్చును ప్రభుత్వం భరిస్తే ప్రజల నుండి వసూలు చేయాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొన్న ఫలితంగానే సర్‌ఛార్జీల భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తుంది.

మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో విఫలమైన ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులైన వివిధ రంగాలకు చెందిన ప్రజలను, చిన్న, మధ్యతరగతి వ్యాపార, పారిశ్రామిక వర్గాలను బలి పశువులను చేస్తున్నది. నెలలో 12 రోజులు సెలవులు ప్రకటించడమే గాక రిస్ట్రిక్షన్ అండ్ కంట్రోల్ పేరుతో పనిచేసే రోజులలో కూడా పీక్ అవర్ (సాయంత్రం 6 నుండి 10గంటల వరకు) నిబంధనలను పెట్టి, నిబంధనలను అతిక్రమించిన వారి నుంచి ఐదు రెట్లు అపరాధ రుసుం వసూలు చేస్తూ పరిశ్రమదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. కొన్ని పరిశ్రమలు అరగంట అదనంగా విద్యుత్‌ను వినియోగించుకున్నారనే నెపంతో సుమారు రు.3.50లక్షల వరకు వసూలు చేశారంటే పరిశ్రమ వర్గాలపై ఎంతగా భారాలు వేస్తున్నారో, పరిశ్రమలను ఏవిధంగా దివాళా తీయిస్తున్నారో స్పష్టమవుతోంది.

ఈ ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు నిర్ణయం ప్రభుత్వాలు ప్రపంచబ్యాంక్ విధానాల్లో భాగంగా అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా చేసిందే. విద్యుత్ తయారు చేయడానికి కావలసిన ఇంధనాలైన బొగ్గు, సహజ వాయువులను, చమురు క్షేత్రాలను ప్రైవేటీకరణలో భాగంగా విదేశీ బహుళజాతి కంపెనీల చేతిలో పెట్టిన ఫలితంగా ఇంధనాల ధరలను నిర్ణయించే అధికారాలను ప్రభుత్వాలు కోల్పోయాయి. ప్రభుత్వరంగ బొగ్గు సంస్థ కోల్ ఇండియాను, ఆయిల్ సంస్థ ఓఎన్‌జిసిని పక్కనపెట్టి మనకు అపారంగా లభిస్తున్న బొగ్గు, ఆయిల్, సహజ వాయువులను విదేశీ ప్రైవేటు సంస్థల కబంధ హస్తాలకు మన పాలక వర్గాలు అప్పజెప్పాయి.

జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి వాడే బొగ్గుకు అస్థిర ఛార్జీలు 2011-12లో యూనిట్‌కు సగటున రు.1.93 కాగా 2013-14లో ఈ ఛార్జీ రు.2.60 అవుతోందని పంపిణీ కంపెనీలు అంచనాలు చూపాయి. కాబట్టి యూనిట్‌కు 67 పైసలు అదనంగా చెల్లిస్తే 2013-14 లో జెన్‌కో 42,341.95 మి.యూ. మేరకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తే రు. 2836.85 కోట్లు అదనపు భారం పడుతుంది. దీనికి ముఖ్య కారణం కేవలం మూడు వేల రూపాయలకే టన్ను బొగ్గు దొరుకుతూ ఉండగా విద్యుత్ సంస్థలు టన్ను బొగ్గును రు.5500లకు కొంటున్నాయి. మన జెన్‌కో దాదాపు 20 లక్షల టన్నుల విదేశీ బొగ్గును అధిక ధర పెట్టి కొంటున్నది. ఎన్‌టిపిసి కూడా అధిక ధరలు పెట్టి విదేశీ బొగ్గును కొనుగోలు చేస్తున్నది. విదేశీ బొగ్గు కొనుగోళ్లకు మన విద్యుత్ సంస్థలు అనుసరిస్తున్న బిడ్డింగ్ విధానం లోపభూయిష్టంగా ఉన్నది. అంతర్జాతీయ బిడ్డింగ్ నిర్వహించితే అన్ని విదేశీ సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొంటే తక్కువ ధరకు బొగ్గు లభిస్తుంది. కొన్ని కేంద్రప్రభుత్వ మార్కెటింగ్ సంస్థల నుండే బిడ్లను పొందే విధానాన్ని మన విద్యుత్ సంస్థలు అనుసరిస్తు న్నందున బొగ్గును అధిక ధర పెట్టి కొనాల్సివస్తుంది. అంతేకాక పరిమిత బిడ్డింగ్ విధానంలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరుగుతున్న సిఆర్‌సి పట్టించుకొన్న దాఖలాలు లేవు. దేశంలో బొగ్గు ఉత్పత్తిని కావలసిన మేరకు కోల్ ఇండియా, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థల చేత చేయించే పనికి ప్రభుత్వాలు పూనుకోనందునే బొగ్గును అధికధర పెట్టి కొనాల్సిరావడం వలన విద్యుత్ వినియోగదారులు సర్‌ఛార్జీల భారం మోయాల్సి వస్తుంది. అంతేకాక బడా బహుళజాతి సంస్థలు దేశంలో లభించే ఇంధనాల ధరలను విదేశాల నుండి దిగుమతి చేసుకునే ధరలతో సమానంగా నిర్ణయించాలన్న గొంతెమ్మ కోర్కెలను కూడా ఆమోదించే స్థితిలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఉంది. ఇష్టారాజ్యంగా విదేశీ కంపెనీలు నిర్ణయిస్తున్న ఫలితంగా పెరిగిన ఇంధన ధరలను ప్రభుత్వాలు వినియోగదారులనుండి ముక్కుపిండి వసూలు చేయడానికి పూనుకున్నది. కె.జి.బేసిన్ డి6 క్షేత్రం నుండి రిలయన్స్ (ఆర్‌ఐఎల్) గ్యాస్ ఉత్పత్తిని, సరఫరాను పథకం ప్రకారం తగ్గించి వేసినందున వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్‌ఎఫ్) 58శాతం, కొత్త ప్రాజెక్టులకు పిఎల్‌ఎఫ్ రెండు శాతమే ఉంటుంది. దీని వలన స్థాపక సామర్థ్యాన్ని వినియోగించుకోలేక ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతాం. దీని

ఫలితంగా యూనిట్ రు.10 చొప్పున చెల్లిస్తామని పంపిణీ కంపెనీలు ప్రతిపాదించక తప్పలేదు. మామూలు సహజ వాయువుతో పూర్తి సామర్థ్యంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే సగటున యూనిట్ ధర రు.3 అవుతుంది. ఈవిధంగా రిలయన్స్ గ్యాస్ దెబ్బవలన మొత్తం రు.5321 కోట్లు అదనపు భారం పడుతుంది.

2010 ఏప్రిల్ నెల నుంచి సర్దుబాటు ఛార్జీలను వినియోగదారులపై వేసేందుకు లెక్కలు సిద్ధం చేసి అక్టోబర్ 2012 నుంచి విద్యుత్ బిల్లు మొత్తాలలో కలిసి ఇస్తున్న బిల్లు మొత్తాలను చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. గత మూడేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రు.15,550 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపింది. ఈ భారాన్ని ఛార్జీల రూపంలో 2010-11లో రు.1400 కోట్లు, 2011-12లో రు.641 కోట్లు, 2012-13లో రు. 4269 కోట్లు పెంచి వసూలు చేస్తున్నది. ఈ భారంకాక సర్దుబాటు ఛార్జీల రూపంలో 2008-09కి రు.1649 కోట్లు, 2010-11కి, 2011-12లకు రు.5852 కోట్లు, 2012-13కి రు.1740 కోట్లు వసూలు చేయడానికి పథకాలు రూపొందించింది. 2008-09, 2009-10 సర్‌ఛార్జీలపై హైకోర్టు తీర్పువల్ల రు.1654 కోట్లు సర్దుబాటు ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా వినియోగదారులపై పడే ప్రమాదం పొంచి ఉంది. పెండింగ్‌లో ఉన్న సర్‌ఛార్జీల మొత్తం కలిపి రు. 11,924 కోట్లు కాగా, ఈ మొత్తాన్ని కేవలం మూడేళ్ల కాలంలో వసూలు చేస్తారు.

ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలతోపాటు ఇంధన సర్దుబాటు ఛార్జీల భారాన్ని నెలవారీ భరించడం నరకంగా మారిన వినియోగదారులను మరింత పాతాళానికి నెట్టే నిర్ణయానికి కిరణ్ సర్కార్ పాల్పడింది. విద్యుత్ ఛార్జీలను ఏకంగా 41 శాతానికి పైగా పెంచి, రు.12,723 కోట్ల భారాన్ని వేయడానికి విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ సిద్ధంగా ఉంది. ఈ తాజా ప్రతిపాదనల ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాలు కుటీర, చిన్న మధ్యతరహా పరిశ్రమలు చావు దెబ్బతింటాయి. సిఆర్‌సి బహిరంగ విచారణ జరిపి నాలుగు పంపిణీ కంపెనీల రివెన్యూ లోటును దానిని భర్తీ చేసేందుకు కాస్ ఆఫ్ సర్వీస్ ఆధారంగా ఏ కేటగిరికి ఎంతమేరకు ఛార్జీలను పెంచాలో ప్రభుత్వానికి తెలియజేస్తుంది. అలానే ఏ కేటగిరికి ఎంత సబ్సిడీ ఇవ్వదలుచుకొన్నది ప్రభుత్వం తెలియచేస్తుంది. అప్పుడు ఆ సబ్సిడీని సర్దుబాటు చేసి మిగిలిన రివెన్యూ లోటును భర్తీ చేసేందుకు ఛార్జీల పెంపుదలను సిఆర్‌సి నిర్ణయించి ఉత్తర్వులను జారీ చేస్తుంది. 2012-13కి, 2013-14కి కిరణ్ సర్కార్ 60శాతం సబ్సిడీ భారాన్ని మోయడం తగ్గించి వేయడంతో విద్యుత్ ఛార్జీలను పెంచాల్సి వచ్చిందని సిఆర్‌సి చెప్పకనే చెప్పింది. అలానే 2013-14లో కొన్ని కింది కేటగిరీలను పెద్దల కేటగిరిలో కలపడం ద్వారా ఎల్‌టిలో ఉండే చిన్న తరహా పరిశ్రమలపై అన్యాయంగా భారం వేసింది.

అంతేకాక ఇంతవరకు ఉన్న టెలిస్కోపిక్ విధానాన్ని ఎత్తివేసి మొదటి యూనిట్ నుంచి పెంచిన ఛార్జీలను లెక్కగట్టే విధానాన్ని ప్రవేశపెట్టాలని చూడడం అంటే వినియోగదారుల నడ్డివిరిచే చర్యలకు పాల్పడడమే. నెలకు 100 యూనిట్లను వినియోగించే వారికి ప్రస్తుతం యూనిట్‌ధర రు.2.60 ప్రకారం రు.260 చెల్లించాలి. 101 యూనిట్లు వాడుకుంటే, పెంచాలని ప్రతిపాదించిన యూనిట్ ధర రు. 5.65 లెక్కన రు.570.65 చెల్లించాలి. అంతే నాన్ టెలిస్కోపిక్ విధానం ఫలితంగా ఒక యూనిట్ అదనంగా వాడుకుంటే రు.310.65 మొత్తాన్ని అదనంగా చెల్లించాలి. నాన్ టెలిస్కోపిక్ విధానం ప్రకారం 200 యూనిట్లకు రు.510, 300 యూనిట్లకు రు.650, 350 యూనిట్లకు రు.742.50లు ప్రస్తుతం వచ్చే బిల్లులకు అదనంగా చెల్లించాలి. కావున నాన్ టెలిస్కోపిక్ విధానాన్ని అమలు పరచడం ఏవిధంగాను సమర్థనీయం కాదు.

విద్యుత్తును తయారు చేయడానికి నీరు, బొగ్గు, సహజవాయువులు మనకు అపారంగా లభిస్తున్నప్పటికీ, పాలకవర్గాలనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలలో భాగంగా మన రాష్ట్ర విద్యుత్తు రంగంలో ఓపెన్ యాక్సిస్, మర్చంట్ ప్లాంట్ల విధానాలను తెచ్చి విద్యుత్తు ధరలను నానాటికీ పెంచుతూ పోవడమే కాక సర్‌ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నాయి. విద్యుత్ రంగంలో సమస్య చార్జీల పెరుగుదల మాత్రమే కాదు. విద్యుత్ ఉత్పాదన, రవాణా, పంపిణీలతో పాటుగా సహజ వనరులైన నీరు, బొగ్గు, గ్యాసు తదితర ఇంధన సరఫరా రంగాలలోనూ, ద్రవ్య రంగం తదితర రంగాలలో మన పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగానే ప్రజలపై వివిధ రూపాలలో భారాలు పడుతున్నాయి.

2013-14 సంవత్సరానికి పెంచిన విద్యుత్ చార్జీలపై సిఆర్‌సి ఫిబ్రవరి 19న విజయవాడలో, 21న విశాఖపట్నంలో, 23న వరంగల్‌లో, 25న హైదరాబాద్‌లలో బహిరంగ విచారణ తతంగాన్ని నిర్వహించింది. విద్యుత్ వినియోగదారుల వెన్ను విరిగేలా ధరలు పెంచిన కిరణ్ సర్కార్ దగాకోరు విధానాలను ఎండకడుతూ, సర్కార్ చేతిలో కీలు బొమ్మగా ఉన్న సిఆర్‌సి బూటకపు విచారణను వెల్లడి చేస్తూ 10 వామపక్ష పార్టీలు పాల్గొని బహిరంగ విచారణను ఎదుర్కోవడంతో ప్రభుత్వం అరెస్టుల పర్వానికి తెరలేపింది. వామపక్ష పార్టీలతో పాటు ఇతర ప్రజా సంఘాలు, వాణిజ్య, పారిశ్రామిక, అసోసియేషన్‌ల ప్రతినిధులు కూడా తమ నిరసనను తీవ్రంగా తెలియచేశారు.

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చే ప్రపంచబ్యాంక్ విధానాలను అమలుపరిచే దానిలో భాగంగానే ప్రైవేటీకరణ విధానాలకు పెద్దపీటవేసి మనకు అపారంగా లభిస్తున్న సహజ వనరులను బడా బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టి ప్రజలపై నానాటికీ భారాలు మోపుతున్నాయి. దానిలో భాగంగా భారీగా పెంచిన, పెంచుతున్న విద్యుత్ భారాలను తగ్గించేంతవరకు, అన్యాయంగా వసూలు చేస్తున్న సర్‌ఛార్జీల వసూళ్లను బేషరతుగా ఉపసంహరించేంత వరకు సమైక్య పోరాటం సాగించడమే ప్రజల ముందున్న కర్తవ్యం. 2000లో విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు సాగించిన ఐక్య ఉద్యమానికి బషీర్‌బాగ్ సంఘటన సంకేతంగా నిలుస్తుంది. అదే విధంగా ఆగస్ట్ 28 పోలీసు కాల్పుల్లో మరణించిన ముగ్గురు యువకుల త్యాగాలు ఉద్యమస్ఫూర్తిని నింపుతాయి. ఇప్పటికే వామపక్ష, విప్లవపార్టీలు దశల వారీగా సాగిస్తున్న పోరాటాన్ని పెంచిన ఛార్జీలను తగ్గించేవరకు కొనసాగించి, సమైక్య పోరాటం సాగించ దానికి వివిధ రంగాలలోని విద్యుత్ వినియోగదారులు సమాయత్తం కావాలి.

*(రచయిత సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు)* వీ

# పోస్కోను నిరసిస్తున్న ప్రజా ఉద్యమం

***అభివృద్ధి పేరు మీద దేశ ఖనిజ వనరులను దోచుకుంటూ, ప్రజలను నిర్వాసితులను చేస్తున్న కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు లాభాలు చేకూర్చడానికి పాలకులు అమలు చేస్తున్న విధానాలను వివరిస్తున్నారు* లోకసంచారి**

విదేశీయులైన బ్రిటిష్ వారు మన దేశాన్ని ఆక్రమించుకొని, పాలిస్తున్న క్రమంలో తమ అధికారాన్ని, దోపిడీని ప్రశ్నించిన వారిని రాజద్రోహ నేరం పేరున జైల్లో పెట్టడం, చంపడం చేసేవారు. 1947లో మనకు విదేశీయుల నుండి 'స్వాతంత్ర్యం' వచ్చిందని బ్రెయిన్ వాష్ చేస్తూ, పోస్కో అనే విదేశీ కంపెనీకి లాభం చేకూర్చడానికి పాలకులు తమ దేశ ప్రజలనే నిర్వాసితులను చేస్తున్నారు. కన్న ఊరును, కడుపు నింపుతున్న ఊరును ఖాళీ చేయం అని అన్నవారిని దేశ ద్రోహం నేరంతో సహా డజన్ల కొద్దీ కేసుల్లో ఇరికిస్తున్నారు. మహిళలను, పిల్లలను, ముసలివాళ్లని కూడా చూడకుండా దాడి చేసి తీవ్రంగా గాయ పరుస్తున్నారు. అత్యంత అధునాతన ఆయుధాలు ధరించిన వేలాది మిలిటరీ సాయుధ బలగాలతో బీభత్సం సృష్టిస్తున్నారు. దాడులలో గాయపడిన వారికి కనీస వైద్యసేవలు అందకుండా, వారు మరణించేట్టు పరిస్థితులు కల్పిస్తున్నారు. 2006 నుండి ఏ ఒక్క రోజూ కడుపు నిండా తిండి, కంటి నిండా కునుకు లేకుండా, దినమొక గండంగా, క్షణమొక యుగంగా గడుపుతున్నారు. ఎప్పుడు ఎవరిని చంపుతారో, ఎవరిని అరెస్టు చేస్తారో, వేలాది మంది సాయుధ బలగాలు ఎప్పుడు, ఎందుకు ఊర్ల మీద దాడికి దిగుతాయో తెలియని పరిస్థితి. బహిర్భూమికి వెళ్లిన వారిని అరెస్ట్ చేయడం, నిత్యావసరాలకో, వైద్యం కోసమో ఊరు దాటగానే పొలిమేరల్లోనే అరెస్ట్ చేయడం నిత్యకృత్యమైంది. దాంతో గత అయిదు సంవత్సరాలుగా ఊరు కూడా దాటని వారు ఎందరో ఉన్నారు.

పోస్కో కంపెనీ కిరాయి గూండాలు 'ప్రజాస్వామ్య', 'గణతంత్ర' భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటికి చెందిన రెవెన్యూ, పర్యావరణ శాఖల నుండి మొదలుకొని పోలీసు, పారా మిలిటరీ శాఖలలో బతుకు తెరువు కొరకు ఉద్యోగాలు చేసుకుంటున్నామని చెప్పే వారు ప్రజల బతుకులను సర్వనాశనం చేస్తున్నారు. ఒక ప్రైవేట్ కంపెనీ కొరకు, అందునా ఒక విదేశీ కంపెనీ కొరకు రాజ్యం ఎందుకు రాజ్యాంగాన్ని, 'ప్రజాస్వామ్యాన్ని', చివరకు కనీస మానవ లక్షణాలైన జాలి, దయలను పాతాళానికి తొక్కి ప్రజల మీద పగ పట్టింది? భారత పాలక వర్గాలకు ఏ లాభమూ లేకుండానే ఇంత అమానుషానికి దిగుతారా? పోస్కో వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభం నుండి ప్రతి నిత్యం జరుగుతున్న పరిణామాలను, రాజ్య హింసను ఫొటోలు, వీడియోలతో సహా ప్రచారం చేస్తున్న వెబ్‌సైట్లు చూసిన తర్వాత కలిగే అనుమానాలు ఇవి. మామూలుగా చూస్తే కనబడని చీకటి కోణాలు ఏవో ఉన్నాయని అనిపించింది. పోస్కో కంపెనీ చరిత్ర ఏంటి? దాని యజమానులు ఎవరు? అని అంతర్జాలంలోని అగాథాలను వెతుక్కుంటూ పోతే ఎన్నెన్నో కోణాలు బయట పడుతున్నాయి. పోస్కో గురించి తెలుసుకుంటే భారతదేశంలో 'అభివృద్ధి', 'పారిశ్రామికీకరణ' అనే మత్తుగొలిపే మాటల వెనుక ఏం జరుగుతున్నది, అసలు భారత దేశానికి, ప్రజలకు ఏం నష్టం జరుగుతున్నదని అర్థమవుతుంది.

పోస్కో కంపెనీ చరిత్ర తెలుసుకునే ముందు ఒడిశాలోని పోస్కో ప్రాజెక్టు వివరాలు, దానికి వ్యతిరేకంగా ప్రజల పోరాటం గురించి తెలుసుకుందాం. జూన్ 2005లో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం పోస్కోతో ఎంఒయు చేసుకుంది. దీని ప్రకారం దాదాపు నాలుగు వేల ఎకరాలలో పోస్కో ఒక ఉక్కు కర్మాగారం స్థాపిస్తుంది. ఇదే కాకుండా పోస్కో కంపెనీకి కావలసిన హైగ్రేడ్ ఇనుప ఖనిజం గ్యారంటీ సప్లయి కొరకు ఒడిశా రాష్ట్రం గనులను కూడా కేటాయించింది. అంతేకాదు, పోస్కో తయారు చేసిన స్టీల్‌ను విదేశాలకు పడవల ద్వారా తరలించడానికి కావలసిన నౌకాశ్రయాన్ని నిర్మించుకోవడానికి కూడా సముద్రపు ఒడ్డున స్థలాన్ని కేటాయించింది. ఇప్పటికే ఉన్న పరదీప్ పోర్ట్‌ను వాడుకోవచ్చు కదా, కొత్త నౌకాశ్రయం ఎందుకు అని ఎవరికైనా అనుమానం రావచ్చు. తన స్వంత నౌకాశ్రయం లేనప్పుడు, ఇతర నౌకాశ్రయాలకు రకరకాల ఫీజులు చెల్లించడం వలన అదనపు ఖర్చులు పెరుగుతాయి. అలాగే, తమ నౌకాశ్రయంలో ఎన్నో రకాల అక్రమాలకు కూడా పాల్పడే సౌలభ్యం కూడా ఉంటుంది. ఇకపోతే, పోస్కో తలపెట్టిన ప్లాంట్, పోర్ట్, గనులు ఈ మూడు కూడా షెడ్యూల్డ్ (అంటే ఆదివాసుల) ప్రాంతానికి చెందినవే. రాజ్యాంగం ప్రకారం అక్కడ ఆదివాసేతరులు గజం భూమి కూడా కొనడానికి, వాడుకోవడానికి అనుమతి లేదు. కాని రాజ్యం తలుచుకుంటే రాజ్యాంగంతో పనే ముంది. జూన్ 2005లో ఒప్పందమయితే, ఆగస్టులో పోస్కో వ్యతిరేక ఉద్యమ సమితి స్థాపించబడింది. పోస్కోకు కేటాయించిన క్యాప్టివ్ మైన్స్ ఉన్న అటవీ ప్రాంతంలో ఆదివాసులను అణచివేసి, రాజ్యాంగ వ్యతిరేకంగా అప్పటికే పెద్ద ఎత్తున మైనింగ్ జరుగుతున్నందున అక్కడ పోస్కోకు ప్రత్యేకంగా వ్యతిరేకత రాలేదు.

అయితే, స్టీల్ తయారీ ప్లాంట్, నౌకాశ్రయం పెట్టడానికి అవసరమయ్యే నాలుగు వేల ఎకరాలు కేటాయించిన ప్రదేశం పుష్కలమైన నీటితో, పచ్చని పంటలకు నిలయం. పోస్కోకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఉద్యమం ప్రారంభించారు. గ్రామస్థులు ప్రభుత్వోద్యోగులను, పోస్కో ఉద్యోగులను తప్ప ఎవరైనా రావడం, పోవడం అనుమతిచ్చారు. పోలీసులు, పోస్కో కిరాయి గూండాలు ఒకరోజు బాంబులతో గ్రామాలకి కాపలగా ఉన్న గ్రామస్థులపై దాడి చేయగా యాభై మంది వరకు గాయపడ్డారు. దాంతో గ్రామస్థులు పారిపోయి ఒక గ్రామంలో దాక్కున్నారు. ఈ రెండు గ్రామాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకొని

(పిల్లలకు విద్యాహక్కు లేదని) స్కూళ్లను ఆక్రమించుకొని, క్యాంపులు పెట్టారు. సామాన్య ప్రజలకు న్యాయం చెప్పడానికి ఏళ్లకు ఏళ్లు తీసుకునే సుప్రీంకోర్టు సరిగ్గా ఎంఒయు జరిగి మూడు నెలలు కూడా కాలేదు, పోస్కో అటవీ భూమిని తన అవసరాలకు వాడుకోవచ్చని, అయితే పర్యావరణ శాఖ మాత్రం 'చట్ట ప్రకారం' పని చేయాలని చెప్పి తీర్పునిచ్చింది. పోస్కో బాధిత గ్రామ ప్రజల ప్రాతినిధ్యం లేకుండానే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆగస్ట్ 2009లో పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం గ్రామసభల అనుమతి పత్రం లేకుండా, వారికి ప్రాజెక్ట్ గురించి, పునరావాసం గురించి చెప్పకుండా అటవీ భూమిని వాడుకోకూడదు. నాలుగు నెలలోనే తన సర్క్యులర్‌ను తానే అతిక్రమిస్తూ పోస్కో ఆ అటవీ భూమిని వాడుకోవచ్చని (ఆ మూడు గ్రామ సభలు భూమి ఇవ్వమని తీర్మానం చేసినప్పటికీ) అనుమతి ఇచ్చింది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే మే 2010లో 25 ప్లటూన్ల సాయుధ బలగాలతో ఆ మూడు ఊర్ల మీద దాడిచేసి దాదాపు యాభై మందిని తీవ్రంగా గాయపరిచి, మార్కెట్‌ను, ఉద్యమకారుల క్యాంపును కాలబెట్టారు. కేంద్ర పర్యావరణ శాఖ నియమించిన సక్సేనా కమిటీ ఆ మూడు గ్రామాలలో అటవీ హక్కుల అమలు పట్ల విచారణ జరిపి ఒడిశా ప్రభుత్వం అటవీ హక్కులను తుంగలో తొక్కిందని, కమిటీకి కూడా ఉద్దేశపూర్వకంగా డేటా ఇవ్వకపోవడం, తప్పుడు సమాచారం ఇవ్వడం చేసిందని రిపోర్ట్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీలు, కోర్టులు అంటూ నాన్చుతూ, జనవరి 2011లో గొప్ప పర్యావరణవాదిగా కార్పొరేట్ మీడియా చేత పొగడబడిన జైరాం రమేశ్ మంత్రిగా ఉన్న కేంద్ర పర్యావరణ శాఖ పోస్కోకు ఫైనల్ క్లియరెన్స్ ఇచ్చింది. సెప్టెంబర్ 2011లో ఒడిశా హైకోర్టు, ప్రభుత్వం ఈ గ్రామాలలో ప్రైవేటేతర భూమి (ఆదివాసుల దగ్గర ఎలాగూ తమ భూములకు పట్టాలుండవు కాబట్టి) స్వాధీనం చేసుకోవడం ప్రజల ప్రయోజనార్థమేనని అనుమతి ఇచ్చింది. ఇప్పుడు పరిస్థితి ఏంటంటే, ఒడిశా ప్రభుత్వం – పోస్కోల మధ్య ఎంఒయు కాల పరిమితి, ఈ కంపెనీకి ఇచ్చిన ప్రత్యేక ఆర్థిక మండలి కాలపరిమితులన్నీ ముగిసిపోయాయి. ఇంకేంటి కథ సుఖాంత మయ్యింది, 'ప్రజాస్వామ్యం' పరిఢవిల్లిందనుకుంటున్నారా? లేదు. ఇక్కడే, 'ప్రజాస్వామ్యం' తన రహస్య నేత్రాన్ని తెరిచింది. రకరకాల ఆకర్షణలతో కొందరిని లొంగదీసుకొని ప్రజలను విడదీయడం, లొంగని వారిపై నిత్యం దాడులు చేయిస్తున్నారు. చివరికి ఈ మధ్యే ఉద్యమ నాయకులపై బాంబు దాడులు చేసి ముగ్గురిని చంపించింది. మొదటి నుండి ప్రభుత్వం, పోస్కో కంపెనీ కిరాయి మూకలు ఎంత హింసాత్మకంగా ప్రవర్తిస్తున్నా పూర్తి అహింసాయుతంగా, వీలైనన్ని ప్రజాస్వామ్య మార్గాల ద్వారా పోరాటం చేస్తున్నారు వారు. ఈ మధ్యే కొందరు స్త్రీలు అర్ధ నగ్నంగా ప్రదర్శన నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినం నాడు పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని ఊరేగింపు తీస్తున్న మహిళలను సాయుధ బలగాలు, పోస్కో గూండాలు తీవ్రంగా గాయపరిచారు. అలాగే పోస్కోను వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులను బాంబులు వేసి చంపారు. దేశంలోని పౌర హక్కుల నిజ నిర్ధారణ కమిటీకి చెందిన ప్రముఖ వ్యక్తులు నిజ నిర్ధారణలో భాగంగా ఆ గ్రామానికి నిజ నిర్ధారణకు వెళితే వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. రెండు గ్రామాల ప్రజలను నయాన భయాన బెదిరించి లొంగ దీసుకొని వారి భూములను స్వాధీనం చేసుకున్నారు, ఇప్పుడు మిగిలింది ఢింకియా అనే ఒక్క గ్రామమే. అయితే, భౌగోళికంగా పోస్కో కంపెనీకి ఈ భూమే కీలకం. బాంబుల దాడి చేసి నాయకులను చంపింది ఈ గ్రామంలోనే.

ఇప్పుడు పోస్కో చరిత్ర చూద్దాం. దక్షిణ కొరియా దేశానికి చెందిన పోస్కో ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద బహుళజాతి స్టీల్ కంపెనీ. మార్కెట్ వ్యాల్యూ ప్రకారం 2010లో పోస్కో ప్రపంచంలో అతి పెద్ద స్టీల్ ఉత్పత్తి సంస్థగా గుర్తింపు పొందింది. 1950ల నుండి భారత దళారీ పెట్టుబడిదారులు తమ అభివృద్ధికి కావలసిన ఉక్కు, బొగ్గు, విద్యుత్ లాంటి అత్యంత పెట్టుబడి అవసరమయ్యే మౌలిక రంగాలలో (ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన ధనంను) ప్రభుత్వంతో పెట్టుబడులు పెట్టించారు. ఆ ప్రభుత్వ రంగ సంస్థల నుండి వివిధ రాయితీల పేరు మీద చాలా చవకగా వాటిని తీసుకొని తాము అత్యంత లాభాలు గడించారు. తర్వాత కాలంలో వివిధ రకాలుగా ఆ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటైజేషన్ పేరు మీద చాలా చవకగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. దక్షిణ కొరియా దళారీ పెట్టుబడిదారులు కూడా అదే కుట్రలను అమలు చేశారు. సామ్రాజ్యవాదులు, వివిధ దేశాలలోని వారి దళారీలు ప్రజల సొమ్ముతో, ప్రజలందరికీ చెందాల్సిన సహజ వనరులను, ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ, అప్పనంగా తాము మిలియనీర్లు, బిలియనీర్లు ఎలా అవుతారో ఏ దేశ చరిత్ర చూసినా, ఏ పెట్టుబడిదారుని చరిత్ర పరిశీలించినా అర్థమవుతుంది. సరిగ్గా పోస్కో కథ కూడా అదే. తమ దేశ పెట్టుబడిదారుల అభివృద్ధికి చవకగా ఉక్కు అవసరమని గ్రహించిన అప్పటి దక్షిణ కొరియా ప్రభుత్వం, 1968లో టేగూటెక్ అనే ఒక ప్రైవేట్ సంస్థతో జాయింట్ వెంచర్‌గా పోస్కో స్టీల్ కంపెనీని స్థాపించింది.

1947కు ముందు ఏ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని కొల్లగొట్టుకుపోయారో వారికే 1947 తర్వాత మన దేశ పాలకవర్గాలు దళారీలుగా మారారు. సరిగ్గా అలాగే, రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు తమ దేశాన్ని ఆక్రమించుకొని, కొల్లగొట్టుకొని, తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగించిన జపాన్ సామ్రాజ్యవాదులకే, యుద్ధానంతరం దక్షిణ కొరియా పాలకవర్గాలు దళారీలుగా మారారు. పోస్కో స్థాపనకు అయిన పెట్టుబడిలో కొంత భాగం దక్షిణ కొరియా ప్రభుత్వం జపాన్ సామ్రాజ్యవాదుల నుండి అప్పుగా తెచ్చుకొంది. టెగూటెక్ కంపెనీ యజమాని అప్పటి దక్షిణ కొరియా ప్రెసిడెంట్‌కు కావలసిన వాడు. అందుకే, పోస్కో కంపెనీని అతని కంపెనీ జాయింట్ వెంచర్‌లో ప్రారంభించారు.

టెగూటెక్ కంపెనీ యజమానే పోస్కో కంపెనీ ప్రెసిడెంట్‌గా ఇరవై ఐదు సంవత్సరాలు తిరుగులేని అధికారాన్ని చలాయించాడు. ప్రతి పెట్టుబడిదారుని చరిత్ర కూడా అన్యాయాల, అక్రమాల, అనైతిక సంపాదనల చరిత్రే అయినప్పటికీ, పాలకవర్గాల మధ్య ఉన్న అంతర్గత వైరుధ్యాల వలన అడపాదడపా కొందరు పెట్టుబడిదారుల అక్రమాలు (అవి కూడా కొన్ని మాత్రమే) బయటకు వస్తాయి. అయితే, అలా అక్రమాలు బయటపడిన తర్వాత సదరు పెట్టుబడిదారునికి కొంచెం నష్టం జరుగుతుందేమో కానీ, ప్రజలకు కలిగే ప్రత్యేక లాభమంటూ ఏమీ ఉండదు. 1990 ఆరంభంలో పోస్కో ప్రెసిడెంట్ అయిన పార్క్ టే జూన్ వ్యతిరేక పెట్టుబడిదారీ వర్గానికి చెందిన వ్యక్తి దేశాధ్యక్షుడు

కావడంతోనే టేజూన్‌పై వివిధ అవినీతి కేసులు వేసి అతన్ని పోస్కో ప్రెసిడెంట్ పదవి నుండి తీసివేయడంతో, తనని అరెస్ట్ చేస్తారనే భయంతో అతడు జపాన్‌కు పారిపోయి ఆశ్రయం పొందాడు. అయితే, మూడు నాలుగు సంవత్సరాలు తిరగకముందే ఆ దేశాధ్యక్షుడు పదవీచ్యుతుడు అయ్యాడు. కొత్త దేశాధ్యక్షుడు జపాన్ పారిపోయిన టేజూన్‌ను ఆహ్వానించి, తిరుగులేని అధికారాలు మళ్లీ కట్టబెట్టడం జరిగింది. పాత దేశాధ్యక్షుడు పదవీచ్యుతుడు కావడం టేజూన్‌కు కొరియాలో తిరిగి పూర్వ వైభవం రావడం మాత్రమే కాదు, అతను ఏకంగా కొరియా ప్రధాన మంత్రి (1996-2000) అవడం వెనుక సామ్రాజ్యవాదుల హస్తం ఉంది. టేజూన్ ప్రధానమంత్రి అవుతూనే, కొరియాలో ఆర్థిక సంక్షోభం బూచితో ప్రైవేటైజేషన్ పరంపర మొదలయింది. ఐఎంఎఫ్ అప్పుల షరతులలో భాగంగా కొరియా ప్రభుత్వం పోస్కోలో ప్రభుత్వ భాగస్వామ్యాన్ని విడుతలు, విడుతలుగా అమ్ముతూ 2001 వరకు వంద శాతం ప్రైవేట్ కంపెనీగా మార్చింది. పుట్టుక రీత్యా పోస్కో దక్షిణ కొరియా కంపెనీ అవడమే కాని, నిజానికి అరవై శాతం పోస్కోలో భాగస్వామ్యం విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోనే ఉంది. ఏ దేశానికి చెందిన బహుళజాతి కంపెనీలను చూసినా ఇదే పరిస్థితి. ప్రపంచంలోని రెండు వేల అతి పెద్ద కంపెనీలలో అతిపెద్ద భాగస్వాములు ఎవరని లోతుగా పరిశోధిస్తే తేలేదేమంటే వారంతా ఒకటేనని. వారే ప్రపంచంలోని దాదాపు 90 వేల అతి పెద్ద పెట్టుబడిదారులు.

పోస్కోలో ప్రధాన భాగస్వాములు ఎవరో చూద్దాం. ప్రపంచంలోని ముగ్గురు అతి పెద్ద ధనవంతులలో ఒకరైన వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హథవే కంపెనీకి పోస్కోలో 4.5 శాతం భాగస్వామ్యం ఉంది. 2007లో 768 మిలియన్ డాలర్లకు 4.5 శాతం పోస్కో షేర్లను కొన్న అతని కంపెనీకి కేవలం మూడు సంవత్సరాలలోనే 1030 మిలియన్ డాలర్ల లాభం వచ్చింది. అంటే ఎంత లాభాలున్నాయో అర్థం అవుతుంది. జనవరి 2010 వరకు (అంటే కేవలం మూడు సంవత్సరాలలోనే) అతని కంపెనీ కొన్న షేర్ల విలువ 2.1 బిలియన్ డాలర్లు (అంటే రెండు వేల పది మిలియన్ డాలర్లు). సరిగ్గా రెండు నెలల తర్వాత వారెన్ బఫెట్ మాట్లాడుతూ 'పోస్కో మేనేజ్‌మెంట్ అద్భుతంగా పని చేస్తున్నది. ఇండియా లాంటి దేశాల్లో పోస్కో చేపట్టిన విస్తరణకు నేను పూర్తి మద్దతు ఇస్తున్నాను' అన్నాడు. 2012లో వారెన్ బఫెట్ భారత ప్రధానమంత్రిని అతని కార్యాలయంలోనే కలిశాడు. ప్రధానమంత్రి కార్యాలయం నుండి బయటకు వస్తున్న బఫెట్ ఫొటో మాత్రమే ప్రచురించిన మీడియా, అతని కంపెనీకి పోస్కోలో భాగస్వామ్యం ఉందని, ఒడిశాలో పోస్కో తలపెట్టిన ప్రాజెక్ట్‌కు అన్నిరకాల అడ్డంకులు తొలగించాలనే విషయంపై మాట్లాడి ఉంటాడనే విషయం రాయలేదు. అది మన దేశ కార్పొరేట్ మీడియా (దు)స్థితి.

దాదాపు అరవై వేల కోట్ల రూపాయల (విదేశీ) పెట్టుబడితో ప్రపంచీకరణ అనంతర భారతదేశ చరిత్రలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా పరిగణించబడుతున్న పోస్కో ప్రాజెక్ట్ పట్ల భారత దళారీ పాలకవర్గాలు ఎందుకింత ఆసక్తి, చొరవ చూపుతున్నాయా? సరిగ్గా, ఇక్కడే వారెన్ బఫెట్ కంపెనీల లాంటి సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి సంస్థల పాత్ర ఉంది. పోస్కో కంపెనీలో వ్యాన్‌గార్డ్, డిఎఫ్ఎ, అలియాన్స్, ఫిడెలిటీ, బ్లాక్‌రాక్, ప్రిన్సిపల్, ట్రాన్స్‌అమెరికా లాంటి వివిధ సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి సంస్థల భాగస్వామ్యం వివిధ స్థాయిలలో ఉంది. అలాగే, బహుళజాతి సంస్థలైన నిప్పాన్ (జపాన్), హ్యూండాయ్ (కొరియా) షిప్‌యార్డ్‌ల భాగస్వామ్యం కూడా ఉంది.

ప్రపంచంలోని అత్యంత ధనవంతుల భాగస్వామ్యంతో నడుస్తున్న పోస్కో కంపెనీకి, వ్యవసాయం మీద బతుకుతున్న పేదల భూమిని లాక్కుని ఇవ్వడమేంటి? ఈ ప్రాజెక్ట్‌కు సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలాలు) హోదా ఇచ్చారు. సెజ్‌లో 'స్వతంత్ర', 'ప్రజాస్వామ్య', 'గణతంత్ర' భారతదేశ రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులు పని చేయవు. సెజ్ హోదా ఉన్న కంపెనీ తమ లాభాలపై కానీ, కస్టమ్స్, ఎక్సైజ్‌లకు కానీ ఒక్క రూపాయి ట్యాక్స్ కట్టనవసరం లేదు. కేవలం మూడు సంవత్సరాలలోనే వారెన్ బఫెట్‌కు పోస్కో కంపెనీలోని 4.5 శాతం వాటా మీద ఎంత లాభం వచ్చిందో చూస్తే, ప్రతి ఏటా పోస్కో భారత దేశంలోని తన ప్రాజెక్ట్ ద్వారా ఎంత లాభాన్ని గడిస్తుందో అర్థం చేసుకోవచ్చు. దేశభక్తులకు ఇంకో శుభవార్త. పోస్కో కంపెనీ భారతదేశంలో ఏటా తయారు చేసే వేలాది టన్నుల అత్యంత నాణ్యతగల స్టీల్‌లో ఒక్క కిలో కూడా భారతదేశంలో అమ్మనవసరం లేదు. చట్టప్రకారం తనకు ప్రపంచంలో ఎక్కడ ఎక్కువ లాభమనుకుంటే ఆ దేశంలో అమ్మవచ్చు. అంటే, భారతదేశ పోలీస్, మిలిటరీ సాయుధ బలగాల పూర్తి రక్షణ తీసుకుంటూ, దేశంలోనే ఒక ప్రత్యేక దేశస్థాయి హోదా కలిగిన సెజ్‌లో, భారత ప్రజలను శ్రమ దోపిడీ చేస్తారు. కనీసం వారికి కార్మిక హక్కులు కూడా చట్ట ప్రకారమే లేకుండా చేస్తారు. సున్నితమైన, కోట్లాది ప్రజల బతుకులతో ముడిపడిన భారత అటవీ, జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తారు. వనరులను కొల్లగొట్టి, ప్రజలను నిర్వాసితులను చేసి, ఉత్పత్తి చేసిన వస్తువులను కనీసం దేశంలో కూడా అమ్మనవసరం లేకుండా విదేశాల్లో అమ్ముకొంటారు. తద్వారా ప్రతి ఏటా సంపాదించే వేలాది కోట్ల లాభాలకు కనీసం దేశంలో ట్యాక్స్ కూడా కట్టనవసరం లేకుండా ఆ లాభాలను ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన పెట్టుబడిదారుల విదేశీ అకౌంట్‌లకు పంపుతారు. వెరసి పర్యావరణ, జీవ వైవిధ్య, హక్కుల, జీవన విధ్వంసం భారతదేశానికి, లాభాలు విదేశాలకు. ఇదే ఒడిశాలో పోస్కో ప్రాజెక్ట్ కాని, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర విదేశీ పెట్టుబడుల వెనుక ఉన్న వాస్తవం.

ప్రజలను అణచడానికి 'ప్రజాస్వామ్యా'నికి పోలీసు, (పారా) మిలిటరీలు కూడా చాలడం లేదు. సామ్రాజ్యవాదులు, వారి భారత దళారీలు కలిసి కార్పొరేట్ ప్రైవేట్ ఆర్మీ కూడా తాయరు చేస్తారు. హైవేలపైన టోల్ బూత్‌ల వద్ద టోల్ ఫీజులు కట్టనన్న ఐపిఎస్ అధికారిని చితక్కొట్టుడు నుండి అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న ఐపిఎస్‌ను చంపడం, పోస్కో లాంటి ప్రాజెక్టుల కొరకు ప్రజల వద్ద నుండి భూములను గుంజుకోవడం, సమ్మె చేసే కార్మికులను చంపడం, బెదిరించడం వరకు రకరకాల బాధ్యతలు రాజ్యం వారి చేతిలో పెట్టింది. కార్పొరేట్ ఆర్మీ, పోలీసు, మిలిటరీ బలగాలతో అన్ని రకాల హక్కులను కాలరాసి దాన్ని ప్రజాస్వామ్యం అంటున్నారు. ప్రజలను నిర్వాసితులను చేస్తూ, జీవనోపాధిని దెబ్బతీస్తూ, వారిని మరింత పేదరికంలోకి నెట్టేస్తూ, దాన్ని 'అభివృద్ధి' అంటున్నారు. కోట్లాది ప్రజల బలవంతపు 'త్యాగాల'ను భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా, సూపర్‌పవర్‌గా ఎదగడానికి కావలసిన 'దేశభక్తి' అంటున్నారు. కోట్లాది సూపర్‌పూర్‌లను తయారు

చేస్తూ, తమ కార్పొరేట్ మీడియాతో సూపర్‌పవర్ కట్టుకథలను చదువు'కొన్న' మధ్యతరగతికి మసాలాలు దట్టించి మత్తెక్కిస్తున్నారు. భారత ప్రజలకు, పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమైన పోస్కో లాంటి ప్రాజెక్ట్‌లను భారత ప్రజల మీద రుద్దడం వెనక భారత దళారీ పాలకులకున్న లాభాలు ఏమిటి? ఈ లాభాలు రకరకాల పద్ధతుల్లో ఉంటాయి. ప్రాజెక్ట్ పరిమానం బట్టి, ఆ కంపెనీకి ప్రభుత్వపరంగా చేకూరుస్తున్న లాభాల బట్టి ముట్ట చెపుతాయి బహుళజాతి కంపెనీలు వేలాది కోట్ల లంచాలు. వీటి గురించి ప్రత్యేకమైన రహస్య ఫండ్ కంపెనీల వద్ద ఉంటుంది. దాన్ని 'స్లష్ ఫండ్' అంటారు.

ఆ లంచాల్లో సింహభాగం అధికార పార్టీకి ఇచ్చి, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు కొంత ఇస్తారు. ఎవరి సంతకాలతో ఫైళ్లు చకచకా కదులుతాయో ఆ బడా అధికారులకు వారి వారి పాత్రల కనుగుణంగా లంచాలు ఇస్తారు. అదనంగా అధికారపక్ష, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కొన్ని సందర్భాల్లో బడా అధికారుల బినామీలు ఆ ప్రాజెక్ట్‌లలో సబ్-కాంట్రాక్ట్ పనులు కూడా తీసుకొని లాభపడతారు. తమకు కావలసిన వారికి ఆ కంపెనీలలో పెద్ద ఉద్యోగాలు ఇప్పించడం లాంటివి మామూలే. అయితే ఇలా అక్రమంగా సంపాదించిన వేలాది కోట్లను బలహీనమైన కరెన్సీ అయిన రూపాయలలోనే దేశంలో ఉంచడం వలన వారికి నష్టం తప్ప లాభం లేదు. అందుకే, దాన్ని విదేశాలలోని తమ రహస్య అకౌంట్‌లలో డాలర్లు, యూరోల లాంటి హార్డ్ కరెన్సీల రూపంలో దాచి, తిరిగి ఆ ధనాన్ని పెట్టుబడిగా పెట్టి లాభాలు ఆర్జిస్తారు. సరిగ్గా, ఇక్కడే వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ లాంటి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కంపెనీల పాత్ర ఉంది. చాలా మంది చదువు'కొన్న', కార్పొరేట్ మీడియా మాఫియా ద్వారా హిప్నటైజ్ కాబడ్డ వారు వారెన్ బఫెట్ చాలా కష్టపడి, తెలివితో, నిజాయితీతో అత్యంత ధనవంతుడు అయ్యాడని నమ్ముతున్నారు. నిజమేమంటే, ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని రాజకీయ నాయకులు, బడా పెట్టుబడిదారులు తమ అక్రమ, అనైతిక వందల, వేల కోట్ల సంపాదనను బెర్క్‌షైర్ లాంటి ద్రవ్య పెట్టుబడి కంపెనీలలో పెట్టుబడిగా పెడతారు. అలా సమకూరిన ధనాన్ని ఆ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా తక్కువ కాలంలో అతి ఎక్కువ డబ్బులు సంపాదించే పోస్కో లాంటి ప్రాజెక్టులలో పెట్టుబడిగా పెడతారు. ఈ ద్రవ్య పెట్టుబడికి కాని, దళారీ పాలకులకు కాని పర్యావరణం, ప్రజలపై ఏ మాత్రం ఆసక్తి ఉండదు. 24 గంటలు వారి మెదళ్లలో తిరిగేది ఒక్కటే, 'అతి తక్కువ పెట్టుబడితో, అతి తక్కువ సమయంలో, అతి ఎక్కువ లాభం చేసుకోవాలి'. అలాంటి ప్రాజెక్టే ఒడిశాలోని పోస్కో ప్రాజెక్ట్. ఏ ఆటంకం లేకుండా ఉంటే, మొదలైన ముప్పై, నలభై సంవత్సరాల తర్వాత పోస్కో కంపెనీ చూసుకోవడానికి భారతదేశంలో ఉండదు. ఎందుకంటే, ఆ కంపెనీ సామర్థ్యం ప్రకారం కావలసిన హైగ్రేడ్ ఇనుప ఖనిజం మన దేశంలో పరిమిత స్థాయిలోనే ఉంది.

మన దేశంలో ఉన్న వనరులను మన దేశ ప్రజలందరికీ సమాన అభివృద్ధి కొరకు మాత్రమే ఉపయోగించే సోషలిస్ట్ వ్యవస్థ ఉంటే, 120 కోట్ల జనాభాకు ప్రపంచంలోనే అత్యంత జీవన ప్రమాణాలు కల అద్భుత వ్యవస్థను నిర్మించగలిగే అరుదైన అనుకూలత ప్రపంచం మొత్తంలో కేవలం భారతదేశానికి మాత్రమే ఉంది. ఈ అరుదైన అనుకూలతను తాము మిలియనీర్లు, బిలియనీర్లు కావడానికి మాత్రమే వాడుకుంటూ కోట్లాది ప్రజల శ్రమను, సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఎయిర్‌పోర్టులు, కార్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్, హైవేలు, రింగ్ రోడ్డుల లాంటి వినియోగ సంస్కృతినే అభివృద్ధిగా చూపుతూ చదువుకున్న మధ్యతరగతి ప్రజల మైండ్ కంట్రోల్ చేస్తున్నారు. వీటన్నింటిని మించిన అద్భుతమైన జీవన ప్రమాణాలు కల వ్యవస్థ ఒకటుందని, దాన్ని నిర్మించుకోవడానికి కావలసిన అరుదైన అనుకూలత భారతదేశానికి ఉందని అర్థం కాకుండా వారిని మత్తులలో ముంచుతున్నారు. ఒక దేశంలోని వనరులపై ఆ దేశ ప్రజలందరికీ హక్కు ఉంటుంది తప్ప, కేవలం కొందరు వ్యక్తులు సహజ వనరులకు యజమానులు ఎలా అవుతారు? వాటిని అమ్ముకొని కేవలం ఆ వ్యక్తులు మాత్రమే లాభపడడం మొత్తం దేశ ప్రజలందరికీ అన్యాయం చేయడం కాదా? అని తమ హక్కులపై కనీస అవగాహన కూడా ప్రజలకు రాకుండా వారిని రకరకాల మత్తులు, భ్రమలల్లో ముంచుతూ రేపన్నది ఒకటున్నదని కూడా పట్టించుకోకుండా దేశాన్ని దోచుకుంటున్నారు.

ఈ సామ్రాజ్యవాదులు, వారి భారత దళారీలు మన భావి భారతపౌరులకు మిగిలిస్తున్నది కాలుష్యం, ప్రకృతి విధ్వంసం, భవిష్యత్ అవసరాలకు లేకుండా పోయిన వనరులు. ఇదే వర్థమాన, భవిష్యత్ దర్శనం. మన మెదళ్లు వాస్తవాలను చూడకుండా ఎక్కిస్తున్న వేలాది రకాల మత్తుల మబ్బులను తొలగించి చూస్తే కనబడే వాస్తవాలు.

పర్యావరణాన్ని నాశనం చేయకుండా ఒక్క డాలర్ కూడా సంపాదించలేని పోస్కోకు కొరియాలో పర్యావరణ అవార్డ్ వచ్చింది. ప్రతిష్ఠాత్మకమైన జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (కలకత్తా) నిపుణులు పోస్కో కంపెనీ వలన పర్యావరణ నష్టం జరగదని, ప్రజల జీవనోపాధి కూడా దెబ్బతినదని రిపోర్ట్ ఇచ్చారు. నాలుగు బొక్కలు పడేస్తే మా లాంటి బాగా చదువు'కొన్న'వారు కూడా అమ్ముడు పోతారని నిరూపించారు. అలాగే, పర్యావరణ శాఖ తరపున, పోస్కో కంపెనీ తరపున ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అమ్ముడుపోయి ఇలాంటి రిపోర్ట్‌లే ఇచ్చారు. పెద్ద చదువులు చదివిన వారు కూడా మానవత్వాన్ని మరిచి తమ స్వార్థం కొరకు ప్రజాద్రోహులుగా మారవచ్చని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి.

ఇప్పటికే రెండు గ్రామాలు ఓడిపోయాయి. ప్రపంచంలోని అత్యంత క్రూర, అమానవీయ పెట్టుబడిదారులను, వారి దళారీలనురెండు వేల జనాభా కలిగిన అతిపేద రైతులు, కూలీలు అహింసాయుతంగా ఎదుర్కొంటున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల అనంతరం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మిలాఖతైన దళారీ పాలకులు దేశంలో సృష్టించబోయే అతి పెద్ద విధ్వంసాన్ని ఈ చిన్న గ్రామం తట్టుకుంటుందా, వేచి చూడాలి.

గౌతం నవ్‌లఖా అనే దేశంలోని ఒక ప్రముఖ జర్నలిస్ట్ తన వ్యాసంలో ఎంఒయులు చేసుకున్నప్పటికీ ఆ భూమిని చూడడానికి కూడా పోలేని పరిస్థితి కేవలం మావోయిస్టుల జనతన సర్కార్ నడుస్తున్న దండకారణ్యంలో మాత్రమే ఉందని రాశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పోరాటాలను కూడా క్రూరంగా అణచివేస్తూ పైచేయి సాధిస్తున్న పాలకవర్గాలు, ప్రజలను కేవలం సాయుధ పోరాటమే ఏకైక, సరైన మార్గమనే పరిస్థితికి నెడుతూ తమ సమాధులు తామే తవ్వుకొని మరణానికి సిద్ధమవుతున్నారు.

*(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త)* వీ

# తెలంగాణ ఉద్యమం ముందున్న ప్రమాదాలు

*నాలుగు సంవత్సరాలుగా ప్రతిష్టంభనలో ఉన్న తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లనూ, వాటిని అధిగమించే మార్గాలనూ వివరిస్తున్నారు* **ఎడ్ల పోచయ్య**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలనే కోరిక ప్రజలలో అరవై ఏళ్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు 1952 ముల్కి ఆందోళనలో, 1954-55 ఫజల్ అలీ కమిషన్ విచారణలో, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంగా 1956లో అది వ్యక్తమయింది. నలభై ఏళ్ల కింద, 1969లో ఆ కోరికతోనే పెద్ద ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. అయితే అప్పుడెప్పుడూ ఆ కోరిక ఇవాళ ఉన్నంత బలోపేతమైన స్థితికి రాలేదు. పదిహేను సంవత్సరాల కింద మొదలయిన ప్రస్తుత దశ ఉద్యమం క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ సారి ఉద్యమం 2009 డిసెంబర్ 9 ప్రకటన తర్వాత, డిసెంబర్ 23 నమ్మకద్రోహం తర్వాత నలభై నెలలుగా నిర్విరామంగా సాగుతున్నది. తెలంగాణ ప్రజానీకం మొత్తం, (కనీసం ప్రత్యర్థులు గుర్తిస్తున్నట్టు అత్యధికభాగం) ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ప్రకటిస్తున్నారు. అనేక స్థాయిలలో తమ ఐక్యతను, పాలకనీతి పట్ల నిరసనను తెలియజెపుతున్నారు. ఏదో ఒక స్థాయిలో ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు.

అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోస్తాంధ్ర, రాయలసీమ సంపన్న స్వార్థ రాజకీయ శక్తులు, తెలంగాణ దళారులు పన్నుతున్న వ్యూహాల వల్ల, చేస్తున్న ద్రోహాల వల్ల, అబద్ధ ప్రచారాల వల్ల, లోపాయకారీ అక్రమ కార్యకలాపాల వల్ల తెలంగాణ రాష్ట్ర సాధన ఆలస్యమవుతున్నది. మూడున్నర సంవత్సరాల కింద కేంద్ర ప్రభుత్వం స్వయంగా చేసిన ప్రకటనకు దిక్కులేని స్థితి ఏర్పడింది. ప్రజా ఆకాంక్షలు బలంగా ఉన్నందు వల్ల ఉద్యమం ఏదో ఒక నాటికి తన లక్ష్యం సాధించుకోవచ్చు. కాని ఈ ఆలస్యం వల్ల ఉద్యమం ముందర ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆ ప్రమాదాలను గుర్తించి, చైతన్యవంతంగా అధిగమించకపోతే ఉద్యమం విజయం సాధించినా ఆ విజయం సుస్థిరంగా నిలబడదని భయం కలుగుతున్నది. అందువల్ల కొన్ని ప్రధాన ప్రమాదాల గురించి తెలంగాణ ఉద్యమకారుల ముందర చర్చ పెట్టడమే ఈ వ్యాస లక్ష్యం. ఇవాల్టి స్థితిలో గుర్తించగలిగిన ప్రమాదాలు 1. వాయిదాలకు బలికానున్న ఉద్యమం, 2. నిరాశ వ్యాపించడం. 3. అనైక్యత ప్రబలడం. 4. మతోన్మాదం పెచ్చరిల్లడం. 5. ఎన్నికల రాజకీయాల మాయ. 6. నాయకత్వ విద్రోహం. 7. సరైన పోరాటరూపాలు చేపట్టలేని స్థితి.

వాయిదాలు తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ ఉద్యమం కావడం వల్ల ఏకకాలంలో ప్రజల ఉద్యమంగానూ, పాలకులలోని ఒక సెక్షన్ ఉద్యమంగానూ కూడ ఉంది. తెలంగాణా ఉద్యమంలో ప్రజల ఆకాంక్షలు, ప్రజా ప్రయోజనాలు బలంగా ఉన్నప్పటికీ, ఆ ఉద్యమంలో స్వభావ రీత్యా పాలకవర్గ డిమాండ్లు కూడ ఉన్నాయి. అది రాజ్యాంగబద్ధమైన ఉద్యమం. చట్టం విధించే పరిమితుల లోపల సాగే ఉద్యమం. అంటే పాలకవర్గ ముఠాల సర్దుబాట్లలో, రాజీలలో భాగంగా ఆ ఉద్యమం విజయం సాధించవచ్చు. అదేమీ దీర్ఘకాలిక పంథా ఎంచుకున్న వర్గపోరాటం కాదు. అందువల్ల అది ఎక్కువ కాలం తీసుకోనక్కరలేదు. అయినా ఎందుకు కాలయాపన జరుగుతున్నదో లోతుగా ఆలోచించాలి. పాలకవర్గ ముఠాల మధ్య బలాబలాల పొందిక వల్ల, ప్రజల ఆకాంక్షను తీర్చగూడదని బలమైన పాలకవర్గ ముఠా స్థిరంగా అనుకుంటున్నందువల్ల తెలంగాణ సమస్య పరిష్కారం తీసుకోవలసినదానికన్న ఎక్కువ సమయం తీసుకుంటున్నది. అనవసరమైన వాయిదాలు, విపరీతమైన కాలయాపన జరుగుతున్నాయి. ప్రభుత్వాధినేతలు తమ విశ్వసనీయత ప్రశ్నార్థకమైనా సరే, తెలంగాణ మీద వాగ్దానాలను నిలబెట్టుకోవడం లేదు.

అయితే, వర్గ, కుల, మత విభజనను అధిగమించి సాగే ప్రాంతీయ ఉద్యమానికి ఇటువంటి వాయిదాల పద్ధతి మంచిది కాదు. కాలం గడిచిన కొద్దీ ఐక్యత దెబ్బతినే అవకాశం పెరుగుతుంది. ఏ బృందానికి ఆ బృందమే తన ఆకాంక్షలు తీరగానే ఉద్యమం వదిలిపోయే అవకాశం ఉంటుంది. తమ బృందపు ఆకాంక్షలు తీరుతాయా లేదా, తీరేదాకా ఉద్యమంలో ఉండడం మంచిదా, ఉద్యమాన్ని వదలడం మంచిదా అనే లెక్కలు ప్రతి బృందమూ మొదలుపెడుతుంది. అది ఉద్యమ ఐక్యతకు హాని చేస్తుంది.

అలాగే వాయిదాలకు మరొక కోణం కూడ ఉంది. పాలకవర్గాలు ప్రత్యర్థులను అలసటకు గురి చేసి ఓడించదలచుకునే వ్యూహానికి నిదర్శనం ఈ వాయిదాలు. యుద్ధ తంత్రంలో ఎక్కువ వనరులున్న పక్షం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ తక్కువ వనరులున్న ప్రత్యర్థి పక్షం తనంతట తానే వనరులు పోగొట్టుకుని, అలసి పోయి ఓడిపోయేలా చేయడం అనే వ్యూహం ఉంది. అట్రిషన్ వార్ ఫేర్ అంటారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న ఉద్యమం యుద్ధం కాకపోవచ్చుగాని ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోస్తా, రాయలసీమ పాలకవర్గాలు, తెలంగాణ దళారీలు, మరొకవైపు తెలంగాణ ప్రజలు, తెలంగాణ పాలకవర్గాలలో ఒక భాగం ఎదురుబొదురుగా నిలబడిన ఘర్షణ ఇది. ఇందులో తప్పనిసరిగా మొదటి పక్షానికి ఉన్న వనరులు, శక్తి సామర్థ్యాలు చాల ఎక్కువ. వారు రంగంలో ఎంత కాలమైనా ఉండగలరు. మరొకవైపు తెలంగాణ ప్రజలకు ప్రజాశక్తి, ఐక్యత అనే బలాలే తప్ప ఇతర వనరులు తక్కువ. కనుక ఈ యుద్ధంలో వాయిదా, కాలయాపన వ్యూహాన్ని అనుసరిస్తే తెలంగాణ శక్తులు అలసిపోయి ఓడిపోతాయని తెలంగాణ వ్యతిరేక శక్తులు భావిస్తున్నాయి.

తెలంగాణ శక్తులు, ముఖ్యంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న శక్తులు కూడా ఈ ప్రత్యర్థుల కాలయాపన వ్యూహపు ఊబిలో పడిపోతున్నాయి. స్వయంగా తెలంగాణ ఉద్యమ నాయకులు కూడ వాయిదాలు ప్రకటించడం, కాలయాపనకు ఆమోదించడం జరుగుతున్నది. ప్రత్యర్థులు పన్నుతున్న ఈ వాయిదాల, తాత్సారాల వ్యూహ ప్రమాదాన్ని ఎదుర్కోవడం, తాము కాలయాపనలో భాగం కాకపోవడం, తెలంగాణ రాష్ట్ర సాధన ఇంకెంతమాత్రం ఆలస్యమయినా సహించబోమని క్రియాశీలంగా వ్యక్తీకరించడం ఇవాళ తెలంగాణ వాదుల కర్తవ్యం.

నిరాశా నిస్పృహల వ్యాప్తి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వికసిస్తున్న క్రమంలోనే ఆశ్చర్యకరంగా నిరాశానిస్పృహలు కూడ పెరిగిపోతున్నాయి. ఇవాళ ఉద్యమంలో నిరాశా నిస్పృహలు ఎంతగా వ్యాపించి ఉన్నాయో కొత్తగా చెప్పనక్కరలేదు. నాయకత్వం కూడ తమ ఆకాంక్ష ఎప్పటికి తీరుతుందో కచ్చితంగా చెప్పలేని అనిశ్చిత స్థితి ఉంది. తమ న్యాయమైన ఆకాంక్ష, సుదీర్ఘ కాలంగా ఉన్న ఆకాంక్ష, రాజ్యాంగ బద్ధమైన, ప్రజాస్వామికమైన ఆకాంక్ష, స్వయంగా కేంద్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించిన ఆకాంక్ష ఎందుకు తీరడం లేదో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఎందుకు ఆ కనీస కోరిక నెరవేరడం లేదో వారికి తెలియడం లేదు. ఆ నిస్సహాయత, ఆగ్రహం నిరాశా నిస్పృహలుగా పరిణమిస్తున్నాయి. పేదవాడి కోపం పెదవికి చేటు అన్నట్టుగా తెలంగాణ ప్రజలు ఆ కోపంతో తమ పెదాలు తామే కొరుక్కుంటున్నారు. తెలంగాణ యువతరం ఆత్మహత్యలను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి.

ప్రపంచంలో ఏ ప్రజా ఉద్యమంలోనూ లేని స్థాయిలో ఆత్మహత్యలు జరగడమే ఈ నిరాశా నిస్పృహలకు నిదర్శనం. పైన చెప్పిన కాలయాపన ప్రమాదం పెరిగిన కొద్దీ ఈ నిరాశానిస్పృహల ప్రమాదం కూడ పెరుగుతున్నది. ఉద్యమానికి అవసరమైన గొప్ప మానవశక్తి, యువశక్తి ఇలా ధ్వంసమైపోవడం ఉద్యమ బలాన్ని దెబ్బతీస్తున్నది. ఒక్కరు ఆత్మహత్య చేసుకున్నారంటే కనీసం వందమంది అటువంటి నిరాశకు లోనైనవారు ఉండి ఉంటారు. లేదా ఈ ఆత్మహత్య ఇతరులలో కోపావేశాలను పెంచకపోగా, మరింత నిరాశను వ్యాపింపజేస్తున్నది. అలా క్రమక్రమంగా నిరాశ నిండుతున్న సమాజం ఒక వేళ ఆతర్వాత విజయం సాధించినా, ఆ విజయాన్ని సంపూర్ణంగా అనుభవించడానికి సిద్ధంగా లేని మానసిక స్థితి ఏర్పడుతుంది. అందువల్ల తెలంగాణ ఉద్యమ నాయకత్వం, మేధావి వర్గం ఈ నిరాశా నిస్పృహలను పారదోలడానికి ఇంకా ఏం చేయవలసి ఉందో ఆలోచించాలి. తెలంగాణ యువతరం ఇంకెంతమాత్రమూ ఆత్మహత్యలకు పాల్పడని ఆశావహ స్థితిని కల్పించాలి.

## అనైక్యత

తెలంగాణ ఉద్యమం ప్రస్తుత దశలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో మరొకటి అనైక్యత. చాల ఆశ్చర్యకరంగా తెలంగాణ సమాజమంతా అన్ని విభేదాలనూ పక్కనపెట్టి ఐక్యంగా తెలంగాణ కోరుకుంటున్న దృశ్యమూ నిజమే, తెలంగాణ సమాజం కుల, మత, రాజకీయ, తదితర అనేక విభజనల కింద అనైక్యంగా ఉన్న దృశ్యమూ నిజమే. ఈ రెండు భిన్నమైన దృశ్యాలూ నాణానికి రెండు ముఖాల లాగ ఏకకాలంలో కలిసే ఉన్నాయి. ఈ విభజనల ప్రాబల్యం వల్లనే తెలంగాణ సమాజంలో అత్యధికులు ఇవాళ్టికీ ఒకవైపు తెలంగాణ కోసం పోరాడుతూనే, తమ కుల భావనలు ప్రేరేపిస్తే ఇతర కులాల తెలంగాణ వాదులను వ్యతిరేకిస్తున్నారు. తమ మతభావనలు ప్రేరేపిస్తే ఇతర మతాల తెలంగాణ వాదులను వ్యతిరేకిస్తున్నారు. అన్నిటికన్న ముఖ్యంగా ఒకవైపు తెలంగాణ జండాను ఎత్తిపడుతూనే తమ రాజకీయాభిప్రాయాల జండాను కూడ ఎత్తిపట్టుకుని ఇతర రాజకీయాలు ఉన్నవారిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకవైపు తెలంగాణ అభిమానాన్నీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షనూ ప్రకటిస్తూనే, మరొకవైపు తెలంగాణను వ్యతిరేకిస్తున్న, ద్రోహం చేస్తున్న తమ పార్టీ మీద, తమ పార్టీ నాయకుల మీద అభిమానాన్ని ప్రకటిస్తున్నారు. తెలంగాణ ఆకాంక్షకూ తమ కుల, పార్టీ అస్తిత్వాలకూ పోటీ వస్తే తెలంగాణను పక్కన పెట్టడానికి వెనుకాడడం లేదు. ఈ పరిణామాలకు ఉదాహరణలు ఇవ్వనవసరం లేదు. ఏ రోజు పత్రికలు తిరగేసినా ఈ అనైక్యత కనబడుతున్నది. అలాగే తెలంగాణలో ఏ గ్రామానికి, చివరికి తెలంగాణ ఉద్యమం బలంగా ఉన్న గ్రామానికైనా సరే వెళితే, తెలంగాణ వ్యతిరేక రాజకీయ పార్టీల జెండాలూ, కార్యకర్తలూ ఇవాళ్టికి కూడ కనబడడం ఒక వాస్తవం. తెలంగాణ ఆకాంక్షకు ద్రోహం చేసే తెలంగాణ ప్రాంత మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు మాత్రమే కాదు, తెలంగాణ వనరులను దోచుకు తింటున్న కోస్తాంధ్ర, రాయలసీమ రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు కూడ తెలంగాణలో యథేచ్ఛగా తిరగగలగడం ఈ అనైక్యత వల్లనే. తెలంగాణ శత్రువులకు, ద్రోహులకు కూడ వంతపాడే చిన్న బృందమైనా తెలంగాణలో కనబడుతున్నది. తెలంగాణ సమాజంలోని ఈ అనైక్యతే తెలంగాణ వ్యతిరేకుల బలంగా మారుతున్నది. వైవిధ్యం, భిన్నాభిప్రాయాలు, అభిప్రాయాల మధ్య ఘర్షణ తప్పనిసరిగా ఉండవలసినవే, కాని అవి వైరుధ్యంగా, శత్రుత్వంగా, అనైక్యతగా, మౌలిక ఆకాంక్ష నుంచి దూరం తీసుకుపోయేవిగా మారకుండా చూడడం ఉద్యమ నాయకత్వ బాధ్యత.

## మతోన్మాదం

తెలంగాణ సమాజం ముందర ఇంకా ప్రధానమైన సమస్య, పెరిగిపోతున్న సమస్య హిందూ మతోన్మాదులది. తెలంగాణ ఒకప్పుడు మతసామరస్యానికి, సహజీవనానికి ప్రతీక. వీరోచిత రైతాంగపోరాటాల సంప్రదాయం వల్ల, భూస్వామ్య వ్యతిరేకత వల్ల తెలంగాణలో భూస్వామ్య, హిందూ మతోన్మాద రాజకీయాల సంఘ పరివార్ కు ఎప్పుడూ స్థానం లేకుండింది. ఎంత ప్రయత్నించినా భూస్వాముల పిల్లలు తప్ప మరెవరూ పెద్దగా అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ లో చేరలేదు. గ్రామాల నుంచి పారిపోయివచ్చిన భూస్వాములు తప్ప మరెవరూ భారతీయ జనతా పార్టీలో చేరలేదు. కాని తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని సంఘ పరివార్ శక్తులు తెలంగాణలో కాలు నిలదొక్కుకున్నాయి.

యుపిఎ ప్రభుత్వం చేసిన, చేస్తున్న మోసాలను చూపుతూ, ఇవాళ ఎన్‌డిఎ కు నాయకత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ తాను తెలంగాణకు న్యాయం చేస్తానని చెపుతున్నది. కాని తెలంగాణకు మోసం చేయడంలో ఆ పార్టీ చరిత్ర యుపిఎ కన్న, కాంగ్రెస్ కన్న భిన్నమైనదేమీ కాదు. రాష్ట్ర విభజనకు అనుకూల తీర్మానం చేసి, ఒక వోటు – రెండు

రాష్ట్రాలు అని ఎన్నికల నినాదం ఇచ్చి నమ్మకద్రోహం చేసిన చరిత్ర భారతీయ జనతా పార్టీది. కేంద్ర ప్రభుత్వ అధికారం నిలుపుకోవడం కోసం, ఒక తెలంగాణ ప్రత్యర్థి పార్టీని సాకుగా చూపి తన వాగ్దానాన్ని వదులుకున్న చరిత్ర భారతీయ జనతా పార్టీది. అయినా తెలంగాణ ఉద్యమ నాయకత్వం భారతీయ జనతా పార్టీ మీద, వస్తుందో రాదో తెలియని ఎన్‌డిఎ ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుంటున్నది, ఆశలు పెంచుతున్నది. నిజానికి 2014 ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ – ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చినా, 1999–2004 కాలంలో నమ్మకద్రోహం చేసిన కారణమే మళ్లీ కూడ వస్తుంది. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామి అయిన ఏదో ఒక చిన్నపార్టీ తెలంగాణకు అభ్యంతరం చెపుతుంది. అది చూపి భారతీయ జనతా పార్టీ వెనక్కి పోతుంది.

భారతీయ జనతా పార్టీ మీద నమ్మకం పెట్టుకునే క్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకత్వం నరహంతకుడు నరేంద్ర మోడీతో భుజాలు రాసుకోవడానికి కూడ ప్రయత్నిస్తున్నది. ఏప్రిల్ మొదటి వారంలో నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వస్తాడని, తెలంగాణ రాష్ట్ర సమితి అతనితో పాటు సభలలో పాల్గొంటున్నదని వస్తున్న వార్తలు నిజమైతే రానున్న తెలంగాణను అనుమానించక తప్పదు. ప్రత్యేకించి తెలంగాణలో ఉన్న ముస్లిం జనాభా దృష్టిలో చూసినప్పుడు అటువంటి మతోన్మాద పార్టీతో, అందులోనూ నరేంద్ర మోడీతో పూసుకుని తిరగడం తెలంగాణ ఉద్యమానికి ఎంతమాత్రం మంచిది కాదు. ఈ వాదనకు అర్థం కాంగ్రెస్ తక్కువ మతోన్మాద పార్టీ అనో, కాంగ్రెస్ ను నమ్మాలనో కాదు. ఏ పార్టీకీ తోకగా ఉండకుండా, ఏ పార్టీ మీద మితిమీరిన ఆశలు పెట్టుకోకుండా స్వతంత్రంగా తెలంగాణ కోసం పోరాడవలసిన చోట ఏ ఒక్క పార్టీ చంకలో దూరినా కష్టమే. అందులోనూ నిన్నామొన్నా గుజరాత్ లో వేలాదిమంది ముస్లింల నెత్తురంటిన చేతుల చంకనెక్కడానికి ప్రయత్నించడం మరింత ప్రమాదం. తెలంగాణ సాధించడానికి పూర్తి నమ్మకం ఉంచవలసింది, పూర్తిగా ఆధారపడవలసింది తెలంగాణ ప్రజల మీదనే గాని, తెలంగాణ వ్యతిరేక రాజకీయ పార్టీల మీద కాదు.

## ఎన్నికల రాజకీయాలు

ఈ ప్రమాదాలకు దారితీసేలా తెలంగాణ ఉద్యమం సాగుతుండడానికి ఒక ముఖ్య కారణం ఒక న్యాయమైన, విశాలమైన ప్రజా ఆకాంక్షను అక్రమాలతో నిండిన, సంకుచితమైన పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలతో ముడిపెట్టడమే. ఒక రాష్ట్ర ఏర్పాటు అనేది రాజ్యాంగ బద్ధమైన చర్య కాబట్టి, రాజ్యాంగ అధికరణం 3 ప్రకారం పార్లమెంటులో చట్టం కావలసి ఉంటుంది కాబట్టి, పార్లమెంటరీ రాజకీయ పార్టీల ప్రమేయం, భాగస్వామ్యం, మద్దతు తప్పనిసరిగా అవసరమే. కాని ఈ దేశంలో పార్లమెంటరీ రాజకీయ పార్టీలు ఎంత ప్రజలకు దూరమయ్యాయో, ప్రజావ్యతిరేకంగా ఉన్నాయో అందరికీ తెలుసు. ఐదేళ్లకోసారి ఎన్నికలలో వోట్ల కోసం ప్రజల దగ్గరికి రావడం తప్ప నిత్యం ప్రజల బాగోగులు చూస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల ప్రతినిధులుగా ఉండే పార్లమెంటరీ రాజకీయ పార్టీ ఒక్కటి కూడ లేదు. తమ పార్టీ మనుగడ, అభివృద్ధి, నిధులు, వోట్లు, అధికారం ఒకపక్కనా ప్రజలు మరొకపక్కనా ఉంటే అన్ని పార్టీలు కూడ ప్రజలను వదిలి తమ సంగతి తాము చూసుకునే స్థితిలోనే ఉన్నాయి.

ఈ స్థితిలో తెలంగాణ రాష్ట్ర సాధన బాధ్యతను పూర్తిగా రాజకీయ పార్టీలకు అప్పగించడం మంచిది కాదు. అలాగే ఎన్నికల గెలుపు ద్వారా ప్రభుత్వాలను, పార్టీలను తెలంగాణకు అనుకూలం చేయగలమనే ఆలోచన కూడ పూర్తిగా సరైనది కాదు. ఎన్నికల గెలుపు ఓటములు పూర్తిగా ప్రజాభిప్రాయం మీద ఆధారపడి ఉండవు. అలాంటి గెలుపు సాధించినా అది ఎక్కువలో ఎక్కువ ప్రజాభిప్రాయం తెలంగాణకు అనుకూలంగా ఉన్నదనే సూచిక మాత్రమే అవుతుంది. ఎన్నికల అవసరం లేకుండానే అటువంటి సూచిక ఇప్పటికి ఎన్నో సార్లు బయటపడింది. ఎప్పటికైనా ఎన్నికలలో అన్నిటికన్ని స్థానాలూ గెలుచుకోగలిగినా తెలంగాణ ఆకాంక్ష సాధించగలిగినది లోకసభలో 17 స్థానాలు (మొత్తం స్థానాలలో 3.1 శాతం), రాష్ట్ర శాసనసభలో 119 స్థానాలు (40.4 శాతం) మాత్రమే. ఈ సంఖ్యకు సాధారణ ఆధిక్యత కూడ ఎప్పటికీ రాదు గనుక గెలవడం ఎప్పటికీ సాధ్యం కాదు. అంతేగాక, రాజ్యాంగం ప్రకారమే చట్టసభలలో 10 శాతం మంది సభ్యులు హాజరయినా సభ నడవవచ్చుననే నిబంధన ఉంది. కనుక తెలంగాణ సభ్యులందరినీ బహిష్కరించి, సస్పెండ్ చేసి కూడ సభలు విజయవంతంగా నడపవచ్చు.

అంటే అన్నిటికన్ని స్థానాలూ గెలిచినా తెలంగాణకు నైతిక విజయమే దక్కుతుంది గాని, నిజమైన విజయం దక్కదు. తెలంగాణ ఇప్పటికి ఎన్నోసార్లు నైతికవిజయం సాధించింది గాని అవేవీ లెక్కలోకి రాలేదు. అందువల్ల తెలంగాణ రాష్ట్ర సాధనను ఎన్నికల రాజకీయాలకు, గెలుపుకు పూర్తిగా ముడివేయడం ఇప్పటికైనా మానుకోవాలి. దానివల్ల ఎన్నికలపట్ల భ్రమలు పెరగడం, అవి కూలి నిరాశ వ్యాపించడం, ఎన్నికల రాజకీయాల ఫలితంగా అనైక్యత పెరగడం తప్ప ప్రయోజనం లేదు. ఎన్నికలను, ఎన్నికల పార్టీల పనితీరును కూడ ప్రభావితం చేయగల స్థాయికి ప్రజాచైతన్యాన్ని, ప్రజాపోరాట స్ఫూర్తిని, పార్టీల మీద ప్రజల ఒత్తిడిని పెంచడం తప్ప మరొక దారి లేదు.

నాయకత్వ విద్రోహం తెలంగాణ ఉద్యమం ముందు ఉన్న మరొక ప్రమాదం నాయకత్వ విద్రోహం. తెలంగాణ ప్రజానీకం గత ఏడెనిమిది దశాబ్దాలలో అనేకసార్లు తమ ఆకాంక్షలకోసం పోరాడడం, నాయకత్వ విద్రోహానికి బలిఅయి, ఉద్యమం ధ్వంసమైపోవడం చూశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 1969లో ఉవ్వెత్తున లేచినప్పటికీ ఆనాటి నాయకత్వం వల్ల, ముఖ్యంగా మర్రి చెన్నారెడ్డి చేసిన విద్రోహం వల్ల ధ్వంసమైపోయింది. ప్రస్తుతం తెలంగాణ ఉద్యమానికి బహు నాయకత్వం ఉన్నందువల్ల ఒకరు విద్రోహానికి పాల్పడినా మరొకరు అందుకుంటారనే ఆశ ఉంది గాని, ప్రభావశీల నాయకులు విద్రోహం చేస్తే దుష్పరిణామాలు తీవ్రంగానే ఉంటాయి. అనేకమంది నాయకులలో ఏ ఒక్కరు ద్రోహం చేసినా, అది ఉద్యమం మీద ప్రభావం వేస్తుంది. ఆ నాయకుడి వెనుక ఉండే ప్రజాశ్రేణులు చెల్లాచెదురు కావడమో, నిరాశలో మునిగిపోవడమో జరుగుతుంది. ఉద్యమానికి విద్రోహం చేయగల శక్తిసామర్థ్యాలు తమకున్నాయని నాయకత్వంలో అందరికందరూ ఇప్పటికే రుజువు చేసుకున్నారు. క్రియాశీలమైన పోరాటరూపాలు చేపట్టక పోవడం, ముందుకు వెళ్తున్న ప్రజాఉద్యమాన్ని వెనక్కి లాగడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద అనవసర భ్రమలు పెంచడం, తెలంగాణ

శత్రువులతో రాజీలకు సిద్ధపడడం, తెలంగాణ ప్రత్యర్థులకు నిజమైన వేడి తగిలే చర్యలకు వెనుకంజ వేయడం వంటి పనుల వల్ల నాయకత్వాన్ని అనుమానించే స్థితి ఉంది. నాయకత్వాన్ని నిరంతరం జాగ్రత్తగా పర్యవేక్షిస్తుండడం, వారి తప్పిదాలను, పెడధోరణులను, సామరస్యపూర్వక వైఖరులను ఎప్పటికప్పుడు ఎండగట్టి వారిని దారిలో పెట్టడానికి ప్రయత్నించడం ద్వారా ఉద్యమం తన నాయకత్వాన్ని కాపాడుకోగలుగుతుంది. తనను తాను కొనసాగించుకోగలుగుతుంది.

### సరైన పోరాటరూపాలు

ఈ ప్రమాదాలన్నిటినీ అరికట్టగలిగినది క్రియాశీలమైన ప్రజా ఉద్యమం మాత్రమే. సరైన పోరాటరూపాలు చేపట్టడమే. సరైన పోరాట రూపాలు చేపట్టకపోవడమనే ప్రమాదమే మిగిలిన ప్రమాదాలన్నిటికీ కారణమవుతున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అనేది పార్లమెంటరీ రాజకీయ ప్రక్రియ అనేది నిజమే గాని ఆ పార్లమెంటరీ రాజకీయ శక్తుల మీద ఒత్తిడి తేగలిగినదీ, వారిచేత రాష్ట్ర సాధన నిర్ణయాన్ని ప్రకటింపజేయగలిగినదీ ప్రజా ఉద్యమం మాత్రమే. వారి మీద ఆ ఒత్తిడి రావాలంటే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించకపోతే తమ ప్రయోజనాలకు భంగం కలుగుతుందనే భయం వారిలో కలిగేలా చేయడం తప్ప మరొక మార్గం లేదు.

ఇవి పాలకులు ప్రజా ఆకాంక్షల పట్ల గౌరవంతో, భక్తితో, కరుణతో, జాలితో నిర్ణయాలు తీసుకునే రోజులు కావు. ఇవి కచ్చితంగా ప్రజల పట్ల భయంతో మాత్రమే పాలకులు నిర్ణయాలు తీసుకునే రోజులు. ఆ భయం వారికి కలగాలంటే ఇవాళ పాలకులుగా వారు అనుభవిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు దెబ్బ తింటాయనే బెదురు కలగాలి. తెలంగాణ ఇవ్వకపోతే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండబోదని వారికి హెచ్చరిక అందాలి. తెలంగాణ ఇవ్వకపోతే తమ ఆర్థిక ప్రయోజనాలు, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, ట్రాన్స్ పోర్ట్, మీడియా ప్రయోజనాలు దెబ్బతింటాయనే బెదురు కలగాలి. తెలంగాణ ఇవ్వకపోతే సమాజంలో తమ గౌరవ ప్రతిపత్తులు, హోదా తగ్గిపోతాయనే భయం కలగాలి. ఇన్నికోట్లమంది ప్రజల న్యాయమైన ఆకాంక్షను, ఇన్ని వందల మంది యువకుల ఆత్మబలిదానాల తర్వాత కూడ సమర్థించడంలేదంటే వారు ఎంత నీచులో లోకం గుర్తిస్తుందనీ, నమోదు చేస్తుందనీ భయం కలగాలి.

ఇప్పటికి తీసుకున్న పోరాట రూపాలలో అత్యధిక భాగం ఈ రాజకీయ, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలను దెబ్బతీయ గలిగినవి కావు. అవి అటు ప్రత్యర్థులకు ఏ హానీ జరగకుండా, ఇటు ఆందోళనకారులకు సంతృప్తి కలిగేలా తయారయినవి. ఇప్పటికైనా అటువంటి బలహీనమైన, అశక్త పోరాటరూపాలను వదిలిపెట్టి, ప్రత్యర్థిని భయపెట్టి, ఒత్తిడి తేగల పోరాట రూపాలను చేపట్టడమే తెలంగాణ ఉద్యమం ముందున్న కర్తవ్యం. అది మాత్రమే తెలంగాణ ఉద్యమం ముందున్న ప్రమాదాలన్నిటినీ నివారించగలదు. తెలంగాణ ఉద్యమాన్ని మరొక అడుగు ముందుకు వేయించగలదు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను సఫలం చేయగలదు.

*(రచయిత పాత్రికేయులు)* వీ

## వీక్షణం రచయితలకు సూచనలు

పది సంవత్సరాలలో, నూట నలభై సంచికలలో వీక్షణం రెండు వేలకు పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (ఐదు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పెజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణం కు సరిగ్గా సరిపోతుంది.
- చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్‌లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్‌మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

# 'నీరోస్ గెస్ట్స్' - రైతుల ఆత్మహత్యల చిత్రణ

***కార్పొరేట్ వ్యవసాయం వైపు మొగ్గుచూపడం, ప్రభుత్వ విధానాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారీకరణ వంటివే వ్యవసాయరంగంలో సంక్షోభానికి కారణమనీ, వీటి పర్యవసానమే రైతుల ఆత్మహత్యలనీ అంటున్నారు* డా. నళిని**

రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేలు వాయించుకున్న నీరో చక్రవర్తి మనకి తెలుసు. కానీ టాసిటస్ చెప్పిన నీరో కథ వేరే ఉంది. 'హిందూ' పత్రిక గ్రామీణ వ్యవహారాల ప్రతినిధి పాలగుమ్మి సాయినాథ్ నోటి ద్వారా ఆ కథ వినవలసిందే. విదర్భ ప్రాంతంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో అతను విస్తృతంగా పర్యటించి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తూ తీసిన డాక్యుమెంటరీ పేరే 'నీరోస్ గెస్ట్స్' (నీరో అతిథులు). పనిపట్ల శ్రద్ధ, సమస్య పట్ల ఆవేదన, పరిష్కారాన్ని వెతకడంలో నిబద్ధత ఇందులో కనపడతాయి.

అతని ముప్ఫై ఏళ్ల పత్రికారంగ అనుభవంలో, ఐదున్నరేళ్లు రైతు ఆత్మహత్యలకే కేటాయించాడు. ఇప్పటికీ మన దేశంలో అరవై శాతం మంది వ్యవసాయం మీదనే ఆధారపడతారనీ, 836 మిలియన్‌ల ప్రజలు రోజుకి యాభై సెంట్ల మీద (డాలరుకి వంద సెంట్లు) బతుకుతారనీ ప్రపంచానికి వెల్లడిస్తాడు. అప్పుల బాధతో దిక్కుతోచక, ఎలాంటి ఆశలేక, 1997 నుంచి రెండు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పత్రికల్లో, టీవీల్లో వీటి ప్రస్తావన చాలా తక్కువే అని చెప్పవచ్చు.

సాయినాథ్ కొన్ని కుటుంబాలను ఉదాహరణలుగా చూపిస్తాడు. వారిలో ఒక దళిత కుటుంబంలో తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరు కొడుకులు బిఏ చదువుతూ మానేశారు. తాకట్టులో భూమి, రైతుల కోఆపరేటివ్‌లో తీసుకున్న అప్పు, బ్యాంకు రుణం. పరిస్థితుల ప్రభావంతో వాళ్లు చదువు మానేసి కుటుంబ బాధ్యతని నెత్తికెత్తుకున్నారు. లింకన్, అంబేద్కర్, లెనిన్, షేక్స్‌పియర్లని అభిమానించే ఆ కుర్రవాళ్లు అప్పుల ఊబిలో కూరుకుపోక తప్పలేదు. వాళ్ల తల్లికి ఏ నష్ట పరిహారమూ అందలేదు.

విదర్భ ప్రాంతంలో 1998లో వారానికి ఒక రైతు ఆత్మహత్య చేసుకునేవాడు. 2002కి అది రోజుకొక చావుగా పరిణమించింది. ఇప్పుడు ప్రతి జిల్లాలో రోజుకి ఇద్దరు, ముగ్గురు చనిపోతున్నారు. ఇదే పరిస్థితి మన ఆంధ్రరాష్ట్రంలో కూడా కనిపిస్తోంది. సాయినాథ్ పోగుచేసిన వందలాది ఫొటోల్లో రెండు ఫొటోలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. కాశీ విశ్వేశ్వర్రావు అభివృద్ధికర రైతుగా ఎంపికయ్యాడు. వ్యవసాయం మన రక్తంలో ఉందని, బతికినన్నాళ్లూ దాన్ని నమ్ముకుని కష్టపడి పని చేయాలని చెప్తూ, ఆత్మహత్యలు చాలా తప్పని కోప్పడేవాడు. కానీ అతనే ఒక రోజు కనుమరుగైపోయాడు. ఇంకొక ఫొటోలో ఒక కుర్రవాడు భయం భయంగా చూస్తున్నాడు. వయసు మించిన భారాన్ని మోస్తున్న భయం. చనిపోయిన తండ్రి కుట్టించుకున్న చొక్కా తొడుక్కుని, పెద్దరికాన్ని నెత్తికి ఎత్తుకున్న అతనికి జీవితమంటే భయం భయం. అతని పక్కన నీరుకారిపోయి గోడకి వేలాడబడిపోయిన తల్లి రూపం. మరొక ఫొటో సుధామణిది. ఆమె తల్లి అనంతపురం జిల్లా రైతు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. కానీ మహిళలు వ్యవసాయం చేయడం ఈ సమాజంలో విడ్డూరం కాబట్టి, ఆమెని రైతుగా గుర్తించలేదు కాబట్టి, నష్టపరిహారం కూడా అందలేదు. తల్లి గురించిన జ్ఞాపకాలు అడిగితే, 'తల్లి పనిచేయని క్షణాలు గుర్తు చేసుకోవాలని ఉంది. కానీ ఒక్కక్షణం కూడా గుర్తు రావడం లేదు. నేను నిద్ర పోతున్నప్పుడు ఆమె పనిచేసేది. నేను మేల్కొన్నప్పుడూ ఆమె పని చేసేది' అంది.

విదర్భలో శ్రీకృష్ణ కలంబ్ ఇంట్లో అంతా నిశ్శబ్దం. ఎన్నోసార్లు కష్టాలు ఎదురైనా చలించని తండ్రి ఈసారి ఎందుకు లొంగిపోయాడో కూతురుకి అర్థం కాలేదు. పక్కన దిగులుగా కూర్చున్న తల్లి. ఆమె త్వరలోనే ఆత్మహత్య చేసుకుంటుందనేది సాయినాథ్ జోస్యం. అలానే ఒకే ఇంట్లో ముగ్గురు మగవాళ్లు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనిపించిన కొంతమంది నిరాశలో పురుగుల మందు తాగారు. (ఆహారం కంటే తేలిగ్గా అదే దొరుకుతుంది!) కానీ 'నా పిల్లల కోసం బతకాలని ఉంది' అంటూ వాళ్లు ఏడవడం కనిపిస్తుంది. అవును, అవన్నీ బలవన్మరణాలే. మన దేశ ఆర్థిక, సామాజిక అధ్వాన్న పరిస్థితులు ప్రేరేపించిన దుర్మరణాలే!

చనిపోయిన రైతు శ్రీకృష్ణ కలంబ్ మంచి కవి కూడా. ఆయన కవిత –

'నేను అందరిలాంటి వాడిని కాను / నా జీవితంలో వైవిధ్యం ఉంది / నా మరణం అకాలమైన వానలా / నిన్ను ముంచెత్తుతుంది / కవిత్వమే ప్రాణంగా / పత్తిమొక్కలా బతుకుతున్నాను / దాని వేరు తీపి / గట్టిపడిన చెరుకు గడ్డ కూడా తీపే.

నా మరణాన్ని చూసి / అందరూ వాపోతారు / గుమ్మాలకి వేలాడుతున్న తోరణాల్లా / నా మరణం కూడా వేలాడుతుంది చూడు!'

ఈ ఉదాహరణల తర్వాత సాయినాథ్ ప్రచార సాధనాలని దుయ్యబడతాడు. ఇలాంటి నిర్భాగ్యులకి మనం ఏ విధంగా స్వాంతన పలకాలి? ప్రపంచంలో కెల్లా వేగంగా పెరుగుతున్న మన ప్రచార మాధ్యమం రాజకీయ స్వేచ్ఛని అనుభవిస్తోంది. కానీ లాభాల వేటలో అది బంధీ అయిపోయింది. మనకి ఫ్యాషన్ రిపోర్టర్లు ఉన్నారు. సామాజిక కరస్పాండెంట్లు ఉన్నారు. కానీ ఒక పత్రికలోనైనా పేదరికాన్ని నివేదించే పూర్తికాలం రిపోర్టర్లు లేరు. ముంబైలో జరుగుతున్న లక్మీ ఫ్యాషన్ వారోత్సవాలని కవర్ చేయడం కోసం 518 మంది కరస్పాండెంట్లు గుమిగూడారు. ఆడపిల్లలు నూలు దుస్తులు ధరించి వయ్యారంగా నడిచిపోతున్నారు. విమానంలో వెళ్తే అక్కడికి గంట దూరంలో, ఆ నూలు బట్టలకి అవసరమైన పత్తిని పండించే స్త్రీ పురుషులున్నారు. వాళ్లు రోజుకి ఆరు నుంచి ఎనిమిది మంది చొప్పున నేలకొరుగుతున్నారు. ప్రభుత్వ విధానాలకి బలైపోతున్నారు.

రైతుగా పుట్టడమే పాపమా అని ప్రశ్నిస్తూ రైతులు నాగ్‌పూర్, నాసిక్, యావత్‌మల్, విదర్భలో ప్రదర్శనలు జరిపారు. ఇది జాతీయ విపత్తు కాదా? ఇది జాతి మొత్తం స్పందించవలసిన సందర్భం కాదా?

బిజినెస్ స్టాండర్డ్ లెక్కల ప్రకారం మన దేశంలో 311 మంది కోటీశ్వరులున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం ప్రపంచ 'ఆనంద సూచికలో' మన దేశానిది నాల్గవ స్థానం! ఈ సంవత్సరం మనకి ఒకటి కాదు, రెండు ఫ్యాషన్ వారోత్సవాలు జరుగుతాయి. శుభవార్త ఏమిటంటే, హిందూస్తాన్ టైమ్స్ లెక్కల ప్రకారం పేదరికం పతాక శీర్షికని ఆక్రమిస్తోంది!

అయితే, పేదలని ఆదుకోవడం కోసం ముందుగా బలవంతులకి సాయం చేయాలన్నది రాహుల్ బజాజ్ ఆలోచన. గొప్పవారి పళ్లేలు నిండి పొర్లిపోతున్నప్పుడు కొంతైనా కింద పడుతుంది కదా. దాన్ని తీసి పేదలకి ఇస్తేపోలా! 'పార్టీలు చేసుకుందాం, మజా చేసుకుందాం, కానీ డొనేషన్ బాక్సులో కొంతైనా వేద్దాం!' అంటూ తళుకు బెళుకు తారలు, విలేకరులు, నాట్యకత్తెలు సందేశమిస్తారు. ఎంగిలి చేతులు విదిలించే వీరి పెద్ద మనసుని శ్లాఘించండి!

మన దేశంలో కరెంటు కోతలో కూడా కుల మత వైషమ్యాలు కనిపిస్తాయి! పత్తి పంటకి పేరుగాంచిన మహారాష్ట్రలోని విదర్భలో ఎనిమిది గంటల కరెంటు కోత. ముంబైలో ఏ కోతా లేదు. అయితే, ఈ దేశంలో మొదటిసారిగా విదర్భ మార్చురీలని కరెంటు కోత నుంచి మినహాయించారు. ఎందుకంటే, ఆ నాలుగు జిల్లాల్లో ఆత్మహత్యలు తెరిపి లేకుండా జరుగుతూనే ఉన్నాయి. పోస్టుమార్టం కోసం కరెంటు కావాలిగా మరి!

ఇక్కడ సాయినాథ్ కొన్ని ప్రశ్నలు వేస్తాడు. వ్యవసాయంలో సంక్షోభం అంటే ఏమిటి? రెండు ముక్కల్లో చెప్పాలంటే 'కార్పొరేట్ వ్యవసాయం వైపు మొగ్గు పెరగడమే వ్యవసాయంలో సంక్షోభం'. మరి ఈ సంక్షోభం ఎట్లా అమలవుతుంది? మళ్లీ టూకీగా చెప్పాలంటే, 'గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారీకరణ వల్ల అది ముదురుతోంది'. దాని పర్యవసానం ఏమిటి? 'మన దేశ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగనంత పెద్ద సంఖ్యలో ప్రజలు నిర్వాసితులవుతున్నారు!'

ఈ ప్రాంతాల్లో స్త్రీలు చీకటితో లేచి, ఇంటి పనులు పూర్తిచేసి, ఇంత తిండి మూటకట్టుకుని, ఉదయం ఆరింటికి రైలెక్కి దూర ప్రాంతాల్లో కూలీకి వెళ్లి, రాత్రి పదకొండు గంటలకి ఇల్లు చేరుతారు. పసిపిల్లలు, తల్లి ముఖం మర్చిపోతున్నారు. కుటుంబాన్ని రక్షించుకోవడం కోసం ఆ స్త్రీలు పడే పాట్లు వర్ణనాతీతం. వాళ్లు ఎప్పుడు తింటారో, ఎప్పుడు విశ్రాంతి తీసుకుంటారో ఎవరికీ తెలియదు.

మరోవైపు, అభివృద్ధి అంటే ఏమిటో తెలియని మేధావులు, ఏనాడూ మట్టివాసన చూడని బడా బాబులు అమెరికాలో, లండన్‌లో చదివి వచ్చి, ఇక్కడ రైతుల జీవితాల మీద నిర్ణయాలు తీసుకుంటారు. ఇదేమి న్యాయం? గత ఇరవయ్యేళ్లలో అన్ని రకాల మానవ విలువలు వినిమయ సరుకులైపోయాయి! వ్యవసాయం లాభదాయకంగా లేదా? అయితే, రైతులని చావనివ్వు! పట్టణాల్లో ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ రంగం బీటలు వారిపోయింది. గత పదేళ్లలో తొమ్మిది లక్షల మంది ఉపాధి కోల్పోయారు. అలాంటప్పుడు వ్యవసాయాన్ని వదిలి ప్రజలు ఎక్కడికి పోవాలి? వారికి విద్యలేదు, వైద్యం లేదు, పారిశుద్ధ్యం లేదు. ఎటు పోదామన్నా దారిలేదు. కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయి. పనికోసం తలోదిక్కు తరలిపోతున్నారు. 90వ దశకంలో ఆరు రాష్ట్రాల్లో ఆకలి సూచికలు ఎందుకు పెరిగాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 1943 బెంగాల్ కరువు తర్వాత ఇదే పెద్ద సంక్షోభం. గత పదిహేనేళ్లలో మన దేశంలో గణనీయంగా పెరుగుతున్నది ఐటి రంగం కాదు, సాఫ్ట్‌వేర్ రంగమూ కాదు. దినదినాభివృద్ధి చెందుతున్నది 'అసమానత్వం, పేదరికం, నిర్వాసితం!'

ఆహార భద్రత రిపోర్టు చూస్తే, 2000-02 మధ్య ఇథియోపియాలో ఆకలి సూచికలు తగ్గాయి. మన దేశంలో అవి పెరిగాయి. రెండు సబ్ సహారన్ దేశాల్లో ఆకలి సూచికలు తగ్గాయి. మన సుసంపన్నమైన భారతదేశంలో ఆకలి సూచికలు పెరిగాయి. 'మేరా భారత్ మహాన్!' నూతన ఆర్థిక విధానాల అమలు కాలంలో ఆహార ధాన్యాల కొరత విపరీతంగా పెరిగింది.

కృష్ణ కలంబ్ రైతు కవి మాటల్లో ఒక పేదతల్లి బాధ చూడండి - 'ఆకలితో చిట్టి తండ్రి / తల్లిని బువ్వ అడిగాడు / కన్నీటితో తల్లి / మండే సూర్యుణ్ని చూపింది / అదే పెట్టమ్మా, కడుపు కాలిపోతోంది / రాత్రంతా తినలేదు, ఆకలవుతోంది / అది మండుతోంది బిడ్డా / దాన్ని చల్లార్చి ఇస్తాను ఆగు / లేదంటే నీ మూతి కాలుతుందిరా / సూర్యుడు తన పని ముగించుకుని / కొండల చాటుకి దిగిపోయాడు / తిండి కోసం చూసి చూసి / చిట్టితండ్రి కడుపులో కాళ్లు పెట్టుకుని / నిద్రపోయాడు.'

మన దేశంలో ఆకలి చావులు విజృంభిస్తున్న కాలంలో ప్రభుత్వం ఏమి చేస్తోంది? 2002-03 మధ్య రెండేళ్ల కాలంలో ఇరవై మిలియన్ టన్నుల ఆహార ధాన్యాన్ని ఎగుమతి చేసింది. మన దేశంలో కిలో ఆరున్నరకి అమ్మే ధాన్యాన్ని విదేశాల్లో ఐదున్నరకే అమ్మింది. దాన్ని ఎవరికి ఎగుమతి చేశారు? యూరప్‌లో పశువుల కోసం ఎగుమతి చేశారు. ఈ భూమి మీద ఆహార భద్రత కలిగి ఉన్న ఏకైక జంతువు యూరప్‌లోని ఆవు. దాని మీద రోజుకి 2.7 డాలర్లు వెచ్చిస్తారు. వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ జవాండియాని ఒక పత్రికా విలేకరి ఇలా అడిగాడు 'జవాండియా సాబ్, భారతదేశ రైతు ఏమని కలకంటాడు?' ఎలాంటి శషభిషలు లేకుండా జవాండియా ఒకటే సమాధానం చెప్పాడు 'యూరప్‌లో ఆవుగా పుట్టాలని!'

పత్తి మీద మన దేశంలో ఇచ్చే రాయితీ మరీ అధ్వాన్నం. కానీ అమెరికాలో 2001లో మూడు బిలియన్ డాలర్ల పత్తిని పండిస్తే, దాని మీద రాయితీ 3.9 బిలియన్ డాలర్లు! 2005లో 3.9 బిలియన్ డాలర్ల పత్తి పండితే, ఇరవై వేల మంది రైతులకి అందిన రాయితీ 4.7 బిలియన్ డాలర్లు! ఈ విధానం వల్ల విదర్భలో, పశ్చిమ ఆఫ్రికాలో పత్తి రైతు నాశనమైపోయాడు. పశ్చిమ ఆఫ్రికాలో మాలి, షాద్, భోహినాఫాసో, బెనిన్‌లు పత్తి పంటపైనే ఆధారపడతాయి. 'మీ సబ్సిడీలు మా రైతుల్ని చంపుతున్నాయి' అంటూ ఈ దేశాల అధ్యక్షులు న్యూయార్క్ టైమ్స్‌లో వ్యాసం రాశారు. మరి అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఏమంది? పంటని మార్చుకొమ్మంది. అమెరికా రాయితీలు తగ్గించదు. యూరప్ రాయితీలు తగ్గించదు. అందుకని మీరు ఇంకేమైనా పండించుకోండి!

కాఫీ పంటలని నాలుగు కార్పొరేషన్లు అదుపు చేస్తున్నాయి. 1999-2000లో బ్రెజిల్ దేశంలో కాఫీ రైతులు సమ్మె చేశారు. ఆ కార్పొరేషన్లు వెంటనే కేరళ నుంచి, కెన్యా, టాంజానియాల నుంచి

కాఫీని పెద్ద మొత్తంలో తెచ్చుకున్నాయి. వేరే చోట్ల పెరిగిన కాఫీ పంట వల్ల బ్రెజిల్ రైతులు నాశనమైపోయారు. వారు సమ్మె మాని మళ్లీ పనిలోకి రాగానే కేరళ, కెన్యా, టాంజానియాల్లో కాఫీ ధరలు పడిపోయాయి. పాశ్చాత్య దేశాల్లో పండని పంటలన్నీ మనతో పండిస్తారు. కానీ వాటిని శుద్ధి చేసి వినియోగించే పని మీద మాత్రం పెత్తనం వారిదే. మనం ఆ పనిలోకి దిగితే మనల్ని బహిష్కరిస్తారు. మనకి నష్టం చేస్తారు.

అనేక పంటలు, అనేక ఉత్పత్తులు ఈ సంక్షోభానికి లోనయ్యాయి. వీటిలో ఏమీ మినహాయింపులు లేవు. పత్తి, కాఫీ, మిరియాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. పాశ్చాత్య కార్పొరేషన్ల దోపిడీలో అన్ని పంటలూ నలిగిపోతున్నాయి.

కృష్ణ కలంబం కవిత చూడండి

'మేము వర్షాధ్ మూగ జీవులం / తల్లి పాల దోపిడీని మౌనంగా భరిస్తున్న దూడలం / మా చెమట చుక్కలతో భూమిని తడిపి / ముత్యాలు పండిస్తాం / కానీ మా పాపలు ఆకలితో మాడిపోతారు / పత్తి పంటని మా చెమటతో తడుపుతాం / మా చిరుగుపాతలు మాత్రం అతుకుల బొంతలు / అయినా, అలానే చెమటతో పంట పండిస్తాం / మండీ మండని కాష్టాల మీద / మా శవాలు కాలవు / ఎందుకంటే, వాటికి కట్టెలు చాలవు / మా జీవితాల కళ్లేలు / ఎవరి చేతుల్లోనో / మేము పిండి కొడుతుంటే / నేలంతా మా రక్తంతో చిత్తడవుతుంది.'

సాయినాథ్ చేసిన కృషి వల్ల, వెలికి తీసిన వెతల కథల వల్ల చివరికి ప్రభుత్వం దిగి వచ్చింది 2006-08 మధ్య ఒక రుణాన్ని మాఫీ చేసి, రెండు సహాయ కార్యక్రమాలు ప్రకటించింది. గుడ్డిలో మెల్ల!

ఈ గుడ్డి న్యాయాన్ని ప్రశ్నిస్తూ సాయినాథ్ పార్లమెంటు భవనాన్ని అదరగొట్టాడు. అసమానత పెరిగే కొద్దీ రైతులు అధోగతి పాలవుతున్నారు. తక్కువ వడ్డీకైనా కనీసం ఎనిమిది వేల రూపాయల అప్పు పొందలేదు రైతు. కానీ పెద్ద ఉద్యోగులకి ఆరుశాతం వడ్డీకి బెంజికారు ఆశ చూపుతారు. ఇదేమి న్యాయం? పేదవారికి ఐదు రూపాయలిచ్చి దాన్ని 'రాయితీ' అంటారు. గొప్పవారికి ఐదు మిలియన్లు ఇచ్చి దాన్ని 'ప్రోత్సాహకం' అంటారు. ఎంత ధనికులైతే అంత రాయితీ, లేదా ప్రోత్సాహకం! ధనికులకి భూములిస్తాం, తక్కువ ధరకి కరెంటిస్తాం, ఎన్నో పన్నుల నుంచి మినహాయింపులిస్తాం!

ముంబైలో రాత్రిపూట తళుకు బెళుకుల మాల్స్ చూడండి. మల్టిప్లెక్స్‌లు చూడండి. ఈ ప్రాంతంలో ఇరవై నిమిషాలు కరెంటు ఆపితే విదర్భలో సంక్షోభానికి గురైన అన్ని ప్రాంతాలకు రెండు గంటల కరెంటు అందించవచ్చు. కానీ అలా జరగదు. ఈ అందమైన మనుషులకి, వారి మాల్స్‌కి, వారి మల్టిప్లెక్సులకి ఎలా నష్టం చేస్తారు?

లీలావతి హాస్పిటల్ చూడండి. అపోలో చూడండి. వాళ్లు తమ పడకల్లో 30 శాతం పేదలకి కేటాయించాలనే హామీ మీద వాళ్లకి ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని అప్పజెప్పారు. కానీ ఆచరణలో అది శూన్యం. అలానే, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు 3,600 చదరపు గజాల ప్రభుత్వ భూమిని కేవలం చదరపు అడుగుకి ఒక్క రూపాయి చొప్పున చెల్లించి ఏళ్ల తరబడి అనుభవిస్తోంది.

ఈ ప్రభుత్వం ఎవరిదో, ఎవరి కోసం పనిచేస్తుందో చాలా స్పష్టం! ముంబైలో స్టాక్ ఎక్స్ఛేంజిలో నష్టం రాగానే రెండు గంటలలోపే ఆర్థిక మంత్రి ప్రత్యేక విమానంలో అక్కడికి వచ్చారు. ఏడుస్తున్న కోటీశ్వరుల కళ్లు తుడిచాడు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే, 1995 నుంచి నలభై వేల మంది రైతులు ప్రాణాలు తీసుకున్న విదర్భకి రావడానికి మాత్రం మన ప్రధానమంత్రికి పదేళ్లు పట్టింది.

అందుకే, ఈ దేశంలో పాలకులు పేద ప్రజల పట్ల చూపే నిర్లక్ష్యం, అమానవీయత, అన్యాయ వైఖరి, చాలా అసహ్యకరంగా, అభ్యంతరకరంగా ఉంటుంది. పరిస్థితి అర్థం చేసుకునే ఎవరికైనా కోపం ఉప్పొంగక మానదు. ఆ అన్యాయాన్ని ఎదిరించేందుకు సంసిద్ధులు కాక మానరు.

అసలు నీరో కథ పూర్తిగా వింటే తప్పెవరిదో తెలుస్తుంది. టాసిటస్ విప్పిన చరిత్ర ప్రకారం నీరో రోమ్‌కి నిప్పంటించ లేదు కానీ, ప్రజల దృష్టిని మళ్లించడం కోసం పెద్ద పార్టీ ఏర్పాటు చేశాడు. దాని కోసం రాజుగారు తన తోటనిచ్చారు. రాజనీతిజ్ఞులు, కులీనులు, సమాచార రంగ ప్రతినిధులు, అలా ఎందరో పార్టీకి వచ్చారు. కానీ అంత పెద్ద తోటకి వెలుగుని ఎలా ఇవ్వాలనేది సమస్య అయింది. దానికోసం నేరస్తుల్ని, ఖైదీలని తెచ్చి రాటలకి కట్టేసి, వాళ్లకి నిప్పంటించి, తోటని వెలుగుతో నింపాడు నీరో. అయితే ఇక్కడ, నీరో కంటే నీరో అతిథులదే సమస్య. ఇంతకీ నీరో అతిథులు ఎవరు?

నీ పక్కవాడు మంటలకి ఆహుతవుతుంటే మిఠాయిలు మింగిన మానసిక స్థితిని ఏమనాలి? నీకు వెలుగునివ్వడం కోసం తోటి మనిషి మండిపోతుంటే ద్రాక్ష గుత్తులు ఆరగించే నిన్ను ఏమనాలి?

నీరో అతిథుల్లో కవులున్నారు. కళాకారులున్నారు. సంగీత సారథులు, చరిత్రకారులు, మేధావులు, ఇంకా అనేకులున్నారు. అందులో ఎవరైనా ఇది తప్పని వేలెత్తి చూపారా? ఆపమని అడిగారా? టాసిటస్ చెప్పిన చరిత్ర ప్రకారం ఎవరూ ఈ ఘాతుకాన్ని అడ్డుకోలేదు. ఇంతకీ నీరో అతిథులు ఎవరంటారు?

ఐదున్నరేళ్ల పాటు రైతుల ఆత్మహత్యలని పరిశోధించిన సాయినాథ్‌కి జవాబు దొరికిందట. మనకీ జవాబు దొరికి ఉండవచ్చు.

ఈ సమస్యని తీర్చే విధానాల్లో బేధాభిప్రాయాలు ఉండవచ్చు. విశ్లేషణలో తేడాలు ఉండవచ్చు. కానీ ఒక్క విషయంలో మాత్రం అందరూ ఏకాభిప్రాయానికి రాకతప్పదు. మనం మాత్రం నీరో అతిథులం కాము, కారాదు. అభివృద్ధికి దాన్నే తొలిమెట్టుగా తీసుకుందాం.

ఈ డాక్యుమెంటరీలో చూపిన కుటుంబాల వారు ఇంకా వ్యవసాయాన్నే వృత్తిగా కొనసాగిస్తున్నారు. వ్యవసాయరంగంపై కేంద్రీకరించిన విలేకరులు ఇంకా వాళ్ల కథలు చెప్తూనే ఉన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని ఆపడం కంటే ఆత్మహత్యలని ఆపడం తేలిక. ప్రభుత్వం అదైనా చేయాలి!

మన దేశంలో పేదలు మైనారిటీ కాదు. కోట్లాది జనం నిరుపేదలుగా ఉన్న మన దేశంలో ఈ సమస్యని దాటవేయడం నేరం, క్షమించరాని నేరం. అన్ని దోపిడీ రూపాలకి వ్యతిరేకంగా, పేదరికానికి వ్యతిరేకంగా గొంతెత్తవలసి ఉంది.

వేలాదిగా ఉన్న పత్రికా విలేకరులు ఇలాంటి కథనాలని పరిశీలించి, పరిశోధించాలి. ప్రభుత్వ విధానాల వల్ల అన్ని రంగాల్లో నష్టపోతున్న నిరుపేద జనానికి న్యాయం చేయాలి. అలా తాము నీరో అతిథులం కాబోమని, బాధ్యతగల పౌరులమని చాటి చెప్పాలి.

*(రచయిత శిశు వైద్యులు,*
*ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక నాయకులు)* వీ

# సమాజ స్వభావం - సామాజిక మార్పు

***మళ్లీ ఒకసారి తలెత్తుతున్న ఉత్పత్తి విధాన చర్చలో భాగంగా సామాజిక చరిత్ర నియమాలను విశ్లేషించిన చారిత్రక భౌతిక వాద నేపథ్యంలో సమాజం గురించీ, మార్పు గురించీ వివరిస్తున్నారు ఎన్. వేణుగోపాల్***

*(గత సంచిక తరువాయి)*

**భారత సమాజ పరిణామం**

భారత సమాజ స్వభావం గురించి, భారత సమాజ పరివర్తన గురించి జరిగే చర్చ ఈ సంక్లిష్టమైన, సుదీర్ఘమైన సైద్ధాంతిక చర్చలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. చారిత్రక భౌతికవాదం చెప్పే దశలన్నీ భారత చరిత్రలో యథాతథంగా లేవనేది స్పష్టమే. భారత చరిత్ర రచన, ప్రత్యేకించి ఉత్పత్తి శక్తుల – ఉత్పత్తి సంబంధాల చరిత్ర రచన, క్రమబద్ధంగా జరగలేదు గనుక చారిత్రక భౌతికవాద దృష్టితో భారత చరిత్రలో కచ్చితమైన యుగవిభజన చేయడం కష్టసాధ్యమైన పని. అటువంటి ప్రయత్నం చేసి, భారతదేశంలో బానిస సమాజాన్ని చదవడానికి ప్రయత్నించిన శ్రీపాద అమృత డాంగే 'ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ' (1949) ని దామోదర్ ధర్మానంద్ కొశాంబి అత్యంత తీవ్రంగా విమర్శించాడు. అసలు మార్క్స్ కూడ ఆదిమ బానిస ఉత్పత్తి విధానం కన్న భిన్నమైన ఆసియాటిక్ ఉత్పత్తి విధానం ఇక్కడ ఉండిందని ఊహించాడు. మార్క్స్ తొలుత 1859లో చేసిన ఈ సూత్రీకరణకు ఆ తర్వాత కాపిటల్ రచనా క్రమంలో మెరుగుపెడుతూ వచ్చాడని అనేక ఆధారాలున్నాయి. కాపిటల్‌లో మాత్రమే కాక, 1870లలో రష్యన్ సమాజ శాస్త్రవేత్త మాక్సిమ్ కొవలెవ్‌స్కీకి రాసిన ఉత్తరాలలో కూడ మార్క్స్ ఆసియాటిక్ ఉత్పత్తి విధానాన్ని వివరించాడు. కాపిటల్ రచనకు నోట్స్‌గా ఆయన 1857–58ల్లో రాసుకున్న గ్రంద్రిస్సె 1970లలో మొదటి సారి ఇంగ్లిష్ లోకి అనువాదం అయి వచ్చినప్పుడు ఆసియాటిక్ ఉత్పత్తి విధానం మీద ఆయన ఆలోచనలు పూర్తిగా బయటపడ్డాయి.

అయితే సైద్ధాంతికంగా, సూత్రరీత్యా మార్క్స్ అభిప్రాయాలకు, అవగాహనా చట్రానికి ఎంత శాస్త్రీయత ఉన్నప్పటికీ, భారత దేశం గురించి ఆయన అభిప్రాయాలు ఎక్కువగా ఆయన చదివిన వలసవాద భారత చరిత్రకారుల పుస్తకాల ద్వారా ఏర్పడినవే. అందువల్ల కొన్ని పొరపాట్లు కూడ ఉన్నాయి. భారత చరిత్ర గురించి మార్క్స్ చెప్పిన వాటన్నిటినీ యథాతథంగా ఆమోదించనక్కరలేదని అంటూనే ఆ చారిత్రక భౌతికవాద చట్రాన్ని మాత్రం పాటించవలసిందేనని కొశాంబి అన్నాడు. చారిత్రక భౌతికవాద పద్ధతిని అనుసరించి భారత చరిత్రను ఎలా అధ్యయనం చేయాలో వివరించడానికి 'యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ' (1956) రాశాడు. ఆసియాటిక్ ఉత్పత్తి విధానం అనేదానిపై ఇంకా పరిశోధించి నిగ్గు తేల్చవలసి ఉందనీ, క్రీ.శ. మొదటి సహస్రాబ్దం మధ్య భాగం తర్వాత భారత భూస్వామ్యం రూపొందిందని, అది పైనుంచి భూస్వామ్యంగా, కింది నుంచి భూస్వామ్యంగా నిలదొక్కుకుని, ఇటీవలి దాకా కొనసాగిందని కొశాంబి అన్నాడు. క్రీ.శ. తొలి శతాబ్దాలలో బ్రాహ్మణులకు ఇచ్చిన దాన శాసనాలతో భారత భూస్వామ్యం మొదలయిందని ఆర్ ఎస్ శర్మ అన్నాడు. భారతీయ భూస్వామ్యపు ప్రత్యేక లక్షణాల గురించి, దాని పుట్టుక, పెరుగుదలల గురించి ఎంతోమంది సామాజిక శాస్త్రవేత్తలు చర్చించారు. వారిలో భారతీయ భూస్వామ్యానికి యూరపియన్ భూస్వామ్యం కన్న భిన్నమైన లక్షణాలు ఉన్నాయని గుర్తించినవారున్నారు. గుప్తుల కాలంలో మొదలై, మొఘల్‌ల కాలంలో, అంతకన్న ఎక్కువగా బ్రిటిష్ కాలంలో ఆ భూస్వామ్యం బలం పుంజుకుందని వాదించిన వారున్నారు. అసలు యూరప్ లో ఉన్నటువంటి భూస్వామ్యం భారతదేశంలో ఎన్నడూ లేదని కనుక భారతీయ భూస్వామ్యం గురించి కొత్తగా ఆలోచించాలని అన్నవారూ ఉన్నారు. భారతీయ భూస్వామ్యంలో కులం ప్రధాన పాత్ర పోషిస్తుందని, కనుక కులాన్ని ఉత్పత్తి శక్తుల – ఉత్పత్తి సంబంధాల చర్చలో చేర్చకతప్పదని అన్నవారున్నారు. ఈ భూస్వామ్య దశ నుంచి భారత చరిత్ర ఆ తర్వాతి పెట్టుబడిదారీ దశకు గుణాత్మక పరిణామాన్ని చవిచూసిందా లేదా అని చర్చించేటప్పుడు భారత భూస్వామ్యం గురించి ఇలా లోతుగా ఆలోచించడం అవసరమే.

ఆ చర్చలోని సంక్లిష్టత అంతా ఇక్కడ అవసరం లేదు గాని మొత్తానికి భూస్వామ్య సమాజ గర్భంలోంచి స్వతంత్ర పెట్టుబడి పుట్టి పెరిగే అవకాశాలు భారత సమాజంలో రాలేదు. వలస పాలన కాలంలో పెట్టుబడి ప్రవేశిస్తుండగా కూడ భూస్వామ్యం పట్టు తగ్గలేదు సరిగదా బలపడింది. ఆ పెట్టుబడి వలస పెట్టుబడి గనుక అది స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధిని అనుమతించలేదు. స్థానిక సామాజిక మద్దతు కోసం భూస్వామ్య, అర్ధభూస్వామ్య వర్గాలను పరిరక్షించింది. అలా వక్రమైన పెట్టుబడిదారీ అభివృద్ధి, పెట్టుబడిదారీ విధానం లేని పెట్టుబడి ప్రవేశం, ఉత్పత్తి విధానంలోనూ, అంతకన్న ఎక్కువగా ఉపరితలంలోనూ భూస్వామ్యానికి దన్ను జమిలిగా సాగాయి.

అలా 1947కు ముందు ప్రధానంగా బ్రిటిష్ వలసగా, భూస్వామ్యంగా, అర్ధభూస్వామ్యంగా ఉండిన భారత సమాజం మీద 1947 ఆగస్ట్ 15న అధికారికంగా వలస పాలన తొలగిపోయింది. భూయాజమాన్యంలో గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా తొలిరోజుల్లో కొన్ని చట్టాలు ప్రవేశపెట్టబడి భూస్వామ్యపు చట్టబద్ధత, సాధికారత రద్దయ్యాయి. నామమాత్రంగా ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. అయితే సమాజంలో పెట్టుబడిదారీ బూర్జువా

ప్రజాస్వామిక విప్లవం జరగకుండానే బూర్జువా ప్రజాస్వామిక విప్లవ ఫలితాలయిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ లాంటి సంస్థలను, భావాలను అంటు కట్టడం వల్ల అవి వాటి స్వభావాన్ని మార్చుకుని వక్రీకృత రూపంలో కొనసాగడం మొదలయింది. ఆధునిక యంత్రం ప్రవేశించడానికి తగిన సామాజిక మార్పు జరగకుండానే ఆ యంత్రం దిగుమతి అయితే, కొబ్బరికాయకొట్టి పసుపు కుంకుమలు పెట్టి ఆ యంత్రాన్ని వాడినట్టుగానే ఇక్కడ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, ఆ ఉత్పత్తి సంబంధాలు, ఆ ఉపరితలం ఒక ప్రజాస్వామిక విప్లవం ద్వారా రాకుండా, వాటి చిహ్నాలు మాత్రం దిగుమతి అయినందువల్ల అవి వక్రరూపాలలో మాత్రమే కొనసాగుతున్నాయి. రూపంలో వలస పాలన పోయినట్టు కనబడినా సారాంశంలో ఆ పాలనాంశాలన్నీ యథాతథంగానో, ప్రచ్ఛన్నంగానో మిగిలిపోయాయి. దేశం ఒక్క సామ్రాజ్యవాద దేశానికి వలసగా ఉండిన స్థితి నుంచి అనేక సామ్రాజ్యవాద దేశాలకు అర్ధవలసగా మారిన స్థితి వచ్చింది. భూయాజమాన్య గుత్తాధిపత్యాన్ని చట్టపరంగా తొలగించారు గాని, భూస్వామ్య, అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు, ఉపరితలాంశాలు మరింతగా బలపడ్డాయి. ప్రజాస్వామిక విప్లవానికి కనీస చిహ్నమైన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ సంపూర్ణంగా భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ, దళారీ పెట్టుబడిదారీ శక్తుల చేతుల్లో మిగిలిపోయి, బూర్జువా ప్రజాస్వామిక విప్లవపు తొలిదశ కూడ అమలులోకి రాలేదు. అందువల్ల 1947 తర్వాత భారత సమాజాన్ని అర్ధవలస అర్ధభూస్వామ్య సమాజంగా అభివర్ణించడం మొదలయింది.

అర్ధవలస అర్ధభూస్వామ్య సమాజం అంటే ఆ సమాజం భూస్వామ్య దశ నుంచి పెట్టుబడిదారీ దశలోకి పరివర్తన చెందబోతూ, అవరోధాల వల్ల మధ్యంతరంగా ఆగిపోయిన సమాజం అన్నమాట. ఆ అవరోధాలను సృష్టించినదీ, వాటి వల్ల లాభపడుతున్నదీ దేశీయ, అంతర్జాతీయ పాలకవర్గాలు గనుక వాటిని తొలగించి స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధికి మార్గం సుగమం చేయడం ఈ పాలనలో జరగదు. మరో మాటల్లో చెప్పాలంటే ఈ సమాజం పాత పోకుండా, కొత్త రాకుండా, కొత్తపాతల మేలు కలయిక కూడ ఏర్పడకుండా, పాత ఆధిపత్యంలో, కొన్ని కొత్త అంశాలతో సాగుతున్న సమాజం అన్నమాట. అసలు సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడి భూస్వామ్యంతో పోరాడే ప్రగతిశీల లక్షణాన్ని కోల్పోయింది. అందువల్ల పెట్టుబడిదారీ వర్గ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక, ప్రజాస్వామిక విప్లవం జరగడం, పూర్తిస్థాయి పెట్టుబడిదారీ ఉత్పత్తివిధానం, ప్రజాస్వామిక ఉపరితలం, సామాజిక-ఆర్థిక నిర్మితి ఉనికిలోకి రావడం సాధ్యం కాదు. కార్మికవర్గ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల ప్రజారాశుల ఐక్య సంఘటన మాత్రమే సమాజ పరివర్తన సాగించగలదు. నాయకత్వం మారినందువల్ల ఈ పరివర్తన పెట్టుబడిదారీ విధానంలోకి కాదు. బూర్జువావర్గ నాయకత్వంలోని ప్రజాస్వామిక విప్లవం స్థానంలో కార్మికవర్గ నాయకత్వంలోని నూతన ప్రజాస్వామిక విప్లవం అనివార్య మవుతుంది. ఇది అటు భూస్వామ్య వ్యతిరేక వ్యవసాయ విప్లవ కర్తవ్యాల్నీ నెరవేరుస్తుంది. ఇటు సామ్రాజ్యవాద వ్యతిరేక, పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాల్నీ నెరవేరుస్తుంది. తద్వారా సమాజాన్ని సోషలిస్టు పరివర్తనకు సంసిద్ధం చేస్తుంది.

లెనిన్, స్టాలిన్‌లు సూత్రప్రాయంగా ప్రకటించిన ఈ ఆలోచనల పునాదిపైనే చైనా విప్లవ క్రమంలో మావో నూతన ప్రజాస్వామిక అవగాహనను సైద్ధాంతీకరించాడు. ఆ అవగాహనను భారత కమ్యూనిస్టు పార్టీ 1948-50 మధ్య ఆమోదించి, తన కార్యక్రమంలో భాగం చేసుకుని శ్రేణులకు అందజేసింది. కాని అతి త్వరలోనే ఆ అవగాహనను వదులుకుని కొత్త వ్యూహాన్ని ప్రకటించింది. సోషలిజం అనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని వదులుకోకుండానే, ప్రస్తుత అభివృద్ధి దశలో సోషలిస్టు పరివర్తనను కోరుకోవడం లేదని 1951లో కమ్యూనిస్టు పార్టీ ముసాయిదా కార్యక్రమం స్పష్టంగానే ప్రకటించింది. అంతకుముందే 1946 ఎన్నికలలో పాల్గొన్నప్పటి నుంచీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంస్థల భ్రమలలో పడిన పార్టీకి వ్యవస్థ పరివర్తన ఆలోచన తగ్గిపోయి, ప్రభుత్వాల మార్పు ఆలోచన మొదలయింది. అలా కేరళలో ప్రపంచం లోనే మొదటిసారిగా ఎన్నికల ద్వారా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం వ్యవస్థ పరివర్తనకు అవసరమైన మౌలిక ఆచరణలో మొదటి అడుగు వేయగానే పాలకవర్గాలు దాన్ని కూలదోశాయి. ఈ వైఫల్యంతో పార్లమెంటరీ ఎన్నికల సామర్థ్యం గురించి పునరాలోచించి ఉండవలసిన భారత కమ్యూనిస్టు పార్టీ ఆ పని చేయలేదు. ఆ తర్వాత తీవ్రమైన అంతర్గత చర్చతో రూపొందిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కూడ ఈ మౌలిక అవగాహనలో భిన్నంగా ఆలోచించలేదు. ఈ రెండు పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలూ భారత సమాజాన్ని పెట్టుబడిదారీ సమాజంగా, లేదా భూస్వామ్య అవశేషాలున్న పెట్టుబడిదారీ సమాజంగా నిర్వచిస్తున్నాయి. భూస్వామ్య, అర్ధభూస్వామ్య లక్షణాల గురించి చెపుతున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానమే ప్రధాన ఉత్పత్తి విధానమని అంటున్నాయి. సమాజ స్వభావం పెట్టుబడిదారీ విధానమని అన్నప్పుడు సోషలిస్టు విప్లవమే కర్తవ్యం అనడం సైద్ధాంతికంగా సరిపోతుంది. కాని, రెండు కమ్యూనిస్టు పార్టీలు కూడ ఇప్పటికీ భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక జనతా ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాల గురించి కూడ మాట్లాడుతున్నాయి.

అర్ధభూస్వామ్య అర్ధవలస స్వభావం నక్సల్బరీ ప్రజ్వలనానికి ముందరి చర్చల్లో భాగంగా రాసిన ఎనిమిది దస్తావేజుల (1965-67)లో చారు మజుందార్ మళ్లీ ఈ సమాజ స్వభావ అంచనా చర్చను బైటికి తెచ్చాడు. ఈ చర్చలవల్ల, దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజా ఉద్యమ ఆచరణ వల్ల 1969 ఏప్రిల్ 22న ఉనికిలోకి వచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) భారత సమాజ స్వభావం అర్ధవలస అర్ధభూస్వామ్యం అనీ, అందువల్ల ఇక్కడ వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే నూతన ప్రజాస్వామిక విప్లవం జరగవలసి ఉన్నదని, ఇది కార్మికవర్గ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల ప్రజారాశుల ఐక్య సంఘటనా పోరాటంగా ఉంటుందనీ, ఇందులో నాలుగు వర్గాల (కార్మికులు, రైతాంగం, పెటీ బూర్జువావర్గం, జాతీయ బూర్జువా వర్గం) ఐక్య సంఘటన సామ్రాజ్యవాదానికీ, దళారీ బడా బూర్జువా వర్గాలకూ, భూస్వామ్య వర్గాలకూ వ్యతిరేకంగా పోరాడు తుందనీ, ఈ పోరాటం దీర్ఘకాలిక ప్రజాయుద్ధంగా ఉంటుందనీ, ఈ ప్రజాయుద్ధపు ప్రధాన రూపం సాయుధ పోరాటం అనీ సూత్రీకరించింది. మరొకవైపు నుంచి చెప్పాలంటే ఈ సమాజంలో నాలుగు వైరుధ్యాలు

ఉన్నాయనీ అవి, సామ్రాజ్యవాదానికీ దేశప్రజలకూ మధ్య, అశేష ప్రజానీకానికీ భూస్వామ్యానికీ మధ్య, పెట్టుబడికీ శ్రమకూ మధ్య, పాలకవర్గ ముఠాల మధ్య ఉన్న వైరుధ్యాలనీ నక్సల్బరీ సూత్రీకరించింది. వీటిలో మొదటి రెండు మౌలిక వైరుధ్యాలని, భూస్వామ్యానికీ ప్రజలకూ మధ్య ఉన్న వైరుధ్యం ప్రధాన వైరుధ్యమని, ఈ వైరుధ్యాల పరిష్కారమే మిగిలిన అన్ని సామాజిక వైరుధ్యాల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని గుర్తించింది.

ఒకవైపు ఒక విప్లవ పార్టీ సమాజ స్వభావం గురించి ఒక నిర్ధారణ ప్రకటించి, సామాజిక పరివర్తనకు ఒక ఆచరణ కార్యక్రమం రూపొందించుకుని అమలు చేస్తుండగానే, మరొకవైపు సామాజిక శాస్త్రవేత్తల మధ్య సమాజ స్వభావం గురించి చర్చ మొదలయింది. ఈ చర్చ 1960 దశకం తొలి రోజుల నుంచి 1980ల తొలి రోజుల దాకా చాల తీవ్రంగా జరిగింది. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (బొంబాయి వారపత్రిక) లో ప్రధానంగానూ, ఫ్రాంటియర్ (కలకత్తా వారపత్రిక), సోషల్ సైంటిస్ట్ (న్యూఢిల్లీ త్రైమాసిక పత్రిక) లో కొంతవరకూ జరిగిన ఈ చర్చలో దాదాపు ముప్పై మంది సామాజిక శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. భారత సమాజాన్ని వీరు పెట్టుబడిదారీ విధానంగా, పెట్టుబడిదారీ పూర్వ స్థితిగా, అర్ధభూస్వామ్యంగా, వలసగా, అర్ధవలసగా, ద్వంద్వ విధానంగా వేరువేరుగా నిర్వచించారు. క్షేత్ర పరిశోధనల ద్వారా, సైద్ధాంతిక ఉటంకింపుల ద్వారా, వ్యాఖ్యానాల ద్వారా, సంవాదం ద్వారా వీరందరూ తమ తమ వాదనలు నిరూపించుకునే ప్రయత్నం చేశారు. అన్ని సైద్ధాంతిక చర్చల లాగనే ఆ చర్చ కూడ ఎటువంటి ముగింపుకూ, సర్వాంగీకారమైన నిర్ధారణకూ రాకుండానే ఆగిపోయింది. (ఈ చర్చ మొత్తాన్ని క్రోడీకరిస్తూ ఆలిస్ థార్నర్ రాసిన సెమి ఫ్యూడలిజం ఆర్ కాపిటలిజం – కాంటెంపొరరీ డిబేట్ ఆన్ క్లాసెస్ అండ్ మోడ్స్ ఆఫ్ ప్రొడక్షన్ ఇన్ ఇండియా, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో 1982 డిసెంబర్ 4, డిసెంబర్ 11, డిసెంబర్ 18 సంచికలలో ధారావాహికగా వచ్చింది. ఈ చర్చలో ప్రధాన వ్యాసాలతో ఉత్సా పట్నాయక్ సంపాదకత్వంలో అగ్రేరియన్ రిలేషన్స్ అండ్ అక్యుములేషన్ – ది మోడ్ ఆఫ్ ప్రొడక్షన్ డిబేట్ ఇన్ ఇండియా పేరుతో ఒక సంకలనాన్ని ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 1990లో ప్రచురించింది).

ఆ నాటి నక్సల్బరీ పంథాను ఆమోదించినవారందరూ అర్ధభూస్వామ్య అర్ధవలస సూత్రీకరణను ఆమోదించారు. నక్సల్బరీ పంథాను ఆమోదించని దేవులపల్లి వెంకటేశ్వరరావు 1971 కోర్టు ప్రకటన 'భారత జనతా ప్రజాతంత్ర విప్లవం' లోనూ, తరిమెల నాగిరెడ్డి 1972లో రాసిన 'ఇండియా మార్ట్ గేజ్డ్' లోనూ కూడ అర్ధభూస్వామ్య, అర్ధవలస సూత్రీకరణ చేశారు. కాని కాలక్రమంలో నక్సల్బరీ పంథా నుంచి దూరమైన చాల పార్టీలూ గ్రూపులూ ఆ సూత్రీకరణమీద సందేహాలు వ్యక్తం చేయడం మొదలుపెట్టాయి. కొన్ని పార్టీలూ గ్రూపులూ మళ్లీ అధ్యయనాలు సాగించి ఆ సూత్రీకరణను మరింత బలంగా చెప్పాయి. (ఆ చరిత్ర కోసం చూ. ఎన్ వేణుగోపాల్, చలనంలో విషయం – చలనంలో అధ్యయనం, వీక్షణం, జనవరి 2013).

కాని నక్సల్బరీ పంథా సమాజ స్వభావాన్ని అర్ధభూస్వామ్య అర్ధవలసగా నిర్వచించి నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత ఈ అవగాహనల మీద చాల ప్రశ్నలు వస్తున్నాయి. నక్సల్బరీ పంథాను వదిలినవారు, విమర్శిస్తున్నవారు, అనుమానిస్తున్నవారు, నిజాయితీగానే సందేహిస్తున్నవారు అనేకులు ఈ ప్రశ్నలు వేస్తున్నారు. మిగిలిన చర్చనీయాంశాలు అలా ఉంచి అసలు భారత సమాజపు మౌలిక స్వభావం అర్ధవలస అర్ధభూస్వామ్యం అనడం సరైనదేనా అని ప్రశ్నలు వేస్తున్నారు. పోరాట వ్యూహాల్ని, ముఖ్యంగా దీర్ఘకాలిక ప్రజా యుద్ధ వ్యూహాన్ని, సాయుధపోరాట రూపాన్ని వ్యతిరేకిస్తున్నవారు ఈ వ్యూహాలకు మూలమైన సమాజ స్వభావ అంచనాను తప్పుపడుతూ ఉండడం గమనించదగిన విషయం. సమాజ స్వభావం గురించీ, పరివర్తనా వ్యూహం గురించీ అవగాహనలు సరైనవే అయితే ఇన్ని దశాబ్దాల ఆచరణ కూడ ఫలితాలు ఎందుకు సాధించలేదని ప్రశ్నిస్తూ, అందువల్ల సమాజ స్వభావ అంచనాను పునరాలోచించాలని కొందరు అంటున్నారు. జరుగుతున్న మార్పులను అర్థం చేసుకోలేక సమాజ స్వభావం గురించి అంచనా సరైనదేనా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

అత్యాధునిక అంశాలూ అత్యంత ప్రాచీన, ఆదిమ అంశాలూ శాంతియుత సహజీవనం చేసే భారతదేశం వంటి సువిశాల దేశంలో ఏ నిర్ధారణ చేయడానికైనా, ఏ నిర్ధారణను బలపరచడానికైనా సరిపోతాయనిపించే దృగ్గోచరాంశాలు ఒక గ్రామంలోనో, పట్టణంలోనో, ప్రాంతంలోనో, ప్రజాసమూహంలోనో దొరుకుతాయి. తాత్వికంగానే ఒకే దృగ్గోచరాంశాన్ని, ఒకే వాస్తవాన్ని భిన్నమైన వ్యాఖ్యాతలు భిన్నంగా నిర్ధారించే అవకాశం ఉంటుంది. అందువల్ల కొంతమంది వ్యాఖ్యాతలు కొన్ని వాస్తవాలను సేకరించి, సాధారణీకరించి సమాజ స్వభావపు అంచనా మార్చుకోవలసి ఉన్నదని వాదించగలుగుతున్నారు. మరి కొంతమంది వ్యాఖ్యాతలు ఆ వాస్తవాలు సేకరించి నిర్ధారించే పని కూడ పెట్టుకోకుండా ఇంతకాలం గడిచింది గనుక, పైపై చూపులకు మార్పులు వచ్చినట్టు కనబడుతున్నాయి గనుక ఆ అంచనా మార్చుకోవాలని వాదిస్తున్నారు. చెప్పి గాని, చెప్పక గాని ఈ రెండు బృందాల వ్యాఖ్యాతల అంతిమ నిర్ధారణ నక్సల్బరీ రచించిన పోరాట వ్యూహాలకు కాలం చెల్లిందని చెప్పడమే.

మరొకపక్క ఒకసారి సమాజ స్వభావాన్ని నిర్ధారించుకుని ఆచరణను నిర్ణయించుకున్న తర్వాత మళ్లీ ఆ విషయంలో చర్చ అనవసరమని భావించే యాంత్రిక వైఖరి కూడ ఉంది. కాని ఎప్పుడైనా జరిగిన, జరుగుతున్న మార్పులను నిశితంగా అధ్యయనం చేసి, వాటిని వివరించవలసి ఉంటుంది. నిజంగానే వివరించలేకపోతే సమాజ స్వభావ అవగాహనను, ఆచరణను మార్చుకోక తప్పదు. సమాజం, సమాజ స్వభావం మారి ఉంటే, తప్పనిసరిగా పోరాట వ్యూహాలను మార్చుకోవలసిందే. మొండిగా పాత సమాజ స్వభావ అంచనాను, పాత పోరాట వ్యూహాలను కొనసాగించడం అదనపు త్యాగాలకూ, సమయమూ శక్తీ వృథా కావడానికీ మాత్రమే దారి తీస్తుంది.

అయితే ఆలోచించవలసిన, వాస్తవాల ఆధారంగా నిగ్గు తేల్చవలసిన సమస్య నిజంగానే సమాజ స్వభావం మారిందా అనేది. సమాజ స్వభావం మారడం అంటే ఏమిటి? ఏ ప్రాతిపదికల మీద సమాజ స్వభావ నిర్ధారణ జరిగిందో ఆ ప్రాతిపదికలు ఏమైనా మారాయా? మారి ఉంటే ఎంతవరకు మారాయి? రూపంలో మారాయా? సారంలో మారాయా?

చూడడానికి కనబడుతున్న మార్పులన్నీ సమాజ స్వభావపు మార్పుకు సూచికలేనా? ఈ ప్రశ్నలకు జవాబులు వెతికే క్రమంలో మూడు రకాల భిన్న వాదనలు కనబడుతున్నాయి.

## భిన్న వాదనలు

ఎంతో మంది వ్యాఖ్యాతలలో ప్రతి ఒక్కరూ తమకే ప్రత్యేకమైన వాదనలు, సమాచార సేకరణ, వాస్తవాల ఉల్లేఖనలు, నిర్ధారణలు చేస్తూ ఉన్నారు గాని ఆ వాదనలన్నిటినీ స్థూలంగా మూడు రకాల అవగాహనలుగా చూడవచ్చు. అవి:

1. అర్ధభూస్వామ్య అర్ధవలస వాదనకు కాలం చెల్లింది. భారత సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారింది, లేదా మారుతున్నది.
2. పూర్తిగా మారిపోయిందని చెప్పలేమేమో గాని ఏదో మారుతున్నది. కొన్ని మార్పులు కనబడుతున్నాయి. కొన్ని మార్పులు కనబడకుండా జరిగిపోతున్నాయి. మొత్తానికి ఈ పరిణామాల అర్థం ఏమిటో తెలియడం లేదు.
3. దృగ్గోచరమైన మార్పులు నిజమే. కాని అవి సారాంశంలో మార్పులు కావు. దోపిడీ పీడనల రూపం మారుతున్నది గాని అవి అలాగే, బహుశా అంతకన్న ఎక్కువగా కూడ కొనసాగుతున్నాయి. సమాజంలో మార్పులు జరిగిన చోట్ల కూడ అవి గుణాత్మక మార్పులుగా లేవు.

మొదటి అవగాహన ప్రకారం

- గ్రామీణ, వ్యవసాయ రంగాలలో మూడు నాలుగు దశాబ్దాల కింద ఉన్న స్థితి ఇవాళ లేదు. ఎన్నో రంగాలలో, ఎన్నో స్థాయిలలో గుర్తించదగిన మార్పులు కనబడుతున్నాయి. గతంలో లాగ పదుల ఎకరాలో, వందల ఎకరాలో ఉన్న భూస్వాములు లేరు, జీతగాళ్ల పద్ధతి చాల వరకు తగ్గిపోయింది. వ్యవసాయ మిగులును దోచుకునే సాధనాలలో ప్రధానమైన కౌలు పద్ధతి తగ్గిపోతున్నది. వ్యవసాయం చేయాలనే ఆసక్తే తగ్గిపోతున్నది. పాత రోజుల లాగ భూస్వాముల అధికవడ్డీ వ్యాపారం లేదు. వ్యవసాయంలోకీ, జీవితంలోకీ ఆధునిక ఉత్పత్తి సాధనాలు ఎన్నో వచ్చాయి. వ్యవసాయం మార్కెట్ కోసమే జరుగుతున్నది. ప్రతిదీ మార్కెట్ కోసమే తయారవుతున్నది,
- పెట్టుబడిదారీ విధానానికి ఒక సూచిక అయిన స్వేచ్ఛా శ్రమశక్తి పెరిగింది.
- సమాజంలో సరుకీకరణ విస్తరించింది. జీవితంలోకి కొత్త కొత్త సరుకులు ఎన్నో వచ్చాయి.
- పట్టణీకరణ చాల పెరిగి, గ్రామాల పట్ల నిరాదరణకు దారి తీస్తున్నది.
- భారత పెట్టుబడి చాల విస్తరించి, బలపడింది. ఇది సామ్రాజ్యవాద పెట్టుబడికి జూనియర్ పార్ట్ నర్ గా, దళారీగా ఉండే దశ నుంచి స్వతంత్రంగా ఎదిగింది. భారత దేశపు బహుళ జాతి సంస్థలు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారీ దేశాల పారిశ్రామిక, వ్యాపార సంస్థలను భారత పెట్టుబడిదారులు కొనగలుగుతున్నారు.
- సేవారంగం విపరీతంగా పెరిగింది.
- పెట్టుబడి ప్రవేశమే పెట్టుబడిదారీ సంబంధాలు అయినప్పుడు, పెట్టుబడి వచ్చింది గాని, పెట్టుబడిదారీ సంబంధాలు రాలేదు అనడం కుదరదు.
- తత్వశాస్త్రం ప్రకారం ప్రతి పరిమాణాత్మక మార్పు గుణాత్మక మార్పుగా పర్యవసిస్తుంది గనుక దశాబ్దాలుగా పెట్టుబడిలో జరుగుతున్న పరిమాణాత్మక మార్పులు గుణాత్మకంగా సమాజాన్ని మరొక దశకు తీసుకుపోయాయని చెప్పవచ్చు.
- కనుక భారత దేశం అర్ధ భూస్వామ్యమూ కాదు, అర్ధవలసా కాదు.

ఈ రకమైన వాదనలతో ఈ అవగాహన మొత్తంగా చెప్పేది భారత సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారిపోయింది అని. లేదా, భారత దేశంలో ప్రధాన స్వభావం పెట్టుబడిదారీ విధానంగా ఉంది అని.

ఇక రెండో అవగాహన ఇంత కచ్చితంగా, వివరంగా అర్ధభూస్వామ్య అర్ధవలస స్వభావం మారిందనీ, పెట్టుబడిదారీ విధానం వచ్చిందనీ వాదించదు గాని ఏదో తెలియని వ్యవహారం జరిగిపోతున్నదనే మీమాంసను ప్రకటిస్తుంది. 'కళ్లముందర చాల మార్పులు జరుగుతున్నాయి, కనబడుతున్నాయి, ఏదో మారుతున్నది, అర్థం కావడం లేదు. భూమి, వ్యవసాయం ప్రాధాన్యత తగ్గిపోతున్నది, గ్రామాలలో వ్యవసాయం చేయడానికి ఎవరూ సిద్ధంగా లేరు. వీలున్నంతవరకు భూమి అమ్మి పట్టణాలకు వెళ్లిపోవడానికి, భూమిలేనివారయితే కూలి కోసం పట్టణాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. సమాజంలో డబ్బు ప్రాధాన్యత పెరిగిపోతున్నది, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకన్న ఎక్కువగా సేవారంగం పెరగడాన్ని ఎలా చూడాలి? కార్మికవర్గానికి ఉండవలసిన ప్రగతిశీల చైతన్యం కనబడడం లేదు. అసలు సమాజంలోనే సామాజిక స్పందనలు, తోటివారి కష్టాలపట్ల సహానుభూతి కనబడడం లేదు. సమాజం ముక్కలు ముక్కలుగా విడిపోతున్నది. ఇటువంటి స్థితిలో నూతన ప్రజాస్వామిక విప్లవ, సోషలిస్టు విప్లవ ఆలోచనలకు చోటు ఉందా? ఈ పరిణామాల అర్థం ఏమిటి? పెట్టుబడి రావడానికి పెట్టుబడిదారీ విధానం రావడానికి తేడా ఏమిటి?' ఇటువంటి అభిప్రాయాలతో, సందేహాలతో నిండి ఉన్న ఈ అవగాహన మొత్తంగా ఒకరకమైన సైద్ధాంతిక అస్పష్టతకు, గందరగోళానికి అద్దం పడుతుంది. సమాజాన్ని, సామాజిక మార్పులను అర్థం చేసుకోవడానికి తగినంత తాత్విక, రాజకీయార్థశాస్త్ర, సైద్ధాంతిక అవగాహన కొరతను సూచిస్తుంది.

## ప్రతివాదనలు

ఈ రెండు అవగాహనలలోని వాదనలన్నిటికీ ప్రతివాదనలున్నాయి. ఇక్కడ చెపుతున్న మార్పులన్నీ నిజమైనవే, కనబడుతున్నవే అయినప్పటికీ, అవి సమాజ స్వభావాన్ని మార్చగలిగిన స్థాయిలో గాని, స్వభావంతో గాని లేవు.

- వ్యవసాయ, గ్రామీణ రంగాలలో మార్పులు కనబడుతున్న మాట నిజమే గాని ఆ మార్పులు ఉత్పత్తి శక్తులలో ఎంత, అందులో భాగమైన ఉత్పత్తి సాధనాలలో ఎంత, మనుషులలో ఎంత, ఆ మనుషుల మధ్య సంబంధాలలో ఎంత, ఆ మనుషుల చైతన్యాన్ని నిర్దేశించే ఉపరితలాంశాలలో ఎంత అని జాగ్రత్తగా లెక్క కట్టినప్పుడు మార్పులుగా కనబడుతున్నవి కొత్త చేర్పులే తప్ప పాతను

పూర్తిగా తొలగించిన మార్పులు కావని అర్థమవుతుంది. గతంలో లాగ వందలాది ఎకరాల భూస్వాములు లేరన్నమాట నిజమే. కాని భూస్వామిని నిర్ధారించవలసింది కేవలం కమతం విస్తీర్ణంతో మాత్రమే కాదు, ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం ఒక అంశం మాత్రమే గాని అదే సమస్తం కాదు, ఏకైకం కాదు. ఆ వ్యక్తి ఎటువంటి ఆధిపత్య సంబంధాలను నెరపుతున్నారు, ఏ ఉపరితలాంశాలను తనకు వత్తాసు తెచ్చుకుంటున్నారు అనేవి కూడ ముఖ్యమైన సూచికలే. అలా చూసినప్పుడు భారీ భూకమతాలు గల భూస్వాములు లేరు గాని భూస్వామ్య స్వభావం, ఆధిపత్యం, ఉపరితలాంశాలు ఇంకా సమాజంలో కనుమరుగు కాలేదు. జీతగాళ్లు, కట్టు బానిసలు లేరనేది, విముక్తి చెందారనేది భూస్వామ్యం మారిందనడానికి ఒక సూచనే. కాని అలా విముక్తి అయిన వ్యవసాయ, గ్రామీణ శ్రామికులు పట్టణ, పారిశ్రామిక కార్మికులుగా మారినప్పుడే సమాజ స్వభావం మారినట్టు. వారు విముక్తి చెంది నిరుద్యోగులుగా, పట్టణంలో అడ్డా కూలీలుగా మారితే అది విముక్తి కాదు. కౌలు, పాలు, పొత్తు వంటి మిగులు దోపిడీ రూపాలు కొన్ని ప్రాంతాలలో తగ్గాయి గాని కొన్ని ప్రాంతాలలో పెరిగాయి, లేదా యథాతథంగా ఉన్నాయి. తగ్గిన ప్రాంతాలలో మిగులును దోచుకునే కొత్త రూపాలు వచ్చాయి. ఆ కొత్త రూపాలు కూడ భూస్వామ్య రూపాలే. మొత్తంగా అనుపస్థిత భూస్వామ్యం (కాగితం మీద భూయజమానులే అయినా వాస్తవంగా వ్యవసాయంతో సంబంధం లేని వర్గం) పెరుగుతున్నది. వ్యవసాయం మీద ఆసక్తి తగ్గడానికి వ్యవసాయ రంగపు సమగ్ర, సమతౌల్య అభివృద్ధి లేకపోవడం, నీటిపారుదల సౌకర్యాలు అవసరమైనంతగా లేకపోవడం, వ్యవసాయ ఉత్పత్తి కారకాల ధరల పెరుగుదల, వ్యవసాయోత్పత్తుల ధరల తగ్గుదల వంటి అనేక కారణాలున్నాయి. ఆ కారణాలన్నీ నిజానికి పెట్టుబడిదారీ విధానం బలపడకపోవడానికే సూచనలు. భూస్వాముల అధిక వడ్డీ వ్యాపారం తగ్గింది గాని అనేక రకాల వడ్డీ వ్యాపారాలు, ప్రజల ఆదాయాన్ని కొల్లగొట్టే రూపాలు, కచ్చితంగా పెట్టుబడిదారీ పునరుత్పత్తితో సంబంధం లేని వ్యాపారాలు వచ్చాయి. వ్యవసాయంలోకి, జీవితంలోకి కొత్తగా వచ్చిన ఉత్పత్తి సాధనాలు ఒకవైపు వెసులుబాటును కల్పించాయి గాని మరొకవైపు జీవనోపాధిని పోగొట్టాయి. ఆ ఉత్పత్తి సాధనాల ప్రవేశం కొత్త ఉత్పత్తి సంబంధాలకు దారితీయలేదు. వ్యవసాయం మార్కెట్ కోసమే జరుగుతున్నది అనే మాటను జాగ్రత్తగా చూడవలసి ఉంది. ఇతర సరుకుల కొనుగోళ్ల కోసం వ్యవసాయోత్పత్తిలో కొంత మార్కెట్ లో అమ్మకం అవుతున్నదా చూడాలి, వ్యవసాయ రంగంలో కూడ ప్రతిదీ మార్కెట్ కోసమే ఉత్పత్తి అవుతున్నదనేది నిజం కాదు. వ్యవసాయోత్పత్తిలో వినియోగమే ఇవాళ్టికీ అధికభాగాన్ని ఆక్రమిస్తున్నది. వ్యవసాయ మిగులును ఎక్కడ మదుపు పెడుతున్నారనేది కీలకమైన ప్రశ్న. అది కచ్చితంగా అదనపు విలువను పోగు చేసే పారిశ్రామిక ఉత్పత్తి రంగంలోనైతే కాదు.

- శ్రామిక శక్తి స్వేచ్ఛను పొందడం తప్పనిసరిగా పెట్టుబడిదారీ విధానానికి సూచికే. కాని మార్క్స్ స్వేచ్ఛాయుత శ్రమశక్తి అని అభివర్ణించినప్పుడు, తాను స్వేచ్ఛ అనే మాటను రెండు అర్థాలలో వాడుతున్నానని వివరించాడు. ఒకటి ఉత్పత్తి సాధనాలకు కట్టుబడి ఉండనక్కరలేని స్వేచ్ఛ. రెండు, తన శ్రమను ఎవరికైనా తన ఇష్టప్రకారం అమ్ముకోగలిగిన స్వేచ్ఛ. భారత సమాజంలో మొదటి స్వేచ్ఛ భూమిలేని నిరుపేద శ్రామికులకు ఎప్పటినుంచో ఉంది. కాని రెండవ స్వేచ్ఛ లేదు. అక్కడ వారిపై వంశ, కుల, మత, ప్రాంత రూపాలలో భూస్వామ్య బంధనాలు ఉండేవి. ఇప్పుడు ఈ బంధనాలు వదిలాయా అనేది అనుమానాస్పదమే. అంతేకాక, తమ శ్రమశక్తిని ఎవరు కొనుక్కున్నా సరే అమ్ముతాం అని స్వేచ్ఛగా ఉండడం ఒక ఎత్తు, కొనుక్కునే వారెవరూ లేక ఎవరు కొంటారా అని వేచి చూస్తూ ఉండడం ఒక ఎత్తు. మొదటిది అన్ని వనరులనూ విస్తృతంగా ఉపయోగించుకుని, ఉత్పాదకతను పెంచుకునే పెట్టుబడిదారీ విధానంలో ఉంటుంది. రెండవది, ఉత్పత్తి శక్తుల పూర్తి వినియోగం జరగని పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలలో ఉంటుంది.
- సమాజంలో సరుకుల పెరుగుదల, ప్రతిదీ సరుకీకరణ జరిగినట్టు కనిపించడం నిజమే. కాని దీనికి ప్రతిధోరణులుగా రెండు అంశాలు కనబడుతున్నాయి: అవి, ఒకటి, సమాజంలో సరుకేతర, మార్కెటేతర సంబంధాలు ఇంకా బలంగానే, నిర్ణాయకంగానే ఉండడం, రెండు, పెరిగిన సరుకుల అభివృద్ధి కూడ దేశీయ స్వతంత్ర పెట్టుబడి ఫలితం కాకపోవడం. పెరిగిన సరుకుల వల్ల హోం మార్కెట్ పెరిగి, దేశీయ స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గం పెరగలేదు. ఆ సరుకులలో తొంబై శాతానికి పైగా విదేశీ బహుళజాతి సంస్థల ఉత్పత్తులు, లేదా బహుళజాతి సంస్థల సాంకేతిక విధానాలను ఉపయోగించి, వారి బ్రాండ్ల మీద, వారికి రాయల్టీలు, లాభాలు చెల్లిస్తూ జరిగే ఉత్పత్తులు. కనుక అవి స్థానిక ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి గాని, ఉత్పత్తి సంబంధాల అభివృద్ధికి గాని ఉపయోగపడుతున్నవి కావు. అవి ఎంత పెరిగినా దేశీయ స్వతంత్ర పెట్టుబడి పెరుగుదలకో, సమాజంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల పెరుగుదలకో సూచికలు కావు.
- పట్టణీకరణ పెరుగుతున్న మాట, గ్రామాల పట్ల నిరాదరణ పెరుగుతున్న మాట నిజమే. కాని మన పట్టణాలు పెట్టుబడిదారీ యుగపు పారిశ్రామిక పట్టణాలేనా ఆలోచించవలసి ఉంది. అవి కేవలం భూస్వామ్య యుగంలో లాగ కూడళ్లలో, అధికార కేంద్రాలలో, మత కేంద్రాలలో పెరిగిన పెద్ద గ్రామాలా, గ్రామాల నుంచి వలసలు అనివార్యమై సాగుతున్నాయా, ఇష్టపూర్వకంగా సాగుతున్నాయా వంటి ప్రశ్నలు కూడ వేసుకోవాలి.
- భారత పెట్టుబడిదారులలో కొందరు బహుళజాతిసంస్థలతో, విదేశీ పెట్టుబడిదారులతో పోటీ పడుతున్న మాట నిజమే. కాని వారి స్వభావం వారిని భారత పెట్టుబడిదారులు అని పిలవడానికి సరిపోయేది కాదు. వారు భారతదేశంలో పుట్టినవారై ఉండవచ్చుగాని, పూర్తిగా దళారీ, మిలాఖత్తు స్వభావంతోనే, అంతర్జాతీయ పెట్టుబడిదారుల వర్గంలో భాగంగా మారిపోయి

ఉన్నారు. కనుక వారిని ఉదాహరణగా చూపి భారత పెట్టుబడిదారీ వర్గం పెరిగిందనడం కుదరదు. సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకు దాసోహం అంటూ నూతన ఆర్థిక విధానాల ప్రకటన జరిగినప్పుడు దాన్ని దేశభక్తి కారణాలతో మాటమాత్రంగానైనా ఖండించిన భారత పెట్టుబడిదారులు లేరంటే, భారత పాలకవర్గాల అర్ధవలస స్వభావం బహిర్గతమవుతుంది.

- సేవారంగం విపరీతంగా పెరిగిందనే మాట నిజమే కాని ఇందులో గుర్తించవలసిన అంశాలు మూడున్నాయి: ఒకటి, ఇది పాలకవర్గాల గణాంకాల మాయ. ఒక ఆర్థిక రంగానికి హెచ్చు ధరలు కట్టి దాని విలువను పెంచడం, మరొక రంగానికి తక్కువ ధరలు కట్టి దాని విలువను తగ్గించడం, తద్వారా వ్యవసాయ రంగపు విలువను తగ్గించి, సేవారంగపు విలువను పెంచడం ఒక పాలకవర్గ మాయ. రెండు, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల మధ్య సమతౌల్యమైన అభివృద్ధి గమనం లేకపోతే అది సుస్థిరమైన వృద్ధి కాజాలదు. ప్రజలకు తిండి పెట్టే రంగమూ, ప్రజలకు అవసరమైన సరుకులు తయారు చేసే రంగమూ కలిసి సగం కన్న తక్కువ ఉండి, వారికి సేవలు అందించే రంగం సగం కన్న ఎక్కువ ఉందంటే, మనుషులు తిండి కన్న, సరుకుల కన్న సేవలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అర్థరహితమైన నిర్ధారణకు రావలసి వస్తుంది. మూడు, సామ్రాజ్యవాద, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటూ, తమ సేవారంగాన్ని అరవై శాతం, డెబ్బై శాతం దాకా పెంచుకుని అదే అభివృద్ధి నమూనా అని ప్రచారం చేస్తున్నాయి. సేవారంగ బహుళజాతిసంస్థలు తమవే గనుక ఆ సేవలను అమ్మి లాభాలు చేసుకుంటున్నాయి. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టు, ఆ సేవారంగ వాతలు ఉండడమే అభివృద్ధికి సూచిక అని మన పాలకులు భావిస్తున్నారు. అవే పెట్టుబడిదారీ విధానానికి సూచిక అని కొందరు మేధావులు భావిస్తున్నారు.
- పెట్టుబడి ప్రవేశాన్నీ, పెట్టుబడిదారీ సంబంధాల ప్రవేశాన్నీ విడదీయ గూడదని, పెట్టుబడి వచ్చిందంటే పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చినట్టేనని కొందరు వాదిస్తున్నారు. పెట్టుబడి ఒక సంబంధమే ననేది నిజమే. కాని సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడి ద్రవ్య పెట్టుబడిగా మారిన తర్వాత అది దానివెంట దాని సంబంధాలను, దాని ఉపరితలాన్ని తీసుకురావడం లేదనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి.
- ప్రతి పరిమాణాత్మక మార్పు గుణాత్మక మార్పుగా పర్యవసిస్తుంది గనుక దశాబ్దాలుగా పెట్టుబడిలో జరుగుతున్న పరిమాణాత్మక మార్పులు గుణాత్మకంగా సమాజాన్ని మరొక దశకు తీసుకుపోయాయని, అందువల్ల భారత సమాజం పెట్టుబడిదారీ సమాజం అయిపోయినట్టేనని ఈ అవగాహన వాదిస్తున్నది. అయితే పరిమాణాత్మక మార్పులు గుణాత్మక మార్పులు అవుతాయని ప్రకృతిలో వర్తించే సూత్రం యథాతథంగా సమాజానికి, వ్యక్తికి వర్తించదు. ప్రకృతిలో పరిమాణాత్మక మార్పులు చాలవరకు క్రమబద్ధంగా పైపైకి వెళ్లే సరళరేఖలా జరిగిపోతాయి. వాటిని అడ్డుకునే ప్రతిఘోరణులు అరుదుగా ఉంటాయి. కాని సమాజం, వ్యక్తి స్వాభావికంగానే చలనశీలం గనుక పరిమాణాత్మక మార్పులు అల్లిబిల్లిగా, కిందుమీదుగా, గజిబిజిగా జరిగే అవకాశం ఉంటుంది. ప్రతిఘోరణుల పాత్ర ఎక్కువగా ఉంటుంది. అందువల్ల కొంత పరిమాణాత్మక మార్పు జరిగిన తర్వాత తార్కిక ఫలితమైన గుణాత్మక మార్పు జరగకపోవచ్చు. ఆ పరిణామం పక్కకు తిరిగి మళ్లీ మరొక పరిమాణాత్మక మార్పుల క్రమం మొదలవుతుంది. పైగా సమాజంలో మార్పుల స్థాయి, వ్యవధి చాల ఎక్కువ. ఒక్కొక్క సామాజిక మార్పుకు వేల ఏళ్లు, వందల ఏళ్లు, దశాబ్దాలు పట్టిన చరిత్ర మన కళ్లముందర ఉంది.

మూడో అవగాహన వచ్చిన మార్పులను గుర్తిస్తుంది. పరిగణనలోకి తీసుకుంటుంది. 'మార్పులు నిజమే కాని అవి రూపంలో మార్పులు మాత్రమే, సారాంశంలో మార్పులు కావు, గుణాత్మక మార్పులు కావు' అంటుంది. పెట్టుబడిదారీ విధానం గ్రామీణ ప్రజానీకాన్ని భూమికి కట్టుబడి ఉన్న స్థితి నుంచి విడుదల చేయాలి. పారిశ్రామిక కార్మికులను తయారు చేయాలి. మార్కెట్ పెంచుకోవడానికి ఒకవైపు భూసంస్కరణలు అమలు చేస్తూ, మరొకవైపు పారిశ్రామికీకరణ జరపాలి. విడుదలైన గ్రామీణ శ్రమశక్తిని పరిశ్రమల్లో వాడుకోవడం ద్వారా, అదనపు విలువ సంచయాన్ని పెంచుకుంటూ, తన పారిశ్రామికోత్పత్తినీ, మార్కెట్ నూ పెంచుకోవాలి. ఈ అదనపు విలువ సంచయానికి తగిన ఉపరితలాన్ని తయారు చేయాలి. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో సహజ, అనివార్య నియమాలైన ఇవేవీ భారత సమాజంలో జరగడం లేదు. హోం మార్కెట్ పెరుగుదల దేశీయ పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తుల ప్రయోజనాల కోసం కాదు. బహుళజాతి సంస్థల కోసం జరుగుతున్నది. గ్రామీణ శ్రమశక్తిని బయటికి తోయడం జరుగుతున్నది గాని దానికి పరిశ్రమల్లో స్థానం దొరకడం లేదు. పెరుగుతున్న మార్కెట్ ఉన్నత వర్గాల విలాస వస్తువుల మార్కెటే తప్ప కిందివర్గాల నిత్యజీవితావసరాల మార్కెట్ కాదు. అంటే మొత్తంగా పారిశ్రామికీకరణ ప్రక్రియ తలకిందులుగా, వక్రంగా సాగుతున్నది. సేవారంగ అభివృద్ధి పేరిట ఉత్పత్తి రంగంతో సంబంధం లేని, చలామణీ రంగ పెరుగుదల సాగుతున్నది. అది సామాజిక మిగులును సంచయనం చేసే పద్ధతిగా ఉన్నది గాని ఆ సంచయనం పునరుత్పత్తిలోకి, ఇతోధిక అదనపు విలువ సృష్టిలోకి రావడం లేదు. అనవసర, ఆడంబర, వృథా వ్యయంగా మారిపోతున్నది. ఉపరితలాంశాలలో కులం, మతం, దైవభక్తి, మూఢనమ్మకాలు వంటి భూస్వామ్య లక్షణాల పట్టు, పెట్టుబడిదారీ పూర్వ సంబంధాల పట్టు పెరుగుతున్నదే గాని తగ్గడం లేదు.

ఈ దృగ్గోచరాంశాలతో పాటు, అసలు చారిత్రకంగానే సామ్రాజ్యవాద దశలో కొత్త పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొనడం జరగదు. పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలతో పెట్టుబడి మిలాఖత్తు అయిన తలకిందుల స్థితి రాజ్యం చేస్తుంది. మొత్తంగా ఈ అవగాహన చెప్పేదేమంటే, ఇవాళ భారత సమాజ స్థితి 1969 కన్న మౌలికంగా మారలేదు, అర్ధవలస అర్ధభూస్వామ్యంగా ఉన్నది. అయితే కొన్ని ప్రాంతాలలో, కొన్ని రంగాలలో పెట్టుబడి ప్రవేశం పెరిగింది. కాని ఆ పెట్టుబడి తన స్వభావాన్ని వదులుకున్న, మారిన పెట్టుబడి కావడం

వల్ల పెట్టుబడిదారీ సంబంధాలు అరకొరగా, వక్రీకరించబడి సాగుతున్నాయి.

### సమాజ స్వభావాన్ని బట్టి పరివర్తనా మార్గాలు

ఇక చివరిగా, సమాజ స్వభావం ఏమిటనేది శుష్క పండిత చర్చ కాదు, అది ఆచరణకు మార్గదర్శి. సమాజ స్వభావం ఏమిటనే దాన్ని బట్టి ఆ సమాజ పరివర్తనా వ్యూహం, అందుకు తగిన ఆచరణ ఉంటాయి. సమాజ స్వభావం నిర్ధారణ ఆ సమాజంలో ప్రధాన వైరుధ్యం ఏమిటనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఆ సమాజంలో మార్క్సిస్టు దృక్పథంతో పరివర్తన సాధించదలచిన స్వీయమానసిక శక్తులు తమ వర్గపోరాటాన్ని ఏ వైరుధ్య పరిష్కారం మీద కేంద్రీకరించాలో ఆ స్వభావమే నిర్ణయిస్తుంది.

చారిత్రక భౌతిక వాదాన్ని యాంత్రికంగా గ్రహించినవారు సామాజిక పరివర్తన సహజమైన, స్వయంచాలిత పరిణామం అని వాదిస్తారు. పెట్టుబడిదారీ విధానం దాని సహజ చలన నియమాల వల్లనే సోషలిజానికి పరివర్తన చెందుతుందని అంటారు. కాని సమాజ చలనం భౌతిక నియమాల ఆధారంగా జరుగుతున్నదని గుర్తించిన మార్క్స్ ఎంగెల్స్ లు కూడ ఆ భౌతిక నియమాలకు ప్రతి ధోరణులు ఉంటాయని, ఆ చలనాన్ని ప్రగతి దిశగా నడిపే కర్తవ్యం వర్గపోరాటం మీద, స్వీయ మానసిక శక్తుల మీద ఉంటుందని అన్నారు. ప్రతి సామాజిక ఉత్పత్తి విధానమూ పుట్టి, పెరిగి, నశించిపోయే మాట నిజమే గాని అది ప్రకృతిలో పూవు పూచి, కాయ కాచి, పండై రాలిపోయినట్టుగా జరగదు. సమాజంలో ఆ ఉత్పత్తి విధానంలోని వైరుధ్యాలు వర్గ వైరుధ్యాలుగా వ్యక్తమై, అనేక రూపాలలో వర్గపోరాటం సాగి, ఆ వర్గపోరాటంలో ప్రగతిశీల వర్గం విజయం సాధించినప్పుడే సామాజిక పరివర్తన సాధ్యమవుతుంది. ఆ ప్రగతిశీల వర్గం విజయం సాధించకపోయినా, వర్గపోరాటం మందకొడిగా సాగినా, సామాజిక పరివర్తన కూడ కుంటుతూ నడుస్తుంది. పాత ఉత్పత్తి విధానాలు, పాత ఉత్పత్తి సంబంధాలు, పాత ఉపరితలం బలంగానే ఉంటాయి. భారత సమాజపు ప్రస్తుత స్థితి ఇది. ఇక్కడ భూస్వామ్య ఉత్పత్తి విధానాన్ని రద్దు చేసిన పెట్టుబడిదారీ ప్రజాస్వామిక విప్లవం జయప్రదం కాలేదు. ఆ ప్రజాస్వామిక విప్లవ వర్గపోరాటానికి నాయకత్వం వహించవలసిన బూర్జువా వర్గం తన బాధ్యత నుంచి తప్పుకుంది. అంతర్జాతీయ బూర్జువా వర్గం స్థానిక ప్రగతినిరోధక శక్తులతో మిలాఖత్తయి, స్థానిక బూర్జువావర్గాన్ని తన తొత్తుగా చేసుకుని ఇక్కడ ఒక ప్రజాస్వామిక విప్లవానికి అవకాశం లేకుండా చేసింది. అందువల్ల భూస్వామ్యం – పెట్టుబడి మిలాఖత్తుతో అర్ధభూస్వామ్య అర్ధవలస ఉత్పత్తి విధానం సాగుతోంది. పెట్టుబడిదారీ సమాజంగా మారలేదు.

పెట్టుబడిదారీ సమాజం అయిపోయి ఉంటే సమాజం చాలవరకు ప్రజాస్వామికీకరణ జరిగి ఉంటుంది. అందువల్ల రహస్య సాయుధ పోరాటం కన్న ఎక్కువగా బహిరంగ చట్టబద్ధ పోరాట రూపాలకు అవకాశం ఉంటుంది. పారిశ్రామిక కార్మికవర్గం విస్తృతంగా పెరిగి, ప్రచారాలు, సమ్మెలు, చట్టసభల వేదికలు వంటి వాటి ద్వారా సమాజంలో చైతన్యాన్ని పెంచి, అన్ని వర్గాలలోను సంఘీభావాన్ని కూడగట్టి అదును దొరికినప్పుడు ఒక సార్వత్రిక సమ్మె రూపంలో అధికారాన్ని హస్తగతం చేసుకుంటుంది.

ఎన్నికలలో విజయం సాధించడం ద్వారా కూడ కార్మికవర్గం (కార్మికవర్గ పార్టీ) తన ప్రభావాన్ని పెంచుకోవచ్చునని, విప్లవానికి సమాజాన్ని సమాయత్తం చేయవచ్చునని ఎంగెల్స్ ఎక్కడో ఒక చోట ప్రకటించిన ఆశాభావాన్ని వత్తాసుగా తీసుకుని పెట్టుబడిదారీ దేశాల కమ్యూనిస్టు పార్టీలన్నీ వ్యవస్థ మార్పును పక్కనపెట్టి, ప్రభుత్వాల మార్పు పనిలో పడిపోయాయి. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చే పార్టీలు, తమను తాము కమ్యూనిస్టులమనో, సోషలిస్టులమనో, ఐక్యసంఘటన అనో పిలుచుకున్నా, అవి వ్యవస్థ మార్పును సాధించలేవు. అటువంటి ప్రభుత్వాలు వ్యవస్థ మార్పుకు దారితీసే చిన్నమెత్తు చట్టాలు చేసినా సామ్రాజ్యవాద శక్తులు, ఆయా దేశాల అభివృద్ధి నిరోధకులు భయంకరమైన హింసాకాండతో వాటిని కూలదోసిన చరిత్ర మన కళ్ల ముందరే ఉంది (బ్రహ్మాండమైన ఉదాహరణ చిలీ. లాటిన్ అమెరికాలో ఇటువంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి). అటువంటి ప్రభుత్వాలు అధికారంలో ఉండాలంటే చిన్నచిన్న సంస్కరణవాద అతుకులు, మాట్లకే తప్ప, మౌలిక మార్పులకు పూనుకోగూడదని సామ్రాజ్యవాదం ఎన్నో చోట్ల హెచ్చరించి చూపింది.

భారత పార్లమెంటరీ కమ్యూనిస్టులదైతే మరింత విషాద చరిత్ర. రాజ్యాధికారం సంగతి అలా ఉంచి, ప్రభుత్వాధికారాన్ని చేపట్టాలన్నా చట్టసభల్లో సాధారణ ఆధిక్యత అయినా రావాలి. ఆ సాధారణ ఆధిక్యత రావడానికి వీలుగా అన్ని స్థానాలకూ పోటీ చేసిన ఉదాహరణ కూడ అరవై సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీలకు లేదు. రాష్ట్ర ప్రభుత్వాలలో మిశ్రమ, ఐక్యసంఘటన, అవకాశవాద కూటముల ద్వారా అధికారానికి వచ్చిన చరిత్ర ఉన్నప్పటికీ, వ్యవస్థలో ఒక చిన్న మౌలిక మార్పు కోసం ప్రయత్నించి బర్తరఫ్ అయిన కేరళ అనుభవం ఉండనే ఉంది. ఆ అనుభవం నుంచి బహుశా భారత పార్లమెంటరీ కమ్యూనిస్టులు నేర్చుకున్న పాఠమేమంటే వ్యవస్థ మార్పు కార్యక్రమాన్ని వదులుకుంటే, ప్రభుత్వ అధికారాన్ని అనుభవించవచ్చునని. చివరికి ప్రపంచీకరణ విధానాలను దోపిడీ పాలకవర్గ శక్తుల కంటే ఎక్కువగా అమలు చేసి రాజును మించిన రాజభక్తి ప్రదర్శించుకున్నదాకా ఇది వెళ్లింది. 'పెట్టుబడిదారీ విధానం వచ్చింది, అక్కడక్కడ భూస్వామ్య అవశేషాలు మాత్రం మిగిలిపోయాయి, పెట్టుబడిదారీ అభివృద్ధి జరగనిస్తేనే సోషలిజానికి అవకాశం వస్తుంది' లాంటి ఎన్నో మాటలతో అంతిమంగా భారత పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలు తమ వ్యూహానికి సరిపోయే సమాజ స్వభావాన్ని ప్రకటిస్తున్నారు.

కాని వ్యవసాయం వైపునుంచి, పరిశ్రమ వైపునుంచి, సేవారంగం వైపునుంచి, పాలన వైపునుంచి, ఉపరితలం వైపునుంచి, సామ్రాజ్యవాదం వైపునుంచి, నిత్యజీవితాచరణ నుంచి, పరివర్తనా మార్గాల వైపునుంచి ఎలా చూసినా భారత సమాజం అర్ధభూస్వామ్య, అర్ధవలసగానే ఉందని తేలుతుంది. భారత పాలకవర్గాలు ప్రధానంగా ఆ అర్ధభూస్వామ్య అర్ధవలస స్వభావం వదులుకోకుండానే, దేశంలోని అసమాన అభివృద్ధి, తీవ్రమైన అసమానతల నేపథ్యంలో భిన్న ప్రాంతాలలో భిన్న ఉత్పత్తి విధానాలు కొనసాగడానికి అవకాశం ఇస్తున్నాయి.

వీటిని విడదీసి చూస్తే ఉత్పత్తి సాధనాలలో మార్పులు ఉన్నాయి, ఉత్పత్తి శక్తులలో భాగమైన ప్రజలలో విభిన్నమైన, వైవిధ్యపూరితమైన

చైతన్యాలు ఉన్నాయి. వర్గ చైతన్యంగా మారడానికి, వర్గపోరాట ఆచరణలోకి రావడానికి ఆటంకాలున్నాయి. ఉత్పత్తి సంబంధాలలో, సామాజిక సంబంధాలలో పెట్టుబడిదారీ పూర్వ ఆలోచనలు, ఆచరణలు విస్తృతంగా ఉన్నాయి, కొత్తగా పునరుత్పత్తి అవుతున్నాయి. ఉపరితలంలో భూస్వామ్య అంశాలు కొనసాగడం మాత్రమే కాక, కొన్ని చోట్ల బలోపేతమవుతున్నాయి. పట్టణీకరణ పెరుగుతున్నప్పటికీ అది భూస్వామ్య, రాచరిక యుగంలోని పట్టణాల లాగ అధికార కేంద్రాలుగా, రాజకీయ కేంద్రాలుగా, మత కేంద్రాలుగా, కూడళ్లుగా ఉన్నాయి గాని పారిశ్రామిక పట్టణాలు ఏర్పడడమూ లేదు, పెరగడమూ లేదు. గ్రామీణ నిరుపేదలను బయటికి తోయడం జరుగుతున్నది గాని వారిని ఆకర్షించి, ఇముడ్చుకునే పారిశ్రామిక రంగం లేదు. పరిశ్రమలు వచ్చి పారిశ్రామిక కార్మికులు ఏర్పడిన చోట కూడ కార్మికుడి స్వభావంలో పెట్టుబడిదారీ పూర్వ ఆలోచనలు వదలలేదు. భారత బూర్జువా వర్గంలో ఒకప్పుడు ఉండిన కనీస జాతీయ, దేశభక్తి ఆలోచనలు నానాటికీ తగ్గిపోతున్నాయి. ప్రపంచీకరణ తర్వాత మరింత ఎక్కువగా స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను, స్వయంసమృద్ధిని వదులుకుంటూ భారత బడా బూర్జువా వర్గం తన దళారీ స్వభావాన్ని చూపుకుంటున్నది. ఈ లక్షణాలన్నిటికీ ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకవర్గ ముఠాలే ఒకదాని తర్వాత ఒకటిగా ప్రభుత్వాధికారాన్ని చేపడుతున్నాయి. మొత్తం మీద రాజ్యాధికారం భూస్వామ్య, సామ్రాజ్యవాద శక్తుల మిలాఖత్తు కూటమి చేతుల్లోనే కొనసాగుతున్నది.

అందువల్ల ఈ సామాజిక దశకు, సమాజ స్వభావానికి తగిన సామాజిక పరివర్తనా కార్యక్రమం వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం కాక తప్పదు. సమాజ ప్రజాస్వామికీకరణ జరగని దశలో ఈ నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను ఎన్నికల ద్వారా, సంస్కరణల ద్వారా సాధించడం సాధ్యం కాదు. అది మౌలిక విప్లవ కార్యక్రమం గల దీర్ఘకాలిక ప్రజా యుద్ధ వ్యూహం ద్వారా మాత్రమే జరుగుతుంది. ఈ దశలో ఉత్పత్తి శక్తులను ప్రజా చైతన్యాన్ని, ఉపరితలాన్ని మార్చడం దీర్ఘకాలికంగా మాత్రమే సాధ్యం. అధికారంలో ఉన్న వర్గాలను కూలదోయడం ప్రజాయుద్ధం ద్వారా మాత్రమే సాధ్యం.

ఈ అర్ధ భూస్వామ్య, అర్ధవలస స్థితి నుంచి సమాజం ఎప్పటికి మారుతుంది? ఆ మార్పుకు దశాబ్దాలు పడుతుందా, శతాబ్దాలు పడుతుందా అని ప్రశ్నిస్తున్న వారు కూడ ఉన్నారు. సమాజ స్వభావం మారడం, సామాజిక పరివర్తన రాత్రికి రాత్రి జరిగిపోయే పరిణామాలు కావు. ఆ మార్పులు విప్లవాల యుగంలో వేగంగా జరగవచ్చు, ఇతర సందర్భాలలో మందకొడిగా జరగవచ్చు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం దాకా భారత సమాజం అర్ధభూస్వామ్య అర్ధవలస స్థితి నుంచి మారదు. పాలకవర్గాలకు దాన్ని మార్చవలసిన అవసరం లేదు. పాలిత వర్గాలకు దాన్ని మార్చవలసిన అవసరం ఉంది గాని, వారు ఆ అవగాహనను అందుకోకుండా చేసే అవరోధాలు, ఆకర్షణలు, భ్రమలు, పక్కదారులు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమించాలంటే కూడ స్వీయమానసిక శక్తుల విస్తృతమైన కృషి, ప్రజలలో ఇతోధికమైన కార్యాచరణ, అంతిమ ప్రజాయుద్ధానికి సమాయత్తం చేసుకోవడం అవసరం.

**చదవదగిన పుస్తకాలు**

ఈ చర్చను అర్థం చేసుకోవడానికి, చర్చలో పాల్గొనడానికి ఉపయోగపడే పుస్తకాలు, వ్యాసాలు వందలాదిగా ఉన్నాయి. ఆ వ్యాసాలలో, పుస్తకాలలో జరిగిన చర్చలో అనవసరమైన, అర్థరహితమైన వాదవివాదాలు, శాఖా చంక్రమణాలు ఎక్కువగానే ఉన్నప్పటికీ, కింది జాబితాలో ఇచ్చిన పుస్తకాల అధ్యయనం ఈ విషయం మీద మెరుగైన అవగాహనకు ఉపయోగ పడుతుంది.


Arvind (ed.) (n.d.) – Agrarian Question in India, Communist League of India (M-L), Delhi.

Aston T H and Philpin C H E (2005) – The Brenner Debate, Cambridge University Press, New Delhi.

Balagopal, K, (1988) – Probings in the Political Economy of Agrarian Classes and Conflicts, Perspectives, Hyderabad.

Basu, Pradip, (2000) – Towards Naxalbari (1953-1967) – An Account of Inner-Party Ideological Struggle, Progressive Publishers, Calcutta.

Beteille, Andre (1974) – Studies in Agrarian Social Structure, OUP, Delhi.

Bhaduri, Amit, (2010) – Essays in the Reconstruction of Political Economy, Aakar Books, Delhi.

Bharadwaj, Krishna (1991) – Production Conditions in Indian Agriculture, K P Bagchi & Co, Calcutta.

Bottomore, Tom (1990) – Theories of Modern Capitalism, Universal Book Stall, New Delhi.

CPI (2012) – Party Programme - http://www.communistparty.in/p/party-programme.html

CPI (Marxist) (2013) – Party Programme - http://www.cpim.org/party-programme

CPI (Maoist) (2004) – Party Prorgramme – www.bannedthought.net/India/CPI-Maoist-Docs/Founding/Programme-pamphlet.pdf

CPI (Maoist), (2004) – Strategy & Tactics of the Indian Revolution. www.bannedthought.net/India/CPI-Maoist-Docs/Founding/StrategyTactics-pamphlet.pdf

CPI (M-L) (People's War), (1983) - Indian Agriculture: Capitalist or Pre-Capitalist?, Voice of the Vanguard, Vol 1, Issues 1, 2 and 3, March, April and May.

CPI (M-L) (People's War), (1983) – Struggle for Land is the Centre of All Peasant Struggles, Voice of the Vanguard, Vol. 1, Issues 5-6, July/August.

CPI (M-L) Central Committee, (n.d.) – Semi Feudal Character of Indian Agriculture, Resistance Publications, place not given.

Damas, Marius, (1991) – Approaching Naxalbari, Radical Impression, Calcutta.

Davey, Brian (1975) – The Economic Development of India, Spokesman Books, Nottingham.

Diwakar, D M, (1994) – India – A Semi-Feudal Semi-Colonial State, Manak Publications, Delhi.

Dobb, Maurice (1978) – Studies in the Development of Capitalism, Routledge, London.

Frank, Andre Gunder (1974) – Lumpen Bourgeoisie Lumpen Development, Monthly Review Press, New York.

Giddens, Anthony (1996) Capitalism and Modern Social Theory, Cambridge University Press, Cambridge.

Ghosh, Suniti Kumar (1985) – The Indian Big Bourgeoisie, Subarnarekha, Calcutta.

Ghosh, Suniti Kumar (ed.), (1992) – The Historic Turning Point – A Liberation Anthology, Vol. I, Author, Calcutta.

Ghosh, Suniti Kumar (ed.), (1993) – The Historic Turning Point – A Liberation Anthology, Vol. II, Author, Calcutta.

Gupta, D N (ed.), (1995) – Changing Modes of Production in India – An Historical Analysis, Hindu College, Delhi.

Hobsbawm, Eric (2011) – How to Change the World – Tales of Marx and Marxism, Abacus, London.

Husain, Iqbal (ed.) (2006) – Karl Marx on India, Tulika Books, New Delhi.

Jha, Shiva Chandra (1963) – Studies in the Development of Capitalism in India, Firma K L Mukhopadhyay, Calcutta.

Karnataka Maoist Independent Center, (2006) – Dialectics of Revolution, Bulletin 1, December.

Kosambi, D. D. (1956) – An Introduction to the Study of Indian History, Popular, Bombay.

Lenin, V. I., (1977) – The Development of Capitalism in Russia in Collected Works, Vol. 3, Progress Publishers, Moscow.

Marx, Karl (1981) – Grundrisse, Penguin Books, Harmondsworth.

Mao Tsetung, (1971) – Selected Reading from the Works of Mao Tsetung, Foreign Languages Press, Peking.

Mazumdar, Charu, (1982) – Eight Documents, Mass Line Publications, New Delhi.

Momjan, Kh (1980) – Landmarks in History, Progress Publishers, Moscow.

Mukherji, R., (1985) - Comprador Bourgeoisie in India, Subarnarekha, Calcutta.

Nagi Reddy, T (1978) – India Mortgaged, T N Memorial Trust, Anantapuram.

Overstreet, Gene D. and Windmiller, Marshall, (1960) – Communism in India, The Perennial Press, Bombay.

Papi Reddy, T. (1990) – Agrarian Unrest, Peasant Struggles and Social Change, Sony Publishing House, Warangal.

Patnaik, Utsa (ed.) (1990) – Agrarian Relations and Accumulation – The 'Mode of Production' Debate in India, OUP, Bombay.

Pavlov, V I (1979) – Historical Premises for India's Transition to Capitalism, Nauka Publishing House, Moscow.

Prasad, Pradhan H, (1989) – Lopsided Growth – Political Economy of Indian Development, Sameeksha Trust and OUP, Bombay.

Rao, M B (ed.), (1976) – Documents of the History of the Communist Party of India, Vo. VII, 1948-50, People's Publishing House, New Delhi.

Rao, R S, (1995) – Towards Understanding Semi Feudal Semi Colonial Society, Perspectives, Hyderabad.

Ramachandran VK et al (ed.) (2010)- Socio-Economic Surveys of Three Villages in Andhra Pradesh, FAS & Tulika Books, New Delhi.

Ray, Rabindra, (1992) – The Naxalites and Their Ideology, Oxford University Press, Delhi.

Reddy, N Rajasekhara, (1977) – What is CPI's Programme?, Communist Party Publication, New Delhi.

Revolutionary Communist Party, (2008) – Opportunists Never Understand Dialectics of Revolution – Central Committee, CPI (Maoist), June.

Rudra, Ashok (1988) – Some Problems of Marx's Theory of History, Orient Longman, Hyderabad.

Rudra, Ashok, (1992) – Political Economy of Indian Agriculture, K P Bagchi & Company, Calcutta.

Sanyal, Kalyan, (2007) – Rethinking Capitalist Development – Primitive Accumulation, Governmentality & Post-Colonial Capitalism, Routledge, London.

Sau, Ranjit, (1986) – Economy Class Society, Universities Press, Madras.

Sen, Samar and others (eds.), (1978) – Naxalbari and After – A Frontier Anthology, Kathashilpa, Calcutta.

Sen, Sunil (n.d.) – Polemics on Understanding Indian Society, Communist Voice, Patna.

Shah, S. A. (ed.), (1983) – India – Degradation and Development, M Venkatarangaiya Foundation, Hyderabad.

Sharma, R. S., (1980) - Indian Feudalism, Macmillan, Delhi.

Singha Roy, Debal K., (2004) – Peasant Movements in Post-Colonial India – Dynamics of Mobilisation and Identity, Sage Publications, New Delhi.

Scott, James C and Bhatt, Nina (2001) – Agrarian Studies, Yale University Press, New Haven.

Suresh, R. R. (2010) – Economy and Society, Sage, New Delhi.

Sweezy, Paul and Dobb, Maurice, et al (2006) – The Transition from Feudalism to Capitalism, Aakar Books, Delhi.

Sweezy, Paul M. (1991) – The Theory of Capitalist Development, K P Bagchi & Co, Calcutta.

Thompson, EP (1988) – The Making of the English Working Class, Penguin Books, Harmondsworth.

Thorner, Alice, (1982) – Semi-Feudalism or Capitalism? Contemporary Debate on Classes and Modes of Production in India, in Economic and Political Weekly, Vol. XVII, No. 49, 50 and 51, Decmber 4, 11 and 18.

Venkateswara Rao, Devulapalli (1982) – People's Democratic Revolution in India, Proletarian Line Publications, Hyderabad.

ఆర్ ఎస్ రావు (2010) – కొత్త చూపు, వీక్షణం పబ్లికేషన్స్, హైదరాబాద్.

పరమేశ్వర్ (2002) – భూపోరాటంలో వాస్తవాలు – వక్రీకరణలు, విప్లవ రచయితల సంఘం, హైదరాబాద్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) (పీపుల్స్ వార్), (1982) – దున్నేవానికి భూమి లభించనిదే రైతాంగానికి విముక్తి లేదు, క్రాంతి ప్రచురణలు, సికిందరాబాద్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) (పీపుల్స్ వార్), (1982) – కరీంనగర్ – ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు వర్ధిల్లాలి, క్రాంతి ప్రచురణలు, సికిందరాబాద్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) (పీపుల్స్ వార్), (1985) – భారత ఆర్థిక వ్యవస్థ – అర్ధవలస అర్ధభూస్వామ్య విధానం, క్రాంతి ప్రచురణలు, సికిందరాబాద్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) జనశక్తి, (1994) – సిరిసిల్ల రైతాంగ పోరాటం – పూర్వాపరాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, హైదరాబాద్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) విమోచన, (1992) – భారత వ్యవసాయరంగపు అర్ధభూస్వామిక స్వభావం, విమోచన, హైదరాబాద్.

భారతి, ముదునూరి (2012) – అభివృద్ధిని ఇలా చూద్దాం, వీక్షణం పబ్లికేషన్స్, హైదరాబాద్.

సామాజిక పరిశోధన కోర్ గ్రూప్ (2012) – ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలు, విరసం, హైదరాబాద్.

సీతారామయ్య, కొండపల్లి (2005) – ఆత్మవిమర్శనా రిపోర్టు తదితర తీర్మానాలు, కొండపల్లి సీతారామయ్య మెమోరియల్ కమిటీ, హైదరాబాద్.

సీతారామయ్య, కొండపల్లి (2005) – వ్యవసాయ విప్లవం – కొండపల్లి సీతారామయ్య మెమోరియల్ కమిటీ, హైదరాబాద్.


*(రచయిత వీక్షణం సంపాదకులు)*

వీ

# ఆర్థిక, సామాజిక దోపిడీ రద్దుకి మార్గం ఏమిటి?

**- ఎం. కృష్ణ ఆదిత్య**

'లక్షింపేట-భూమి-కులం-వర్గం-పరస్పర సంబంధం' శీర్షికతో వీక్షణం అక్టోబర్ 2012లో నా వ్యాఖ్యను ప్రచురించారు. వివిధ రూపాల్లో ఈ ముఖ్య సమస్యపై చర్చను ప్రోత్సహిస్తున్న సంపాదకులకు కృతజ్ఞతలు. నాది 'సద్విమర్శ'గా పేర్కొన్న కడియాల సుబ్బనాచారి గారికి (డిసెంబర్ 2012) అభినందనలు. వారి కొన్ని ప్రశ్నలకు నా స్పందన ఇది. నిజానికి అనేకుల ప్రశ్నలివి. నా వ్యాఖ్యలోనే చాలా జవాబులున్నాయి. మరోసారి పరిశీలించాలని మనవి. 'వాస్తవాల ఆధారంగా, శాస్త్రీయ దృష్టితో పునఃపరిశీలన' అవసరం అన్నాను. ఎక్కువ పునశ్చరణ లేకుండా కొన్ని అంశాలపై వివరణ ఇది.

కుల వివక్ష అణచివేతలపై 'ఆందోళన ఎవ్వరూ కాదనలేనిది, అయితే దానికి పరిష్కారం ఏమిటి?' అన్నదే అసలు ప్రశ్న అని లేవనెత్తి ఇలా రాశాను – 'దళిత పేదలు, ఇతర అన్ని కులాల పేదలు ఐక్యమై, కులాలకతీతమైన వర్గపోరాటం చేయడమే మార్గం. అలాకాక, ఇతరుల నుంచి దళితులు విడిపోతే లేదా వారిని విడగొడితే, వారి ఓటమి తథ్యం'. దళితులు 15–20 శాతంగా ఉన్న మైనారిటీ అనీ, దోపిడీ వర్గాలు ఇతరులందరినీ రెచ్చగొడతారనీ, రాజ్యం వారిని కాపాడలేకపోతున్నదనీ, 65 ఏళ్ల అనుభవం చెపుతుందనీ రాశాను. కులం – వర్గం పరస్పర సంబంధం, కులంలో వర్గ విభజన ద్వారా నానాటికీ స్పష్టంగా కనిపిస్తున్నది. విశ్లేషణలు ఎలా ఉన్నా పరిష్కారం దిశ ఏది? ఇదే మౌలికాంశం.

ఆర్థిక, సామాజిక అణచివేతలో దేశంలో చాలా వైవిధ్యం ఉందని వివరించాను. ప్రాంతం, కాలం, సంస్కరణలు, పోరాటాల చరిత్రలను బట్టి మారుతున్నది. దళితేతరుల పట్ల కూడా అంటరానితనం పాటించిన కేరళలో పోరాట ఉద్యమాల ఫలితంగా దళితులు తలెత్తుకుని తిరుగుతున్నారు. 'ఆత్మగౌరవ పోరాటం' జరిగిన తమిళనాడులో దళితుల అణచివేత వెర్రితలలు వేసింది. కుల ఉద్యమాలు ఆంధ్ర ప్రాంతంలోని కారంచేడులో జరిగాయి. వర్గపోరాటాల ఫలితంగా తెలంగాణలోని అలాంటి ప్రాంతాల్లో స్థితి వేరుగా ఉంది. దళితులు వీధుల్లో అందరితోపాటు తిరగగలుగుతున్నారా? వారిని వరుసలతో పిలుస్తున్నారా? లేదు అనేది వాస్తవం – అని సుబ్బనాచారి రాశారు. తెలంగాణలోని వందలాది పోరాట గ్రామాల్లో అలా తిరుగుతున్నారు, పిలుస్తున్నారు అనేది వాస్తవం. కుల వ్యవస్థలో వర్గపోరాటం తెచ్చిన మార్పులు కళ్లెదుట వాస్తవం.

జగ్జీవన్‌రాం గుడికి వెళితే శుద్ధి జరిపారని, ఆ నాయకుడి హోదా ఏమైంది? అని ప్రశ్నించారు. అది గత చరిత్ర. ఇవాళ జి. వెంకటస్వామి కుటుంబం, పనబాక లక్ష్మి, సర్వే సత్యనారాయణలు గుళ్లలో ఎలా ఆదరించబడుతున్నారో టివిలే సాక్షి. ఇతరుల్లాగే దళిత ఎంఆర్‌ఒ, ఎస్‌ఐలు కింది స్థాయిలో ఎలా సాగించుకుంటున్నారో జనానికి నిత్య అనుభవం. ఇలాంటివారు అగ్రవర్ణ కోడళ్లను, అల్లుళ్లను తెచ్చుకున్నారు. వారి ఇళ్లలో హిందూ 'బ్రాహ్మణీయ' సంప్రదాయాలు, పూజాదికాలు, వ్రతాల అట్టహాసం, ఆర్భాటం, అక్కడ బ్రాహ్మణ పూరోహితుల సేవలు, వాటికి ఇతర కులాల మిత్రులు, భృత్యుల హాజరు, వారి భక్తి ప్రపత్తులు చూడాల్సినవే. ఇదంతా దళితుల్లో ఎదిగిన అగ్రవర్గం, మధ్యతరగతి కథ. కోట్లాది దళిత పేదల వ్యధ వేరే. పాలకవర్గ విధానాల ఫలితంగా అలాంటి వర్గాలు ఏర్పడి, పైకి వెళ్లినకొద్దీ ఈ తేడా కొట్టొచ్చేట్టు కనపడుతున్నది. దళిత నాయకులకు, అధికారులకు హోదాయే కాదు, దర్పం కూడా వచ్చేసింది. గాంధీ 'హరిజనులని నామకరణం చేసి, సమాజంలో వారికొక గౌరవమైన స్థానం కల్పించారు. ఆ తదనంతర పరిణామాలు నేడు చూస్తున్నాం' అని సుబ్బనాచారి గారే రాసిందొక వాస్తవం. దేశంలో ఇలాంటి కొన్ని లక్షల మంది దళిత నాయకులను, అధికారులను – సర్పంచి నుంచి ముఖ్యమంత్రులు, దేశాధ్యక్షుడి దాకా, ఎంఆర్‌ఒ నుంచి డిజిపి దాకా – పాలకులు సృష్టించారు. పాలకులు తమ సంస్కరణల ద్వారా సాధించింది ఇది. కోట్లాది దళిత పేదల నుంచే వారిపై, ఇతరులపై కూడా పెత్తనం చేసే ఒక వర్గాన్ని సృష్టించారు. దోపిడీ వర్గంలోకి వారినీ కోఆప్ట్ చేసుకున్నారు. అందుకే ఏ దౌర్జన్యాలు జరిగినా వారు అందరిలాగే కుర్చీలకు అతుక్కునే ఉంటారు. పాలకులు దళితుల్లో వేగవంతం చేసిన ఈ వర్గ విభజనను చూసి వ్యవహరించాలి.

పోరాటాల క్రమంలో ఎస్‌సిలు కొంత 'బాగుపడి ఉండొచ్చు' అని రాస్తూ, 'ఇక్కడ కూడా నాయకత్వం అగ్రవర్ణాలదే కదా' అని రాసారు. అన్ని రంగాల్లో లాగే సామాజిక చారిత్రక కారణాల వల్ల స్త్రీలలో దళితుల్లో నాయకత్వ అభివృద్ధికి పైనా కిందా కూడా ప్రత్యేక కృషి చేయాల్సి ఉంది. అయినా కెజి సత్యమూర్తి తమ పార్టీ సాంస్కృతిక రంగంలో, తర్వాత కేంద్ర నాయకత్వంలో ముఖ్యుడిగా, కొంతకాలం కార్యదర్శిగా వ్యవహరించారన్నది తెలిసిందే. తర్వాత తొలగించారు కదా అంటే అది రాజకీయ నిర్మాణ తగాదాల్లో భాగం. ఆ మాటకొస్తే తర్వాత కొండపల్లిని కూడా తొలగించారు కదా. సాంస్కృతిక రంగంలో గద్దర్ వంటివారు జాతీయస్థాయిలో అగ్రశ్రేణికి చేరారు. రాష్ట్ర స్థాయిలో కల్యాణరావులు అనేకులున్నారు. దీనర్థం కమ్యూనిస్టు పార్టీలలో కులతత్వం లేదని కాదు. అగ్రకులతత్వం, ఇటీవలి కాలంలో కింది కులతత్వం కూడా ఉన్నాయి. సరైన దృక్పథంతో వర్గ, సాంస్కృతిక పోరాటాలు జరపడం ద్వారా వీటిని పరిష్కరించుకోవచ్చును.

తెలంగాణ పోరాటంలో 'ప్రధాన శత్రువు నవాబు' అని రాసారు. అది వాస్తవం కాదు. 1948 సెప్టెంబర్‌లో నవాబు రాజ్యం పోయాక, 1951 చివరి దాకా సాయుధ పోరాటం సాగడమే కాదు, తీవ్రమైంది. మూడు వేల గ్రామాలకు విస్తరించింది. ప్రధానంగా విస్తరించింది ఈ దశలోనే. అక్కడ నవాబు కాదు, ఫ్యూడలిజం ప్రధాన శత్రువు. ఆ వ్యవస్థకు నవాబుతో పాటు హిందూ జాగీరుదారులు, దేశముఖ్‌లు, దొరలు నాయకులు. తర్వాత ఆ శత్రునాయక పాత్రను – నవాబు కన్నా క్రూరంగా – కేంద్రమే నిర్వహించింది. 'బండెనుక బండి కట్టి' పాట ముందు 'నా కొడక ప్రతాపరెడ్డి' అని పాడినది. అనేక పాటలను తిరగరాసినట్టే దాన్నీ 'నైజాము సర్కరోడా'గా మార్చి రాశారు.

'ప్రతి పోరాటం కూడా భూమితో ముడిపడి ఉంటుంది. దీన్ని కాదనలేం. తరతరాలుగా జరుగుతున్న పోరాటం చారెడు నేల కోసమే' అని సుబ్బనాచారి గారు రాసింది ప్రత్యక్షర సత్యం. ఈ పోరాటాల వల్ల దళితులు 'కొంత భూమిని కూడా సంపాదించుకొని ఉండవచ్చు. ఎక్కువగా లాభ పడింది మాత్రం అగ్రవర్ణాల రైతులు, తదితర బిసి కులాలు' అని రాశారు. 'తతిమ్మా వారితో సమానంగా వీరికి భూమిని రానీయరు. ఇది కుల అణచివేతలో ఉన్న మర్మం' అన్నారు. ఇక్కడ రెండు అంశాలున్నాయి. ఎక్కువ, తక్కువ అన్నది పరిమాణాత్మక అంశం. అణచివేత మర్మం అన్నది గుణాత్మకం. రెండూ చూడాల్సినవే. ప్రాంతీయ, చారిత్రక అంశాల రీత్యా, పోరాట ఫలం రీత్యా వీటి వాస్తవాలను బేరీజు వేయాల్సి ఉంటుంది. ఎక్కువ, తక్కువ ఉంటే, దానికి ఏదేది ఏమేరకు కారణం అని పరిశీలించాలి. ఈ విశ్లేషణంతా ఆర్థిక, సామాజిక న్యాయసాధన లక్ష్యంతో సాగాలి.

జాతీయ స్థాయిలో పేరుగాంచిన దళిత అధ్యయనాల నిపుణుడు, దళిత ఉన్నతాధికారి, విద్యావేత్త అయిన సుఖదేవ్ తోరట్ ఇచ్చిన లెక్కలను పేర్కొన్నాను. 65 శాతం దళిత కుటుంబాలు, 33 శాతం దళితేతరులు (దాదాపు) భూమిలేనివారని చెప్పారాయన. ఉత్తరప్రదేశ్‌లో 43 శాతం మంది దళితులు 'స్వతంత్ర రైతుల'ని, బిఎస్‌పి బలం అదేనని దళిత వ్యాఖ్యాత చంద్రభాన్ ప్రసాద్ చెప్పారు. 'ఈ లెక్కలను తిరగేసి, వాటిని విపర్యయాలను చూస్తే వర్గం – కులం పరస్పర సంబంధాలు, తేడాలు, పోలికలు కూడా

లోతుగా బోధ పడుతాయి' అని సూచించాను. ఆ పని కొద్దిగా చేసి పరిశీలించుదాం.

దేశ జనాభాలో నూటికి 70 మంది నేటికీ గ్రామీణులే. (నిర్వచనాల్లో మార్పు ద్వారా కొద్దిగా దాన్ని తగ్గించి చూపెడుతున్నారు). అంటే సుమారు 84 కోట్ల మంది గ్రామీణులే. వారిలో ఆరవ వంతు, అంటే సుమారు 14 కోట్ల మంది దళితులు. మిగతా 70 కోట్లు దళితేతరులు (ఎస్‌టిలతో సహా). దళితుల్లో 65 శాతానికి, అంటే 9–10 కోట్ల మందికి (దాదాపు) భూమి లేదు. దళితేతరుల్లో 33 శాతానికి, అంటే 23 కోట్ల మందికి భూమి లేదు. అంటే భూమిలేని దళితులు 9 కోట్లు, దళితేతరులు 23 కోట్లు కలిపితే మొత్తం భూమిలేని వారు 33 కోట్ల మంది. భూమిలేని దళితుల శాతం ఎక్కువైనా, సంఖ్యరీత్యా భూమిలేని దళితేతరులు ఎక్కువని చూడవచ్చును. తెలంగాణ పోరాటంలో భూమిలేని వారికి ప్రాధాన్యత ఇచ్చి (ఇదొక గీటురాయి), భూ పంపిణీ చేశారు. దళితుల కన్నా దళితేతరులు 'ఎక్కువ మంది' భూమి పొందారంటే, దానికి ఒక కారణం ఇక్కడ బోధపడుతుంది. దళితుల్లో మిగతా 4–5 కోట్ల మంది పేదరైతులు (కొద్దిగా మధ్యతరగతి, ధనిక రైతులున్నా విస్మరిద్దాం). దళితేతరులు 70 కోట్లలో 10 శాతం మంది భూస్వాములుగా, ధనిక రైతులుగా సాగుభూమిలో 50 శాతం దాకా కలిగి ఉన్నారని వ్యవసాయ సెన్సస్ లెక్కలు సూచిస్తున్నాయి. మరికొంతమంది మధ్యతరగతి రైతులు, వారందరినీ తీసేస్తే సుమారు 40 కోట్ల మంది దళితేతరులు పేద రైతులని చెప్పవచ్చు. అంటే పేద రైతాంగం (దళిత, దళితేతర) మొత్తం 45 కోట్లు. భూమిలేని 33 కోట్లను కలిపితే, మొత్తం 78 కోట్ల మంది భూమిలేని, లేదా పేద రైతాంగం. కులాలకు అతీతంగా వీరిని ఐక్యం చేస్తే, పాలకులను దెబ్బతీయగల బలీయమైన పోరాట శక్తి వీరు. మధ్యతరగతి రైతులూ కలిసి పోరాడుతారు. (కార్మికుల, ఇతర పట్టణ పేదలు లెక్క వేరే). ఇలాంటి ఐక్యత క్రమంలో కొందరు ధనిక రైతులు తటస్థం కావచ్చును. నూటికి ఇలా 90 మందికి పైగా ఐక్యం చేయబడితేనే విజయం. అదే ఐక్య సంఘటనా విధానం. ఇలాంటి ఐక్యత ఒక ప్రబోధమే కాదు, దళిత, దళితేతర పేదలందరికీ అత్యవసరం. ఈ వర్గపోరాట ఐక్యతే నిజమైన మార్గం. దాన్ని అడ్డుకోవడానికి కులాల పేరిట ఉద్ధరణ, సంస్కరణలు, ప్రలోభాలు, తప్పుడు సిద్ధాంతాలు, చీలిక రాజకీయాలు. అలాగే మత, ప్రాంత, లింగ ఇత్యాది చీలిక వాదాలు. ఆయా గుర్తింపులు, వారి సమస్యలూ లేవని కాదు. ప్రజల మధ్య వైరుధ్యాలవి. పాలకవర్గ సిద్ధాంతాలు వాటిని తెగని శత్రు వైరుధ్యాలుగా మలచాలని చూస్తున్నాయి. వాటికి తోడు పోలీసు మిలిటరీ రాజ్యం. కాబట్టి ఐక్య పోరాటాలే పరిష్కార మార్గం. ఈ పోరాటాల క్రమంలో కులాలకతీతంగా ఐక్యత అనివార్యంగా, ఒక అవసరంగా పెరుగుతుంది, పెంచాలి. విప్లవోద్యమాల క్రమంలో ప్రజలు ఇలాంటి ఐక్యతను ఇతోధికంగా సాధించారు, సాధించగలరు. ఈ క్రమానికి అనుబంధంగా సాగే సాంస్కృతిక పోరాటం ఈ ప్రక్రియను సుగమం చేస్తుంది. వీ

# తెలంగాణ సాయుధ పోరాటం - వాస్తవాలు

- జి. సత్యనారాయణ రెడ్డి

జనవరి సంచికలో వరవరరావు గారు రాసిన వ్యాసంలోని తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన భాగంపై నేను రాసిన విమర్శను ఫిబ్రవరి సంచికలో 'తెలంగాణ సాయుధ పోరాటం – నూతన ప్రజాస్వామిక విప్లవం' పేరుతో ప్రచురించారు. నేను రాసిన దానిపై ఎన్. నర్సింహులు గారు రాసిన విమర్శ 'చరిత్ర తవ్వితే జవాబు కోరే ప్రశ్నలెన్నో' మార్చి సంచికలో ముద్రించారు. దానిలో ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు. 'వరవరరావు గారు రాసిన దాదాపు పదిన్నర పేజీల వ్యాసంలో ఒక పేరా మీద, అందులోనూ ఒకటి రెండు వాక్యాల మీద తీవ్రమైన విమర్శలు చేశారు.' అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ సాయుధ పోరాటంపై అవగాహన, అంచనాల సమస్యను కేవలం ఒకటి రెండు వాక్యాల సమస్యగా పేర్కొనడం అనేది ఆ సమస్య (సబ్జెక్ట్) ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించి చూపడమే. నాయకత్వానికి ఆనాడే పోరాటంపై స్పష్టత ఉందనడానికి నిదర్శనంగా నాటి సెక్రటేరియట్‌కు సంబంధించిన రెండు డాక్యుమెంట్లను నేను పేర్కొన్నాను. దానిపైన నర్సింహులుగారు 'ఒక్కరిద్దరికి స్పష్టత ఉన్నా అది మాటల్లోనే అని, చేతల్లో లేదని, నాయకత్వానికి లేదని, శ్రేణులకు అందలేదని' రాశారు. అదే వాస్తవమైతే 1948 నుండి 1951 వరకూ సాగిన వ్యవసాయ విప్లవాన్ని, గ్రామ రాజ్యాల నిర్మాణాన్ని వారు ఏ అవగాహనతో నడిపినట్లు? నిజాం సైన్యాలకు మాత్రమే కాకుండా కాంగ్రెస్ సైన్యాలకు కూడా వ్యతిరేకంగా మూడు సంవత్సరాల పాటు సాయుధ పోరాటాన్ని ఏ విధంగా కొనసాగించగలిగారు? 1948 సెప్టెంబర్ 'పోలీస్ యాక్షన్' పేరుతో జరిపిన సైనిక దాడిలో తీవ్రంగా దెబ్బతిన్న గెరిల్లా సాయుధ బలగాలను పార్టీ తిరిగి ఎట్లా పెంపొందించుకున్నట్లు? 'మాటల్లో అవగాహన' ద్వారానే అది సాధ్యమవుతుందా? ఆ పోరాట నాయకత్వానికి స్పష్టమైన అవగాహన ఉండడం వల్లనే అది సాధ్యమయిందనేది ఒక చారిత్రక వాస్తవం. (అయితే ఆ స్పష్టత వారికి మొదటి నుండీ లేదనీ, 1948 ఏప్రిల్ – మే నెలలో వారు రూపొందించిన 'ఆంధ్రా థీసిస్' సమయానికి మాత్రమే అది ఏర్పడిందనేది స్పష్టమే.)

ఇక నేను ప్రస్తావించిన రెండవ డాక్యుమెంట్ 'తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించాలనే తప్పుడు ధోరణులపై విమర్శ' గురించి నర్సింహులు గారు 'అది 1949లో రాసిందే అని నమ్మినా' అంటూ ఆ డాక్యుమెంటు అసలు అప్పుడే రాయబడిందో లేదో అనే సందేహాన్ని లేవనెత్తారు. తిరిగి ఆయనే 'పోరాట స్మృతులు, జ్ఞాపకాలు, అనుభవాలు రాసిన వారిలో ఒక్కరు కూడా దాని గురించి పేర్కొనలేదనీ, దానికి కారణం వారు ఆ (పోరాట) రాజకీయాలను వదులుకోవడమేనని' స్పష్టంగా పేర్కొన్నాడు. ఇది పరస్పర విరుద్ధంగా ఉంది. ఆ డాక్యుమెంటు చదివితే అది ఆనాడే కిందికి సర్కులేట్ చేయబడిందనే వాస్తవం కూడా అర్థం అవుతుంది.

తెలంగాణ సాయుధ పోరాట విరమణకు డి.వి. అంగీకరించాడనీ, ఆ విషయాన్ని వివరించడం కోసం ఆయన ఒక ప్రాంతానికి వెళ్లడానికి బాధ్యత తీసుకున్నాడని నర్సింహులు గారు రాశారు. దానికి ఆధారం సుందరయ్యగారు రాసిన వీర తెలంగాణ పోరాటం – గుణపాఠాలు అనేదే. సుందరయ్యగారు పై పుస్తకంలో రాసిన కొన్ని ఇతర విషయాలతో పాటు ఈ సమస్యపై కూడా డి.వి. ఒక సుదీర్ఘమైన వివరణతో విమర్శించాడు. సుందరయ్యగారు వాస్తవాన్ని పూర్తిగా వక్రీకరిస్తున్నాడనీ ఆనాడు జరిగిన సంఘటనల యథార్థాన్ని దాంట్లో వివరించాడు. అది 1974లో ఇంగ్లిష్‌లోనూ, తర్వాత తెలుగులోనూ ముద్రించబడింది. ('భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణ సాయుధ పోరాటం' పేరుతో). డి.వి.గారి వివరణ, విమర్శలను పక్కన పెట్టి నర్సింహులు గారు సుందరయ్యగారు రాసిన దాన్నే వాస్తవంగా భావించడంలోని ఔచిత్యం ఏమిటి? (సుందరయ్యగారు ఆనాటి నుండి చనిపోయే వరకూ ప్రజాయుద్ధ పంథాను దృఢంగా వ్యతిరేకిస్తూ వచ్చాడు. ఆంధ్రా థీసిస్‌కు 'డీసెంట్ నోట్' పెట్టింది ఆయనే). డి.వి. రాసిన విమర్శ తర్వాత దశాబ్దానికి పైగా జీవించిన సుందరయ్యగారు దానిపైన విమర్శగానీ, వివరణ గానీ చేపట్టలేదనేది ఒక భౌతిక వాస్తవం.

చివరగా నర్సింహులు గారు డి.వి. పాత్ర గురించి మరికొన్ని ప్రశ్నలు

లేవనెత్తారు. ఆ ప్రశ్నలన్నింటికీ డి.వి. తన రచనల్లో వివిధ సందర్భాల్లో వివరణ ఇచ్చారు. వాటిలోని కొన్నింటిలో ఆనాటి తన పాత్రను ఆయన ఆత్మవిమర్శా పూర్వకంగా విశ్లేషించుకొన్నారు. (వాటినన్నింటినీ 'వీక్షణం' చర్చ పరిధిలో 1,2 పేజీల్లో వివరించడం సాధ్యం కాదు.) నర్సింహులు గారితో పాటుగా చరిత్రను తవ్వితీసి ఆ ప్రశ్నలన్నింటికీ జవాబు పొందాలనే ఆసక్తి, శ్రద్ధ గల వారందరూ డి.వి.తో పాటు ఇతరుల వివరణలన్నింటినీ (వర్షెన్స్) అధ్యయనం చేసి వాటిని పొందాల్సి ఉంటుంది. అయితే ఆ అధ్యయనాన్ని, పరిశీలనలను మావో పేర్కొన్న 'వాస్తవాల నుండి సత్యాన్ని అన్వేషించండి' (సీక్ ది ట్రుత్ ఫ్రమ్ ఫ్యాక్ట్స్) అనే స్పిరిట్‌కు అనుగుణంగా చేపట్టాల్సి ఉంటుంది. అప్పుడే ఎవరైనా కూడా తెలంగాణ సాయుధ పోరాటంపై సమగ్రమైన, లోతైన అవగాహనను అభివృద్ధి చేసుకోగలుగుతారు. దానితో పాటుగా ఆ అనుభవాలను ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న, కొనసాగవలసిన విప్లవోద్యమానికి ఉపయోగపడే విధంగా అన్వయించుకో గలుగుతారు.

అలాంటి సానుకూల అభిప్రాయంతోనే నేను వరవరరావు గారి వ్యాసంలోని కొన్ని భాగాలపై విమర్శ చేశాను తప్ప ఆయన డి.వి.ని విమర్శించినందుకు నర్సింహులు గారన్నట్లుగా ఖండఖండాలుగా చేయడం కోసం కాదు. (అసలు వరవరరావుగారు డి.వి. గురించి ప్రస్తావించనే లేదు.) వ్యక్తులు వారి పాత్ర అట్లా ఉంచి తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను ప్రస్తుత విప్లవోద్యమానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలనేది మరింత ముఖ్యమైన సమస్య. ఈ సమస్య పై ఆసక్తి గల వారెవరైనా ఆ వైపుగా ఆలోచించడం అవసరం. వీ

# చరిత్ర తవ్వటమేమో కానీ...

**- ఎం. ఉదయభాను**

వీక్షణం మార్చ్ 2013లో నర్సింహులు గారు (చర్చ పే. 62లో) ప్రశ్నలంటూనే అనేక విధాల తప్పుడు సమాచారం ఇచ్చారు. అందువల్ల వారికేకాక పాఠకుల కోసం కొన్ని వాస్తవాలు అతి క్లుప్తంగా. 'చరిత్ర మౌలిక వాస్తవాలనే విస్మరించి ప్రత్యామ్నాయ చరిత్ర నిర్మాణం' శీర్షికతో ఫిబ్రవరిలోని నా వ్యాఖ్య గురించి వారి విమర్శలు నిరాధారం. (ఇక్కడ లక్ష్యం మళ్లీ మూల వ్యాసంలోకి వెళ్లడం కాదు).

1) జనవరి సంచిక వరవరరావు (వివి) గారి వ్యాసంలోని 'ఒక్క పేరా మీద – ఒకటి రెండు వాక్యాల మీద తీవ్ర విమర్శలు' అన్నారు. 'ప్రత్యామ్నాయ చరిత్ర...' రాసేప్పుడు తెలంగాణ కీలకాంశం. పేరాలెన్నో అప్రస్తుతం. అయినా పది పేరాల్లో, వందలైన్లలో ఈ విషయ ప్రస్తావన ఉంది. నేను ఉటంకించినవే 10–15 లైన్లు.

2) తెలంగాణ 'పోరాట స్వభావం ఏమిటి? నాయకత్వానికీ శ్రేణులకూ ఉండిన అవగాహన ఏమిటి? ఆ విషయంలో వివిగారి అంచనా సరైనదే' అని వారి మౌలిక విషయాన్ని సమర్థిస్తూ రాశారు. నేను వివి అంచనా జోలికి పోలేదు. సిద్ధాంత చర్చల్లోకి పోకుండా కొన్ని వాస్తవాలను ఎత్తి చూపడానికే పరిమితమైనాను.

అ) పోరాటాన్ని నడిపిన పార్టీ గానీ, పోరాట చరిత్ర రచయితలు గానీ 'విప్లవంగా వర్ణించలేదు' అని వివి రాశారు. డివి గారు నాటి ఆంధ్ర పార్టీ సెక్రటేరియట్ సభ్యులు, ఆ పోరాట చరిత్ర రచయిత. వారి తెలంగాణ చరిత్ర పుస్తకం మొదటి పేజీలోనే దాని విప్లవ స్వభావం, విప్లవ పంథాల గురించి స్పష్టంగా ఉంది. ఆ) గెరిల్లాలు అనే మాట కూడా అంత ప్రచారంలో లేదు అని వివి రాసినది తప్పని, పుస్తక విషయ సూచికలోని మూడు నాలుగు శీర్షికలే నిదర్శనం అని ఎత్తి చూపాను. (నర్సింహులు అంగీకరించారు). ఇ) నాటి పోరాటంలో చైనా మార్గం అని కొద్దిగా స్ఫురించినా, నూతన ప్రజాస్వామిక పంథా, రాజ్యాధికార సమస్యలు నాయకత్వానికి, శ్రేణులకు అర్థం కాలేదు అని వివి రాశారు. ఈ మూడు ఎలా తప్పో చెపుతూ, ఆంధ్ర థీసిస్ గురించి డివిని ఉటంకించాను. పై వాటిని 'అభ్యంతకరం... వీక్షణం ప్రమాణాలకు తగినట్టుగా లేదు' అని ఎలా అనగలరు? సంస్కరణవాది, మధ్యేవాది అయిన సుందరయ్య లాంటి వారి రచనలు పేర్కొని, కొన్ని నిర్ధారణలకు వచ్చారు. జ్ఞాపకాలు చాలా మందే రాసినా, సైద్ధాంతిక, చారిత్రక లోతుల్లోకి వెళ్లిన అరుదైన గ్రంథం డివిదే. ఆ అంచనాను (అంగీకరించక పోయినా) పరిశీలించకుండా ప్రత్యామ్నాయ 'విప్లవ' చరిత్ర ఎలా సాధ్యం? ఎవరైనా సరైన అంచనాకు ఎలా రాగలగుతారు? ఇదే నా పాయింట్.

3) ఆంధ్ర థీసిస్ గురించి ఒకరిద్దరు తప్ప తలచుకోలేదు, దాని జీవితం ఆరు నెలల కన్నా ఎక్కువ లేదు, దానితో రెండు పంథాల మధ్య పోరాటమూ లేదు. 2007లోనే వెలుగు చూసింది – ఇంకా ఇలా నర్సింహులు రాశారు. నిజమా? నాకు తెలిసే పది మందికి పైగా దాన్ని పేర్కొన్నారు. రాసి 65 ఏళ్లయినా అది వెంటాడుతూనే ఉంది. 1948 నుంచి నేటి వరకూ అక్షరాలా ప్రతి దశాబ్దంలోనూ ప్రస్తావించబడింది. రెండు పంథాల పోరాటంలోనూ ఉపయోగించారు. ఆ సందర్భంగా దానిలోనూ లోపాలున్నాయనీ డివి విశ్లేషించి చెప్పారు. ఆ థీసిస్ గురించి ఉన్నచోట వెతకాలి కానీ, అది లేని 'గాలిమరల్లో, పై బజారులో' (విండ్ మిల్లర్, ఓవర్ స్ట్రీట్) వెతికి ఏం ప్రయోజనం! దాన్ని స్వయంగా వివియే తెలంగాణ నవలలపై తన థీసిస్‌లో (1983) పేర్కొన్నారు. ఇనుకొండ తిరుమలి కూడా తన థీసిస్‌లో (1991) సైట్ చేశారు; అది 2003లో పుస్తకంగా, తెలుగులో 'తిరగబడ్డ తెలంగాణ'గా వెలువడింది. ఇద్దరూ అది ఎక్కడ లభ్యమో కూడా పేర్కొన్నారు (అని జ్ఞాపకం). ఆంధ్ర థీసిస్ ప్రతి కలవారిలో, ఎవరెవరు ఎందుకు బైటకు తేలేదో, తొక్కి పెట్టారో దానికదే ముఖ్య పరిశోధనాంశం.

4) 1949 డాక్యుమెంట్ గురించీ ఏవేవో రాశారు. అనుమానాలు వెదజల్లారు. ఆంధ్ర థీసిస్‌ని నాటి పార్టీ ఆంతరంగిక పరిస్థితులలో ఎందుకు పంపిణీ చేయలేకపోయారో, అయితే దాన్ని ఆధారం చేసుకునే 1949లో డివి డ్రాఫ్టు చేసిన డాక్యుమెంట్‌ని కింది యూనిట్, దళాల దాకా ఎలా చర్చించారో, ఆ పుస్తకం (కనీసం ముందుమాట) చదివిన వారికి తెలుస్తుంది (120+20 పేజీలు). ఆసక్తి కలవారు ఇప్పుడైనా చదువుకోవచ్చును.

5) విరమణ వివాదాలు, అందులో డివి పాత్ర మొదలైన అనుమానాలు లేవనెత్తారు. వారన్నట్టు నిజంగానే 'డివి రాసినవన్నీ అబద్ధాల'ని సుందరయ్య 'విప్లవ పథంలో నా పయనం'లో రాశారా? 'తాను పోరాట విరమణకు విరుద్ధం అని (డివి) చెప్పడం అబద్ధం' అని 'స్టాలిన్ నోట్లో మేమీ మాటను మేము ఉంచామ'నటం శుద్ధ అబద్ధం అని రాశారు (నా పయనం, పే 23). 'అన్నీ' అబద్ధాలే అనలేదు. ఆ తర్వాతి వాక్యంలోనే 'పోరాట విరమణ నిర్ణయం తీసుకొనే సమయంలో దేవులపల్లి లేని మాట మాత్రం నిజం' అని వారే రాశారు. 'దేవులపల్లి రాకుండానే మేము నలుగురం ... విరమణ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది' అని అంతకు ముందు 21వ పేజీలో ఒక వివరణ కూడా ఇచ్చారు. అక్షరాలా తర్వాతి వాక్యంలోనే ఉన్న ఈ విషయాన్ని నర్సింహులు మింగేశారు.

సుందరయ్య ఈ వివరమైనా ఎందుకిచ్చారు? అంతకు ముందు వారి చరిత్ర పుస్తకంలో (1973) ఈ విషయాల్ని రాస్తూ, పోరాట విరమణ, స్టాలిన్ సలహా, డివి పాత్ర మొదలైన వాటి గురించి ఇలాగే కొన్ని అవాస్తవాలు రాశారు. డివి వాటిని ఖండిస్తూ ఆ పుస్తకంపై తమ సమీక్షలో సుందరయ్య దాచిపెట్టిన, వక్రీకరించిన అనేక నిజాలను బైటపెట్టి, విశ్లేషించి, రుజువు

చేసి, వివరించారు. 'పోరాట ఉపసంహరణకు నేను ఎన్నడూ సమ్మతించలేదు.. పోరాట ప్రాంతంలో బాధ్యులుగా ఉన్న నేను, భీమిరెడ్డి నరసింహారెడ్డి గారు లేకుండా ఈ కామ్రేడ్లే సాయుధ పోరాట విరమణకు నిర్ణయించారు... సమావేశానికి ఆహ్వానించబడని, హాజరు కాని సభ్యునికి ఆ నిర్ణయ బాధ్యతను అంటగట్టడం కమ్యూనిస్టు నిర్మాణ సూత్రాలలో ఎక్కడా కనీవినీ ఎరుగనిది' అని సాక్ష్యాధారాలతో డివి వివరించారు (పే. 62). ఈ సమీక్ష పుస్తక రూపంలో 1974లోనే తెలుగులో, ఇంగ్లిష్‌లో (152+12 పేజీలు) వెలువడింది. రకరకాల పునర్ ముద్రణలు కూడా వెలువడ్డాయి. ('భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణ సాయుధ పోరాటం' శీర్షికతో – ఇక్కడ పేర్కొన్నవి తెలుగు అనువాదం 1982 మే ఎడిషన్ పేజి నంబర్లు)

6) సుందరయ్యగారి కథనాలన్నీ పరమ సత్యాలన్నట్టుగా అనేక ఇతరుల్లాగే నర్సింహులు రాసుకొచ్చారు. వాటిలో అనేకం పరమ వివాదాస్పదమైనవి. డివి, సుందరయ్య గారి కొన్ని కథనాలను 'నిరాధారమైనవిగా తోసి పుచ్చవలసింది' అని (పే. 51); 'మరో విషయం గురించి అశ్వత్థామ హతః కుంజర అన్నట్లుగా అస్పష్టంగా చెప్పారు' అని (పే. 56); 'ఆయన 'ద్వంద్వ వైఖరి'తో కొన్ని ముఖ్యమైన పరిణామాలు ప్రజలకు తెలియజెప్పకుండా ఉంచుతున్నారు' అని (పే. 57); కొన్ని వాస్తవాలను, డాక్యుమెంట్లను మినహాయించారని (పే. 60); కొన్ని 'అంశాలపై వాస్తవాలను అందజేయడంలో సుందరయ్యగారు వాస్తవ దృష్టిని కానీ, చిత్తశుద్ధిని కానీ ప్రదర్శించలేదనడానికి పై వాస్తవాలే నిదర్శనం (పే. 66) అని సోదాహరణంగా వివరించారు. ఈ పుస్తకం ప్రచురణ అయిన పదేళ్ల దాకా డివి, సుందరయ్య జీవించి ఉన్నారు. ఆ కాలమంతటా సుందరయ్య, బసవపున్నయ్యల నుంచి సమాధానం రాలేదు. అంతా చనిపోయాక సుందరయ్యగారి మూడో వర్ధంతి (1988) సందర్భంగా పైన పేర్కొన్న 'అబద్ధాల' పుస్తకం వెలువడింది. ఈ నేపథ్యంలోనే డివివి 'అబద్ధాలు' అంటూనే, డివి 'రాకుండానే విరమణ నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది' అని అంగీకరించాల్సి వచ్చింది.

7) ఆనాటి డాక్యుమెంటులో స్పష్టత ఉందని అనుకున్నా, కింది దాకా వెళ్లలేదని, అమలు ప్రయత్నం లేదని రాశారు. నాటి పోరాట వివరాలు కనీసం తెలిసినవారికైనా అమలు, చైతన్య స్థాయి ఏమిటో అర్థమవుతుంది. వేలాది ప్రజల నోళ్లలో మార్మోగిన ఆనాటి పాటల్ని చూసినా చాలు, నాయకులే కాదు, శ్రేణుల్లో, ప్రజల్లో ఎలాంటి విప్లవ చైతన్యం ఉండేదో తెలుస్తుంది. (ఉదాహరణకు, రంగు రంగుల మారి నెహూరయ్యా; ప్రజారాజ్యం గురించిన పాటలూ)

8) డివి గారి మీద 'ఈగ వాలినా ఖండ ఖండాలుగా నరికేసే ఉత్సాహంతో' రాసినట్టు ఆరోపించారు. మళ్లీ వారే వివి 'డివి గారి అంచనాను ప్రస్తావించలేదు' అని ఒక నిజం రాశారు. అంటే ఈగే వాలలేదు, నరికేసే సమస్య ఎక్కడ? ఈ ఈగల సమస్య వివి సృష్టించలేదు. అది నర్సింహులు గారిదే. ఎందుకంటే వారు – వెనుక కొందరు ఇతరులూ – ప్రశ్నలంటూనే అనేక అనుమానాలు లేవనెత్తారు. వారికే కాదు, ఆసక్తి, సీరియస్‌నెస్ కలవారెవరైనా కనీసం పైన పేర్కొన్న రెండు మూడు పుస్తకాలను చదివితే దాదాపు అన్నింటికీ సమాధానాలు లభిస్తాయి. వాటి వివరాలకు ఈ వేదిక, సందర్భం సరిపోవు.

9) ఎవరైనా సమీక్షలు, విమర్శలు చేయవచ్చు. కానీ చరిత్రలో రికార్డయిన వాస్తవాలను విస్మరించకూడదని మనవి. చర్చ అంటూ విషయాలు తెలియ (తెలుసుకో)కుండానే రాయడం మంచిది కాదేమోనని నా వ్యక్తిగత అభిప్రాయం. ఎవరికైనా జవాబులు చాలావరకు అధ్యయనం ద్వారా లభిస్తాయి. కనీసం ప్రస్తావించిన పుస్తకాలనైనా చదవాలి. అనుమానాలు పెట్టుకు కూర్చుంటే కాదు.

10) నా విమర్శలో వ్యక్తిగత నింద, దూషణలు, తిరస్కారం ఉన్నాయట! నిరాధారం. ఇప్పటికైనా పరిశీలించవచ్చును. ఒకింత వ్యంగ్యం ఉందేమో! విషయానికి దోహదం చేసే వ్యంగ్యం ఆరోగ్యకరమే. వీక్షణం పేజీల్లో అది పుష్కలంగా ఉంది. దానికి సంపాదకులను తప్పుపట్టడం ఎందుకు? చర్చకు వీలు కల్పించినవారికి కృతజ్ఞతలు. వీ

# రంగనాయకమ్మ, ఎన్. ఆదిరెడ్డిల చర్చకు స్పందన

**- లోకసంచారి**

**నా** వ్యాసాలలో మార్క్సిస్ట్ దృక్పథానికి సరిపడని అభిప్రాయాలు కూడా ఉంటున్నాయని ఎన్. ఆదిరెడ్డి గారన్నారు. అది వాస్తవమే. నాకు మార్క్సిజంపై లోతైన అవగాహన లేదు. కొంతకాలం క్రితం ఒక మార్క్సిస్ట్ నిపుణుడు నేను ఒకటి, రెండు వ్యాసాలలో రాసిన '0.5 శాతం పాలకవర్గాలు వ్యతిరేకంగా 99.5 శాతం ప్రజల ఐక్యత' అనే ఆలోచన ఎలా అశాస్త్రీయమైనదో వివరించి మార్క్సిస్ట్ దృక్పథం ప్రకారం ఎలా ప్రజల ఐక్యతను అర్థం చేసుకోవాలో చెప్పిన తర్వాత నా అభిప్రాయాన్ని మార్చుకొని మళ్లీ ఎక్కడా ఆ భావాన్ని వ్యక్త పరచలేదు. ప్రజల శక్తి అపారమైనది, అజేయమైనది అనే మార్క్సిస్ట్ అవగాహనతో నాకు పూర్తి ఏకీభావం ఉంది. అయినప్పటికీ, పర్యావరణం విషయంలో మాత్రం పెద్ద నష్టాలు జరిగిన తర్వాత పర్యావరణాన్ని పునర్నిర్మించడం ప్రజల శక్తికి మించిన కార్యం. ఈ అంశంపై వివరంగా పర్యావరణంపై రాసే వ్యాసంలో వివరిస్తాను.

'2020 తర్వాత ఏమి జరుగబోతోంది?' అనే నా వ్యాసం 'జీవవైవిధ్యపు..' అనే వ్యాసంలానే భయం గొలిపేదిగా ఉందని రాశారు. తాజాగా మార్చ్ 2013 రెండవ వారం నుండి సైప్రస్ దేశంలో జరుగుతున్న పరిణామాలు ఒక చక్కటి ఉదాహరణ. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకపోతే, ప్రజల వ్యక్తిగత ఖాతాల నుండి డబ్బులు తీసుకొని మా అప్పు తీర్చాలని ఆ దేశ ప్రభుత్వానికి ఐఎంఎఫ్ అల్టిమేటం ఇచ్చింది. ఇలాంటి ద్రవ్య సంస్థ అయిన యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్. కొంచెం అటు ఇటుగా ఇంకో ఏడు సంవత్సరాల తర్వాత భారతదేశంపై కూడా ఈ 'డ్యామ్‌క్లీన్ ఖడ్గం' పడనుందని ఇలాంటి వాస్తవ సంఘటనల ఆధారంగానే విశ్లేషించి రాశాను. సిరియాపై రాసిన వ్యాసంలో సామ్రాజ్యవాదుల వ్యూహాలను ఎక్కువగా రాయడానికి కారణం, సిరియాలో జరుగుతున్న పరిణామాలకు ఆ వ్యూహాలకు విడదీయలేని సంబంధం ఉంది కాబట్టి. అయితే బిల్డెర్‌బర్గ్ అనే సామ్రాజ్యవాదుల సంస్థ సామ్రాజ్యవాదాన్ని ముందుకు తెచ్చిందని నేను రాయలేదు, అలాంటి అశాస్త్రీయమైన అభిప్రాయం కూడా నాకు లేదు. ప్రజలు ఎక్కడికక్కడ విప్లవిస్తుండడం, సామ్రాజ్యవాద వ్యతిరేక కమ్యూనిస్టు శక్తులు అధికారంలోకి రావడం లాంటి కారణాలతో సామ్రాజ్య వాదులు, వారి దళారీలు తమ మధ్య ఉన్న వైరుధ్యాలకతీతంగా ఏకమై, తమ అధికారాన్ని సుదీర్ఘకాలం పాటు సుస్థిరం చేసుకోవాలనే ఆలోచనతో బిల్డెర్‌బెర్గ్ లాంటి సంస్థ స్థాపనకు పూనుకున్నారు. ఇదే నా వ్యాస అభిప్రాయం తప్ప, ఈ సంస్థ సామ్రాజ్యవాదాన్ని కనిపెట్టిందని కాదు. సామ్రాజ్యవాదులు మార్కెట్‌పై తమ మోనోపలీ ఆధిపత్యం కొరకై కార్టెల్స్ ఏర్పరుచుకుంటారనే లెనిన్ సూత్రీకరణకు అనుగుణమైనదే బిల్డెర్‌బెర్గ్ అనే సామ్రాజ్యవాద సంస్థ.

సామ్రాజ్యవాదం తన అభివృద్ధి, మనుగడ కొరకు అత్యంత సమర్థవంతంగా వాడుకొంటున్న అంశాలలో అత్యంత ప్రధానమైనది ప్రజల మైండ్‌ను ఎలా కంట్రోల్ చేసి తమకు అనుకూలంగా మలచుకోవాలని అనే అంశం. అలా అని ప్రపంచ ప్రజలనందరినీ శాశ్వతంగా మైండ్ కంట్రోల్ చేసి తాము శాశ్వతంగా అధికారంలో ఉంటారని నా అభిప్రాయం కాదు, అది సాధ్యం కూడా కాదు. కేవలం నెల క్రితమే ఒబామా నాయకత్వంలోని అమెరికా

సామ్రాజ్యవాదులు 'బ్రెయిన్ మ్యాపింగ్' అనే బిలియన్ డాలర్ల ప్రాజెక్టును ప్రకటించారు. రెండవ ప్రపంచ యుద్ధానంతర అమెరికా చరిత్రలోనే అతి పెద్ద ప్రభుత్వ ఫండింగ్‌తో నడిచే ప్రాజెక్ట్‌గా పరిగణించబడుతున్నది. ఈ ప్రాజెక్ట్ అమెరికా ప్రకటించగానే, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తాము కూడా ఈ ప్రాజెక్ట్‌పై పరిశోధనలు చేస్తున్నట్టు ప్రకటించారు. మైండ్ కంట్రోల్‌ను లోతుగా పరిశోధించాల్సిన అవసరం ప్రత్యామ్నాయ వ్యవస్థ కోరుకునే వారందరికీ ఏర్పడింది. క్లాసికల్ మార్క్సిస్ట్, లెనినిస్ట్ సిద్ధాంతం సామ్రాజ్యవాద పుట్టుకను, దాని మరణాన్ని శాస్త్రీయంగా, తిరుగులేని విధంగా చెప్పింది. అయితే, దాని పుట్టుక, మరణాల మధ్య దాని జీవితం కూడా ఉంది. ఇప్పుడు మనం ఆ దశలో ఉన్నాం. ఆ జీవితానికి ఎన్నెన్నో కోణాలున్నాయి. కొత్త కొత్త కోణాలు పుడుతున్నాయి. అశేష ప్రజానీకపు రోజువారీ జీవితాల్లో తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపుతున్న ఈ కోణాలను బయటకు తీస్తున్న ఆయా రంగాల్లో నిపుణులైన మార్క్సిస్టేతర మేధావులను, వారి విశ్లేషణలను పైపై విమర్శలు, సంచలనాత్మక విషయాలు అని తీసివేయకుండా, మార్క్సిస్ట్ - లెనినిస్ట్ సిద్ధాంతం ఎలా శాస్త్రీయమైనదో నిరూపించడానికి వాటిని వాడుకోవాలి. దోపిడీ పాలకవర్గాలు అధికారంలో ఉన్నంత వరకు చాలా అంశాలకు రుజవులు లేకుండా చూస్తారు.

అత్యాచారాలపై నేను రాసిన వ్యాసంలో 1991 ప్రపంచీకరణతోనే భారత దేశంలో అత్యాచారాలు జరుగుతున్నట్టు నేను రాశానని ఆదిరెడ్డి అన్నారు. నేను అలా రాయలేదు. నా అభిప్రాయం కూడా కాదది. 1991 తర్వాత అనూహ్యంగా పెరుగుతూ వస్తున్నాయి అని రాశాను. దీనర్థం అంతకు ముందు అత్యాచారాలు జరగలేదని కాదు, ఆ వ్యవస్థ మంచిది అని కాదు. 'అన్ని రోగాలు కుట్రపూరితంగా మందుల అమ్మకాల కోసమే కల్పించబడుతున్నవని' నేను రాసినట్టు ఆదిరెడ్డి అన్నారు. నేను అలా రాయలేదు. కుట్రపూరితంగా రోగాలు వచ్చే జీవన విధానాన్ని, పరిస్థితులను కల్పిస్తూ దాని వలన ఆర్థికంగా లాభపడి, తిరిగి రోగాలు వచ్చిన తర్వాత ఆరోగ్య వ్యాపారం ద్వారా కూడా ఆర్థికంగా లాభడుతున్నారని నా వ్యాస ఉద్దేశం. నేను రాయలేదు కాని, మందులు అమ్ముకోవడానికే కొన్ని రోగాలు సృష్టించిన ఘనత కూడా సామ్రాజ్యవాద వ్యవస్థకు ఉంది.

'అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి?' అనే నా వ్యాసంలోని కొన్ని వాక్యాలకు నేను ఉద్దేశించని అర్థాలను రంగనాయకమ్మ తీసారు. 'వ్యభిచారాన్ని లీగలైజ్ చేస్తే అత్యాచారాలు తగ్గుతాయి' అనేట్టుగా అర్థం వస్తున్నదని రాశారు. నేను రాసిన వాక్యం ఉద్దేశం అది కాదు. నా వ్యాసంలో రాయలేదు కానీ, ఈ వ్యవస్థలో వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీలు అత్యంత అమానవీయ, దీన పరిస్థితి దృష్ట్యా ఆ వృత్తిని లీగలైజ్ చేయాలనే సెక్స్‌వర్కర్ హక్కుల సంఘాల డిమాండ్ సమర్థనీయమైనది. అయితే, బతకడానికి వేశ్యా వృత్తిలోకి దిగాల్సిన అవసరం లేని సోషలిస్ట్ వ్యవస్థనే మన లక్ష్యంగా ఉండాలి అని నా అభిప్రాయం. రంగనాయకమ్మ రాసిన అమ్మే - కొనే పెట్టుబడిదారీ సంస్కృతి ఎప్పుడో కనుమరుగైపోయింది. దాని స్థానంలో సామ్రాజ్యవాదులు దశాబ్దాల కాలం పాటు వేలాది మానసిక శాస్త్రవేత్తల, సోషియాలజిస్టల, ఆంత్రపాలజిస్టుల, మేనేజ్‌మెంట్, డిజైనింగ్ నిపుణుల, ఇతర రంగాల పరిశోధకులతో ఐదు, ఆరు నెలల వయసు పిల్లల నుండి సీనియర్ సిటిజన్ల వయసు వరకు ప్రజలపై చాలా లోతైన పరిశోధనలు, ప్రయోగాలు చేసి అభివృద్ధి చేసినది వినియోగ సంస్కృతి. మొబైల్, ఇంటర్నెట్, ఇతర టెక్నాలజీల అభివృద్ధితో గత కొన్ని సంవత్సరాల నుండి వినియోగ సంస్కృతిని అడ్వాన్స్‌డ్ మైండ్ కంట్రోల్ టెక్నిక్‌లకు అనుసంధానం చేసి ఇంకా అభివృద్ధి పరిచారు. వినియోగ సంస్కృతికి అత్యాచారాలకు సంబంధం ఏమిటి అని రంగనాయకమ్మ అడిగారు. తుపాకులు కొని ఇంట్లో దాచుకోవాలనుకునే వినియోగ సంస్కృతికి, వాటితోనే కుటుంబ సభ్యులనో, ఇతరులనో కాల్చి చంపే పరిణామాలకు ఏ సంబంధం ఉందో అలాంటి సంబంధమే ఉంది. అత్యాచార నిందితుల జీవితాన్ని, ఆలోచనా విధానాన్ని, మానసిక స్థితిని వివిధ కోణాల నుండి లోతుగా పరిశోధిస్తే వినియోగ సంస్కృతి ఈ అంశాలతో ఎలా ముడిపడి ఉందో అర్థం అవుతుంది.

పాలకవర్గాలు, వారి సేవకులు చేసే అత్యాచారాలను మీడియా చెప్పడం లేదని అనడం, చెప్పే వాటిని చెప్పకూడదని కాదు. వివక్ష ఉందని, దాన్ని అర్థం చేసుకోవాలని ప్రజలకు తెలుపడం. ఎందుకంటే, మీడియా కూడా వ్యవస్థీకృతమై పాలకవర్గాలతో మిలాఖతై ఉంది. వ్యవస్థీకృతమైన ఏ వివక్ష, అన్యాయమైనా అత్యంత ప్రమాదకరమైంది. ఈ కుట్రపూరిత బ్రెయిన్‌వాష్ వలన ప్రజలు ఒకరిని ఒకరు అనుమానించుకునే, అసహ్యించుకునే పరిస్థితులు వచ్చాయి. ఈమధ్య ఒక ఎగువ మధ్యతరగతి స్త్రీ తన మిత్రురాలికి ఫోన్ చేసి, 'నేను ప్రతిరోజూ ఇరవై, ముప్ఫై కార్మికులతో ఒంటరిగా పని చేయవలసి వస్తున్నది. వారు నాపై అత్యాచారం చేస్తారేమోనని భయంగా ఉంది' అని వాపోయిందట. ఒక హిందీ సినిమా ప్రముఖుడు ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'పల్లె ప్రాంతాల నుండి పట్టణాలకు వలస వచ్చే పేదవారు పట్టణ ప్రాంత స్త్రీల వేషధారణ చూసి ఉన్మాదంతో అత్యాచారాలు చేస్తున్నారు' అని అన్నాడు. పేద, మధ్యతరగతి ప్రజల పట్ల ఇలాంటి తప్పుడు అభిప్రాయాలు కలగడానికి కార్పొరేట్ మీడియా చేస్తున్న వివక్షాపూరిత ప్రచారం కారణం. ఇలాంటి ఎన్నెన్నో సామాజిక కోణాలు ఈ వివక్షలో ఉన్నాయి. ఈ కోణాలపై ప్రజలు లోతుగా ఆలోచించాలనే ఉద్దేశంతో అన్న వాక్యం అది. నిజానికి, రంగనాయకమ్మ లాంటి పేరు ప్రఖ్యాతలున్న వారు తమ అస్త్రాలను పిచ్చుకల (పేదల) మీద కాకుండా రాబందుల మీద వదిలితే సమాజానికి ఎంతో మేలు. 'అత్యాచారం చేసిన పేదవాణ్ని వెంటనే ఉరి తీయాలి' అని రంగనాయకమ్మ అభిప్రాయం. ఉరి తీయాల్సింది వ్యక్తిని కాదు, అత్యాచారాలు జరగడానికి కారణమవుతున్న వ్యవస్థను. వాదన కొరకు ఉరిశిక్షే సబబు అనుకున్నా, అత్యాచారం ఒకటే దానికి అర్హమా? మారిటల్ రేప్ (భార్య ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక చర్య జరపడం) కూడా అత్యాచారమే. ఆ లెక్కలో భారతదేశంలో కనీసం యాభై శాతం వరకు భర్తలు ఉరిశిక్షకు సిద్ధం కావాలి. స్త్రీల ఇష్టానికి వ్యతిరేకంగా పెద్దలు బలవంతంగా పెళ్లి జరపడం కూడా (అలాంటి చట్టం లేకపోయినా) అత్యాచార నేరం కిందికే వస్తుంది. అలాంటప్పుడు భర్తను, బలవంతపు పెళ్లి చేసి అత్యాచారానికి కారణమైన ఇరువైపుల తల్లిదండ్రులను, బంధు మిత్రులను కూడా ఉరితీయాలి. అలాగే, టీనేజ్ దాటని అబ్బాయిల మీద మగవారు జరుపుతున్న లైంగిక అత్యాచారాలు కూడా ఏటా లక్షలలో ఉంటాయి. వీటికి కూడా ఉరిశిక్షలు వేయాలి.

రంగనాయకమ్మ ప్రజలను నేరస్తులు, నేరస్తులు కాని వారని రెండుగా విభజించి, తిరిగి నేరాల్ని కూడా చిన్న నేరం, పెద్ద నేరమని రెండుగా విభజించారు. ఇంత సింపుల్‌గా న్యాయాన్యాయాలను విడదీయగలిగితే న్యాయ వ్యవస్థ అవసరమే లేదు. వీ

**గమనిక - విజ్ఞప్తి :** భిన్నాభిప్రాయాల మధ్య, ఒకే అభిప్రాయపు ఛాయా భేదాల మధ్య ఆరోగ్యకరమైన చర్చ జరిగినప్పుడే నిజం నిగ్గు తేలుతుందని వీక్షణం విశ్వాసం. అందువల్లనే 'చర్చ' శీర్షిక కింద వీలైనన్ని ఎక్కువ పేజీలు కేటాయించడం జరుగుతున్నది. కాని, చర్చ అనేది మూలవ్యాసంలోని అభిప్రాయాలతో తేడాను చెప్పడానికి, ఆ వ్యాసం వైఖరి కన్న భిన్నమైన వైఖరి ఉండే అవకాశం ఎలా ఉందో చూపడానికి మాత్రమే తప్ప ప్రత్యామ్నాయ వ్యాసం కాదు. చర్చ ఒక పేజీ, ఎక్కువలో ఎక్కువ పేజిన్నరకు మించ కూడదు. చర్చలో పాల్గొంటున్న మిత్రులు ఈ తేడాను గుర్తిస్తున్నట్లు లేదు. చర్చ పేరుతో ప్రత్యామ్నాయ వ్యాసాలు రాస్తున్నారు. మూల వ్యాసంతో సంబంధం లేకుండా అదే విషయం మీద వారు ప్రత్యామ్నాయ వ్యాసాలు రాస్తే తప్పనిసరిగా ఆహ్వానిస్తాం. కాని, ఒక మూల వ్యాసం ప్రేరణతో రాస్తున్నప్పుడు అది చర్చ పరిమితికి లోబడి ఉండాలి. చర్చలో పాల్గొనదలచుకున్న రచయితలు, మిత్రులు ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సవినయంగా కోరుతున్నాం. - సం.

## ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

మూడు ఈశాన్య రాష్ట్రాలకు ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ ఎన్నికలలో 2008 నాటి ఫలితాలే వచ్చాయి. మేఘాలయలో కాంగ్రెస్ 29 స్థానాలు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రిగా ముకుల్ సంగ్మా బాధ్యతలు చేపట్టారు. త్రిపురలో 60 స్థానాలకుగాను సిపిఎం 49 చోట్ల గెలిచి వరుసగా ఐదోసారి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా మానిక్ సర్కార్ ఎన్నికయ్యారు. నాగాలాండ్‌లో నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) మూడోసారి విజయం సాధించింది. ఆ పార్టీకి 38 నియోజకవర్గాలలో నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నాగాలాండ్ నీఫ్యూ రియో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

## దేశంలో 52 ఇంజనీరింగ్ కాలేజీల మూత

దేశవ్యాప్తంగా గత రెండేళ్ల కాలంలో 52 ఇంజనీరింగ్ కళాశాలలు మూసివేశారని, మరో 25 కళాశాలలు మూసివేతకు ఎఐసిటిఇకి దరఖాస్తు చేసుకున్నాయని మానవ వనరుల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద రాజ్యసభలో మార్చ్ 2న తెలిపారు. ఎఐసిటిఇ నిర్ణయించిన మేరకు విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో ఈ కళాశాలలు మూతపడ్డాయన్నారు. ప్రస్తుతం దేశంలో 3,357 డిగ్రీ స్థాయి కళాశాలలు, 1,901 పిజి స్థాయి ఇంజనీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు జితిన్ తెలిపారు.

## ఉత్తరప్రదేశ్‌లో డి.ఎస్.పి. కాల్చివేత

ఉత్తరప్రదేశ్‌లోని బలిపూర్ గ్రామంలో భూవివాదానికి సంబంధించి గ్రామ పెద్దను మార్చ్ 2న హత్య చేశారు. అక్కడి పరిస్థితిని అదుపుచేయడానికి వెళ్లిన డి.ఎస్.పి జియాఉల్ హక్‌తో పాటు తదితరులపై గ్రామం బయటే దాడిచేసి జరిపిన కాల్పుల్లో డి.ఎస్.పి మరణించారని అడిషనల్ డి.జి.పి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ హత్య వెనుక మంత్రి రఘురాజ్ ప్రతాప్ సింగ్ (రాజాభయ్యా) హస్తం ఉందని డి.ఎస్.పి భార్య ప్రవీణ్ ఆజాద్ కుందా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## కశ్మీర్‌లో కొనసాగుతున్న హింస

ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో మార్చ్ 2న మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో భారతీయ రిజర్వ్ పోలీసు (ఐఆర్‌బి) దళానికి చెందిన ఇద్దరు కానిస్టేబుల్‌లు మరణించారు.మార్చ్ 13న శ్రీనగర్‌లోని బెలిమా ప్రాంతంలో పోలీసు పబ్లిక్ స్కూల్‌లోని సి.ఆర్.పి.ఎఫ్ శిబిరంపై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఐదుగురు జవాన్లు మృతి చెందారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు కాల్చివేశారు.

## పోస్కో వ్యతిరేక ఉద్యమకారుల మృతి

పోస్కో ప్రాజెక్ట్‌కోసం ఒడిశా ప్రభుత్వం భూసేకరణను మార్చ్ 3న మళ్లీ తిరిగి చేపట్టింది. పోస్కో వ్యతిరేక ఆందోళన కారుల వద్ద బాంబు పేలి ముగ్గురు మృతి చెందారు. ఈ బాంబులు పోస్కో వ్యతిరేక ఆందోళన కారులు తయారుచేసినవే అని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను పోస్కో ప్రతి రోధ్ సంగ్రామ్ సమితి (పిపిఎస్‌ఎస్) తోసిపుచ్చింది. భూసేకరణలో భాగంగా తమలపాకుల తోటలు మూడింటిని ధ్వంసం చేయడంతో గోవింద్‌పూర్ గ్రామంలో మహిళలు ఏకంగా అర్థనగ్న ప్రదర్శన జరిపి తమ నిరసనను వ్యక్తం చేశారు.

## కొనసాగుతున్న కూడంకుళం పోరాటం

కూడంకుళం అణు కేంద్రం తొలి ప్లాంట్‌లో మార్చ్ 11న విద్యుదుత్పత్తి ప్రారంభం అవుతుందని వార్తలు రావడంతో సుమారు ఆరు వందల పడవల్లో ఉద్యమకారులు అణు విద్యుత్ కేంద్రాన్ని ముట్టడికి ప్రయత్నించారు. ఆ సమయంలో అణు విద్యుత్ కేంద్రం వద్ద నాలుగు వేల మంది పోలీసులు మోహరించి ఉన్నారు. దీంతో కూడుకుళంలో మరోసారి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

## వెంటాడుతున్న భోపాల్ గ్యాస్

భోపాల్‌లో 1984 డిసెంబర్ 2 రాత్రి యూనియన్ కార్బైడ్ కంపెనీ నుండి వెలువడిన విషవాయువు ప్రభావం బాధితులను ఇంకా వెంటాడుతోంది. ఈ ప్రాంతంలో అవయవ లోపాలతో జన్మించేవారి సంఖ్య ఏడు రెట్లు పెరిగిందని వైద్యులు తెలిపారు. దీని ప్రభావం మూడో తరంపై కూడా ఉంటుందన్నారు. ప్రపంచంలోనే ఘోర ప్రమాదాల్లో ఒకటైన విషవాయువు లీకేజీ బాధితులతో కోల్‌కత్తాకు చెందిన జ్యోతిర్మయి సమద్దర్ 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఆమె మార్చ్ 3న భోపాల్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము 20 వేల కుటుంబాలను కలిశామని అందులో 3000 మంది నవజాత శిశువులు పుట్టుకతోనే మానసిక వైకల్యం లేదా అవయవ లోపాలతో ఉన్నారన్నారు.

## ప్రభుత్వానికి డి.ఎం.కె మద్దతు ఉపసంహరణ

శ్రీలంకలో తమిళుల ఊచకోత, మానవ హక్కుల ఉల్లంఘనలపై అమెరికా ప్రవేశపెట్టే తీర్మానం మార్చ్ 21న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ముందుకు రానుంది. ఈ తీర్మానాన్ని భారత్ బలపరచాలని కరుణానిధి అన్నారు. దాంతో పాటు రెండు సవరణలను ప్రతిపాదించా లన్నారు. మార్చ్ 19న కరుణానిధి అధ్యక్షతన 'తమిళ ఈళం మద్దతుదారుల సంఘం' (టెసో) సమావేశమైంది. సమావేశానంతరం కరుణానిది విలేకరులతో మాట్లాడుతూ 'ఈలం తమిళ ప్రజలకు ఎంతమాత్రం ప్రయోజనం చేకూర్చని పరిస్థితుల్లో యుపిఎ ప్రభుత్వంలో డి.ఎం.కె కొనసాగడమంటే తమిళ జాతిని ముప్పులోకి నెట్టినట్లేనని అందుకే మేం ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నామనే ప్రకటన చేశారు.

## ముంబై పేలుళ్లపై సుప్రీం తీర్పు

1993 మార్చ్ 3న ముంబైలో జరిగిన వరుస పేలుళ్ల కేసులో మార్చ్ 21న సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసులో కుట్రాదారుల్లో మాకుబ్ రజాక్ మెమెన్‌కు మరణ శిక్షను విధించింది. పది మంది నిందితులకు టాడా కోర్టు విధించిన మరణ శిక్షను యావజ్జీవ శిక్షగా మార్చింది. మరో 25 మందికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షగా మార్చింది. వీరిలో గతంలో టాడా కోర్టు నిర్దోషులుగా ప్రకటించగా సుప్రీం కోర్టు ఆ తీర్పును తిరస్కరిస్తూ, వీరికి యావజ్జీవ శిక్ష విధించింది. ఆ నాటి దాడులకు అక్రమంగా తరలించిన ఆయుధాలు కలిగిఉన్నాడని సినీ నటుడు సంజయ్‌దత్‌పై నమోదు చేసిన కేసును నిర్ధారించింది. ఆయుధాల చట్టం కింద ఆయనకు ఐదేళ్ల శిక్షను ఖరారు చేసింది.

## కర్ణాటక శాసనసభకు ఎన్నికలు

కర్ణాటక శాసనసభ గడువు జూన్ 3తో ముగియడంతో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి వి.ఎస్. సంపత్ మార్చ్ 20న ఢిల్లీలో విలేకరులకు తెలిపారు. మొత్తం 224 స్థానాలకు మే 5న ఒకే దశలో పోలింగ్, 8న ఓట్ల లెక్కింపు, ఏప్రిల్ 10న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఆ రోజు నుండే నామినేషన్‌లను దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఏప్రిల్ 20తో ముగుస్తుంది. వీ

## బంగ్లాలో కొనసాగుతున్న ఘర్షణలు

**1971** బంగ్లా స్వాతంత్ర్య సమరం సమయంలో యుద్ధ నేరాలకు, అత్యాచారం, హత్యలకు పాల్పడ్డారనే అభియోగం మీద జమాతె ఇస్లామీ పార్టీకి చెందిన దిల్వార్ హుసేన్ సయీద్‌కు బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల విచారణ ట్రిబ్యునల్ (ఐసిటి) ఫిబ్రవరి 28న మరణశిక్ష విధించింది. ఈ తీర్పుకు నిరసనగా జమాతె ఇస్లామీ పార్టీ, దాని మిత్ర సంస్థలు దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ నిరసన క్రమంలో పోలీసులతో జరిగిన ఘర్షణల్లో ముప్పై రెండు మంది మరణించారు, వందలాది మంది గాయపడ్డారు.

## హ్యూగో చావెజ్ మృతి

వెనిజులా అధ్యక్షుడు, యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా అధినేత హ్యూగో చావెజ్ మార్చ్ 5న మరణించారు. ఆయన గత రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన 28 జూలై 1954లో వెనిజులాలోని మారుమూల గ్రామమైన బరినాస్‌లో, ఒక పేద కుటుంబంలో పుట్టారు. 1975లో వెనిజులా అకాడమీ ఆఫ్ మిలిటరీ సైన్సెస్‌లో చేరి సైనిక శిక్షణ పొందాడు. 1982లో బొలివేరియన్ రెవెల్యూషనరీ మూవ్‌మెంట్‌ను ప్రారంభించారు. 1992లో అప్పటి వెనిజులా అధ్యక్షుడు కార్లోస్ అండ్రెస్ పెరెజ్‌పై తిరుగుబాటు చేసి రెండు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. 1998లో ఫిఫ్త్ రిపబ్లిక్ మూవ్‌మెంట్ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి 56 శాతం ఓట్ల విజయం సాధించారు. ఫిబ్రవరి 2, 1999న తొలిసారి వెనిజులా అధ్యక్షుడయ్యారు.

## పాకిస్తాన్‌లో పార్లమెంటరీ కమిటీ పాలన

పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి అధికార గడువు మార్చ్ 16తో ముగియడంతో ప్రభుత్వం రద్దయింది. అధ్యక్షుడు జర్దారీ మేలో సాధారణ ఎన్నికలను ప్రకటించారు. అధికార ప్రతిపక్ష పార్టీలు పిపిపి, పాకిస్తాన్ ముస్లీం లీగ్ (పిఎంఎల్ - ఎన్)ల మధ్య ఆపద్ధర్మ ప్రధానమంత్రి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ట్రజరీ శాఖ నుండి ఇతర ప్రతిపక్షాల నుండి ఎనిమిది మందితో పార్లమెంటరీ కమిటీని ఎంపిక చేసి ఆ బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు.

## నేపాల్ ప్రధాని ఖిల్‌రాజ్ రేగ్మీ

నేపాల్ ప్రధానమంత్రిగా నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఖిల్‌రాజ్ రేగ్మీ మార్చ్ 14న బాధ్యతలు చేపట్టారు. నేపాల్‌లోని నాలుగు రాజకీయ పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆయనకు ఈ పదవి దక్కింది. దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి, అనిశ్చితికి తెరదించడానికి జూన్ 21లోగో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా మాధవప్రసాద్ ఘిమిరె, హరిప్రసాద్ న్యూపనెలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

## చైనా అధ్యక్షుడిగా జింగ్‌పింగ్

చైనా నూతన అధ్యక్షుడిగా జి జిన్‌పింగ్ మార్చ్ 14న పదవీ బాధ్యతలు చేపట్టారు. మిలిటరీ కమిషన్ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. మూడు వేల మంది సభ్యులు గల చైనా పార్లమెంట్ (నేషనల్ పీపుల్ కాంగ్రెస్) జిన్‌పింగ్‌ను అధ్యక్షుడిగా, స్టేట్ కౌన్సిల్ (పార్లమెంట్) ప్రీమియర్‌గా లీ కీ క్యాంగ్ ఎన్నుకుంది.

## పోప్ బెనెడిక్ట్ 16 రాజీనామా

గత ఆరున్నర శతాబ్దాల రోమన్ కాథలిక్కుల చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక పోప్ తన పదవికి రాజీనామా చేశారు. బెనెడిక్ట్ 16 ఫిబ్రవరి 28న అధికారికంగా తన రాజీనామాను ప్రకటించారు. దీంతో కొత్త పోప్ ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించగా, రోమన్ కాథలిక్ చర్చికి మొదటిసారిగా లాటిన్ అమెరికా దేశం నుంచి పోప్ పదవి చేపట్టారు. ఆర్జెంటీనా జెసూట్స్ కమ్యూనిటీకి చెందిన ఫ్రాన్సిస్ మార్చ్ 13 అర్ధరాత్రి పోప్‌గా ఎన్నికయ్యారు.

## క్యూబా అధ్యక్షుడిగా రౌల్ కాస్ట్రో

క్యూబా అధ్యక్షుడిగా రౌల్ కాస్ట్రో తిరిగి ఎన్నికయ్యారు. మార్చ్ 24 రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పదవి చేపట్టడం ఇది చివరిదనీ, 2018లో పదవీకాలం పూర్తయిన తరువాత తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోననీ, యువకులకు ఈ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు డియాజ్ క్యానెల్‌ను అధ్యక్ష పదవికి వారసుడిగా ప్రకటించారు.

## మాల్దీవుల ప్రతిపక్ష నేత అరెస్ట్

మాల్దీవు మాజీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు మహ్మద్ నషీద్‌ను మార్చ్ 5న రాజధాని మాలెలో అరెస్టు చేశారు. గత సంవత్సరం ఆయనను పదవి నుంచి తొలగించిన సమయంలో సీనియర్ న్యాయమూర్తిని అపహరించిన కేసులో ఆయనపై కేసు నమోదయింది. ప్రస్తుత అధ్యక్షుడు వహీద్ హసన్ ఇది అరెస్టు కాదనీ, ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు.

## శ్రీలంకపై తీర్మానం

శ్రీలంకలో మానవహక్కుల ఉల్లంఘనపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (ఎచ్‌ఆర్‌సి) ఆమోదించింది. మొత్తం 47 సభ్య దేశాలున్న మండలి మార్చ్ 21న ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించింది. ఇరవై ఐదు దేశాలు అనుకూలంగా, పదిహేను దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. శ్రీలంకలో మానవ హక్కుల ఉల్లంఘనపై స్వతంత్ర, విశ్వసనీయమైన దర్యాప్తు నిర్వహించాలని పునరుద్ఘాటించారు. శ్రీలంకలో మానవ హక్కుల ఉల్లంఘనపై ఆ దేశాధ్యక్షుడు మహింద రాజపక్సపై చర్యలు చేపట్టాలని ఐరాస ఎచ్‌ఆర్‌సి తీర్మానంలో పేర్కొంది.

వీ

# అసహజ మరణాల సూచి

సంకలనం : వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.


**(1 ఫిబ్రవరి నుండి 28 ఫిబ్రవరి 2013 వరకు 15 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1472)**

| జిల్లా | ఆకలి | ఆత్మహత్యలు | | | | చికిత్స అందక, అనారోగ్యం | | | గుర్తు తెలియని | | హత్యలు | | ప్రమాదాలు | | | | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | | | | | | | | | పనిచేసే స్థలంలో | కరెంట్ | రహదారి | ఇతరాలు | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| | | | | స్త్రీ | పు. | స్త్రీ | పు. | పి. | స్త్రీ | పు. | స్త్రీ | పు. | | | | | | | | | |
| **(1)** | **(2)** | **(3)** | **(4)** | **(5)** | **(6)** | **(7)** | **(8)** | **(9)** | **(10)** | **(11)** | **(12)** | **(13)** | **(14)** | **(15)** | **(16)** | **(17)** | **(18)** | **(19)** | **(20)** | **(21)** | **(22)** |
| ఆదిలాబాద్ | – | 3 | – | 16 | 17 | 4 | 2 | 3 | 2 | 2 | 3 | 2 | 2 | – | 23 | 29 | – | – | – | 1 | – |
| హైదరాబాద్ | – | – | – | 10 | 9 | – | – | – | 1 | 6 | 5 | 12 | – | – | 26 | 25 | – | – | – | 5 | – |
| నల్గొండ | – | 3 | 1 | 14 | 12 | – | 4 | 1 | 1 | 5 | 2 | 2 | 4 | 4 | 51 | 17 | – | – | – | 5 | – |
| మహబూబ్‌నగర్ | – | 6 | – | 26 | 20 | 16 | 18 | – | 6 | 3 | 13 | 31 | 19 | 24 | 54 | – | – | 4 | – | 1 | – |
| మెదక్ | – | 4 | – | 7 | 10 | 2 | 5 | 2 | – | 2 | 1 | 5 | 1 | 6 | 42 | 14 | – | – | – | – | – |
| నిజామాబాద్ | – | – | – | 7 | 15 | 2 | 2 | 1 | – | 9 | 2 | 6 | 4 | 4 | 36 | 7 | – | – | – | – | 4 |
| రంగారెడ్డి | – | 3 | – | 10 | 18 | 8 | 6 | 1 | 5 | 6 | 3 | 7 | 1 | 5 | 37 | 5 | – | – | – | – | 1 |
| వరంగల్ | – | 6 | 5 | – | – | – | 6 | 7 | – | – | – | – | 2 | 5 | 9 | 8 | – | – | – | – | 3 |
| కరీంనగర్ | వివరాలు అందలేదు | | | | | | | | | | | | | | | | | | | | |
| ఖమ్మం | – | 1 | – | 3 | 4 | 1 | 3 | 5 | – | 1 | 4 | 5 | 4 | – | 17 | 11 | – | – | – | – | – |
| అనంతపూర్ | – | 7 | 1 | 20 | 11 | 1 | 2 | – | 1 | – | 2 | 3 | 3 | 4 | 36 | 10 | – | – | – | – | – |
| నెల్లూరు | – | – | – | 2 | – | – | – | – | – | – | 3 | 2 | 2 | 3 | 17 | 8 | – | – | – | – | – |
| కర్నూలు | – | 8 | – | 6 | 4 | 5 | 3 | 6 | 8 | 5 | 5 | 8 | 7 | 4 | 28 | 23 | – | – | – | – | 3 |
| చిత్తూరు | – | – | – | 5 | 8 | 4 | 1 | – | – | – | 8 | 8 | 9 | – | 31 | – | – | – | – | – | – |
| విశాఖపట్నం | – | – | – | 1 | 11 | 5 | 8 | – | 1 | 2 | 2 | 3 | – | – | 17 | 9 | – | – | – | 10 | – |
| విజయనగరం | – | – | – | 6 | 3 | 4 | – | 3 | 3 | 5 | – | 1 | 2 | – | 32 | 8 | – | – | – | – | – |
| **మొత్తం** | **–** | **41** | **7** | **133** | **142** | **52** | **60** | **29** | **28** | **46** | **53** | **95** | **60** | **59** | **456** | **174** | **–** | **4** | **–** | **22** | **110** |

వీక్షణం పబ్లికేషన్స్

# ఊరి దారి

గ్రామ అధ్యయనాల పరిచయం




ఎన్. వేణుగోపాల్


పేజీలు: 164

వెల: రు. 60

కాకి ప్రచురణలు

# డావిన్సీ

కళ – జీవితం




పి. మోహన్

పేజీలు: 278

వెల: రు. 150


ఎ. నర్సింంహారెడ్డి రచనలు


**సామాజిక విద్య - ఒక మిథ్య**

పేజీలు: 230 వెల: రు. 100

**ప్రజా ఎజెండాలేని**
**పార్లమెంటరీ రాజకయాలు**

పేజీలు: 80 వెల: రు. 40




సేతు ప్రకాశని, కోల్‌కత్తా ప్రచురణ

# అండర్‌స్టాండింగ్ మావోయిస్ట్స్:


నోట్స్ ఆఫ్ ఎ పార్టిసిపెంట్ అబ్జర్వర్
ఫ్రమ్ ఆంధ్ర ప్రదేశ్

ఎన్. వేణుగోపాల్

పేజీలు: 319

వెల: రు. 375

★ వీక్షణం పాఠకులకు
ప్రత్యేక తగ్గింపు ధర రు. 300




ఈ పుస్తకాలన్నీ వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్నాయి

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 141 -April 2013 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 29/3/2013 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

# వీక్షణంకు మీ అండదండలు ఇవ్వండి!
# ఈ ప్రజాపక్ష వేదిక పదికాలాలపాటు నిలబడేలా తోడ్పడండి!

- వీక్షణం చదవండి, చదివించండి, చర్చించండి ఇతరులకు పరిచయం చేయండి.
- వీక్షణంకు చందాదారులు కండి, చందాదారులను చేర్పించండి, మీ మిత్రులకు కానుకగా చందా చేర్పించండి. మీ గ్రామంలో గ్రంథాలయాలలో, సంస్థలలో, కళాశాలలలో, కార్యాలయాలలో వీక్షణం చందాలు చేర్పించండి. మీ జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయాలు వీక్షణం తెప్పిస్తున్నాయో లేదో కనుక్కొని తెప్పించే ఏర్పాటు చేయండి
- మీ గ్రామంలో, పట్టణంలో వీక్షణం విడిప్రతులు అమ్మే న్యూస్ ఏజెంటును ఏర్పాటు చేయండి
- మీకు తెలిసిన దాతలకు, ప్రముఖులకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంకు విరాళాలు ఇచ్చేలా ప్రోత్సహించండి. మీకు తెలిసిన విద్యాసంస్థలకు, ఆస్పత్రులకు, వ్యాపారసంస్థలకు, కార్యాలయాలకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంలో ప్రకటనలు ఇచ్చేలా చూడండి.

## చందా వివరాలు

| | సంస్థలకు/లైబ్రరీలకు | వ్యక్తులకు | విద్యార్థులకు |
|---|---|---|---|
| విడి ప్రతి | రు. 15 | రు. 15 | రు. 15 |
| సంవత్సరం | రు. 180 | రు. 150 | రు. 120 |
| మూడు సంవత్సరాలు | రు. 500 | రు. 400 | రు. 350 |
| ఐదు సంవత్సరాలు | రు. 800 | రు. 650 | - |
| పది సంవత్సరాలు | రు. 1500 | రు. 1300 | - |

## వీక్షణంలో మీ ప్రకటనలకై చెల్లించాల్సిన రుసుం

| | | | |
|---|---|---|---|
| చివరి కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) | రు. 40,000; | రెండవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) | రు. 25,000 |
| మూడవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ) | రు. 25,000; | లోపల పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో ఫుల్ పేజీ) 24సెం.మీ. ×17 సెం.మీ.) | రు. 20,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్ సగం పేజీ) (12 సెం.మీ. × 17 సెం.మీ.) | రు. 10,000 | లోపలి పేజీ (బ్లాక్ & వైట్ పావు పేజీ) (12 సెం.మీ. × 8.5 సెం.మీ.; లేదా 6 సెం.మీ. × 17 సెం.మీ.) | రు. 5,000 |

**వీక్షణం అకౌంట్ నెంబర్ - 013911011002175, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్**
**'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా**

**వీక్షణం**
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com
వీక్షణంను ఈ సైట్‌లో చూడొచ్చు, చదవవచ్చు **www.veekshanam.wordpress.com**

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao